మాదిరెడ్డి సులోచన

# పంతులమ్మ



ఇందులోని పాత్రలు, కల్పితములు
ఎవరినీ వుద్దేశించినవి కావు

\- రచయిత్రి

# పంతులమ్మ

బస్సుదిగి స్కూలు వైపు దృష్టి సారించింది సుచరిత. పిల్లలూ, ఉపాధ్యాయులూ ప్రార్థన ముగించి తరగతులలోకి వెళ్తున్నారు. మనసంతా అదోలా అయింది. తొమ్మిది కాకముందే యింటివద్ద బయలుదేరి, లేటు మార్కు వేయించు కోవాలంటే సిగ్గుగా వుంది. త్వరత్వరగా వెళ్ళి అటెండెన్సు రిజిష్టరులో సంతకము చేసి తరగతికి వెళ్ళిపోయింది. పాఠశాలంతా కలయతిరుగుతూ ప్రధానోపాధ్యాయులు కనిపించారు. ఆయనకు విష్ చేసే ధైర్యము లేకపోయింది. ఉపాధ్యాయులందరూ ప్రార్థన వేళకు విధిగా వుండాలంటారాయన. కాని తనేం చేయగలదు ? రాజధానిలో బస్సుల ప్రయాణం గురించి రాస్తే ఓ భారతం అవుతుంది. ఒక రోజు బిఫోర్ టైమంటూ మధ్య దార్లో ఆపుతారు. ఇంకో రోజు స్టాపుకు దూరంగా తీసుకుపోయి ఆపుతారు. ఇవి రెండూ లేనినాడు బస్సు దానంతటదే ఫేలవుతుంది. కండక్టర్లకు డబ్బులిచ్చి టికెట్ అడగ్గాడదు. అడిగితే ఆ మనిషి స్టేజి దగ్గర కనిపిస్తే చాలు బస్సును ఆపరు. అందరూ అలాగే ఉంటారని కాదు.

క్లాసుకెళ్ళి అటెండెన్స్ తీసుకొంటోంది సుచరిత. క్లాసులో మాత్రం యిద్దరే అమ్మాయిలు. మిగతా అందరూ అబ్బాయిలు. మగపిల్లలంతా చేరి ఆ ఉన్న యిద్దరాడపిల్లలకు ఓ ప్రత్యేకత ఏర్పరుస్తారు.

చివర్లో 'జయ' అంది సుచరిత.

"ప్రజంట్ మాడమ్."

"పుష్పా".

జవాబు రాలేదు. రెట్టించి  తలెత్తింది. జయ తనను పుష్ప విషయం అడుగుతుందనుకుని లేచి నిలబడింది "నాకు తెలియదు మేడమ్" అన్నది. మూల కూర్చున్న ఓ విద్యార్థి లేచి "నాకు తెలుసు మాడమ్ ? ఈ రోజు పుష్పకు పెళ్ళిచూపులట! వాళ్ళ నాయనమ్మ మా నాయనమ్మతో చెప్పింది......." క్లాసంతా గొల్లున నవ్వింది. "సైలెన్స్" డస్టరుతో బల్లను టకటకలాడించింది

సుచరిత. విద్యార్థులు యథావిధిగా కూర్చున్నారు. "అడగని విషయాలు చెప్పొద్దు. పుష్ప యెందుకు రాలేదని నే నడిగానా?" ఆ కుఱ్ఱాడివంక తీక్షణంగా చూచింది.

"సారీ ?" సిగ్గుతో తలొంచుకున్నాడు ఆ అబ్బాయి. ఇక సంభాషణ పొడిగించకుండా పాఠం తీసింది. "నిన్నటి పాఠంలో కొన్ని ప్రశ్నలడుగుతాను. జవాబులు చెప్పగలరా !" "యస్" పది కంఠాలు పలికాయి.

"ధర్మములు ఆమ్లము లేమిటి ?" విద్యార్థులు తెల్లపోయారు. ఓ చురుకైన పిల్లవాడు లేచి "ధర్మముల ఆమ్లములు కాదు టీచర్. ఆమ్లముల ధర్మములు" అన్నాడు. తన పరధ్యాసకు సిగ్గుపడింది. సర్దుకొని "సారీ, ఆమ్లముల ధర్మములు చెప్పు?" వెనుక బెంచీలో కూర్చుండే ఓ అబ్బాయిని లేపింది.

"తెల్లగా పొడిగా ఉండును. ఉప్పగా ఉండును. గాలిలోని తేమను పీల్చు కోగలిగియుండును........" చెప్పుకుపోతున్నాడు.

"వెరీగుడ్, సిట్ డౌన్!"

"అయ్యో? టీచర్ ! వాడు లవణముల లక్షణాలు చెప్పాడండీ !" ఇంకో అబ్బాయి లేచి చెప్పాడు. సుచరితకు మతి పోయింది. ఇదేమిటి, తనకు తెలియకుండా ఈ పరధ్యాస తన్నెలా ఆవరించింది ! పుష్ప పెళ్ళి అని విన్న దగ్గర నుండి చదలుపుట్టలా ఆలోచనలు మనసును తొలచి వేస్తున్నాయి. ఇక పాఠం చెప్పలేనని తెల్సుకుంది. తల ఆలోచనలతో వేడెక్కిపోయింది.

"పాఠం చదివిరానట్లున్నారు. పుస్తకాలు తీసి చదవండి" అందరూ పుస్తకాలు తీసి చదవసాగారు. ఊరికే చదువుకుంటారా? ఒకటే గోల మొదలుపెట్టారు. గోల బయటికి వినిపించింది కాబోలు - ప్రధానోపాధ్యాయులు వచ్చారు. సుచరిత చెక్కిట చేయి చేర్చి చలనం లేనట్టు కూర్చుంది. పిల్లలు గోలగా అరుస్తున్నారు. సుచరిత క్లాసులో అలా జరగడం అదే మొదటిసారి. విద్యార్థులున్నారా, లేరా? అన్నంత నిశ్శబ్దంగా ఉండేది. హెడ్ మాష్టారిని చూడగానే పిల్లల గోలాగిపోయింది. అందరూ లేచి నిలుచున్నారు. ఏమిటన్నట్టు సుచరిత ద్వారం వైపు చూచింది.



"ఒంట్లో బాగా లేదా సుచరితా!" హెడ్ మాష్టారి ప్రశ్నకు అయోమయంగా చూచింది.

"బాగా లేకుంటే లీవు పెట్టకపోయారా?"

"లేదు సార్ ! బాగున్నాను. ఎక్స్క్యూజ్ మి ఫర్ ది డిస్ట్రబెన్స్" అన్నది. ఆయన వెళ్ళిపోయారు. నిజంగా తను క్లాసు తియ్యలేనని తెలుసుకుంది. లీవు చీటి రాసి హెడ్‌మాష్టారికిచ్చి యింటికి వెళ్ళిపోయింది.

వెళ్ళిన రెండుగంటల్లో తిరిగివచ్చిన కూతుర్ని చూచి ఆశ్చర్యపోయింది గోపమ్మ.

"సెలవా సుచమ్మా?

"లేదమ్మా, తలభారంగావుంటే సెలవు పెట్టి వచ్చాను"

"వెళ్ళేటప్పుడు బాగానే ఉన్నావు. అంతలో ఏమొచ్చిందే?"

"మనిషన్నాక తలనొప్పి రాదా అమ్మా !......"

"సర్లే కాఫీ చెయ్యనా? మాత్ర వేసుకొందువుగాని."

"ఇప్పుడేమీ వద్దు. కాసేపు కళ్ళుమూసుకు పడుకుంటే అదే తగ్గిపోతుంది" గదిలోకి వెళ్ళిపోయింది. తలుపులు చేరవేసి మంచముపై వ్రాలింది. ఆమె కంటె ముందుగానే ఆమె మనసు గతంలోకి వెళ్ళింది.

* * *

వేరుశనగకాయలు తింటూ క్లాసుబయట నిల్చుంది సుచరిత. వెంబడి నలుగురు చెలులు కూడా ఉన్నారు. అటు నుండి పదో తరగతి అబ్బాయి రఘు కూడా వచ్చాడు.

"ఏయ్ !........ సుచీ, మాట" పిలిచాడు.

చెలులను వెనకే వదిలి వెళ్ళింది.

"నిన్న బడి కెందుకు రాలేదు?" అతని కంఠంలో అధికారము కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అతని వాలకానికి సుచరితకు కోపమొచ్చింది. అందుకే పెంకెగా జవాబిచ్చింది. "నా యిష్టం! నువ్వెవరు అడగటానికి?"

"ఏమన్నావ్?" జడ దొరకబుచ్చుకున్నాడు రఘు.

"వదులు! వదులు రఘూ! నాన్నగారిని కేకేస్తాను. చూడు......"

"ఏదీ పిలు" ఇంకో చేత్తో చెవి మెలిబెట్టాడు. సుచరితకు తెలుసు అత నెంత మొండి ఘటమో? మెల్లగా తప్పుకోవడమే ఉత్తమమని. "వదులు రఘూ-చెప్తాను వదులు" బేలగా కనిపించింది సుచరిత.

"అలా దారికి రా.... ఇప్పుడు చెప్పు. బడి కెందుకు రాలేదో నిన్న" జడ వదిలేస్తూ అడిగాడు.

"చెప్పను బాబూ! నువ్వు నవ్వుతావు" సిగ్గుగా తల వంచేసుకుంది.

"చెప్పకుంటే రెండో చెవి మెలిబెడతాను, నీ యిష్టం!"

"నేను బడికి రాకుంటే నీకేం? అంతగా ఆరా తీస్తున్నావు?" తన చక్రాలను బోలిన కళ్ళు తిప్పింది సుచరిత. అలా త్రిప్పటం రఘు కెంతో ఇష్టం! క్షణం అధికార దర్పం మరచిపోయాడు. "నువ్వు బడికి రాకుంటే నా కేం తోచదు సుచీ? మీ నాన్నగారు కూడా రాకుంటే ఊరికి వెళ్ళారేమో అనుకున్నాను."

"నవ్వొద్దు మరి చెప్తాను. నిన్న...... నిన్న........" ముఖం త్రిప్పుకుంది.

"నేనేం నవ్వను. చెప్పు" అన్నాడు విసుగ్గా.

"నన్ను చూడ్డానికి పెళ్ళికొడుకొచ్చాడు. యెవరికీ చెప్పకేం?" సంచి ఊపుకుంటూ పరుగు తీసింది.

అప్పుడు సుచరిత ఏడవతరగతి చదువుతోంది. నిండా పదకొండేళ్ళు లేవు. తండ్రి అదే స్కూల్లో తెలుగు పండితుడు. అతని పేరు శాస్త్రి. ఆయన కిద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఇద్దరు కొడుకులూ సుచరిత కంటే పెద్దవారే. పెద్ద కొడుకు కాంతారావు పట్నంలో చదువుతున్నాడు. రెండో కుమారుడు చలపతి రఘు తరగతిలో చదువుతున్నాడు. శాస్త్రిగారిది శుద్ధ శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబం. శాస్త్రిగారి తల్లి నిప్పును కడిగి వేస్తుంది మడి పేరిట. మనవరాలికి పదేండ్లు దాటగానే పెళ్ళి చెయ్యాలని పట్టుబట్టింది. ప్రక్క ఊరి కరణంగారి మేనల్లుని కియ్యాలని సంకల్పించారు. కరణం గారి యింట్లో స్త్రీలు సుచరితను దేవుడిపెళ్ళినాడు చూచారు. అందాలబొమ్మ కోడలుగా రావటం వాళ్ళకిష్టమే. లాంఛనప్రాయంగా పెళ్ళికుమారుడిని తీసుకొచ్చి చూపించి తాంబూలాలు పుచ్చుకున్నారు.



వాళ్ళటు వెళ్ళగానే శాస్త్రి తల్లి సుబ్బమ్మ బుట్టెడు మిరపకాయలు పోసి మనవరాలికి దిష్టి తీసింది.

"పసిడి ప్రతిమవు. అందరూ రెప్ప వేయక చూడ్డమే" అంటూ మెటికలు విరిచింది. ఇదంతా గోపమ్మకు నచ్చలేదు. చిన్న వయస్సులో పెళ్ళిచేసుకుని తనేం సుఖపడింది గనక? ఆ మాటే పైకి అంది.

"నీ బోడిసలహా యెవడడిగాడు ? మా యింటా వంటా లేదు ఆడపిల్లలను యెద్దుల్లా పెంచటం!" వినలేక పోయింది గోపమ్మ.

"అవునమ్మా! మన సాంప్రదాయం ప్రకారమే చేద్దాం. ఇంకా చదివి ఉద్యోగాలు చెయ్యాలా, ఊళ్ళేలాలా? రోజు రోజుకు కట్నాల బాధ ఎక్కువవు తోంది. త్వరగా బాధ్యత తీర్చుకోవడం మంచిది" శాస్త్రిగారు తల్లినే బలపరిచారు. భారతదేశంలో స్త్రీగా పుట్టిన గోపమ్మ యింకే మనగలదు? ఇంకా గొడవే జరిగింది. సుచరితకు గుర్తు లేదు. ఒక్కటే గుర్తుంది. పెళ్ళంటే బోలెడు నగలు, పట్టు దుస్తులు, మేళాలు, విందు భోజనాలు! ఇవి తల్చుకుని మురిసిపోయిందా పసి హృదయం. అంత శుభసమయంలో తల్లి గొడవకు కోపం కూడా వచ్చింది సుచరితకు.

సాయంత్రం యింటికి బయలుదేరింది సుచరిత. రెడ్డిగారి తోట దగ్గరకొచ్చి ఆగిపోయింది. పెద్ద బండ మీద కూర్చుని, రాళ్ళు అటూ ఇటూ రువ్వుతున్నాడు రఘు.

"రఘూ! ఇక్కడ కూర్చున్నావేమిటి? అన్నయ్య ఏడీ?"

"మీ అన్నయ్య లాస్టు పిరియడ్ ఎగ్గొట్టి పోయాడు. నిజంగా నీకు పెళ్ళి అవుతుందా సుచీ!"

"అవును, వాళ్ళు బోలెడు నగలు చేయిస్తారట. నాయనమ్మ చెప్పింది. అదేమిటలా ముఖం పెట్టావు? నా పెళ్ళి నీ కిష్టం లేదా?" స్నేహితుడు అలా నిరుత్సాహపడటం సుచరితకు నచ్చలేదు.

"నీ కిష్టమేనా మొదట చెప్పు".

"ఏం యెందుకిష్టముండదు? నా కిష్టమే" అన్నది.

"నాతో ఉండటం నీ కిష్టంలేదా సుచీ?" అన్నాడు ఆశగా.

"నీతో ఎందుకుండను? మనము కలిసే ఆడుకుందాము రఘూ!"

"నీకు పెళ్ళయితే అలా సాగుతుందా?"

"ఏం యెందుకు సాగదు? మంచిగా ఆడుకోవచ్చు."

"నీకు తెలియదు సుచీ! నువ్వింకా చిన్న దానివి. ఈ పెళ్ళొద్దని నాన్న గారితో చెప్పు." బ్రతిమాలే ధోరణిలో అన్నాడు.

"పోదూ ! నీదంతా చాదస్తం." పరికిణీ పైకి యెత్తి పట్టుకుని పరుగు తీసింది సుచరిత.

* * *

వైశాఖం గడిచి జ్యేష్ఠమాసము వచ్చేసరికి యెన్నో మార్పులు! రఘు చలపతి హెచ్.ఎస్.సి.ప్యాసై పట్నం వెళ్ళారు కాలేజీ చదువులకు. సుచరి పెళ్ళి మహా సందడిగా జరిగింది. పట్నం వెళ్ళేటప్పుడు రఘు సుచరితన చూడటానికొచ్చాడు. ఆమె బంధువులతో పాటు గుడి కెళ్ళింది.

సుచరితను ఫోర్తుఫారం చదివించటానికి అత్తగారు ఒప్పుకున్నారు.

సుచరిత ఒంటరిగా స్కూలుకు వెళ్ళలేకపోతోంది.రఘు లేని వె కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. చిరుతిండ్లు కొంటే చెప్పా పెట్టకుండా తినేవాడ చలపతి. రఘు అలా కాదు. దాచి సుచరితకు పెట్టేవాడు. ప్రైవేటు క్లాసం చలపతి వెళ్ళిపోయేవాడు? రఘు తోడుగా వచ్చేవాడు.

ఫస్ట్ టర్మ్ సెలవులకు రఘు, చలపతి ఊరికి వచ్చారు. సుచరి హృదయం యెగిరి గంతేసింది "రఘూ!" అంటూ పిలుస్తూ వాళ్ళింటికి వెళ్ళింది వాళ్ళింట్లో సుచరితకెలాంటి అడ్డూ లేదు. రఘు తల్లికి ఆడపిల్లలు లేరు నలుగురూ కుమారులే. పెద్దవాళ్ళు ముగ్గురూ ఉద్యోగాలు చేస్తూ పై ఊళ్ళ ఉంటారు. రఘు కూడా వెళ్ళిపోతే అప్పుడప్పుడు అన్నపూర్ణమ్మగారు చే ఫలహారాలను సుచరితే సార్థకం చేసేది. కిటికీ దగ్గర నిలబడి బయటి చూస్తున్న రఘును కళ్ళు పెద్దవి చేసి చూచింది. ఒదులొదులు ప్యాంటు చొక్కాతో భుజాలమీద పడేదాకా జుట్టు పెంచుకున్న రఘు యెం మారిపోయాడు! ఉలెన్ ప్యాంటు, టక్అప్ చేసిన తెల్లని సిల్కు షర్టు చక్క దువ్విన తల, కాళ్ళు నల్లని బూట్లలో దాక్కున్నాయి. వెనుకగా వెళ్ళి భుజా



పట్టుకు కుదిపింది. రఘు వెనుకకు తిరిగాడు. ప్రసన్న వదనంతో "ఓ సుచీ" అన్నాడు. మరుక్షణమే అతని ముఖం గంభీరంగా తయారయింది. తన భుజం మీదున్న సుచరిత చెయ్యిని మృదువుగా తీశాడు.

"బావున్నావా సుచరితా?" విస్తుబోయి చూచింది. సుచరిత అంటూ పూర్తి పేరుతో రఘు పిలవటం ఇదే మొదటిసారి. శారీరకంగానే కాక మానసికంగా కూడా రఘు యెదిగిపోయాడని సుచరిత కేం తెలుసు!

"ఏమిటి అలా చూస్తావు? రా కూర్చో" ఈ మర్యాదకు మరీ విస్తుబోయింది.

"ఇక్కడ కూర్చుంటే ఏం తోస్తుంది? తోటలోకి వెళదాము పద. నీవు లేకుంటే ఏమీ తోచటమే లేదు రఘూ! నాకు తోడు యెవ్వరూ లేరు." అతని చేతులు పట్టుకుని లాగింది. రఘు తీక్షణంగా చూచాడు. "ఇంకా మనం పసిపిల్లలమా? పెళ్ళయిన అమ్మాయివి కుదురుగా ఉండాలి. ఇలా పరాయివాళ్ళ చేతులు పట్టుకోవద్దు" అన్నాడు.

ఈ తిరస్కృతి సుచరిత భరించలేకపోయింది. రఘుకు గర్వం అనుకుని గిరుక్కున వెనుదిరిగింది.

"సుచరితా! ఇదిగో మైసూరుపాకు.......... తీసుకెళ్ళి రఘుకు పెట్టి నువ్వు తీసుకో" అన్నపూర్ణమ్మ పిలిచింది.

"నా కేం వద్దు. అంతా నీ కొడుక్కే పెట్టు" పరుగెత్తుకుపోయింది.

ఇంట్లో అడుగుపెట్టగానే సుబ్బమ్మ తారాజువ్వలా లేచింది. "ఏమిటి నీ మిడిసిపాటు. మొగరాయుడల్లే ఇళ్ళమ్మట తిరుగుతావా? మళ్ళీ యిల్లు కదులు. కాళ్ళు విరగ్గొడ్తాను." కన్నీరు కుక్కుకుంటూ తల్లి దగ్గరకు పోయింది. తను పెద్దదైందా? ఆ మాటే రఘూ అన్నాడు. రఘును చూస్తే తనకెందుకో అంత ఆనందం! కళ్ళుమూసినా, కళ్ళు తెరిచినా మారిపోయిన రఘు రూపమే ప్రత్యక్షం కాసాగింది.

సుచరిత పదోక్లాసుకు రావటం, వ్యక్తురాలు కావటం ఒకేసారి జరిగాయి. అప్పటి వరకు ఏటూ తేల్చక ఆపదలచిన చదువు ఇక ఆగిపోయింది. సుచరిత అత్తగారి వైపు వారొచ్చి వేడుకలు జరిపారు. ఊరందరినీ పేరంటానికి

పిలిచారు. రఘు తల్లి కూడా చీర, రవికె తీసుకొని పేరంటానికి వచ్చింది. చెణుకులతో, ఛలోక్తులతో, హాస్యంతో పేరంటం ముగిసింది.

వికసించిన సుచరిత హృదయంలో ఏదో లోటు. ఆ లోటు ఊహించ గల్గిందే. కానీ భర్తీ చేసుకునే అవకాశము దాటిపోయింది. "మీ నాన్నతో చెప్పు ఈ పెళ్ళి వద్దని" అనే రఘు మాటలు చెవుల్లో గింగురుమనేవి.

భర్త, అత్తగారిల్లు అనగానే భయం పుట్టుకొచ్చేవి సుచరితకు. అందరూ ఎదురుచూసే ఆ శుభగడియ తల్చుకోగానే కంపరం పుట్టు కొచ్చేది. తన బాల్య స్నేహితుడు, చెలికాడు రఘు గుర్తుకు రాగానే తీయగా మూల్గేది హృదయం. ఒక్కసారి రఘును చూడాలనే కోర్కె ప్రబలమైంది. అతడెప్పుడు చలపతితో వచ్చినా వాకిట్లోనుండే వెళ్ళిపోతాడు. ఈసారి సెలవుల కొచ్చినప్పుడు తప్పక చూడాలనుకుంది.

* * *

సుచరితకు ఆ శుభం కాస్త జరిపించి అత్తవారింటికి పంపే సన్నాహంలో ఉన్నారు శాస్త్రిగారు.

"అమ్మా, వాళ్ళెందరొస్తారో ఏమిటో! అందరికీ బట్టలు తీసుకు రావాల్నా?"

"ఎంద రొస్తారని అడగలేం. రాగానే వెళ్ళి తేవడాన్కి పట్నం దగ్గర లేదు. పిల్లాడికి, మన పిల్లకు తీసుకురా. వాళ్ళకు ఓ వందరూపాయలు చేతికిస్తే సరి, ఎవరికన్నా కొనుక్కోనీ."

"అలాగే చేద్దాము. పిండివంట లేం చేయిస్తావు?"

"నీ పెళ్ళామైతే లడ్డూ, మైసూర్‌పాక్ చేయిద్దామంటూంది. నాకు మాత్రం ఇష్టం లేదు. మైసూర్‌పాక్ నయమే. లడ్డూ రాళ్ళలా ఒదిగి ఉండదు. అరిసెలు, కజ్జికాయలు చేయిస్తాను."

"నీ యిష్ట ప్రకారమే కానియ్యమ్మా" సుబ్బమ్మ మురిసిపోయింది. తను మంచి నోములు నోచింది. అణుకువగల కుమారుడు లభించాడు.

కలరాతో సుచరిత భర్త చనిపోయాడని సాయంత్రం పిడుగులాంటి వార్త వచ్చింది. గోపమ్మ స్పృహ తప్పిపోయింది. సుబ్బమ్మ నెత్తి బాదుకొని శోకాలు మొదలుపెట్టింది. సుచరిత బొమ్మలా నిలబడిపోయింది.



పద్నాలుగు నిండిన సుచరిత తెల్లనిదుస్తులతో పాములా వ్రేలాడే జడకు బదులు, పిచ్చిగా వేసిన ముడితో ఇంట్లో ఓ మూల కూర్చుండిపోయింది. గోపమ్మ హృదయం గిలగిల కొట్టుకోసాగింది. వేటగాని బాణం దెబ్బతిన్న పక్షివలె కూతుర్ని చూచి కన్నీరుమున్నీరుగా విలపించింది. మంచి చీరలు కట్టడం మానేసింది. దొడ్లో పూచినపూలు రాలిపోతున్నాయి. గోపమ్మ వాటికేసి చూడలేదు. ఒక్కొక్కప్పుడు వెర్రెత్తినదానిలా కూతుర్ని గుండెల కదుముకుని వెక్కివెక్కి ఏడ్చేది.

"ఎవరి ఖర్మ కెవరు కర్తలు? నిండింట్లో ఈ శోకాలు, అమంగళాలు ఎందుకు?" విసుక్కుంది సుబ్బమ్మ.

"జరగవల్సిన అమంగళం జరిగేపోయింది. ఇంకేం మిగిలింది? పదిహేనేళ్ళు రాకుండానే నా తల్లికి అన్ని ముచ్చట్లూ తీరాయి. ఇంకా మీకు తృప్తి లేదా? నాకు ఏడ్చే హక్కు కూడా లేదా?" కఠినంగా జవాబిచ్చింది గోపమ్మ. సుబ్బమ్మ నిరుత్తరురాలయింది. కొడుకొచ్చేవరకు బిగపట్టుకు కూర్చుంది కోపాన్ని.

"శాస్త్రీ ! నీ కూతురి తల నా వల్లే చెడిందిట్రా ! అయ్యో దేవుడా ! నన్నెందుకు పిలువవు?" బుడిబుడి దీర్ఘాలు తీసింది. శాస్త్రి కోపంగా భార్య దగ్గరకొచ్చాడు.

భార్యను చూచి తెల్లబోయాడు శాస్త్రి. అల్లుడుపోయిన దగ్గర నుండి భార్యను ఈ రోజే పరీక్షగా చూచాడు. ఒకేసారి పాతికేళ్ళు పెరిగినట్టు అయింది. నీరసంగా రోగిష్టిలా తయారయింది. భర్త రాక గమనించి లేచింది గోపమ్మ.

"ఏం కావాలి ?" నిర్జీవంగా ఉందా పలకరింపు.

"ఏంలేదు, నువ్విలా రా" ముక్కాలిపీట లాక్కుని కూర్చున్నాడు.

గోపమ్మవెళ్ళి క్రింద చతికిలబడింది.

"ఇటు చూడు. మరీ అంత దిగులుపడితే ఎలా? మన చేతుల్లో ఏముంది చెప్పు? విధి చేతులలో కీలుబొమ్మలం మనము. నువ్విలా వుంటే చిట్టితల్లి ఎంత బెంగ పెట్టుకుంటుందో ఆలోచించావా?" ఆత్మీయుల ఓదార్పు దుఃఖాన్ని అధికం చేస్తుందంటారు. గోపమ్మ విషయంలో నిజమైంది. రెండు చేతుల్లో ముఖం దాచుకుని బావురుమంది.

"ఊరుకో ! ఊరుకోవే" శాస్త్రి గొంతు బొంగురు పోయింది. నెమ్మదిగా భార్య ముఖం మీద చేతులు తొలగించి తల నిమురుతూ కూర్చున్నాడు.

గోపమ్మ గోడకు జరిగి కూర్చుంది. కన్నీరు ఒత్తుకుంది.

"అది ఇంట్లో మ్రోడులా తిరుగుతుంటే ఎలా భరించేది? దాని ముందు గతేమిటి? అబ్బాయిలు యిద్దరూ ఇంతవరకూ రాలేదు."

"చిన్న పిల్లలు! వాళ్ళతో ఏమిటి? మనము లేమూ?"

"ఉన్నాము. అది బ్రతికినంతకాలము ఉండముగా ? అప్సరకన్యలా వుండే నా తల్లి, అలా కృంగిపోతుంటే ఎలా బ్రతికేది ?" నుదురు కొట్టుకుంది.

"నన్నేం చెయ్యమంటావు? నీ మాట కెప్పుడు విలువ నివ్వలేదు. చిట్టితల్లి విషయం నువ్వేం చెప్పినా చేస్తాను. నాకు మాత్రం బాధ లేదా? నువ్వే నయం. ఏడ్చి నీ బాధ కొంత వరకు తేలిక చేసుకుంటావు. నేను నాలో కృంగిపోతున్నాను. చెప్పు "చిట్టితల్లి భవిష్యత్తు కొరకు నన్నేం చెయ్యమంటావు?"

గోపమ్మ భర్త కళ్ళలోకి సూటిగా చూచింది. భరించలేని ఆవేదనను కురిపిస్తున్నాయి కళ్ళు.

"ప్రస్తుతం చదివించాలి. ఆ వ్యాపకంలోపడి దుఃఖాన్ని మరిచి పోతుందేమో. ముందు ముందు దాని బ్రతుకుతెరువు అవుతుంది కూడాను" గోపమ్మ సలహా నచ్చింది శాస్త్రికి కుమారుల గుణగణాలు తెలుసు. అందుకే కూతురు చదువు విషయంలో ఏమీ అభ్యంతరము చెప్పలేదు.

"ట్యూషన్ ఏర్పాటు చేస్తాను. ప్రయివేటుగా మెట్రిక్ చదువుతుంది. వీలుంటే పై చదువులు చదివిద్దాం" అనుకున్నట్టే ఏర్పాటు చేశారాయన. నడివయస్సు దాటిన దంపతుల మనసులు కూతురివల్ల దగ్గర చేరాయి.

శాస్త్రికి కుమారులయెడల ఉదాసీనత పెరగసాగింది. కొందరు పిల్లలు తోబుట్టువులను ప్రేమగా, ప్రాణంగా చూస్తారు. అలా చూడకపోతే మానె వీళ్ళు అడ్డుపుల్లలు వెయ్యటం మొదలుపెట్టారు.

"దానికిప్పుడు చదువు యెందుకు? గుప్పెడు మెతుకులు పెట్టలేమా? మన జాతులవాళ్ళు నవ్వరా?" పెద్దకొడుకు ఆలోచన వేరుగా వుంది. భార్య కాపురానికి వచ్చింది. పిల్లా, పీచూ లేకపోయినా భార్య యెప్పుడూ నీరసంగా వుంటుంది. సుచరితను తీసుకెళితే కొంత సహాయంగా వుంటుందని.



"నేనూ ఆ మాటే అన్నాను నాయనా! నా మాట యెవరు వింటారు?" కళ్ళొత్తుకుంది సుబ్బమ్మ. ఇన్నేళ్ళ తరువాత కుమారుడు తనమాట నిర్లక్ష్యము చెయ్యటం సహించలేకపోయింది.

"గుప్పెడు మెతుకులతో జీవితాలు వెళ్ళమారవు కాంతారావు" శాస్త్రి నొక్కి పలికాడు.

"దానికి ఆస్థి రాదా? నలుగురు పెద్దలతో దాని మామగారి దగ్గర కెళ్ళమంటే వినరు. నాయనా ! కాంతీ....." సుబ్బమ్మ బాధ సుబ్బమ్మది.

"అవును నాన్నా ! ఎందుకు వెళ్ళరు?"

శాస్త్రికి మండిపోయింది. "ఎందుకు వెళ్ళరూ? నేనే వెళ్ళాలా! నువ్వెళ్ళరాదూ? 'మీ పిల్ల పాదమహిమే మా అబ్బాయి పోవడానికి' అని కూసిన వాళ్ళింటికి ఏ ముఖంతో వెళ్ళాలి ?"

"బాగుంది. డబ్బు విషయంలో అభిమానాలు పెంచుకుంటే యెలా? యెవడికోసం యిస్తారు! కోర్టు లేదా ?"

"కోర్టు నా కక్కరలేదు. నా బిడ్డకు ఒకరివద్ద దేవురించి పెట్టే గతి రాలేదు. మిమ్మల్ని దేవురించే గతి రానివ్వను" కాంతారావుకు కోపం ముంచుకొచ్చింది. సుబ్బమ్మని తీసుకుని వెళ్ళిపోయాడు.

* * *

"నాన్నా ! నేను సెకండుక్లాసులో పాసయ్యాను." నవ్వుతూ వచ్చింది సుచరిత. ఇన్నాళ్ళ తరువాత ఆమె ముఖంలో నువ్వు వెలిసింది. కూతుర్ని దగ్గరకు తీసుకున్నాడు శాస్త్రి. "చాలా సంతోషం తల్లీ! కాలేజీలో చేరు" అన్నారు ప్రసన్నవదనంతో. గోపమ్మ సంబరంగా చూచింది. సుచరిత ఉత్సాహంగా తన గదిలోకి వెళ్ళింది.

"ఏమండీ!"

"విన్నావుటే! సుచీ పాసైంది" అన్నారు.

"అది పాసైంది తెలుసు. కాని మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూచుకోండి. ఒక్కసారి డాక్టరు దగ్గరి కెళ్ళకూడదూ?"

"నాకేం లేదు లేవే" అన్నారు క్లుప్తంగా.

శాస్త్రిగారి ఆరోగ్యం దినదినానికీ క్షీణించసాగింది. వికసించిన పుష్పంలా ఇంట్లో తిరిగే కూతుర్ని చూచినప్పుడు గుండెల్లో చురకత్తి దిగేది. అకస్మాత్తుగా ఒకరోజు సగం పొలం బేరం పెట్టారు. అదమ్మితే వచ్చిన డబ్బు, ప్రావిడెంటు ఫండొచ్చిన డబ్బు తీసుకెళ్ళి హైదరాబాద్‌లో మేడ కొన్నారు. కూతురికి సగం, మిగతా సగం కుమారులిద్దరికి రాసి రిజిష్టరు చేయించాడు. కాంతారావు, చలపతి కారాలు మిరియాలు నూరారు. కాని ఏం చెయ్యలేక పోయారు.

కొంతకాలానికి సుచరిత పేరు కలవరిస్తూనే మరణించాడు శాస్త్రిగారు. అప్పుడు రఘు వచ్చాడు. సుచరితను వితంతువు దుస్తులలో చూడటం అదే మొదలు. బాధగా కళ్ళు మూసుకున్నాడు. సుచరిత తన ముఖం అతనికి చూపించలేక పోయింది.

అతడు మెడిసన్ చదవడానికి మేనమామ వూరు వైజాగ్ వెళ్ళిపోయాడు. కూతుర్ని తీసుకుని గోపమ్మ పట్నం వచ్చింది. ఎవరెన్ని అన్నా సుచరిత తల్లి ప్రోత్సాహముతో బి.ఎస్‌సి.బి.యిడి. పూర్తి చేసింది. టీచరుగా ఉద్యోగంలో ప్రవేశించింది. కాంతారావు వచ్చినా ముభావంగా ఉండి వెళ్ళిపోయేవాడు. చలపతిమాత్రం మాట్లాడతాడు. సుచరిత సంపాదనలో కొంత తనకిస్తే బాగుండునని అతనికి ఉంటుంది.

* * *

ఇన్నాళ్ళూ మనసులో వున్నా రఘును చూడాలనే కోర్కె ఈరోజు యెందుకో తీవ్రమైంది. అతని గురించిన ఆలోచనలు మనసునిండా నిండుకున్నాయి. ఎక్కడున్నాడో? డాక్టరై పెళ్ళిజేసుకొని ఉండవచ్చు. పిల్లలు కూడా పుట్టి ఉండొచ్చు.

"సుచమ్మా! తలనొప్పి తగ్గిందా తల్లీ" గోపమ్మ మాటలు సుచరిత ఆలోచనా ప్రవంతిని చెదరగొట్టాయి. తలెత్తి చూచింది. తలవైపు గోపమ్మ నిలబడివుంది. ఆమె కళ్ళు ఆందోళనగా ఉన్నాయి. లేచి కూర్చుంది. 'తగ్గిందమ్మా!'

"కాళ్ళు! ముఖం కడుక్కో తల్లీ, వేడి వేడి కాఫీ చేసిస్తాను" కూతురి ముంగురులు సవరించి వెళ్ళిపోయింది గోపమ్మ. సుచరిత ఒళ్ళు విరుచుకుని లేచింది.



స్కూల్లో అడుగు పెట్టగానే విద్యార్థులంతా చుట్టుముట్టారు. "యెలా వుంది టీచర్ ఒంట్లో? మాకు నిన్నంతా అదోలా వుంది." పిల్లలు చూపే ఆదరానికి చిన్నగా నవ్వి తగురీతి సమాధానం చెప్పింది.

"ఏదీ ? పుష్ప వచ్చిందా?"

"యస్. మేడమ్!" పుష్ప సిగ్గుగా యింకోపిల్ల వెనకాల దాక్కుంది. ప్రార్థనగంట వినబడటంతో పిల్లలు పరుగున అటు పోయారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి ప్రార్థన వేదికవైపు వెళ్ళింది.

"హల్లో సుచరితా! హౌ డూ యు డూ!" హెడ్ మాస్టరుగారు చిరునవ్వుతో పలకరించారు.

"అ యాం ఆల్‌రైట్ సర్! థాంక్యూ."

"........యస్, చిల్‌డ్రన్ బిగిన్!"

"వందేమాతరం ........ వందేమాతరం ...... తరం ....." ప్రార్థన ముగిసింది. సుచరిత పుష్పను ఒంటరిగా పిల్చింది.

"ఏం పుష్పా! పెళ్ళి నిశ్చయమైందా?" సిగ్గుపడింది పుష్ప.

"ఫరవాలేదు చెప్పు, ఒప్పుకున్నారా?"

"వాళ్ళూ, అమ్మా, నాన్నా ఒప్పుకున్నారండి. సాయంత్రము అన్నయ్య ఊరి నుండి వచ్చాడండి. అన్నయ్య యిష్టపడ లేదండి. అందర్నీ కేకలేశాడు" చెప్పింది పుష్ప. సుచరితకు కాంతారావు, చలపతి మదిలో మెదిలి నిట్టూర్చింది.

"ఏమిటి సుచరితా! నిన్న అకస్మాత్తుగా సెలవు పెట్టారు?" తెలుగు టీచర్ శర్మగారు ప్రశ్నించారు.

"ఒంట్లో అంతగా బావుండలేదండి."

"ఓహో! అదే అనుకున్నాను. హెడ్‌మాష్టరుగారు పర్టిక్యులర్‌గా అడుగుతుంటే....." నసుగుతూ వెళ్ళిపోయాడు.

'ఛీ! ఏం కుళ్ళు మనుష్యులురా బాబూ!' అనుకుంది.

మూడవ పిరియడ్‌లో హోమ్‌వర్క్సు కరెక్టు చేసుకుంటూ కూర్చుంది. ఏవిలీన్, మరియమ్మ, లలిత వచ్చారు.

"మీకు క్లాసులు లేవా?" ఆశ్చర్యంగా చూచింది సుచరిత.

"యెందుకు లేవు? ఆ ముసలినక్క అలా బయటికి వెళ్ళాడు. ఊసిరి పీల్చుకుందామని వచ్చాము."

"ఓహో!" వాళ్ళధోరణి అసహ్యము కలిగించింది.

"ఏమిటి దిద్దుతున్నావు....... హోమ్‌వర్క్! సంతకం చేసి పారెయ్యక చదువుతున్నావా? అక్కడక్కడ ఎర్ర గీతలు పెట్టి యివ్వాలి." లలిత సలహా యిచ్చింది.

"ఇంటిదగ్గర పిల్లా పాపా? పనేముంది? ఈ పనులన్నీ నెత్తినేసుకుంది." ఎవిలీన్ కాంప్లిమెంటు.

"నే నేం అదనపు పని చెయ్యటం లేదు." సౌమ్యంగానే జవాబు చెప్పింది సుచరిత.

"అదనమో, అవసరమో మాకేం తెలుసు? ఆ ముసలినక్క 'సుచరితను చూడండి. వర్క్ యెంత అప్టుడేటుగా ఉంచుతుందో' అంటాడు. తాము పడుకుంటున్నట్టు" మూతి విరిచింది సుచరితను చూస్తూ లలిత.

"గవర్నమెంటు ఇచ్చే జీతాలకు చేసే పని చాల్లెద్దూ! ఎవరో పనిపాట లేనివాళ్ళు చేస్తారని మనమూ చేస్తామా."

"ఆ ముసలాడు అలాగే వాగుతాడు. వాడి దృష్టిలో సుచరిత, రమాదేవి, వెంకట రత్నము పనిచేసేవాళ్ళు, మనమంతా ఊరికే తిరిగేవాళ్ళమూను" మరియమ్మ విసురుగా వదిలింది బాణం. ఆ సంభాషణ సాగనివ్వద్దనుకుంది సుచరిత. "ఎవరి పిచ్చి వాళ్ళకానందం. ఎవిలీన్ అన్నట్లు నాకు యింటి దగ్గర అంతగా పని వుండదు. ఏదో చేస్తాను" చెప్పింది శాంతంగా. హెడ్‌మాష్టరు వస్తారేమోనని గుండె పీకుతూనే ఉంది. రోజూ చీవాట్లు వినేవాళ్ళకు అలవాటు కాని ఒకరోజు పొరపాటున చిన్న హెచ్చరిక విన్నా సుచరిత సిగ్గుతో చితికిపోతుంది. వాళ్ళ సంభాషణ సాగుతూనే వుంది. బెల్ అయింది. సుచరిత లేచింది. పుస్తకాలన్నీ కవరులో పెడ్తూ.

"వెల్దువుగానిలెద్దూ, ముంచుకు పోయేదేమీ లేదు. మన బుర్రతీసి వాళ్ళకు అతికినా వాళ్ళకు చదువు సక్రమంగా రాదు." సుచరితను ఆపాలని చూసింది లలిత. ఈ సారి సుచరితకు కోపం ముంచు కొచ్చింది. "మరీ



అంత అన్యాయంగా మాట్లాడకు లలితా, వాళ్ళకు వచ్చేది రానిది తరువాత సంగతి. మన విధి మనము నిర్వహించామన్న తృప్తి మిగిలితే చాలు" త్వరగా ఆ చోటు విడిచిపెట్టింది.

"పనితోనే తృప్తి పడు" వెనుక నుండి ఎవిలీన్ వెటకారం చేసింది. విననట్టే సాగిపోయింది సుచరిత. ఇంటర్‌వెల్ వరకూ ఈ సభ సాగుతూనే ఉంది.

ఆరవ పిరియడ్‌లో నోటీస్ తెచ్చాడు ప్యూన్. చదివి సంతకం చేసింది సుచరిత. ఆఖరి పిరియడ్‌లో స్టాఫ్ మీటింగ్ అని.

అందరూ సెవెంత్ క్లాసు రూములో సమావేశమయ్యారు. హెడ్‌మాష్టారు రాగానే లేచి విష్ చేసి కూర్చున్నారు.

"లేడీస్ అండ్ జంటిల్‌మన్ !"

"ఐ వాంటెడ్ టు సే సమ్‌థింగ్ ! యెంతమానాలనుకున్నా ఇంగ్లీషు మానలేను కదా?" చిన్నగా నవ్వాడు. "అనివార్య కారణాలవలన ఈ సమావేశం ఏర్పాటు చెయ్యాల్సి వచ్చింది. మనము చేసే ప్రతిపని యింకొకరి మెప్పు కొరకు కాదు, మన ఆత్మ సంతృప్తికొరకని గుర్తించాలి. అసలు విషయాని కొద్దాము. ఈ రోజు సెకండ్ పీరియడ్ తరువాత పదినిమిషాలు బయటికి వెళ్ళి వచ్చాను...........వచ్చి చూద్దును గదా నాలుగు క్లాసులు టీచర్సులేకుండా ఉన్నాయి. విద్యార్థులు గోలగా అరుస్తున్నారు. వాళ్ళెవరో నేనెరుగుదును. పేర్లు చెప్పి మీటింగులో అవమానపరచాలని కాదు నా ఉద్దేశ్యం. ఇక ముందు ఇలాంటి అవకతవకలు జరగొద్దని హెచ్చరిస్తున్నాను. టీచర్లంటే చిన్న చూపు ఉండటానికి కారణం పని దొంగతనమే. మరోవిషయం, నిన్న కొన్ని ఇంగ్లీష్ పిరియడ్‌లకు వెళ్ళా. స్పెల్లింగ్ మిస్టేక్స్‌కు అంతే లేదు. డిక్టేషన్ ఎప్పుడూ చెప్పిన పాపాన పోలేదట. ఈ విషయంలో కొంచెం శ్రద్ధ చూపితే మంచిది" ఎంతో శాంతంగా చెప్పినా కంఠంలో కాఠిన్యము దానంతటదే వచ్చింది. హెడ్‌మాష్టారు తన వైపు నుండి చెప్పేది చెప్పి కూర్చున్నాడు. లెక్కలు టీచరు రమణ లేచాడు. "సర్ ? మాకు కొన్ని సందేహాలున్నాయి. నివృత్తి చేసుకోవచ్చునా?" అన్నాడు స్టాఫ్‌వంక చూస్తూ.

"దేని గురించి ?"

"మన స్కూలు స్టాఫ్ గురించి" అన్నాడు.

"యస్" అంగీకారంగా తలాడించారు.

"టీచర్లకు తన పొజిషన్ ఏమిటో తెలిస్తే మంచిది. నిన్న నా క్లాసు కొచ్చి నా విద్యార్థులను బెదిరించటంలో ఉద్దేశ్యం ఏమిటి ? వెంకటేశం లేచాడు.

"మిస్టర్ రమణా ! ఆ విషయం వారి నడిగితే వారేం చెప్తారు? నేను చెప్తాను విను. నా పొజిషన్ నాకు బాగా తెలుసు. నా ప్రక్క క్లాసులో రమణ ఉన్నాడు సర్ ! శర్మ, రమణ కలిసి క్లాసును గాలికి వదిలి బయట కబుర్లు చెప్పు కుంటున్నారు. రెండుక్లాసుల పిల్లలు చేసే గోలకు నా క్లాసు డిస్టర్బ్ అయింది అందుకని వాళ్ళక్లాసు కెళ్ళి పిల్లలను మందలించాల్సి వచ్చింది."

వెంకటేశం వంక కొరకొరా చూస్తూ లేచాడు రమణ - సుచరిత వైపు చూస్తూ "సర్ ! సుచరిత విద్యార్థులను తప్పుత్రోవను పట్టిస్తున్నారు. తనే మంచిదట. తననే గౌరవించాలని చెబుతుంది, అవసరం లేని పెత్తనాలు చేస్తుంది" అందరివంకా చూచాడు. కొన్ని కళ్ళు నవ్వుతూ ప్రోత్సాహమిచ్చాయి.

"ఇదేమి అభియోగం? అర్థంలేని ఆరోపణ!....." సుచరిత మాట పూర్తి కాకుండానే హెడ్‌మాస్టర్ లేచారు. అందరినీ కలయజూచారు. "మీరుండండి సుచరితా ! మిస్టర్ రమణా ! మీ యిష్టమొచ్చినవి మీరు చెప్పండి. యిలాంటి అర్థంలేని విషయాలు ఎప్పుడూ మీటింగుల్లో ఎత్తవద్దు. విద్యార్థులు మనకంటే తెలివైనవారు. ఎవర్ని గౌరవించాలో వాళ్ళకు బాగా తెలుసు. మీకు ఆవేశమేగాని ఆలోచన లేదు. ఇంతవరకు మీ పొరపాట్లను క్షమిస్తూ వచ్చాను. రిజల్టు పడ్డరోజు పర్సంటేజ్ తక్కువని పిల్లలను రెచ్చగొట్టారు. స్వతంత్రదినం నాడు 'ఘోరం? 'ఘోరం' అంటూ పిల్లల వినోదప్రదర్శనకు భంగము కలిగించారు."

"అదంతా చెత్తలా కనిపించింది. కొంచెం స్టాండర్డుగా ఉండాలి" అన్నాడు రమణ.

"స్టాండర్డు దేనినిబట్టి నిర్ణయిస్తారు ? నవ్వుతూ, నవ్విస్తూ తిరిగే వాళ్ళంటే మీకు గిట్టదు. మీ ప్రవర్తనల్లో మార్పు తెచ్చుకోవాలి. అనవసర విషయాలలో తలదూర్చొద్దని హెచ్చరిస్తున్నాను."



"హెచ్చరించటం అంటే నన్ను ట్రాన్స్‌ఫర్ చేయించటమేగా? నేను సిద్ధమే. నా ఆరేళ్ళ సర్వీసులో పదకొండుసార్లు ట్రాన్స్‌ఫరయ్యాను, ఫరవాలేదు" రోషంగా మాట్లాడాడు.

"ఆల్ రైట్ ? మిమ్మల్ని చిన్నబుచ్చటం, అధికారం చెలాయించటం నా అభిమతం కాదు. కాని స్కూలు క్రమపద్ధతిలో నడవాలంటే, బాధ్యత తెలియనివాళ్ళకు బాధ్యతలు తెలియజేయటం నా కర్తవ్యం. మళ్ళీ ఒకసారి చెపుతున్నాను రమణా! మీ రేపనిచేసినా సావకాశంగా ఆలోచించి చెయ్యండి. ఇక వెళ్దామా?" ఆయన లేవగానే అందరూ లేచారు. ఆయన ఆఫీసువైపు వెళ్ళారు.

"రమణా! భలేగా చిత్తుచేశావు. ముసలాడి ముఖం వెల్ల వేసిన తెల్లగోడలా అయింది" అన్నారు శర్మ రమణ భుజం తడుతూ. రమణ బారెడుపైకి ఎదిగినట్టు ఫీలయ్యాడు.

"శర్మగారూ! మీ కుయుక్తులన్నీ ఆ పిల్లవాడిచేత ప్రదర్శించకపోతే మీరే పూనుకోకూడదూ ? చూడు రమణా! మీరు నాకు తమ్ముడిలాంటివారు. అనుభవం తక్కువ. యితరులు రేపగానే అలా చెడామడా మాట్లాడొచ్చు, వాళ్ళు మటుకు వాళ్ళు మంచిగానే వుంటారు. మధ్య మీ కెందుకు నిష్ఠూరం!" రమాదేవి శాంతంగా రమణకు నచ్చచెప్పి చూచింది. శర్మకు తేలుకుట్టి నట్టయింది. రమాదేవికి ఎదురుగా జవాబు చెప్తే ఎంత ప్రమాదమో తనకు తెలుసు. అందుకే వినిపించనట్టు జారుకున్నాడు.

"మీ సలహాకు థాంక్స్ ! నిజం నిష్ఠూరంగానే వుంటుంది రమాదేవి గారు. నాకు యెవరూ నేర్పలేదు. నేనేం పసిపిల్లవాడినా?" అన్నాడు రమణ.

"నీ అమాయకత్వం చూస్తే జాలివేస్తుంది రమణా ! ఎక్కువ మాటలు వద్దు. అనాలోచితంగా చేసే విషయాలకు త్వరలోనే చింతించగలవు - రా! సుచరితా". రమాదేవి, సుచరిత బస్‌స్టాండ్ వైపు వెళ్ళారు. వెనకాల విసుర్లు వినిపిస్తున్నాయి.

"మీ భవిష్యత్తు గురించి సోది చెపుతుందేమిటి రమా?"

"ముద్దుల చెల్లెలి ప్రస్తావనొచ్చిందిగా?"

"ఇదేమిటక్కా ! ఈ అర్థంలేని ఆరోపణలు!"

"పోనియ్ సుచరితా కుళ్ళు మనుషులు, పాఠాలు చెప్పరు. చెప్పేవారిని పిల్లలు గౌరవిస్తే చూడలేరు. ఆ అసూయను దాచుకోలేక వాగుతారు."

"చదువుకున్న వారు కదా! మాట్లాడేది సబబుగా ఉండాలని తెలియదూ?"

"చదువుకున్నంతమాత్రాన సక్రమ పద్ధతులు అలవడుతాయని ఏం నమ్మకం-ఏమిటి నిన్నలా వెళ్ళిపోయావు?"

"ఏమిటో పాత జ్ఞాపకాలు రేగి మనసు తొలిచి వెయ్యసాగాయి. అందుకే వెళ్ళిపోయాను."

"ఊఁ!" బాధగా నిట్టూర్చింది రమాదేవి. దూరం నుండి బస్సు వచ్చే శబ్దం వినిపించింది. ఇద్దరూ త్వరత్వరగా నడిచారు.

గోపమ్మ ఉబ్బసంతో ఆయాసపడుతోంది. మూడు రోజుల నుండి మంచము వదలనే లేదు. సుచరితే వంట చేసి, జావ కాసి తల్లిచేత తాగిస్తోంది. దిగులుతో సగం రోగం పెరుగుతోంది. కళకళలాడుతూ తిరగవలసిన కూతురు మ్రోడులా తిరుగుతుంటే ఏ తల్లి భరించగలదు? ఆమె కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి. జావతెచ్చిన సుచరితకు కోపమొచ్చింది. "అమ్మా! ఈ దిగులు మానందే నీ ఆరోగ్యం బాగుపడదు. ఇప్పుడేమైందని కంటతడి పెడుతున్నావు?"

"లేదమ్మా! ఏదో గుర్తుకొచ్చి..... నువ్వు అన్నం తిన్నావా!"

"లేదు, తింటాను -" జావ త్రాగించి బయటికొచ్చింది. బూట్లు టక టక లాడించుకుంటూ చలపతి వచ్చాడు.

"ఇదేనా రావటం?"

"ఊఁ. అమ్మేది?"

"ఎవరో చూడమ్మా వచ్చింది?" గోపమ్మ అడిగింది.

"చిన్నన్నయ్యొచ్చాడమ్మా... ఏం అన్నయ్యా! చాలారోజులకొచ్చావు. అంతా కులసాగా వున్నారా?"

"అందరూ మూడుపూటలూ తింటూ నిక్షేపంగా వున్నారు."

"ఒదినను తీసుకురాలేదే?"

"దానికి ఒంట్లో బావుండటము లేదు."

"మూడు పూటలూ తింటోందని ఇప్పుడేగా అన్నావు?"

"తింటే ఒంట్లో సరిగా వుంటుందేమిటి?"

"ఓహో! మళ్ళీ ఓ ఎడిషనల్ మెంబర్ని తయారు చేస్తోంది కాబోలు!" నవ్వింది సుచరిత. చలపతి బూట్లు విప్పుకొంటూ తనూ నవ్వాడు -

"నువ్వేమో పరిహాసము చేస్తావు. సంపాదించే మేనత్త, తండ్రి ఇద్దరుండగా దానికేం బాధ అని మీ వదినంటుంది. ఇక సంవత్సరానికొకరు అవతారమెత్తుతారు - అమ్మ బయటికి రాదేం? ఒంట్లో బాగా లేదా?" అంటూ గదికేసి వెళ్ళాడు.

"ఏంరా, ఇన్నాళ్ళకు జ్ఞాపక మొచ్చామా?"

"మిమ్మల్ని మరిచిపోతానా? తీరికేది? రావడం కుదరలేదే! జ్వరమా?"

"సత్తు వుడిగితే అన్నీ రోగాలే నాయనా! వెళ్ళి భోజనం చెయ్యి" ఉదాసీనంగా జవాబు చెప్పింది.

"రా, అన్నయ్యా! భోజనం చేద్దాము". లేచాడు చలపతి.

మూడురోజులుండి తనకు రావాల్సిన యింటద్దెలు వసూలు చేసుకున్నాడు చలపతి. తల్లి అనారోగ్యం గురించి పట్టనట్టే తిరిగాడు. గోపమ్మకు బాధగావున్నా ఏం అనలేదు.

"సుచీ! నీతో ఓ ముఖ్యవిషయం మాట్లాడాలి బయటి కొస్తావా?" సుచరిత వరండాలోకి వచ్చి కూర్చుంది.

"మీ వదినకు నీరసము! పెద్దపిల్ల లిద్దరూ బొత్తిగా చెడిపోతున్నారు. నీ దగ్గరయితే కాస్త భయం వుంటుంది అంది మీ వదిన - మీకూ సందడిగా వుంటుంది."

"ఇప్పుడు బడులు తీసి చాలా రోజులైంది. వచ్చే సంవత్సరం చూద్దాములే."

"అలా కాదు. ఇక్కడే చేర్పిస్తాను. ఈ మధ్య కొంచెం ఖర్చు కూడా యెక్కువైంది. పోయిన నెల పాపకు జబ్బు చేసింది. మీ వదినకు మందులు కొనని నెల లేదు. డబ్బు చాలక మీ వదిన గొలుసు బ్యాంకులో పెట్టి అప్పు

తెచ్చాను. అది విడిపించాలంటే కుదరటం లేదు. ఓ రెండు మూడు వందల సర్దగలవా?"

సుచరిత తెల్లబోయింది. "నా దగ్గరంత డబ్బెక్కడిదన్నయ్యా? నా జీతంలో నెలకు పాతికో, యిరవయ్యో మిగిలితే పదిరోజుల నుండి అమ్మ మందులకే సరి పోతున్నాయి"

"అన్నయ్య అమ్మకు డబ్బు పంపటం లేదా?"

"నువ్వెంత పంపుతున్నావో వాడూ అంతే."

"పోవే. వాడికీ నాకు పోలికా? వాడి కెంతొస్తుందని!"

"పోనీలే అన్నయ్యా! ఎవరూ పంపొద్దు. అమ్మ నాకేం బరువు కాదు"

అయిదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి.

"ఓ సంగతి చెప్తాను వింటావా సుచరితా?"

"చెప్పన్నయ్యా!"

"మీ అత్తగారివైపు వాళ్ళు నీ భాగమంతా మేస్తున్నారు. నువ్వెందుకు దానికి ప్రయత్నించగూడదు? డబ్బు చేదా?"

"అన్నయ్యా!" సుచరిత కళ్ళల్లో నీళ్ళు చిమ్మాయి. "ఎందుకు నన్ని బాధపెడతారు? దేన్ని మరిచిపోవాలని ప్రయత్నిస్తున్నానో దాన్నే మీరు యె చూపుతున్నారు! నేను వాళ్ళింటికి వెళ్ళిందెప్పుడు చెప్పు! వాళ్ళు నా బంధువు అన్న భావనే నాకు లేదు. ఇక ఆ విషయం యెప్పుడూ నా వద్ద యెత్తవద్దు"

"ఆవేశం వద్దు సుచీ! డబ్బు అవసరం లేనిదెవరికి?"

"నాకు అవసరమైన డబ్బు నేను సంపాదించుకుంటున్నాను. చా ఎవరి దయాభిక్షా నాకు అక్కర లేదు." అన్నది కఠినంగా.

"నాకు ఇమ్మంటున్నానా! నేను చెప్పేది వినవేం?"

"విననక్కరలేదు చలపతీ! ఒక్కగానొక్క తోడబుట్టిన చెల్లెలు నిర్జీవంగా యింట్లో తిరుగుతూ ఉంటే మీకు బాధ లేదు. కాని దాన్ని సంపాదన సాధనంగా వాడుకుంటారా? ఛీ! మీలాంటి కొడుకులను కన్నందుకు నే సిగ్గుపడాలిరా!" గది గుమ్మములో నిలబడి ఆవేశంగా ఊగిపోతోంది గోపమ్మ



"అమ్మా! నువ్వెందుకు లేచి వచ్చావు? నీ ఆరోగ్యం అసలే బాగా లేదు?" సుచరిత వెళ్ళి తల్లిని పట్టుకుంది.

"నువ్వుండు తల్లీ! అవసరమొస్తే తప్ప అమ్మా, చెల్లీ గుర్తు రారు కదరా! రేపు నేను చచ్చినా దాన్ని మీరేం చూస్తారు? మీ ప్రవర్తన చూస్తోంటే నాకు చావు కూడా తృప్తిగా రాదురా" ఆవేశంగా అరుస్తోంది గోపమ్మ. సుచరిత బలవంతంగా లోపలికి తీసుకెళ్ళింది.

సాయంత్రము వెళ్ళిపోయాడు చలపతి. వెళ్ళేవరకూ ముభావంగా తిరిగాడు. గోపమ్మ కుమిలి కుమిలి ఏడ్చింది. తన కుమారుల కిలాంటి పోలిక వచ్చిందేమిటి? భర్తకు కూడా యింత స్వార్థం లేదు. ఇదంతా సుచరిత దురదృష్టమా? సుచరిత బ్రతుకే అంధకారమైంది. అనతిదూరంలో వెలుగురేఖ కనిపించటం లేదు. తను యెక్కువ రోజులు బ్రతకదు. తరువాత సుచరిత యెవరి వద్ద ఉంటుంది? ఒంటరిగా ఈ ప్రపంచములో యెలా జీవిస్తుంది ? అది వాళ్ళలా మొగపిల్లాడే అయితే ఏ బాధా ఉండేది కాదు.

"అమ్మా ! నువ్విలా దిగులుపడితే యెలా! అన్నయ్యల ప్రవర్తన క్రొత్తదా? ఒక్కరోజులో యెంత దిగజారిపోయావో చూడు!" అన్నది తల్లి గుండెలు రాస్తూ.

"పెద్దతనం కదూ! ఇంకెలా ఉంటాను తల్లీ !" పాలిపోయిన కూతురు చెక్కిళ్ళు నిమురుతూ అంది.

స్కూలు కెళ్ళినా సుచరిత మనసు యింటివైపే ఉంది. "ఏమిటి సుచరితా! అలా వున్నావు" రమాదేవి పలకరించింది.

"ఆ ఏమీ లేదక్కా ?" ఉలిక్కిపడింది.

"అంత పరధ్యాస యెందుకు ?"

"అమ్మకు ఒంట్లో యేం బావుండటం లేదు. యిస్తున్న మందులు పనిచెయ్యటం లేదు. రోజుకు రోజు క్షీణించిపోతోంది."

"మీ అన్నగారికి ఉత్తరం రాశావా?"

"ఏం రాయను? మొన్ననే చిన్నన్న వచ్చివెళ్ళాడు. పెద్దన్నయ్య రాసినా రాడు. అదో బాధ" సుచరిత కళ్ళు సజలమయ్యాయి.

"ఇంత చిన్నవిషయానికి దిగులుపడితే యెలా ? వయస్సు వచ్చినకొ
తొందరగా తగ్గదు. మంచి డాక్టరు వద్దకు తీసుకెళదాము. నువ్విలా ఉం
ఆమె మరీ దిగులు పడుతుంది."

"ఎప్పుడూ అదే దిగులు అక్కా. నాగురించి దిగులు పడొద్దంటే వినద
మనోవ్యాధికి మందులేం పనిచేస్తాయి.?"

"ఊc! నువ్వు మాత్రం ధైర్యంగా ఉండు" రమాదేవి క్లా
కెళ్ళిపోయింది.

ఎనిమిదవ తరగతి ఇంగ్లీషు కాంపోజిషన్ నోట్‌బుక్స్ తీసింది సుచరి
ఒక్క స్పెల్లింగ్ కూడా సరిగా లేదు. వాళ్ళంతా మరియమ్మ ప్రమోట్ చే
విద్యార్థులు. పైగా తనకే ఇంగ్లీషు వస్తుందని తెగ గర్వము ఆవిడకు. తెలుగు
ఇంగ్లీషు పాఠాలు కలిపి మాట్లాడటం సుచరిత కిష్టముండదు. అది గమనిం
మరియమ్మ సుచరితకు ఇంగ్లీషు రాదను కుంటుంది. మరియమ్మ అజాగ్ర
గర్వము యెరిగిన ప్రిన్సిపాల్ ఎనిమిదవ తరగతి సుచరితకిచ్చాడు. దాం
మరియమ్మకు మరింత మండిపోయింది.

రెండు పేపర్లు దిద్దేసరికి తలప్రాణం తోకకొచ్చింది. మిగల
కొట్టివేసింది. బెల్ కాగానే నోటుబుక్స్ తీసుకుని క్లాసుకెళ్ళింది. యెవ
వారికిచ్చింది.

"టీచర్ ! 'Cow has to eyes' తప్పాండి?" ఓ విద్యార్థి లేచాడు.

"టు స్పెల్లింగ్ చెప్పు మొదట."

"టి ఒ టు" అన్నాడు వెంటనే?"

"ఈజ్ ఇట్ కరెక్ట్?"

"కాదు, టీచర్! టి డబ్ల్యూ ఒ టు నండి" యింకో విద్యార్థి
జవాబు చెప్పాడు.

"అవునండి" తలొంచుకున్నాడు ఆ మొదటి కుర్రవాడు. కాంపోజి
బోర్డుపైన రాసింది. కొందరు పిల్లలకు కొన్ని పదాలు అర్థం కాకుంటే తెలుగు
చెప్పింది. "చూడండి-చిన్నక్లాసులలో గ్రమిటికల్ మిస్టేక్స్‌కు అంత ప్రాము
యివ్వరు. స్పెల్లింగ్ మిస్టేక్స్ మాత్రము పర్టిక్యులర్‌గా చూస్తారు. పాఠం



వచ్చే కఠినమైన పదాలన్నీ రఫ్ నోటుబుక్కులో పదిసార్లు ఇంపోజిషన్ వ్రాయండి."

"అలాగే టీచర్" ఏక కంఠముతో అంగీకరించారు పిల్లలు.

"గుడ్. టెక్స్టుబుక్ తియ్యండి. రీడింగ్ చూద్దాము" అదీ అంతంత మాత్రమే. క్లాసు తనకిచ్చి రెండు నెలలు! తనేం ఇంప్రూవ్ చేసినట్టు? మనసంతా అసంతృప్తి ఆవరించుకుంది. చికాకుగా ముగ్గురి చెవులు మెలివేసింది. పిల్లలు గజగజలాడిపోయారు. రోజూ కొట్టే టీచర్లంటే అంత లక్ష్యముండదు.యెన్నడూ లేనిది సుచరిత చెయ్యి చేసుకుంటే వాళ్ళకు భయమేసింది. 'రేపటినుండి చదవకుండా క్లాసుకు రాము' అని ప్రమాణం చేశారు. బెల్ కాగానే బయటికొచ్చింది. గుమ్మం దగ్గర ఎవిలీన్ నిలబడి ఉంది.

"ఏమిటి సుచరితా! అలా వున్నావు?"

"ఏమీ లేదండి" అని వెళ్ళబోయింది.

"మీరు ఇంగ్లీషు క్లాసులో తెలుగులో అర్థాలు చెప్తారేమిటండీ?"

సుచరితకు చిర్రెత్తుకొచ్చింది. అయినా తన్ను తాను సంబాళించు కుంది. పొంచి వుండి యితరుల పాఠం వినటం అంటే అసహ్యమేసింది.

"వాళ్ళకు అర్థం కాదు. ఫౌండేషన్ బాగా లేదు" అంది.

"అదేమో, అలా చెప్పటం రూల్సుకు విరుద్ధం. మీరూ ట్రైనింగ్ అయ్యారుగా? డైరెక్టు, ఇండైరెక్టు మెథడ్స్ అని రెండు రకాలు."

"ఇతరులు పాఠం చెపుతుంటే గుమ్మం దగ్గర నిలబడి వినటం రూల్సా ఎవిలీన్‌గారూ! అన్నీ రూల్సు ప్రకారమే మాట్లాడాలంటే నన్ను విమర్శించే అధికారం నీ కెక్కడిది? ఇక ముందు జాగ్రత్తగా ఉండండి" కోపంగా జవాబు చెప్పింది సుచరిత. ఎవిలీన్ అవమానంతో ఊగిపోయింది. కనిపించిన వాళ్ళందరితో సుచరితకు టీచ్ చెయ్యడం రాదని ప్రచారం మొదలు పెట్టింది. తను ఉచితంగా సలహా యివ్వబోతే తిట్టిందని చెప్పింది.

లాస్ట్ పీరియడ్ పర్మిషన్ తీసుకొని యింటికొచ్చింది సుచరిత. గోపమ్మ ఆయాసంతో బాధపడుతోంది. అద్దెకున్న వాళ్ళ అబ్బాయిని పంపి డాక్టరును

పిలిపించింది. ఆయన పరీక్షచేసి జనరల్ హాస్పిటల్లో అడ్మిట్ చెయమని చెప్పాడు "ఊపిరితిత్తుల్లో నీరొచ్చిందని అనుమానంగా ఉందమ్మా! జనరల్ హాస్పిటల్లో అయితే ఎక్స్‌రే, బ్లడ్ టెస్టు వాళ్ళే చేస్తారు."

"ప్రమాదమా? యిప్పుడే చేర్చాలా ?"

"ప్రమాదమేం లేదు. ఎంతతొందరగా చేరిస్తే అంత మంచిది" చేర్చుకోవడానికి రికమండేషన్ రాసిచ్చి వెళ్ళిపోయారు డాక్టర్. సుచరితకు ఏ తోచలేదు. కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి. తల్లిని హాస్పటల్లో చేర్చేదెలా?అ ఆలోచించసాగింది. రమాదేవి, ఆమెభర్త మూర్తి వచ్చారు. రమాదేవి భుజం తలవాల్చి వెక్కి వెక్కి ఏడ్చింది. "ఛ ! ఊరుకో అమ్మకెలా ఉంది.?" తేరుకు డాక్టర్ చెప్పిందంతా చెప్పింది. మూర్తిగారు వెళ్ళి టాక్సీ తెచ్చారు. అందరు వెళ్ళి గోపమ్మను హాస్పిటల్‌లో చేర్పించారు. అసిస్టెంట్ సర్జన్ ఎక్స్‌రే తీస్తేగా ఏం చెప్పలేనని వెళ్ళిపోయాడు. నర్సుకేదో మందు ఇవ్వమనిచెప్పాడు మందుతెచ్చి నర్సు తాగించి వెళ్ళిపోయింది. రమాదేవి, మూర్తి ధైర్యము చె వెళ్ళిపోయారు.

రాత్రి పదిదాటింది. గోపమ్మ ఆయాసం మరీ ఎక్కువయింది. పడుకో నంటుంది. కూర్చోలేనంటుంది. దిండ్లు ముందుపెట్టి, దానికి చేర వే కూర్చోబెట్టింది. డాక్టర్ని పిలవమని నర్సులకు చెప్తే ఎవరూ విన్పించుకో తనే డాక్టర్ని పిలవడానికి బయలుదేరింది. రెండువైపులా గదులున్నాయి. వైపు దాంట్లో ఆ వార్డు డాక్టరుంటాడో తెలియక అటుయిటు చూ నిలబడింది.

"సుచీ!" సుచరిత ఉలిక్కిపడి చుట్టూ కలయచూచింది. తన్ను స్వతంత్రంగా పిలిచేవారెవరు? ఎదురుగా మెడలో స్టెతస్కోపు తగిలించుకొ డాక్టర్.

"నన్ను గుర్తించలేదా సుచీ! సుచరితా ?"

సుచరిత కళ్ళు సంబరంగా విచ్చుకున్నాయి. క్షణం దుః మరిచిపోయింది. "నువ్వా రఘూ! - మీరా? ఇక్కడున్నారా?" చాలాకాలా కల్సుకొన్న స్నేహితులు అనుకోకుండా ఒకర్నొకరు చూచుకోవడం



కొన్నిక్షణాలు మాటలు కరువయ్యాయి. రఘు అలాగే సుచరిత వంక చూస్తున్నాడు. ముఖం వాడి వుంది. తప్ప అవే తనను మంత్రించే కళ్ళు! ఆడుకోవాలనిపించే అలల్లా లేచే జుట్టు! తాకాలనిపించే పసిడి నిమ్మపండువంటి మేని ఛాయ - రఘు తేరుకున్నాడు.

"నేను యిక్కడ డాక్టరుగా పనిచేస్తున్నాను. నువ్వు ఇక్కడెందుకున్నావు?"

"అమ్మకు ఊపిరితిత్తుల్లో నీరు వచ్చిందట - ఆయాసపడుతోంది. డాక్టర్ని పిలవడానికొస్తే నీవు- మీరు ఎదురొచ్చారు" అంది మాట తడబడుతూ.

"అంత కంగారెందుకు? పద అమ్మను చూద్దాము." యిద్దరూ గోపమ్మ మంచము దగ్గర కొచ్చారు. రఘు గోపమ్మను పరీక్షించి రిపోర్టు షీట్ చూసి, నర్సును కేకేసి ఏమేమో పురమాయించాడు. నర్సు మందు ఇంజక్షన్‌తో వచ్చింది. మందు త్రాగించి ఇంజెక్షన్ చేశాడు. గోపమ్మ వద్దని గోలపెట్టింది. కొద్దిసేపు ఆమెను పట్టుకొని కూర్చోబెట్టాడు. పది నిమిషాల్లో నిద్రపోయింది. ఆమెను తల దిండ్ల పైకి జరిపాడు. ప్రశాంతంగా ఉంది ఆమె ముఖం.

"అదేమిటి? అమ్మ అలా అయిపోయింది!" కంగారుగా ప్రశ్నించింది.

"మరేం భయం లేదు. నిద్రపోయింది. నర్స్! డాక్టరు హుస్సేన్‌ను పిలువు" నర్సు వెళ్ళిపోయింది.

"ఇంత ముదిరేవరకు ఏం జేశావు?"

"చాలా ప్రమాదామా ? నెలరోజుల నుండి మందు తీసుకుంటోంది."

"ప్రతి దానికి నువ్వంత భయపడితే యెలా? ప్రమాదం ఏం లేదు. ఒకటి, రెండు నెలలు యిక్కడే ఉంచాలేమో?"

"అలాగే ఉంచుతాను. మిమ్మల్నిక్కడ చూచిన తర్వాత ఎంతో ధైర్యమొచ్చింది"

"చలపతి, కాంతారావు రాలేదా?"

"వచ్చి వెళ్ళారు."

"చలపతి ఏం మారలేదన్నమాట...?"

"ఊం వాళ్ళ ప్రవర్తనతోనే అమ్మ సగం కృంగిపోతోంది."

"సరే! నువ్వు భోజనం చేశావా?"

"చేశాను."

"చెయ్యలేదని నీ ముఖమే చెప్తోంది. నాకు కారియర్ వచ్చింది. తిందువుగాని పద"

"నిజంగానే చేశాను. నా కొలీగ్ రమాదేవని ఉంది. ఆమె పంపింది- అమ్మగారు ఎక్కడున్నారు? బావున్నారా ?"

"ప్రస్తుతం ఊళ్ళో ఉన్నారు, యెప్పుడూ నిన్ను జ్ఞాపకం చేస్తుంది. మళ్ళీ మీరు ఊరెళ్ళనే లేదట ?

"అవును ఊరంటే అమ్మ విముఖత చూపుతోంది!"

"పాత జ్ఞాపకాలు బాధిస్తాయేమో! రెండు నెలల క్రితం ఒక్కసారి చలపతి కనిపించాడు. నువ్వు టీచరుగా పని చేస్తున్నావని చెప్పాడు. నిన్ను చూడాలని ఉందంటే మళ్ళీ వచ్చి తీసుకెళతానన్నాడు. అంతే, కనిపించనేలేదు!"

"వాడంతే!" డాక్టరు హుస్సేన్ రావటంతో సంభాషణ ఆగిపోయింది. కొంచెము దూరం వెళ్ళి యిద్దరూ ఏమో మాట్లాడారు. హుస్సేన్ కేసు వివరాలు చెప్పి వెళ్ళి పోయాడు. రఘు మళ్ళీ సుచరిత వైపు వచ్చాడు. "ఏమన్నాడు?" అంది.

"ఫరవాలేదు. నువ్వేం దిగులుపడకు. పడుకోవటానికి ఏమన్నా తెచ్చుకున్నావా?"

"రమాదేవి పంపించింది-మీకు చాలా శ్రమ కల్గించాను." అంది.

"సుచరితా! మీరు నాకు పరాయివాళ్ళా! అవును. నేనే పొరపడ్డాను. నువ్వు చిన్నప్పటి నుండీ అంతేగా?" సుచరిత కళ్ళు నీరుతో నిండాయి. ఉన్న ఆత్మీయుడిని దూరం చేసుకుంటున్నానేమో అనే బాధ ఆమె కళ్ళల్లో చూచి చిరుకోపం ప్రదర్శించాడు. "ఛ! కన్నీరు ఎందుకు? పద. కాఫీ త్రాగొచ్చి నిశ్చింతగా పడుకో. అమ్మ విషయం నేను చూసుకుంటాను."

"నన్ను క్షమించండి."

"ఇక చాలు? ఇంకేం మాట్లాడొద్దు."

* * *



గోపమ్మ దిండ్లనానుకొని కూర్చుంది. చాలా వరకు ఆయాసం తగ్గింది. తన వార్డులో రౌండ్స్ పూర్తి చేసుకుని వచ్చాడు రఘు.

"ఏమమ్మా! కులాసాగా ఉందా!"

"కులాసాగానే ఉన్నాను బాబూ! ఇదంతా నీ చలవే. నెలరోజుల నుండి నా గురించి చాలా శ్రమపడ్డావు." గోపమ్మ హృదయం అనురాగంతో పులకించిపోయింది. ఊళ్ళో రఘును చూచింది. చలపతి స్నేహితుడుగా తప్ప ప్రత్యేకంగా గుర్తు లేదు. ఈ నెలరోజులలో ఆమె హృదయంలో ఓ ప్రత్యేకమైన స్థానం ఏర్పరచుకున్నాడు. రఘును కన్నతల్లి ధన్యురాలనుకుంది.

"అదేమిటమ్మా అలాంటి భావనే రానివ్వద్దు. నా తల్లికైతే నేను చెయ్యనా? అది శ్రమగా యెంచుతానా? సుచరిత వచ్చి వెళ్ళిందా?"

"లేదు. ఆరింటికి వస్తానని చెప్పింది. స్కూల్లో ఏదో మీటింగ్ ఉందట - బిడ్డ బాగా చిక్కిపోయింది. యిటు తిరుగుతూ, స్కూల్లో పని చూసుకుంటూ, ఇంటిపనీ దాని నెత్తినే పడింది". గోపమ్మ మాట పూర్తి చెయ్యకమునుపే నవ్వాడు రఘు. "తల్లు లెప్పుడూ యింతే. మరి, నేను వెళ్ళి రానా?" వెళ్ళబోయాడు రఘు.

"ఒక్క సంగతి నాయనా! యిక్కడ విసుగేస్తోంది. ఇంటికి పంపించి వెయ్యవా? నాకు చాలా తేలికగా ఉంది."

"లేదమ్మా? ఇంకో నెలయినా తిరగకుండా ఉండాలి. ఇంట్లో యెలా కుదురుతుంది?"

"ఇంటికెళ్ళినా తిరగను నాయనా! చాలా జాగ్రత్తగా ఉంటాను. సుచమ్మ కొరకైనా నన్ను పంపించు. రోజా రాత్రుళ్ళుండి ప్రొద్దుటే స్కూలుకు వెళ్ళటం విశ్రాంతి లేక అది జబ్బుపడితే చేసేదెవరు? నా కొడుకుల పద్ధతి చూశావుగా? ఉత్తరం రాస్తే చుట్టపు చూపుగా వచ్చి వెళ్ళారు అంది దిగులుగా.

"సరే! ఇంటికెళ్ళే ఏర్పాట్లు చేస్తాను. మీరు యింటికెళ్ళినా నేను చెప్పినట్లు వినాలి మరి."

"తప్పకుండా నాయనా !" జవాబిచ్చింది.

"ఏమిటమ్మా! చాలా సంతోషంగా కబుర్లు చెప్తున్నావు?" సుచరిత టిఫిన్ క్యారియర్ తీసుకుని వచ్చింది.

"నన్ను యింటికి పంపించి వేస్తానంటున్నాడమ్మా రఘుబాబు." సుచరి
రఘువైపు చూచింది. రఘు చిన్నగా నవ్వాడు.

"నీకు కష్టమవుతుందని అమ్మ చాలా బాధ పడుతున్నారు. ఇం
కొచ్చినా జాగ్రత్తగా ఉంటారట...."

"అవన్నీ యిక్కడి మాటలే. ఇంటికొస్తే ఏదో పని చేస్తుంది. నాకే
కష్టం లేదు. తగ్గేవరకు యిక్కడే ఉండనీ."

"ఫరవాలేదు. రోజూ నేను వచ్చి చూస్తాగా. మనసు లేనిచోట మం
కూడా వంటబట్టదు. సామాన్లు సర్ది ప్యాక్ చెయ్యి. ఆర్.ఏమ్.ఓ.తో మాట్ల
యిప్పుడే వస్తాను." రఘు వెళ్ళిపోయాడు.

"మొత్తానికి నీ పంతం నెగ్గించుకున్నావు - సరే - నీ సంగ
డాక్టరుగారికేం తెలుసు" అంది సుచరిత నిష్ఠూరంగా. సామాన్లన్నీ కా
చేర్చారు. గోపమ్మ కోసం వీల్‌ఛైర్ తెచ్చారు. నర్సులకు కృతజ్ఞత తెలి
ఆయాలకు ఊడ్చేవాళ్ళకు కొంత డబ్బిచ్చి బయటి కొచ్చింది సుచరిత. అప్పటి
రఘు డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. తల్లికి శాలువా కప్పి తను కూర్చుంది

"అయిందా? ఇంకెవరికన్నా బహుమతిచ్చేది ఉందా" కాస్త తలప్రక్క
తిప్పి అడిగాడు. సుచరిత నిండుగా నవ్వింది.

"మీకు ఒక్కరికే యివ్వాలి. .....

"అది వాళ్ళ డ్యూటీ. ప్రభుత్వము వారికి జీతాలు ఇస్తోంది. ఈ విధం
లంచగొండితనాన్ని ప్రోత్సహించటం తప్పు"

"పావలా డబ్బులకిలా అంటున్నారు. నూర్లు, వేలు మింగే పై వా
మాటేమిటి? మొన్న మాకు తెలిసినావిడ కాలు ఆపరేషన్ చేయించుకుం
చేసింది గవర్నమెంటు హాస్పటల్లో. యింటి దగ్గర ఆయనకు మూడువంద
ముడుపు చెల్లించనిదే పని జరగలేదు. ఒక హాస్పటల్లో నేమిటి? ప్రతిచో
అదే తంతు. డబ్బుంటేనే పనులు జరుగుతుంటాయి. ప్రపంచ
మెటీరియలిస్టిక్‌గా మారింది"

"మొత్తానికి టీచరువని నిరూపించుకున్నావు" నవ్వాడు రఘు కా
స్టార్ట్ చేస్తూ.



"మీరు నన్నుడికించాలని అంటున్నారు. మీకు తెలియవా! మొన్నో బస్ కండక్టర్ని సస్పెండ్ చేశారు, అతనేదో తన కిల్లీల ఖర్చు మిగుల్చుకుంటాడు. అంతే ! పోలీస్ డిపార్టుమెంటువారికి రెండువందల జీతముంటే, రెండేళ్ళలో రెండులక్షల బిల్డింగ్ నిర్మిస్తారు. అలాగే పి.డబ్ల్యు.డిపార్టుమెంటువారు, రెవెన్యూ-ఏందయ్యా? అని అడిగేవారేరి? ఈ కండక్టర్లు కూడ కొంతముడుపు యిన్‌స్పెక్టర్లకు చెల్లించుకుంటే ఆ రోజు మొత్తం ప్యాసెంజర్లకు టికెట్ ఇష్యూచేయకున్నా యెవరూ అడగరు."

"నిజమే" ఇల్లు రావటంతో సంభాషణ ఆగిపోయింది. గోపమ్మకు పడక ఏర్పాటుచేసి, పరుండ చేసింది. ఆమెకు రొట్టె, పాలు యిచ్చి లేచింది. రఘుకూడా లేచాడు. తీసుకోవల్సిన జాగ్రత్తలన్నీ చెప్పాడు.

"నేను వంట మొదలు పెట్టాను. భోజనంచేసి వెళుదురుగాని"

"ఇంకోసారి భోజనం చేస్తాను. ఇప్పుడు వెళ్ళనివ్వండి" గోపమ్మవంక చూచాడు.

"వెళ్ళనియ్యి సుచమ్మా! ఇంటి దగ్గర అమ్మాయి కనిపెట్టుకుని ఉంటుందేమో !"

"ఈ డాక్టర్లు అనుకున్న సమయానికి యింటికెళతారా? ఈరోజు నావైపు నుండి మా అక్కగారికి క్షమార్పణలు చెప్పండి" అన్నది సుచరిత. డాక్టర్ రఘు సన్నగా నవ్వాడు.

"అలాంటి బాదరబందీ ఏం లేదమ్మా! ఒంటిగానే ఉంటున్నాను" అన్నాడు.

"యెప్పుడడగాలన్నా హడావుడే! అమ్మాయిని ఊళ్ళో ఉంచావా!"

"లేదమ్మా, ఇంకా వివాహమే చేసుకోలేదు."

"అదేం నాయనా! అమ్మ వూరుకుందా?"

"పోరుతూనే వుంది. మా వంటవాడు మాత్రం నేను వెళ్ళేవరకు తిండిముట్టడు. సత్యకాలపువాడు."

"అదేం నాయనా ? అమ్మను పిలుచుకు రాలేక పోయావా?"

"ఇక్కడేం తోస్తుంది? అక్కడ అన్నయ్య పిల్లలతో ఉంటుంది.

అన్నయ్యకు క్యాంప్‌లు యెక్కువ. అందుకే వదినను, పిల్లలను పుళ్ళో
వుంచారు. వాళ్ళతో అమ్మకు కాలక్షేపం" రఘు, గోపమ్మ మాట్లాడుతుండగా
సుచరిత వంట పూర్తి చేసింది. రెండు స్టవ్‌లు అంటించింది. అన్నము
బంగాళదుంపలు పెట్టింది. పుల్లమజ్జిగతో పులుసుపెట్టింది. తనకు వండుకు
పప్పుండనే ఉంది. అప్పడాలు! వడియాలు వేయించింది. మధ్యగదిలో కూర్చు
మధ్య మధ్య లోపలికి చూస్తున్నాడు రఘు. తల్లి సపర్యలలో చిక్కి, నల్లబడిం
కాని అదే అందం, అదే సౌమ్యత.

"లేవండి భోజనానికి" సుచరిత వెనకాల లోపలికెళ్ళాడు, బూట
విప్పుకుని.

"అండి-మీరు అరువు తెచ్చుకున్నట్టున్నది. మొదటిలాగే పిలి
కూడదూ?"

"బావుంది! మీరు 'సుచీ' అని యెందుకు తడబడ్డారు. వయసుతో
పాటు కొన్ని సరదాలు ఏర్పడతాయి మనచుట్టూ వాటిని దాటాలనుకోవ
వివేకమనిపించుకోదు."

జవాబు చెప్పలేదు రఘు. వచ్చి పీటమీద కూర్చున్నాడు. అన్నీ వడ్డిం
దూరంగా కూర్చుంది సుచరిత.

"నువ్వు కూడా వడ్డించుకో సుచరితా"

"వద్దు. నేను తరవాత తింటాను."

"ఉహు అయితే నేనూ తినను" రఘు మొండికేశాడు.

"ప్లీజ్, నామాట వినండి. ఈరోజు నాకు చాలా సంతోషంగా వుంది
దాంతోటి నా కడుపు నిండిపోయింది. బలవంతం పెట్టకండి" జాలిగ
వేడికోలుగా చూసింది. ఆమె మాటలను త్రోసివేసే శక్తి తనకు లేదనుకున్నా
రఘు. త్వరగా భోజనం ముగించాడు.

"అదేం అంత త్వరగా పూర్తిచేశారు. నా వంట బాగాలేదా ?"

"వంటకేం? దివ్యంగా వుంది. మా నాయర్ చేతివంట తిని జీవి
చచ్చిపోయింది. బ్రతకటానికి తింటున్నాను" సుచరిత నవ్వింది.

"ఓ మంచి పాకశాస్త్ర ప్రవీణురాలిని చూసి పెళ్ళి చేసుకోండి. అప్పుడ
తినడానికి బ్రతకొచ్చు"



జవాబు చెప్పక నీరసంగా నవ్వి బూట్లు కట్టుకోసాగాడు.

సుచరిత అతనివంక పరీక్షగా చూసింది. చిన్నప్పటి ఆకతాయి రఘు కాదు, వేలాది ప్రజల నోళ్ళలో ఉండే గంభీరమూర్తి !

"వస్తాను. రేపు సాయంత్రం వచ్చి చూస్తాను. అమ్మ నిద్రపోతున్నారు జాగ్రత్త!" రఘువెళ్ళి కార్లో కూర్చుని స్టార్ట్ చేశాడు. సుచరిత కార్ మలుపు తిరిగేవరకు గుమ్మంలో నిల్చుని చూసింది.

* * *

"నిన్న హాస్పిటల్‌కు రావాలనుకున్నాను సుచరితా! ఇంటికివెళ్ళేసరికి బంధువులు వచ్చి ఉన్నారు, అమ్మ గోలచేస్తోందా ఇంటికొచ్చేస్తానని" రమాదేవి పలుకరించింది.

"ఇంకా గోలేమిటక్కా! ఇంటికొచ్చేస్తేను."

"డాక్టరుగారు అనుమతించారా?"

"ఆయనతో పోరి వచ్చింది. బంధువులెవరక్కా. అతిథిలేని భోజనం వంటబట్టనట్టుంది మీకు?"

"వాటం చూస్తే అలాగే వుంది. కాని సంసారమన్నాక అన్నీ వుంటాయి. వచ్చేవాళ్ళను వద్దంటామా?"

"ఇంతకీ యెవరు? మీ వదినగారా?"

"కాదు. మా పెద్దఆడబడుచు భర్త మేనమామ." సుచరిత గొల్లున నవ్వింది. "భలే దగ్గరచుట్టమే. నువ్వు కాబట్టి చేస్తున్నావు-ఇటు ఉద్యోగం, అటు యిల్లు, పిల్లలు, అతిథులు. నేనైతేనా బాబోయ్ తలుచుకుంటేనే భయం వేస్తుంది."

"సమయమొస్తే నువ్వూ చేస్తావు. వచ్చినందుకేం బాధ లేదు. వాళ్ళవిమర్శలతో చావొస్తుంది. ఉచిత సలహాలిస్తారు."

"ఉచిత సలహాలంటే గుర్తొచ్చిందక్కా! మొన్నోరోజు అమ్మను పరామర్శించడానికి పెద్ద వదిన తండ్రి వచ్చాడు. ఆయన మాట్లాడే తీరు చూస్తే తన్ని తరిమెయ్యాలనిపించింది. 'ఎందుకమ్మా! ఈ తాపత్రయం? మీ వదిన కూడా బలహీనంగా వుంది. మీరు అక్కడే వుంటే మీకాలం

గడుస్తుంది. వాళ్ళకు సహాయం లభిస్తుంది. వెధవ పంతులమ్మ ఉద్యోగం అంటూ మొదలుపెట్టాడక్కా. నేను ఉద్యోగంచేస్తే వాడి కేం చేటు?"

"లోకం తీరే అంత. తాము చెయ్యలేంది యింకొకరు చేస్తున్నారంటే చాలు. రంగులు పూసి కావల్సినన్ని వ్యాఖ్యానాలు. ఎవరో ఏ పరాయివాళ్ళో అన్నందుకు బాధపడుతున్నావు. పిల్లలు చీదినా, దగ్గినా నా ఉద్యోగమే కారణం అంటుంది అత్తయ్య. తన కూతుర్లు నా అంత చదివి కూడా ఇంట్లోనే వున్నారని అత్తయ్య బాధ. అది పైకి అనలేక ఏదో మడతమాటలతో దెప్పుతుంది. "సంసారం చక్కదిద్దుకుంటే చాలు. ఎందుకొచ్చిన ఉద్యోగాలు? వచ్చింది చీరలకే చాలదు" అంటుంది.

"మీ అబ్బాయికి చీరలు కొనే బాధన్నా తప్పింది కదా అనలేక పోయావు?"

"అనొచ్చు ప్రయోజనం? ఇద్దరిమధ్య మాట పెరగటమే. ఇక అక్కడతో ఊరుకోదు.. "ఆ సినిమా చూశావా? ఈ సినిమా చూశావా?."అంటుంది. అన్ని సినిమాలు చూడ్డానికి టైములేదంటే కోపం.

"నీది మరీ విడ్డూరమే. నాలాంటివాళ్ళు ఉద్యోగం చెయ్యటం లేదనుకో. ప్రపంచంలో ఎందరు చెయ్యటం లేదు. ఎక్కడో మొదలుపెట్టి ఎక్కడో పూర్తి చేస్తుంది. చేసేవాళ్ళంతా నా పరిస్థితుల్లోనే ఉన్నారా? అనే విషయం ఆమె ఆలోచించదు,"

"బావుంది."

"ఇక మా మరదలు వచ్చిందంటే భయం! ఈ చీరెప్పుడు కొన్నావు? నీ కేమమ్మా! ఎన్నన్నా కొంటావు!!. ఉద్యోగస్తురాలివి. మేము చూడు ఒక్క చీర కొంటానికి గిజగిజలాడిపోతాము అంటుంది. నవ్వేసి ఊరుకుంటాను. ఇలాంటివారితో వాదం వేసుకుంటే యిక మిగిలేది వ్యథే. తను కొనదా బట్టలు అంటే అందరికంటే ఎక్కువే కొంటుంది. ఆ మాట పైకంటే తగూ."

"అవును. ఎవరి హద్దుల్లో వాళ్ళుంటే యే బాధా వుండదు"

"అన్నయ్య భార్య వస్తుంది. ఉచితంగా సలహాలు- ఈ కర్టెన్లు బాగా లేవు. సామాన్లకు అన్నీ ఇత్తడి డబ్బాలు కొనరాదూ? సామాన్లు ఇంటినిండా



ఉండందే నాకు తోచదు. నెలసరి వెచ్చాలు కాసిన్ని ఎక్కువే తెప్పించాలి.మన బాధ అర్థం చేసుకోదు. నెలకు తెప్పించిన వస్తువులు మధ్యలోనే అయిపోతాయి. ప్రతిదినమూ రెండోసారి వంటచెయ్యాల్సి వస్తుంది. ఆ మాట పైకంటే మేము వచ్చినందుకే అంటున్నారనే గొడవ. ఒకోసారి యెక్కడికైనా దూరం ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలన్నంత బాధ కలుగుతుంది."

"నిజమేనక్కా! ఆలోచనలేని మనుష్యులు." స్కూలు సమీపించారిద్దరూ. "మీరిద్దరూ కబుర్లలో పడితే మూడో మనిషి ఉనికే గుర్తించరు. ఇద్దరూ తిరిగి చూచారు. లలిత వెనకాలే వస్తోంది కాబోలు! "మేము చూడలేదు. మీరు పలకరిస్తే తప్పా?" రమాదేవి అడిగింది.

"మీరు చెప్పేవిషయం చక్కగా కథలా ఉంటేను" అంది వక్రంగా నవ్వుతూ.

"ఇక ఊరుకో మరి. నిష్ఠూరం దేనికి?" అంది సుచరిత.

పదకొండవ తరగతి పిల్లలు, హెడ్‌మాష్టారు ఘర్షణ పడుతున్నారు. ఎందుకో తెలుసుకోవాలని కొందరు ఆ ప్రాంతములోనే పని ఉన్నట్టు తిరుగుతున్నారు. మరికొందరు మన కెందుకన్నట్టు వెళ్ళిపోయారు.

సైన్స్‌పాఠం తియ్యడానికి పదకొండోతరగతి కెళ్ళింది సుచరిత. పిల్లలంతా గోలగా అరుస్తున్నారు.

"ఏమిటయ్యా ఈ గోల? ఆడపిల్లలు మీరైనా అణకువగా ఉండలేరమ్మా? -ఒక్క నిమిషం ఆలస్యమయితే ఎంత జరగాలో అంతా జరిగితీరుతుంది.-" విసుక్కుంది సుచరిత.

"సారీ, టీచర్! మేము యూనిఫారమ్‌గురించి చర్చించుకుటున్నాము" అన్నాడొక విద్యార్థి.

"యూనిఫారమ్ విషయమై చర్చించవలసిన అవసరమేముంది?"

"హెడ్‌మాష్టారుగారు నెలరోజులక్రిందట నోటీసు పంపారట- యూనిఫారమ్ ప్రవేశ పెట్టినట్టు. అన్ని క్లాసులకు తెల్సింది. మా క్లాసుకు తెలియలేదు. అందరూ వేసుకొస్తున్నారు. మొన్న అసెంబ్లీలో ఆయన చెప్పేవరకు మాకు తెలియనే తెలియదు. శర్మగారు చెప్పనే లేదు."

"ఎందుకు చెప్పలేదట?"

"ఎందుకో వారికే తెలియాలి? రేపటినుండీ యూనిఫారం లేంద క్లాసుకు రావద్దంటున్నారు. ఒక్కరోజులో ఎలా కుట్టించుకుంటామం డబ్బుండాలి అది ఉన్నా టైలరు కుట్టివ్వద్దూ? పదిరోజులు టైమ్ యివ్వ హెడ్ మాష్టారికి వినతిపత్రం యిచ్చుకుంటాము."

"మంచిదే. ప్రయత్నం చెయ్యండి."

"ఏమిటి సుచరితా?" హెడ్‌మాష్టారు ప్రత్యక్షమయ్యారు. జరి విషయం చెప్పింది.

"వాళ్ళకు పదిరోజులు కాదు కదా ఒక్కరోజు కూడా టైమివ్వను. ఇప్ప ఆలస్యమైంది" కోపంగా అని వెళ్ళిపోయాడు.

"మాకు చెప్పండే. శర్మగారి పొరపాటుగానీ మాది కాదుగా?"

"తప్పించుకునే మార్గం కాకపోతే, రోజూ చిన్నతరగతుల పిల్ల వేసుకురావటం లేదూ? మీరు చూడ్డం లేదా? మీకు రూల్సు అంటే ముంటేగా - సరే, పాఠం తియ్యండి" సుచరిత బ్యాక్టీరియాగురించి చెప్పింది. మళ్ళీ ప్రశ్నలడిగి జవాబు రాబట్టింది.

ఇంటర్‌వెల్‌లో హెడ్‌మాష్టారి రూముకెళ్ళింది సుచరిత. హెడ్‌మా తలెత్తి "ఏమిటమ్మా?" అడిగాడు.

"పదకొండవతరగతి విద్యార్థుల విషయమే సార్! ఒక్కరోజులో వా డ్రెస్ యెలా వస్తుంది? మీరు సావకాశంగా ఆలోచించి మీ నిర్ణయం మా చేస్తే.

"నో! నో! వాళ్ళ విషయంలో యెలాంటి ఆలోచనకు తావు లే వాళ్ళు కావాలని అలా చేశారు. వాళ్ళ కనుగుణంగా మనము నడవాలంటా ఒక క్లాసుకు యిలాంటి పనిష్మెంట్ యిస్తే మిగతావాళ్ళు బుద్ధిగా ఉంటా అన్నారు మొండిగా. ఏమనగలదు! వెళ్ళిపోయింది.

లాస్ట్ పీరియడ్‌లో రమణ కొందరు విద్యార్థులను తీసుకొని బయటి మంత్రాంగము జరిపాడు. అదేదో అనుచిత కార్యానికి దారే అనుకుం వెళ్ళి రమాదేవితో చెప్పింది.



"జరగనివ్వు. మన మేం జేస్తాము! ఎవరి పట్టుదలలు వారివి" నిర్లిప్తంగా జవాబిచ్చింది రమాదేవి.

స్కూలు వదిలారు. సుచరిత బస్సుకొరకు వేచి ఉంది. ఆరు బస్సులు వెళ్ళాయి. ఒక్కటీ ఆపలేదు. చివరకు రిక్షా చేసుకొని వచ్చింది. అద్దెకున్నావిడ గోపమ్మ దగ్గర కూర్చుంది.

"సుచరితా! కొంచెము పెందలాడే రావాలి తల్లీ!"

"ఏం చెయ్యనండీ! బస్సులు ఆపరు. నడిచి రావడానికి దగ్గర కాదాయె! మీకు శ్రమ యిచ్చాను!"

"ఫరవాలేదమ్మా, యిరుగుపొరుగు అన్నారు. నీ గురించి మీ అమ్మగారు ఆందోళనపడుతున్నారు." అంటూ ఆవిడ వెళ్ళిపోయారు. తల్లికి కావల్సినవి అమర్చి పెట్టి, ప్రొద్దుట మిగిలిన అన్నం, కూరా ఉంటే తను తిని పడుకుంది.

"అలసివస్తే యింతన్నము కూడా వండిపెట్టేవారు లేరు."

"అమ్మా! నువ్వలా ఆలోచించకు, డాక్టరుగారొచ్చారా?"

"వచ్చారమ్మా. ఏదో అర్జెంటు కేసుందని వెళ్ళి పోయాడు."

"ఇక నువ్వు పడుకో" అటు తిరిగింది సుచరిత. రఘును చూడలేకపోయినందుకు మనసదోలా అయింది.

* * *

స్కూలువద్ద బస్సు దిగగానే పుష్ప, జయ యెదురొచ్చారు. మామూలుగా విష్ చేశారు. ఏదో చెప్పాలన్నట్టు వెంబడించారు. "ఏమిటమ్మా? ఇక్కడ నిల్చున్నా రేమిటి?"

"టీచర్ ! మరేమో లెవెన్తు క్లాస్ అబ్బాయిలు సమ్మె చేస్తున్నారట. ఎవ్వరినీ క్లాసులకు వెళ్ళనియ్యటం లేదు, మేము వెళ్ళబోతే గేటుకడ్డంగా నిల్చున్నారండీ" అంది పుష్ప.

"డ్రెస్ కుట్టించుకోవడానికి నెలరోజుల టైమ్ కావాలటండీ. లేకుంటే హెడ్‌మాష్టర్ పని చూస్తారట."

"ఊ! చాల్లెండి" లోపలికెళ్ళింది సుచరిత. గేటుదగ్గరున్న అబ్బాయిలు

ఏమీ అనలేదు. సుచరితే పలుకరిస్తుందని ఆసించారు. క్లాసుకు ఒకరిద్దరు తప్ప పిల్లలు లేరు. సుచరిత టెస్ట్‌పేపర్లు దిద్దుతూ కూర్చుంది. అరగంటలో అవి అయిపోయాయి. ఎన్నోరోజులనుండి- సైన్స్ సామాన్లుంచిన గది సర్దాలి అనుకుంది.ఈ రోజన్నా చేద్దాము. రమాదేవి రాలేదు. తోచదు అని ఆలోచిస్తు గది బయటకు వచ్చింది. సైన్స్ రూమ్‌లోని బీరువా తాళం చెవులు లెవెంత్ క్లాస్ మానీటర్ దగ్గరున్నాయి. ఫ్యూన్‌ను పిలిచింది. రంగయ్య వచ్చాడు.

"రంగయ్యా ! బయట రమేష్, పదకొండవతరగతి పిల్లవాడున్నాడు పిలుస్తావా?" రంగయ్య వెళ్ళి కాసేపట్లో రమేష్‌ను వెంటబెట్టుకొచ్చాడు. సమ్మె విషయము అడుగుతుందేమోనని జంకుతూ వచ్చాడు. సుచరిత అలాంటి ప్రస్తావనే చెయ్యకుండా కీస్ తీసుకుని పంపించింది. దూరంనుండి కొన్ని కళ్ళు సుచరితను వింతగా చూచాయి.

రంగయ్య సహాయంతో రూము సర్దేసరికి మూడు దాటింది. బయట ఏం జరుగుతుందో సుచరితకు పట్టలేదు. సుచరిత కాళ్ళు, చేతులు కడుక్కుని రంగయ్య తెచ్చిన కాఫీ త్రాగి స్టాఫ్‌రూమ్ కెళ్ళింది. కొందరు నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. సుచరితను చూడగానే గప్‌చిప్‌గా కూర్చున్నారు.

"ఏమండీ సుచరిత గారూ! ఈరోజు కూడా తీరుబాటు లేకుండా పని చేస్తున్నారు? విసుగులేకుండా పనిచెయ్యగల సమర్థులు మీరొక్కరేనండీ" శర్మ హేళనగా నవ్వాడు. సుచరిత మూతి ముడుచుకొని, నిష్ఠూరంగా జవాబిస్తుందని ఆశించారు.

"మరింత పెద్ద బడిలో ఒక్కరన్నా పనిచేసేవారుంటే సంతోషించ వలసిన విషయం కదండీ !" నవ్వుతూ జవాబిచ్చింది. కొందరు తెల్లబోయారు. అక్కడుంటే అలాంటిమాటలే పెరుగుతాయని వచ్చి బయటవున్న చిన్న గార్డెన్‌లో కూర్చుని అడవి బాపిరాజు 'గోన గన్నారెడ్డి' తీసి చదువుతోంది.

"ఈ మధ్య సుచరిత చాలా మారిపోయింది" తలపంకించాడు శర్మ.

"రమాదేవిగారి ప్రభావమే" వక్రంగా నవ్వాడు రమణ.

"అదేం కాదు". గుంభనగా నవ్వింది ఎవిలీన్.

"ఇంకేమైనా విశేషమా? త్వరగా చెప్పు !" అన్నది లలిత.



"మొన్న నేను, మా అక్కయ్య వాళ్ళ వీధిలో ఉన్న మా చుట్టాలింటికి వెళ్ళాము. రిక్షాలు దొరక్క నడిచి వెళ్తున్నాము. గుమ్మంలో నిలబడి యెవరో అందమైన యువకుడికి వీడ్కోలు యిస్తోంది. నన్ను చూచి పిలుస్తుందేమో, వాళ్ళమ్మను చూచివద్దామనుకున్నాను. మా వంక చూడలేదు, కారు వెళ్ళిపోయినా తన్మయత్వముతో అటే చూస్తోంది అయినా ఇతరుల విషయాలు నాకెందుకు!"

"తనే చెప్పింది రమాదేవితో ఆయన యెవరో కార్లో యింటిదగ్గర వదిలారని. డాక్టర్ కాబోలు!" అన్నది లలిత.

"అయితే కావచ్చు. ఆమె అందం చూచి లెవెంత్ క్లాసు పిల్లలే డౌన్ అయ్యారు" మరియమ్మ నవ్వింది. శర్మ, రమణ, వాళ్ళ కంపెనీలో వాళ్ళంతా గొల్లున నవ్వారు, వెంకటేశం వినలేక లేచిపోయాడు.

"ఆమె నారాధించేవాళ్ళలో యితనొకడు. అందుకే అంత కోపం" అన్నది మరియమ్మ.

లాంగ్‌బెల్ కావటంతో అందరూ తమ తమ సామాన్లు సర్దుకొని బయటపడ్డారు,

రెండవరోజు సుచరిత వచ్చేసరికి పిల్లలు గోలగా అరుస్తున్నారు. ఫ్యూన్ వాళ్ళను కసిరి పంపిస్తున్నాడు. దారి చేసుకుని లోపలికెళ్ళింది సుచరిత. అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం పెట్టి వెనుతిరిగింది. వెనుకవైపు రూములనుండి హెడ్‌మాస్టరు, రమణ వస్తున్నారు మామూలుగా హెడ్‌మాష్టారిని విష్ చేసింది. "గుడ్‌మార్నింగ్ సర్ !"

"గుడ్ మార్నింగ్! మీరు కాస్త ఆగుతారా ? ఇలా పిల్లలను రెచ్చగొట్టడంలో మీ ఉద్దేశ్యం?" సూటిగా ప్రశ్నించాడు.

"మీరంటున్నది నాకర్థం కావటం లేదు."

"అంతలా నటించవలసిన అవసరము లేదు లెండి. పిల్లలకు సమ్మె చెయ్యమని సలహాయిచ్చింది మీరు కాదా?"

"సర్ ! మీ రే ఆధారంతో నాపై ఈ నింద ఆరోపిస్తున్నారో అర్థం కావటం లేదు." సుచరిత కంఠము వణికింది.

"ఆధారం కావాలా!- పిల్లలవైపునుండి రాయబారం తెచ్చారు. అది

నిష్ఫలమైతే సమ్మె చెయ్యమన్నారు. నాపై రిపోర్టు రాసిచ్చి డి.ఇ.ఓ. గారికి పంపమన్నారు. అవునా?"

"రాయబారం తేవటం తప్ప అంతా అబద్ధం. నా మాటకు విలువ యిస్తారనుకున్నాను. మీరు అంగీకరించలేదు. ఊరుకున్నాను. నేను మిమ్మల్ని అడిగిన సంగతి పిల్లలకు తెలియదు."

"అయితే నిన్న రమేష్‌తో జరిపిన మంత్రాంగానికి అర్థం!"

"రమేశ్ నా విద్యార్థి. వేరే యెన్నో పనులుంటాయి. సరే! ఈ నింద నిరూపిస్తే చాలా సంతోషిస్తాను సర్!" అన్నది ఆవేశంగా.

"మిష్టర్ రమణా! ఏది ఆ రిపోర్టు ఇలా తీసుకురండి."

"విద్యార్థులదగ్గరే ఉంది సర్!" అని బయటకెళ్ళాడు. ఐదునిమిషాల్లో కొందరు విద్యార్థులను వెంట తీసుకొచ్చాడు.

"ఆవిడ కివ్వండి. తను డిక్టేటు చేసిందో, కాదో తెలుస్తుంది."

"నేను విప్పి చదువుతాను సర్!" రమణ ఆమెకివ్వడానికి వెనుకాడాడు.

"నో, ఆమెకే యివ్వండి."

సీల్డ్‌కవర్ యిచ్చాడు రమణ. సుచరిత దాన్నందుకుని చించింది. లోపలి కాగితం తీసుకుని చదివింది. పూర్తిగా ఉత్తరం చదివేసరికి ఆమె ముఖం విప్పారింది.

"సర్! ఇది చూడండి. వ్రాయించిందో, వ్రాసిందో చూడగానే తెలుస్తుంది. వ్రాత వెంటనే పోల్చివేయవచ్చు." కాగితం ఆయన కందించింది. ఆయన దాన్ని పరిశీలించడంలో మునిగిపోయాడు.

"రమణా?" గొణిగాడు శర్మ.

అసహనంగా చూచాడు రమణ.

"నువ్వు యిచ్చిందే పెట్టినట్టున్నారు. కాపీ చేసి పెట్టమని చెప్పలేదా ఆ వెధవలతో?" గుసగుసలాడారు.

"నేను అలాగే చెప్పాను. వాళ్ళు నేనిచ్చిందే పెట్టినట్టున్నారు" రమణ ముఖం పాలిపోయింది!

"మిష్టర్ రమణా !" హెడ్‌మాష్టారు తీక్షణంగా చూచారు.



"ఇది నీ రైటింగనుకుంటాను."

"నాదా! కాదు సర్?"

"సందేహమక్కరలేదు సర్! అది రమణగారు వ్రాసిందే. నాపై అసూయతో చేసిన పని అది. విద్యార్థులను పిలిచి నిజం తేల్చుకోవడం మంచిది... రంగయ్యా! నేను పిలుస్తున్నానని చెప్పి రమేశ్‌ను, కృష్ణను పిలుచుకురా" అన్నది. రంగయ్య వెళ్ళి ఆ ఇద్దరి పిల్లలను వెంట తీసుకుని వచ్చాడు.

"రమేశ్! మీరు బడికొచ్చేది ఎందుకయ్యా?"

"..................."

"మాట్లాడరేం? మా పిల్లలు బడి కెళ్ళి చదువుకుంటారని మీ తల్లి దండ్రుల అభిప్రాయం. మీరేమో ఇలాంటి సమ్మెలు చేస్తూ, పిచ్చివేషాలేస్తూ నిర్దోషులను రచ్చకీడుస్తారు"

"టీచర్! మీరనేదేమిటి? మాకు అవకాశమివ్వమని సమ్మె చేస్తున్నాము. అంతే! మేమెవ్వరినీ రచ్చకీడవలేదు."

"మరయితే ఈ రిపోర్టు కర్థం ఏమిటి? అవకాశం ఇవ్వమని అడిగే మార్గమిదేనా! పోనీ, ఒక్కసంగతి చెప్పు. నేను నిన్న నీతో ఏం మాట్లాడాను?"

"ఏం మాట్లాడలేదు. లాబ్ కీస్ అడిగితీసుకున్నారు."

"లాబ్ కీస్ కుర్రాడి దగ్గరెందుకుంటాయి?" అరిచాడు రమణ.

"యెందుకా!.....మనకు లాబ్ బోయ్ లేడు. రమేశ్ నమ్మకంగా ఉంటాడు. స్కూలుకు అతని యిల్లు దగ్గరగా ఉంది. తొమ్మిదింటికొచ్చి రంగయ్యచేత లాబ్ శుభ్రం చేయిస్తాడని ఇచ్చాను... రమేశ్! ఉన్నదున్నట్టు హెడ్‌మాష్టరుగారితో చెప్పు."

"......................."

"రమేశ్ ! మీరిలా మౌనం వహిస్తే రిజైన్ ఇవ్వాల్సి వుంటుంది."

"సుచరితగారూ ! వాళ్ళను భయపెట్టి మీ నేరం కప్పిపెట్టాలని చూస్తున్నారా?" రమణ ముందుకొచ్చాడు.

"లేదండీ రమణగారూ! మీ నేరం బయటపెట్టాలని చూస్తున్నాను."

"సర్! నిన్న టీచర్ నాతో మాట్లాడనే లేదు. లాబ్ కీస్ మాత్ర
తీసుకున్నారు అంతే" రమేశ్ వినయంగా జవాబిచ్చాడు.

"మరి రిపోర్టు యెవరు వ్రాశారు?" హెడ్‌మాష్టరు మాట
ప్రశ్నించాడు. రమేశ్ తలవంచుకున్నాడు.

"మాట్లాడవేం?"

కృష్ణ అనే అబ్బాయి ముందుకొచ్చి యేదో చెప్పబోయాడు. రమేశ్
వారించాడు. రమణగారి వంకే రెప్పవేయక చూస్తున్నాడు.

"సర్! యెవరిదైనా అలా రిపోర్ట్ తీసుకోవడం తప్పు మాది. ఇక రా
వారు టీచర్ మాత్రం కారు. మమ్మల్ని ఈసారికి క్షమించండి."

"మీలో ఉన్న డిప్లమసీ మా స్టాఫ్‌లో ఉంటే బావుండును. సరే వెళ్ళ
వారంరోజులు గడువిస్తున్నాను. యూనిఫారాలు కుట్టించుకోండి. వెళ్ళం
రమేష్ వెళ్ళిపోయాడు తన బృందంతో.

"స్టాఫ్ కో ఆపరేషన్ లభించదని తెలిసికూడా పట్టుదలకు పోవటం
బుద్ధిహీనత. ఛీ!" తనలో తానే గొణుక్కున్నాడు హెడ్‌మాష్టరు. సుచ
త్వరగా రమాదేవి ఉన్న చోటికి వచ్చింది, అంతా విన్న రమాదేవి గాఢ
నిట్టూర్చింది.

"ఒక సంస్థకు ఆధిపత్యం వహించాలంటే యెన్నో విధాలుగా స
లైండాలి. చెప్పుడుమాటలు వినటం, తేలికగా అభిప్రాయాలు మార్చుకో
లాంటి గుణాలకు దూరంగా ఉండాలి. ఇలా నిశ్చితాభిప్రాయం లేని వాళ్ళు
రోజుకో తగూ. బడి సక్రమముగా నడవదు.... పద. పిల్లలు క్లాసు
వస్తున్నట్టున్నారు." ఇద్దరూ లేచి తమ తమ క్లాసులకు వెళ్ళారు. సెకె
పిరియడ్‌లో సుచరితను పిలిపించారు హెడ్‌మాష్టరు.

"ఎక్స్క్యూజ్‌మి సుచరితా! రమణ తత్వం తెలిసి కూడా తొందరపడ్డ
అతనింతకు తెగిస్తాడనుకోలేదు."

"మనలో మనకు యివన్నీ యెందుకు సర్! రమణకు ముందుచూ
తక్కువ, యెగదోస్తే ఉబ్బిపోతాడు."

"సరే, వెళ్ళండి. మొదటే నేను అంగీకరిస్తే పోయేది" అన్నారు.



నాలుగురోజులు ఏ గొడవా లేకుండా బడి సక్రమంగా నడిచింది. ఐదోరోజు వార్త గుప్పుమంది. రమణకు మారు మూల పల్లెటూరికి ట్రాన్స్‌ఫర్ అయింది. అతని స్థానంలో వచ్చిన సత్యమూర్తి ఆర్డర్స్ తీసుకువచ్చాడు. రమణ బుసలు కొడుతూ అభిమానంగా, రోషంగా ఆర్డర్స్ తీసుకున్నాడు. చెప్పదలచినవారు హెడ్‌మాష్టరిపై బోలెడు విషయాలు చెప్పారు. రెండవరోజు రిలీవింగ్ ఆర్డర్స్ తీసుకోవడానికి వచ్చిన రమణ ముఖం వాడి వుంది. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడలేదు.నెమ్మదిగా సుచరిత క్లాసువైపు వచ్చాడు

"సుచరితగారూ!" రమణ సౌమ్యమైన పిలుపు విని విచిత్రంగా చూచింది.

"నన్ను క్షమించండి. మీ యెడ చాలా అనుచితంగా ప్రవర్తించాను. తలచుకుంటే నాకే సిగ్గుగా వుంది." అమాయకంగా, దీనంగా వున్నాయి మాటలు.

"పొరపాటు అందరివల్లా జరుగుతుంది. అది తెలుసుకోవటం గొప్పతనం" అన్నది.

"మీరు మీ సహృదయతను చూపుకున్నారు. మొన్నటి విషయం బయటపడడం ఆలస్యమైతే మీపై తీవ్రమైన చర్య తీసుకునేవారు. అది తలచుకుంటే కంపరం పుడుతోంది."

"ఇప్పుడవన్నీ యెందుకు. నాకూ బాధగానే వుంది. మీ రిలా వెళ్ళిపోవటం." సుచరిత మాట పూర్తి కాకమునుపే రమాదేవి వచ్చింది.

"రమాదేవి గారూ! నా క్షేమముకోరే సహోదరిగా మీరిచ్చిన సలహాను పాటించలేక పోయాను. చెప్పుడుమాటలు విని, పొగడ్తలకు ఉబ్బి ఇంత అనర్థం తెచ్చుకున్నాను. అమ్మ ఆరోగ్యం ఏం బావుండలేదు. ఇక్కడ రెగ్యులర్‌గా ట్రీట్‌మెంట్ జరుగుతోంది. అదో పల్లెటూరు, కనీసం డాక్టరున్నాడో లేడో? చెల్లెలి చదువు మధ్యలో ఆగిపోయేటట్టే ఉంది. హాస్టల్లో చేర్పించే తాహతు నాకు లేదు. ట్రాన్స్‌ఫర్ సంగతి విని అమ్మ నెత్తీ నోరూ బాదుకుంది" అతని కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"మిస్టర్ రమణా! ఈ విషయంలో హెడ్‌మాష్టర్ని తప్పు పట్టలేం. ఆయన మంచిగా మిమ్ము వంచాలని ఎంతో ప్రయత్నించారు. మీరు అర్థం

చేసుకోలేదు. అందరూ యెగ్రదోసి, ప్రచ్ఛన్నంగా ఉండిపోయారు. పి అమాయకంగా తేలిపోయారు."

"ఇప్పుడు యెంత చింతించినా లాభం లేదండి. అమ్మను త కుంటే బాధగా వుంది."

"పరిస్థితులు ఒక్కమాదిరిగా ఉండవు. ముందైనా జాగ్రత్తగా ఉ అధైర్యపడొద్దు. వెళ్ళేది పల్లెటూరు కాబట్టి మీకు ఖర్చు అంతగా ఉ చెల్లిని హాస్టల్లో చేర్పించండి."

"అలాగే చేస్తాను. చాలా థ్యాంక్స్ రమాదేవిగారూ! వస్తాను. నమ సుచరితగారూ!" రమణ వెళ్ళిపోయాడు.

సుచరిత కళ్ళు అశ్రుపూరితాలు అయ్యాయి

"రమణ ఒక్కడి తొందరపాటు ఫలితం అందరూ అనుభవి పాపం. వాళ్ళమ్మను తల్చుకుంటే జాలేస్తుందక్కా!"

"అనాది నుండి ఒక్కరివల్ల అందరూ బాధపడుట సాంప్రదాయ ధర్మరాజు జూదంవల్ల అందరు పాండవులు అడవులపాలు కాలేదా? కారణంగా భార్యాబిడ్డలు యిడుములు పడలేదా?"

"వాళ్ళంతా కారణజన్ములు! దుష్టశిక్షణకై అవతరించారేమో?"

"ఇదీ అలాగే అన్వయించుకోవచ్చు. ఈ దెబ్బతో రమణలో రావచ్చు" బెల్ కావటంతో యిద్దరూ తమ క్లాసులకు వెళ్లిపోయారు.

ఇంటికొచ్చినా సుచరిత మనసు కుదుటపడ లేదు. అమాయకం, మిళితమైన రమణ ముఖమే ప్రత్యక్షం కాసాగింది. శర్మ, గోపాలం ము వారిపై విపరీతమైన కోపం వచ్చింది. అమాయకుడిని ఎగ్రదోసి సురక్షితంగా ఉన్నారు.

"అంత తలమునకలయ్యే ఆలోచనలేమిటబ్బా?"

ఉలిక్కిపడి చూచింది. చిరునవ్వుతో రఘు నిల్చున్నాడు గుమ్మ లేచింది.

"మీరా? రండి. నిల్చునే ఉన్నారేం? చాలా సేపైందా వచ్చి?"

"అంత కంగారెందుకు? నేనేం కొత్తవాడినా? ఇప్పుడే వచ్చాను." కుర్చీలో కూర్చున్నాడు రఘు.



"యేమిటో విశేషం అలా వున్నావు?"

"ఆ! ఏం లేదు. ఎలా వున్నాను?"

"డాక్టర్లకు సైకాలజీలో ప్రవేశం వుంటుంది మేడమ్!" సుచరిత అందంగా నవ్వింది. స్కూల్లో జరిగిన విషయాలు అన్నీ చెప్పింది. ఓపికగా విన్నాడు.

"సర్వీస్ అన్నాక యిలాంటివి సహజమే. అంతగా నువ్వు బాధపడటం బాగా లేదు."

"బావుంది. మీరు ఒడ్డునుండి మాట్లాడుతున్నారు" అతని అవస్థ చూస్తే జాలేస్తుంది. అతన్ని ట్రాన్స్ఫర్ చెయ్యకుండా ప్రవర్తన మారిస్తే బావుండేది." అన్నది అమాయకంగా.

"ఎవరు మార్చాలి?"

"హెడ్మాస్టరు మార్చొచ్చుగా?"

"మార్చవచ్చు. ఆయన సహనాన్ని, విశాలహృదయాన్ని అసిస్టెంట్లు అర్థం చేసుకోవద్దూ? అతని క్షమాగుణాన్ని బలహీనతగా తీసుకుని యింకా అఘాయిత్యాలు మొదలు పెడితే? హెడ్మాస్టరు కూడా మనలాంటి చీము, నెత్తురు గల మానవుడేగా?"

"అవును. కాని యెందుకో అతడిని తల్చుకుంటే బాధగా ఉంది."

"ఇంత విషయానికే బాధపడుతున్నావు. కొన్నిసార్లు యే తప్పూ లేందే ట్రాన్స్ఫర్ చేస్తారు. ఏ మినిష్టరు చుట్టమో లేక ఆఫీసర్ అల్లుడో అయితే వాళ్ళను తేవడానికి యితరులను పంపేస్తారు." అన్నాడు రఘు. సుచరిత కళ్ళు పెద్దవిచేసి చూసింది. "ఏమిటో! ఈ ప్రపంచంలో విద్యావంతులకు, విద్యాహీనులకు భేదము లేదు. స్వార్థం! స్వార్థం!"

"భూమి గుండ్రంగా ఉంది మేడమ్!"

"అదేం పిలుపు? మీరేం విద్యార్థులా?" అంది కినుకగా.

"మరి నాకిష్టమైన పిలుపు నీకిష్టం వుండదు....."

సుచరిత తొందరగా మాటమార్చింది. "పోనియ్యండి.-ఈ గొడవలు రోజూ వుండేవేగా? అమ్మగారు ఉత్తరాలు వ్రాస్తున్నారా?"

"మొన్ననే వచ్చింది ఉత్తరం. మీరు కలిశారని వ్రాస్తే చాలా సంతోషం వ్రాసింది. నిన్ను మరీమరీ అడిగానని వ్రాసింది."

"అమ్మగారికి నేనంటే అభిమానం ఎక్కువేమో! ఈ స్థితిలో యెప్పు చూడబుద్ధి కావటం లేదు."

"మాటలసందడిలో మరిచిపోయాను అమ్మగారేరి? ఆమె ఆరో యెలా వుంది?" చుట్టూ కలయచూచాడు.

"మీ శ్రమ వృధాగా పోతుందా? కులాసాగానే ఉంది. ఈరోజు గు వెళతానని గొడవచేస్తే ప్రక్కవాళ్ళతో పంపించాను. యెంతకని ఆపగలను"

"ఫరవాలేదు... నువ్వేమిటి అంతలా నీరసించిపోయావు."

"మీ కలాగే కనిపిస్తాను. నాకేమైంది? నిక్షేపములా ఉంటేను. ఉండు కాఫీ తెస్తాను,"

"ఇప్పుడే త్రాగాను. నాకు త్రాగాలని ఉంటే అడుగుతాను. మర్యాద లేం పెట్టుకోవద్దు."

"మర్యాద సంగతి దేవుడెరుగు. మీకు కాఫీ యివ్వకుండా పంపి తెలిస్తే అమ్మ నా చెవి మెలి వేస్తుంది."

"ఓహో! నీకు యివ్వాలని లేకపోయినా అమ్మ భయానికిస్తావు" కొం చూశాడు రఘు. సుచరిత ముఖం గంభీరంగా మారిపోయింది.

"నాకు యివ్వాలని వుందో, లేదో తెలిపే సాక్ష్యం నా దగ్గర లే మరి!" చురుగ్గా చూసి వంటగదిలోకి వెళ్ళిపోయింది.

కాఫీ కప్పుతో వచ్చిన సుచరిత కళ్ళు ఎర్రగావున్నాయి. ర మాట్లాడకుండా కాఫీ తీసుకున్నాడు.

"నేను జోక్‌చేశాను సుచరితా! నువ్వేమో సీరియస్‌గా తీసుకు ట్లున్నావు! సారీ! టానిక్కు తెప్పించావా?"

"లేదు."

"అయితే తెప్పించకు. శాంపిల్‌కు వచ్చినవి నా దగ్గరున్నాయి. తెస్తాను" సూటిగా సుచరిత వంక చూడలేక వెళ్ళిపోయాడు.

* * *

స్కూలు ఆవరణ యెంతో అందముగా అలంకరించబడి వు



విద్యార్థులు యెంతో సంతోషముగా గాంధీ జయంతి ఉత్సవం జరుపుకుంటున్నారు. ఆనాటి ఉత్సవానికి అధ్యక్షత వహించుటకు డి.ఇ.ఓ. గారిని ఆహ్వానించారు. గాంధీగారి జీవితచరిత్ర చిత్రపటములతో ప్రదర్శించారు. వారిలో నిద్రాణమైయున్న తెలివితేటలు బయటపడ్డాయి. ఆడపిల్లలు 'ఇదే జ్యోతా! నీకిదె జ్యోతా! ఓ స్వతంత్ర భారత పితా!' అనే గీతాన్ని పాడారు. మొగపిల్లలు 'రఘుపతి రాఘవ' పాడారు. వినోదకార్యక్రమాలలో 'గెస్ పేపర్' అను ఇంగ్లీషు డ్రామా ప్రదర్శించారు.

"...ఇంతవరకు చాలాచోట్ల ప్రోగ్రాములు చూశాను. కాని ఎక్కడా ఇంతగా ఆకర్షించలేదు. పెద్ద పెద్ద స్టేజి నాటకాలు తీసుకొని వేసేవారు చూసేవారికి విసుగు పుట్టిస్తారు. ఇక్కడ అలా కాకుండా విద్యార్థులకు పరిస్థితి వివరించి చెప్పే యిలాంటి నాటకాలే ఉండాలి"

విద్యార్థి సంఘం అధ్యక్షుడు అందరికీ తమ కృతజ్ఞత తెలుపుతూ సుచరితకు ప్రత్యేకంగా తమ కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఆమె వల్లే ఈ కార్యక్రమాలు జయప్రదం అవుతున్నాయని మెచ్చుకున్నాడు. వందన సమర్పణతో నాటి సమావేశం ముగిసింది.

"పోజులు పెట్టి పేర్లు తెచ్చుకోవడం మనకు చేతకాదు లెద్దూ!"

"బోడి పెత్తనాలు చెయ్యటం రావాలి." ఎవిలీన్ అన్నది.

"వాడిని సెక్రటరీగా యెలా యెన్నుకున్నారు? ఇంగ్లీషులో మాట్లాడాలంటే తడబడతాడు." మూతి విరిచింది మరియమ్మ.

"జయ తన కీచుగొంతుకతో పాట చెడగొట్టింది." లలిత వ్యాఖ్యానం.

"మీరు నిర్వాహకులేమో గదా"! అని అన్నది ఎవిలీన్. "పిల్లలకు ఇంగ్లీషు నేర్పగూడదూ?"

"అలా నిరుత్సాహపరచకూడదు! విద్యార్థుల నెప్పుడూ ప్రోత్సహించాలి. ఇంగ్లీషులో మాట్లాడటం అన్నది ప్రాక్టీసుపై ఆధారపడి ఉంటుంది. గ్రాడ్యుయేట్స్ కూడా కొన్ని సార్లు మాట్లాడలేరు." అన్నది సుచరిత ఊరుకుండలేక.

"మా పాప చూడండి! యెంత చక్కగా మాట్లాడుతుందో ఇంగ్లీషు" సాగదీసింది ఎవిలీన్.

"అది వేరు సంగతి. తల్లీతండ్రీ చదువుకున్నారు. మీరు మాట్లా
తుంటే మీ పిల్లలు వింటారు" అన్నది రమాదేవి.

"మీ హిందూస్ ఇంగ్లీష్ మాట్లాడాలంటే తడబడతారు" అన్న
మరియమ్మ. అంతవరకు వెనుక మౌనంగా నడుస్తున్న వెంకటేశం కలుగజే
కున్నాడు?

"హిందూస్, క్రిష్టియన్స్ అని రిలిజియన్ ఫీలింగు యెందుకు ?
చెప్పాలంటే మీరు మాట్లాడేది రాటన్ ఇంగ్లీషు. కొట్టినపిండి అన్న
లాంగ్వేజిని ఖూనీ చేస్తారు."

"వెంకటేశంగారికి కోపం వస్తోందే. రిలిజియన్ అంటే అం
అభిమానమా? మీకు దేవుడంటే భక్తా ?"

"ఏం ఉండకూడదా?"

"అబ్బే. అదికాదు. మీ దేవుడెవరు? రాముడా, కృష్ణుడా, శంకరుడా

"యింకా ఉన్నారు....." మరియమ్మ వెటకారం చేసింది.

"ఎవరో ఒకరు! ఆ సర్వాంతర్యామిని తమ కిష్టమైన పేరు
పిలుచుకుంటారు" తీక్షణంగా జవాబు చెప్పాడు వెంకటేశం.

"అంతకోపం దేనికండీ! మీ దేవునిపేరు చెప్పమంటే......"

"ఇంకా చెప్పేది ఏముంది? ఆయన పేరు చూస్తేనే తెలిసిపోవ
లేదూ! ఆయన దేవుడు వెంకటేశ్వరుడు" లలిత చెప్పింది. వెంకటేశం లలిత
ఏవగింపుగా చూశాడు.

"వెంకటేశ్వరుడంటే యెవరు లలితా? ఆ వెంట్రుకల దేవుడేనా? తల
నుంటేనే వెంట్రుకల అందము. అబ్బ ! తలనుండి రాలిన వెంట్రుక
యెంతో నీచంగా చూస్తాము కదా! అలాంటివి మీ దేవుడె
పుచ్చుకుంటాడమ్మా లలితా?" మరియమ్మ అసహ్యంగా ముఖం పెట్టిం

"హద్దులుమీరి మాట్లాడుతున్నారు. ఎవరి భక్తి వారిది, ఒక మతా
ఒక దేవుడిని విమర్శించటానికి మీ కెన్నిగుండెలు?" వెంకటేశం కోపం
ఊగిపోయాడు.

"ఏసుక్రీస్తు నిజమైన దేవుడంటారా?" సుచరిత అడిగింది.



"మున్మాటికి పరిశుద్ధ ఆత్మగలవాడు, పాపులను బ్రోచేవాడు
ఆతనొక్కడే! అతన్ని నమ్మినవారిని నరకకూపం నుండి రక్షించును".

"పాపులను బ్రోచే ప్రభువున్నాడని పాపాలు ఎక్కువ చేస్తారు కదండి?"
క ఊరుకుంటే పెద్ద పోట్లాట జరుగుతుందని రమాదేవి కలుగచేసుకుంది.
"వెంకటేశంగారూ! ఎందుకొచ్చిన తర్కం! వాళ్ళు చేశారని మీరూ ఒక మతాన్ని,
దేవుడిని చులకన చేస్తారా? వీళ్ళకు ఏసుప్రభువు గురించి ఏం తెలుసు? ఆ
మతం యొక్క మంచితనంవల్ల క్రిష్టియన్లుగా మారారా? లేదు. అమెరికన్ల
నుండి ఫ్రీగా స్కాలర్‌షిప్ కొరకు మతం మార్చుకున్నారు. ఆ మతంలో
ఉండే ఔన్నత్యం వీళ్ళకేం తెలుసు! యేసుప్రభువు ఆదేశాలు లోకోత్తరమైనవి.
వీళ్ళు తమ స్వార్థం తమిష్టమొచ్చినట్లు ప్రాపగాండా చేస్తారు."

"ఎంతకని ఊరుకోను? ప్రతినిమిషంలో మరియమ్మ, ఎవిలీన్
కవ్విస్తుంటారు. దేవదానం వీళ్ళకు వంత పాడుతాడు."

"వాళ్ళ మూర్ఖత్వమే బయటపడుతుంది. వాళ్ళు పురాణాలు, భగవద్గీత,
బైబిల్ ఒక్కసారి చదివితే తెలుస్తుంది. సృష్టి అంతా ఒక్కటే, ఒకరిచేత
నడుపబడుతున్నదని తెలుసు. కొందరు మిడిమిడి జ్ఞానంతో చేసే విమర్శను
మీరు సీరియస్‌గా తీసుకోవద్దు. మనలో ఐకమత్యము లేక కూడా వాళ్ళు
యిష్టమొచ్చినట్టు మాట్లాడుతారు" అన్నది లలిత వైపు చూస్తూ.

"అవును. ముస్లిములు, క్రిష్టియన్లు బయట తన్నుకున్నా ఈలాంటి
తర్కం వచ్చిందంటే అంతా ఏకమవుతారు. వారి ఐకమత్యాన్ని మెచ్చుకోవాలి."
అన్నది సుచరిత. లలిత ఆముదం తాగినట్టు ముఖం పెట్టింది. స్త్రీలంతా
బస్సుస్టాండులో నిల్చున్నారు. మొగాళ్ళు కొందరు నిలుచున్నారు. కొందరు
మాట్లాడుకుంటూ నడిచివెళ్ళారు. తొమ్మిదిగంటలు దాకా ఒక్క బస్సుకూడా
రాలేదు. తొమ్మిదింటికి ఒక బస్సు వస్తే మరియమ్మ యెక్కగానే బెల్
యిచ్చాడు. మిగతావారు నిస్పృహగా నిల్చుండిపోయారు.

"ఎంతసేపు నిల్చుంటాము! ముందటి స్టేజీలో దిగే వాళ్ళు చాలా మంది
వుంటారు. అక్కడి కెళదామా అక్కయ్యా?"

"నాకు నీరసంగా వుంది సుచరితా?"

"మా పాప యెంత యేడుస్తోందో?" దిగులుపడింది లలిత.

"మా అత్తగారున్నారు. మా ఇంట్లో పనిపిల్ల వెళుతుంది. అయి
విసుక్కుంటున్నారో ?" వాళ్ళు మాట్లాడుకుంటుండగానే ఓ అంబా
కారొచ్చి వాళ్ళముందాగింది. అందులోంచి స్ఫురద్రూపి అయిన ఓ యువ
దిగాడు.

"బస్‌కొరకు వెయిట్ చేస్తున్నారా ?" అతడు సుచరితను ప్రశ్నిం

"అవును. గంటనుండి నిల్చున్నాము."

"ఎక్కండి, అందరినీ డ్రాప్ చేస్తాను." సుచరిత తన కొలీగ్స్ ను
ఆయనకు పరిచయం చేసింది. "అక్కా! వీరే డాక్టర్ రఘుగారు"
రమాదేవి వంక చూస్తూ.

"చాలా సంతోషమండి, మిమ్మల్ని కలుసుకోగలిగినందుకు ..."

"మీ విషయం కూడా సుచరిత చెప్పింది. రండి లేటవుతో
రమాదేవి, ఎవిలీన్, లలిత వెనుక సీట్లో యెక్కారు. అక్కడే సర్దుకుం
సుచరిత యెక్కబోయే అంతలో రఘు ముందు డోరు తీసి యెక్కమ
చూశాడు. వెనుకే ఎక్కితే అతన్ని అవమానపరిచినట్లవుతుందని అతని
సీట్లో కూర్చుంది. కారు స్టార్ట్ అయింది. "ఎంత అందమైన జంట!
చేయ్యలేకపోయాడు భగవంతుడు" అనుకుంది రమాదేవి. ట్రాఫిక్‌వల్ల ఓ
కారు ఆగింది. కాంతారావు గురించి రఘు ఏదో అడిగాడు. సుచరిత జ
చెప్తోంది.

"వాట్ ఏ బ్యూటిఫుల్ పెయిర్" ఇద్దరూ ఉలిక్కిపడి అటు చూ
పేవ్ మెంటుమీద నిల్చున్న ముసలి ఆంగ్లో యిండియన్ దంపతులు
సంబరంగా చూస్తున్నారు. సుచరిత రఘు వైపు చూసింది. అతడు చూ
ఇద్దరి కళ్ళూ క్షణం కలుసుకొని విడిపోయాయి. రఘు కళ్ళలోని ఆ
యేమిటోగాని సుచరిత క్షణం చలించింది. మరు క్షణం మామూ
కూర్చుంది. యెవరింటి దగ్గర వారిని దింపారు. రమాదేవి తన
పరిచయం చేసింది.



"అయాం వెరీ గ్లాడ్ టు మీట్ యు" అని కరచాలనం చేశాడు. కాస్సేపు కూర్చుండి వెళ్ళమని బలవంతము చేశారు. మళ్ళీ వస్తానని వచ్చి కార్లో కూర్చున్నాడు. సుచరిత అంతరంగంలో ఎందుకో అల్ల కల్లోలం చెలరేగింది. మదిలో మెదిలో భావాలను బలవంతంగా నొక్కిపట్టింది.

"సుచీ ! ఏమిటంతగా ఆలోచిస్తున్నావు?" రఘు కంఠం కాదు; అనురాగ స్రవంతి, మేను పులకరించే ఆ పలకరింపు!

"ఆ! ఏం లేదు. నా గురించి. అందరినీ డ్రాప్ చేశారు. చాలా ప్రొద్దుపోయింది" కాసేపు మౌనంగా ఉన్నాడు.

"సుచీ ! నీ కొరకు ఏం చేసినా శ్రమ అనిపించదు. ఏదో తృప్తి! అన్ని ఆశలు త్రెంచుకొనివున్న నా జీవితంలో మళ్ళీ వెలుగురేఖ ప్రసాదించావు. నీ దర్శనంతో నా హృదయమందిరం కాంతివంతమైంది." ఆమెనుండి జవాబు రాలేదు కాని ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి. అతని హృదయమంతా ఏదో మధురభావన ఆక్రమించుకుంది. ఒక చేత్తో స్టీరింగ్ పట్టుకొని రెండో చేయి ఆమె నడుము చుట్టూ పోనిచ్చి దగ్గరగా లాక్కున్నాడు.

చటుక్కున అంటీ అంటనట్లు ఆమె విశాలమైన నుదురు చుంబించాడు. "ఏడవకు సుచీ ! నిన్ను సాంప్రదాయాలను వదిలిపెట్టమని శాసించను. ఆలోచించు, మన జీవితం అర్థవంతముగా చెయ్యడానికి ప్రయత్నించు. ఈనాడు యవ్వనంలో జనించే కోర్కెల ఆలంబనతో నిన్ను ఆరాధించుట లేదు. మన బాల్యం నీకు గుర్తుందనుకుంటాను. నీకు అయిదు సంవత్సరాలు, నాకు పది వుండొచ్చు. బొమ్మలా వుండే నిన్ను చూస్తే ఏదో ఆకర్షణ. ఆ బొమ్మ నా సొంతం కావాలనిపించేది. ఓ రోజు నునుపైన నీ బుగ్గలు తాకాలనిపించింది. తాకాను. మీ నాన్నతో గిల్లానని చెప్పి కొట్టించావు" సుచరిత అతని భుజంపై వ్రాలి వెక్కి వెక్కి ఏడ్చింది.

"వద్దు రఘూ ! అవన్నీ గుర్తు చేయకు. అవి మధురస్మృతులుగానే మిగిలిపోనియ్యి" ఆమె భుజాన్ని చేతితో చుట్టి "అంతగా బాధపడొద్దు. పోనీ, నీ కిష్టంలేకపోతే ఏదీ మాట్లాడను. ఈ భాగ్యం చాలు. అమరసుఖాలను ఊహించుకుంటూ జీవితం గడిపేస్తాను" మరుక్షణమే తనను తాను సంబాళించుకున్నాడు రఘు. "కళ్ళు తుడుచుకో సుచీ! యిల్లు వచ్చేసింది.

అమ్మ చూస్తే ఏమనుకుంటుంది?" కారాపాడు. కళ్ళు తుడుచుకుని కారు దిగింది.

"రండి, ఇంట్లోకి"

"వద్దు రేపు వస్తాను" కారు వెనుకకు త్రిప్పాడు.

తల్లికి లేటయిన కారణం చెప్పి భోజనానికి కూర్చుంది. ఒక్క ముద్ద దిగలేదు. మజ్జిగ త్రాగి పడుకుంది. నిద్ర రావటం లేదు. ఏమిటి? రఘు అంత చొరవ చేశాడు. తనకు మాత్రం లేదా అతని యందు అనురాగం? అతను పురుషుడు, వ్యక్తం చేయగలడు. తను స్త్రీ వ్యక్తం చేయలేదు. చేస్తే సంఘం ఊరుకోదు. లోకం సంగతి తరువాత. అమ్మ ఆచారాలను వదలి తన సుఖం కోరగలదా! పునర్వివాహం చేస్తుందా ? అసంభవం ? కొడుకులపల్లే ఆమె హృదయం గాయపడింది. తను తెగింపుచేస్తే ఆమె గుండె ఆగిపోదూ. అమ్మను ఆవేదనకు గురిచేయటం భావ్యం కాదు. మరుక్షణమే చిరునవ్వుతో గంభీరంగా ఉండే రఘు ముఖం ప్రత్యక్షమైంది. అతని కళ్ళు అతనిలోని అనురాగాన్నంతా కురుస్తున్నాయి. అతని బాహువులు ఎంత విశాలం ! అతని కళ్ళల్లో యెంత ఆకర్షణ ! మాటల్లో మత్తుమందే వుంటుంది. అతనికి తనెలా చెప్పగలదు. 'రఘూ ! నా హృదయాన్ని చీల్చి చూడు. నీ రూపమే నిండి వున్నదని.' అసహాయంగా దిండులో తలదూర్చి ఏడ్చింది. 'అంతగా ఆరాధించి ప్రేమించే వ్యక్తిని దూరం చేసుకుని బ్రతకగలదా? జీవితం త్రాసుగా ఆమె ముందు నిల్చుంది. రఘు ఒక వైపు, సంఘం బంధుజనం రెండో వైపు ఎటూ మొగ్గ లేదు. ఆలోచనలతో తల వేడెక్కింది. ఎప్పుడు నిద్రాదేవి ఒడిలో విశ్రమించిందో ఆమెకే తెలియదు.

"తల్లీ ! సుచరితా ! ఎనిమిది దాటిందమ్మా" గోపమ్మ లేపగా లేచింది. ఎర్రగా జ్యోతుల్లావున్న కళ్లు చూసి గోపమ్మ బెంబేలు పడింది. ఒంటిని తాకి చూచింది. ఒళ్ళు పేలిపోతోంది.

"అయ్యో ! రాత్రి బావున్నావు కదా ! ఎన్నడు లేంది జ్వరమేమిటే నీకు!" సుచరిత లేస్తూ నీరసంగా నవ్వింది. తల్లి వంక చూచి "మనిషన్నాక జ్వరమే రాదా ! ఊరికే కంగారుపడతావు". తల్లిని మందలించి, ముఖం



కడుక్కుని కాఫీ త్రాగింది. ఐదునిమిషాలలో వాంతి చేసుకుంది. మగతగా పడిపోయింది. ప్రక్కింటి కుర్రాడిని పిలచి డాక్టర్ రఘు యింటికి ఫోన్ చేయించింది. అయినా ఆమె ఆదుర్దా తగ్గలేదు. దగ్గర్లోవున్న డాక్టర్ ఎవరైనా వుంటే పిలుద్దామని బయటికొచ్చింది. ఎవర్ని పిలవాలో తెలియదు. ఒకవేళ రఘు హాస్పిటల్ కెళ్ళిపోతే! ఆమె ఆలోచనలు పూర్తి కాక పూర్వమే రఘు వచ్చాడు. గోపమ్మ ముఖం ప్రసన్నమైంది.

"రాత్రి బావుందికదమ్మా !"

"అదేమో నాయనా ! తెల్లారేపాటికి ముంచుకొచ్చింది. బిడ్డ యెన్నడూ చీదీ యెరుగదు." గోపమ్మ కంట తడిపెట్టింది, సుచరితను పరీక్షించాడు. ఇంజెక్షన్ చేసి "ఫరవాలేదమ్మా వేడి. నిద్ర కొరత వల్ల వచ్చింది జ్వరం. సాయంత్రానికి తగ్గిపోతుంది."

"పెద్ద హంగామా చేసి మిమ్మల్ని రప్పించిందా ?" నీరసంగా చూసింది సుచరిత.

"ఇప్పుడేం ముంచుకుపోలేదుగాని, కళ్ళుమూసుకుని పడుకో. సాయంత్రం జ్వరం తగ్గేవరకు ఏం తినడానికి యివ్వకమ్మా" వెళ్ళిపోయాడు. అతడు చెప్పినట్టే సాయంత్రం జ్వరం తగ్గిపోయింది. రఘు సాయంత్రం తిరిగి వచ్చాడు.

"ఎలా వుంది ?"

"మందిచ్చినవారెవరు? జ్వరం పారిపోయింది" అతని చేతిని తీసుకుని గుండెలమీద పెట్టుకుని కళ్ళుమూసుకుంది సుచరిత. నెమ్మదిగా తన చేతిని లాక్కుని గోపమ్మతో జాగ్రత్తలు చెప్పి వెళ్ళాడు రఘు.

రెండురోజుల్లో సుచరిత పూర్తిగా కోలుకుంది. రేపు బడికివెళ్ళాలి అనుకుంది. తను ఒక్కరోజు బడికివెళ్ళకుంటే పరుగెత్తుకొచ్చే రమాదేవి ఎందుకు రాలేదో ? ఏం తోచక టాగూర్ 'రెక' తీసింది. ఎన్నిసార్లు చదివినా తనివి తీరదెందుకో! పది పేజీలు చదివిందో, లేదో పుస్తకం లాక్కున్నారు. 'యెవరా' అని తలెత్తింది సుచరిత.

"అప్పుడే పుస్తకం మీదికి మనసుపోయిందా?" కోపం నటించాడు రఘు.

"ఏం తోచటం లేదు. మరి కూర్చోండి" రఘు కుర్చీ లాక్కు
కూర్చున్నాడు.

"బడికి వెళ్ళనా?"

"వెళ్ళు. ఇంట్లో వుండి ఆలోచనలతో తల బద్దలు కొట్టుకుంట
కాని లైట్‌గా టీచ్ చెయ్యి" గోపమ్మ వచ్చింది. "రఘూ! నీ ఋణం ఏ
తీర్చుకుంటానయ్యా! నా కొడుకులకన్నా ఎక్కువగా ఆదుకున్నావు. నీ
లేకుంటే హడలిపోయేదాన్ని."

"చిన్న విషయాన్ని భూతద్దంలో చూస్తారమ్మా మీరు. సుచరిత మీ
కూతురైతే, నా బాల్యస్నేహితురాలు"

"ఎంతైనా నీ అభిమానమే వేరు నాయనా! ఈ రోజు ఫలహా
చెయ్యందే వెళ్ళొద్దు. ఉప్మా చేస్తాను."

"అమ్మా ! పచ్చిమిరపకాయల పాలు మించనియ్యకు. డాక్టరుగ
పేషెంటు అవుతారు" సుచరిత నవ్వుతూ తల్లికి సలహా యిచ్చింది.

"నాకు తెలుసు తల్లీ ?..... అయినా కారం లేని పదార్థాలు ఏం రుచ
అనుకుంటూ వెళ్ళిపోయింది.

"ఓహో! తమరు అమ్మకు కూడా టీచర్ అయ్యారన్న మాట !"

"అదేం లేదు. నాన్నగారికి పచ్చిమిరపకాయలు ఇష్టం, అదే వుద్దేశ్య
అమ్మ అందరినీ తినమంటుంది......"

"అయితే మీ నాన్నగారు అదృష్టవంతులు! మరణించినా మీ అ
హృదయంలో చిరంజీవిగా వున్నారు."

"ఏమో!........"

"సుచరితా ! మొన్నటి సంఘటనతో నన్ను నీచంగా ఊహించుకున్న
కదూ? ఆ క్షణంలో అంత బలహీనుడి నయ్యాను - నన్ను క్షమించు
అన్నాడు నెమ్మదిగా.

"క్షమించవలసిన నేరం మీరు చెయ్యలేదు. అయినా ఆ ప్రసక్తి దేని

"నీకు అంత తొందరగా జ్వరం ముంచుకు రావటానికి కారణం
కదూ?



అతనికళ్ళు తన పట్ల ఉండే ఆదరం అనురాగాన్నే కురుస్తున్నాయి. అతడు సుచరితను నిదానించి చూచాడు. "సుచరితా ! నన్ను యెన్నో రోజుల నుండి ఓ సందేహము పీడిస్తోంది. తీర్చగలవా ?"

"అడగండి. నాకు తెలిసిన విషయమైతే చెప్తాను."

"వద్దులే. ఇప్పుడు నీరసంగా ఉన్నావు. యింకెప్పుడైనా తీర్చుకుంటాను" లేచి పోబోయాడు. సుచరిత స్వతంత్రంగా అతని చెయ్యిపట్టుకుని ఆపు చేసింది.

"మీ రిప్పుడెళ్ళిపోతే ఉప్మా అంతా యెవరు తినాలి? మీ సమక్షములో నాకేం నీరసం కాని చెప్పండి యేమిటో" రఘు కళ్ళు కాంతివంతమయ్యాయి. వచ్చి సుచరిత మంచం చివర కూర్చున్నాడు.

"సుచీ! నేనంటే నీ అభిప్రాయమేమిటి? నేనెంత సన్నిహితంగా రావాలనుకున్నా నీవు దూరంగా పారిపోతావేం?" చెప్పదగిన జవాబు ఏం లేదు సుచరితవద్ద. తలొంచు కుంది.

"చెప్పు సుచీ! నాకు మనశ్శాంతి కరువు చెయ్యొద్దు"

"ఏం చెప్పను? మీరే అన్నారు కదా. మీరు సైకాలజీ యెరుగుదుమని. ఆ మాత్రం అర్థం చేసుకోలేరా? మీరు పురుషులు. మీ భావాలను స్వతంత్రంగా వ్యక్తం చెయ్యగలరు. చేసే అధికారం ఉంది. నేను స్త్రీని. భారతదేశంలో స్త్రీ కెలాంటి స్థానముందో తెలియదా! నాలోని భావాలను వ్యక్తం చెయ్యలేదు. చేసినా లోకం ఊరుకోదు. స్త్రీకి సంఘం ఒక యినుపగోడ లాంటిది. అది ఛేదించుకొని రాలేదు. ఒక వేళ మీ అంత స్వతంత్రంగా మొన్న నేను ప్రవర్తిస్తే మీరుకూడా నన్నో నీతిలేనిదాన్నిగా ఊహించుకొనేవారు."

"సుచరితా!" దెబ్బతిన్నట్టు చూచాడు.

"అది సహజము. మీ రెందుకంత బాధపడుతున్నారు ?"

"సుచీ ! బాధపడకుండా ఎలా వుండమంటావు ? ఈ జన్మలో కాదు. మరో జన్మలో కూడా నిన్నపార్థం చేసుకోలేను. యింతేనా నన్ను నువ్వు అర్థం చేసుకుంది! పోనీ, ఒక్క విషయం చెప్పు! నీ హృదయంలో నాకు స్థానం ఉందని చెప్పు. హాయిగా జీవిస్తాను. తృప్తిగా ఉండగలుగుతాను" సుచరిత కళ్ళు శ్రావణమేఘాలయ్యాయి.

"ఎందుకంత అభిమానం తెంచుకుంటావు రఘూ ! ఈ దుర
వంతురాలు మీకే విధమైన తృప్తి ఇవ్వలేదు. ఒక్క మాటమాత్రం చెప్పగల
జ్ఞానం తెలిసిన నాటి నుండి కలిగే తీయని ఊహలలో మీరు తప్ప యింకొ
ప్రవేశించలేదు. అది తెలిసి వచ్చేసరికే అంతా మించిపోయింది. అదృ
నన్ను దాటిపోతూ పోతూ అభాగ్యురాలనే ముద్రవేసి పోయింది." చేతు
ముఖం దాచుకుని రోదించసాగింది. రఘు హృదయం తేలికయింది.

"మీ ఆడవాళ్ళకు అడగకుండానే వస్తుంది కన్నీరు! అందుకే మీ
యిప్పుడు అడగనన్నాను." ముఖం మీది నుండి చేతులు తొలగించి కన్నీ
ఒత్తాడు.

"మరేం ఫరవాలేదు. హృదయభారం తగ్గింది."

"సుచీ - నాకొక్క అవకాశ మిస్తావా? నిన్ను అదృష్టవంతురాలి
ఆశీర్వదించే అధికారమివ్వు?"

ఉలికిపడింది సుచరిత - "ఏమిటి మీరంటున్నది!"

"అనుచితమా? దురాశా?"

"లేదు. కోరి దురదృష్టాన్ని తెచ్చుకోవడం. నేను వివాహితను. విధ
మీరు విశాల హృదయంతో స్వీకరించినా సంఘం ఊరుకుంటుందా?
అమ్మగారు అంగీకరిస్తారా? మా అమ్మగారు ఆశీర్వదిస్తారా?"

"నా కెవరి ప్రమేయం లేదు. అవన్నీ పురాతన భావాలు. పురుషుడికు
హక్కు స్త్రీకి యెందుకుండరాదు.

"ఉండొచ్చు. కాని అందరికన్నా ముందు నాకే యిష్టం లేదు.
దేవుడిగా నా హృదయపీఠం పై ప్రతిష్టించి పూజించగలను. కాని మీ
అవమానం జరిగితే చూడలేను. ఒక మహాపురుషుడుగా గౌరవించగల
కాని పవిత్రమైన మీ జీవితంలో కళంకముగా ప్రవేశించలేను" చాలాసే
ఆమె వంక చూచాడు. తొందరపడితే లాభం లేదనుకున్నాడు. సావకాశము
నచ్చజెప్పవచ్చు అనుకున్నాడు. సుచరిత ముఖం ప్రక్కకు త్రిప్పుకుని దు
దులిపినట్టు నటించసాగింది.

* * *



సుచరిత తయారయి బయటికి వచ్చింది. తల్లి కూడా వెనకాలే వచ్చింది. "బస్సు కొరకు నిలబడి నీరసించకు తల్లీ ! రిక్షాలో వెళ్ళమ్మా" సుచరిత చిన్నపిల్లలా తల్లి భుజంపై వాలిపోయింది.

"ఎందుకమ్మా అంత భయం! నాకేదన్నా అనర్థం జరిగినా నీ ప్రేమ దానితో పోట్లాడి నన్ను నీ కప్పగిస్తుంది" అన్నది నవ్వుతూ.

"వెర్రితల్లీ! ఇది కలికాలం! యెల్లకాలం నేనుండబోయానా? నేను ఉన్నన్ని రోజులన్నా జాగ్రత్తగా చూసుకుంటే తృప్తి ! ఈ బ్రతుకే నీ కోసం తల్లీ? మీ నాన్నగారితోనే పోవాల్సినదాన్ని" అన్నది కూతురు తల నిమురుతూ. కారు హారన్ వినిపించింది. వెంటనే రఘు వచ్చాడు.

"వచ్చావా బాబూ! సుచరిత స్కూలుకెళుతుందట."

"అవును. నిన్న చెప్పింది. నీరసంగా ఉంది, కార్లో తీసుకెళ్ళి వదిలేస్తాను." అన్నాడు రఘు.

నీకు "ఎంత జ్ఞాపకం నాయనా! వెళ్ళు తల్లీ" గోపమ్మ లోపలికి పోయింది!

"మీకు వేరే పనులేం లేవా? నేను బస్‌లోనే పోతాను." అన్నది కోపంగా.

రఘు కొంటెగా చూచాడు.

"పూజారి ఎన్ని పనులున్నా పూజను విస్మరించగలడా?" సుచరిత మూతి ముడుచుకొని వచ్చి వెనుకసీట్లో కూలబడింది రఘు డ్రైవింగ్ సీట్లో కూర్చుంటూ వెనుకకు చూచాడు.

"అంత కోప మెందుకో."

"అమ్మ వింటే?" బుంగమూతి పెట్టింది.

"అమ్మ వినకుంటే పరవాలేదా?" అతని నరనరాల్లోను పురుషత్వము బుసలు కొట్టసాగింది. ముద్దుగా ముడుచుకున్న ఆ బుంగమూతి ముద్దు పెట్టుకోవాలనిపించింది. కాని వివేకం మేల్కొంది. తన ఆవేశం అంతా కారుమీద చూపించాడు. విమానంలా దూసుకుపోయింది. అయిదు నిముషాల్లో స్కూలు ఆవరణలో ఆగింది. స్కూల్లో అడుగుపెట్టిన సుచరితను విద్యార్థులు చుట్టుముట్టారు. చిరునవ్వుతో అందరినీ సమాధానపరుస్తూ స్టాఫ్‌రూమ్ కెళ్ళింది.

"చాలా త్వరగా వచ్చా రేమండీ?" గోపాలం ప్రశ్నించాడు.

"కార్లో వచ్చినట్టున్నారు!" మరియమ్మ అన్నది.

"అవునండి" ముక్తసరిగా జవాబిచ్చి రమాదేవి కొరకు యెదురు చూడసాగింది.

"విశేష మేమిటండోయ్! ఒకేసారి మూడు రోజులు సెలవు పెట్టారు."

"జ్వరమొచ్చిందండీ" నెమ్మదిగా జవాబు చెప్పింది.

"కొంపదీసి యెవరన్నా డాక్టరు స్నేహితులున్నారేమిటి? అలా అయితే జ్వరం త్వరగా వచ్చేస్తుంది." మరియమ్మ మూతి మున్నూట అరవై డిగ్రీలు తిరిగి యధాస్థానం చేరుకుంది.

"ఇప్పుడావిడ వచ్చింది డాక్టరుగారి కారులోనే. మొన్న మిమ్మల్ని కూడా దింపారు యిండ్ల వద్ద" ఎవిలీన్ సాగదీసింది.

"ఏమండీ అతడు స్నేహితుడా?" అమాయకంగా అడిగింది లలిత.

"స్నేహితుడే కాదు, బంధువు - యింకా ఎక్కువే" వాళ్ళ వంక అసహ్యంగా చూసి వెళ్ళిపోయింది.

"ఎంత నిర్భయంగా అతని ప్రక్కన కూర్చుందని" లలిత కళ్ళు త్రిప్పింది.

"ఎలా వుంటాడు? అందమైనవాడేనా?" మరియమ్మ కుతూహలంగా అడిగింది.

"అబ్బో చాలా అందగాడు" బెల్ కావటంతో అందరూ బయటి కొచ్చారు.

హెడ్‌మాస్టారికి లీవ్ లెటర్ యిచ్చింది సుచరిత.

"మీరిద్దరూ ఒకేసారి లీవ్ పెట్టారమ్మా? రమాదేవి ఆరోగ్యం ఏం బావుండలేదట. నెలరోజులకు సెలవు పెట్టి పంపింది".

"ఏం జబ్బో,' ఆదుర్దాపడసాగింది సుచరిత.

సుచరిత కనిపించగానే వింతగా చూస్తూ గుసగుసలాడటం, ఎదుట బడితే ముడతమాటలతో అవమానించటం మొదలుపెట్టారు అసూయాపరులు.

ఎనిమిదో తరగతి ఇంగ్లీషు క్లాసు కెళ్ళింది. పిల్లలు విష్ చేసి కూర్చున్నారు. ఆ రోజు గ్రామర్ పీరియడ్ ది.ఎ.యాన్. అనే పదాలు బోర్డుపై రాసింది.



"వాట్ ఆర్ దే?"

"ది, ఎ, యాన్ టీచర్ !"

"వాట్ ఈజ్ ది గ్రమెటికల్ నేమ్ ఫర్ దెమ్?"

"............"

"యూ కృష్ణా !.......హేమా.......నాగరాజ్ ?"

"దే ఆల్ కాల్డ్ ఆర్టి...." నాలిక కరుచుకుంది సుధ.

"యస్. యు ఆర్ కరెక్ట్ ! కంప్లీట్ యిట్."

"దే ఆర్ కాల్డ్ ఆర్టికల్స్ టీచర్. గుడ్, సిడౌన్, ఐ విల్ రైట్ సమ్ సెంటెన్‌సెస్, కెన్ యూ డిఫైన్ ది ఆర్టికల్స్"

"యస్ టీచర్! ది వర్డ్ ఆల్ఫాబెట్ విచ్ ఈజ్ యూజ్డ్ బిఫోర్ కామన్ నౌన్ యీజ్ కాల్డ్ ఆర్టికల్స్ టీచర్."

"గుడ్! యింప్రూవ్డ్" ప్యూన్ నోటీసు తెచ్చాడు. పాఠం ఆపి చదివింది. రమాదేవి లాంగ్‌లీవ్ పెట్టినందుకు ఆమె క్లాసులు అందరికీ వేశారు. ఎలెవెన్త్ నాండిటేల్ పడింది సుచరితకు. తన పేరు దగ్గర సంతకము పెట్టింది. ప్యూన్ వెళ్ళిపోగానే మళ్ళీ మొదలుపెట్టింది. అందరిచేత ఆర్టికల్ డెఫినిషన్, ఉపయోగము చెప్పింది. తృప్తిపడింది. బెల్ అయి బయటికొస్తుంటే ఎవిలీన్ యెదురొచ్చింది.

"చూడండి సుచరితా ! నైన్త్ జాగ్రఫీ వేశారు. నాకేం వచ్చు?"

"నైన్త్ గద, ఏదో ప్రిపేరయి చెప్పండి. ఏం చేస్తాము!"

"ఎంత చదివినా జాగ్రఫీ ఏం చెప్పగలను! నా తలకాయ! ఏం చెప్పినా పెడర్థాలు తీస్తారు." అనుకొని వెళ్ళి పోయింది. ఎలెవెన్త్ కెళ్ళింది సుచరిత. పిల్లలు విష్ చేసి కూర్చున్నారు.

మీ నాండిటేల్ లూయీ పాశ్చర్ కదూ !"

"అవునండి" పుస్తకం తెచ్చి యిచ్చాడొక విద్యార్థి.

"ఇదివరకు చదివిందే. ఏ చాప్టర్‌లో వున్నారు?"

"టీచర్ !."

"చెప్పండి" సుచరిత పేజీలు త్రిప్పుతూ కూర్చుంది.

"ఒక్కసారి నాన్‌డిటేల్ టెస్టు తెలుగులో సమీక్షించండి టీచర్!

రమాదేవిగార్ని అడిగితే వీలులేదన్నది. ఆమెను మళ్ళీ అడిగే ధైర్యం లే
మా ఫౌండేషన్ బాగా లేదండి. చిన్నచిన్న పదాలు కూడా అర్థం చేసుకోలేము
మా కర్థం కాకుంటే ఎలాగండీ ?"

"మీ ఇష్టప్రకారము చెయ్యకుంటే మళ్ళీ స్ట్రయిక్ చేస్తారా ?"

అందరూ తలలు పంచుకున్నారు.

"భలేపిల్లలే, నవ్వులాటకన్నాను.... లూయీస్ పాశ్చర్ ఓ చిన్న గ్రామం
జన్మించాడు. అతని తండ్రి తోళ్ళను చదును చేసేవాడు. పాశ్చర్‌ను మా
బడికి పంపేవారు. బడిలో పాశ్చర్‌కు చాలామంది స్నేహితులయ్యారు. ఒక
పాశ్చర్ తన స్నేహితులతో పాటు షికారు కెళ్ళాడు. తిరిగివస్తుండగా
పిల్లవాడు కొండ ప్రాంతములో తప్పిపోయాడు. ఆ కాలంలో అక్కడ నివస
ప్రజలకు తోడేళ్ళ భయం ఎక్కువ. ఆ బాలుణ్ని తోడేలు కరిచింది. తో
కరుపుకు జరిగే చికిత్స తెలిసిన బాలుడు యింట్లో వాళ్ళకు ఏం చెప్ప
వారం రోజులకు మరణించాడు. అదే రోజు పాశ్చర్ ఇంటికి వస్తూ ఒక
తోడేలు కరుపుకు చికిత్సపొందటం చూచాడు. కమ్మరివాడు ఇనుప
ఎర్రగా కాల్చి తోడేలు కరచినచోట పెడతాడు."

"అబ్బా ! వింటే భయం! ఒళ్ళు జలదరిస్తోంది టీచర్ ! పాపం వా
ఆ చికిత్సను ఎలా భరించేవాళ్ళో!" సుందర్ భయంగా చూచాడు. మ
లేనప్పుడేం చేస్తారు? పూర్వం వాతమని మన వాళ్ళుకూడా మెడ పైన
దగ్గర, నుదట కాల్చేవారు. అలా కాల్చేటప్పుడు చికిత్స పొందే వ్యక్తి యొ
బాధ, అతని అరుపులు పాశ్చర్ పసిహృదయం పై ముద్రింపబడ్డా
పలురకాలుగా ఆలోచించాడు. తను పెద్దవాడైతే మొదట తోడేలు కరు
మందు కనిపెడ్తానని శపథం చేసుకున్నాడు" ఫ్యూన్ రావటంతో విద్యార్థుల
విసుగ్గా అతనివైపు చూచారు. సుచరిత ఏమిటన్నట్లు చూచింది. "అమ్మ
సైన్స్ స్టాక్ రిజిష్టర్లో ఏమో వ్రాయాలట, పిల్లలను వదిలేసి రమ్మంటున్నా
ఆడిట్ పార్టీ వస్తుందట."

"సరే, వస్తాను పద. ఎక్స్యూజ్ మీ బాయస్! ఐ విల్ కంటిన్యూ టుమా
సుచరిత వెళ్ళిపోయింది.



"ఛ! ఈ ఫ్యూన్‌కు బుద్ధి లేదు. ఎప్పుడూ పాఠము మధ్యలోనే వస్తాడు" విసుక్కున్నాడు కృష్ణ.

"వాడేం చేస్తాడు! హెడ్‌మాస్టర్ పంపితే వచ్చాడు."

సోమవారం వరకు నాండిటేల్ పీరియడ్ లేదు. సైన్స్ స్టాక్ రిజిష్టర్ పూర్తి చేసేసరికి బెల్ అయింది. బయటి కొచ్చి రఘు కారును చూచి ఆశ్చర్య పోయింది. డ్రైవరొచ్చి చీటి యిచ్చాడు. నమస్కరించి నిల్చున్నాడు. చీటి విప్పింది. ఆత్రంగా వ్రాసినట్టు అస్తావిస్తంగా ఉన్నాయి అక్షరాలు.

"సుచరితా!

నాకు అర్జంటు పని వుంది. ఆపరేషన్ కేస్ వచ్చింది. రాలేకపోయాను. డ్రైవర్‌కి కారిచ్చి పంపుతున్నాను. మొహమాట పడక వచ్చేయి."

- రఘు

రఘు చూపే అభిమానానికి, ఆదరానికి సుచరిత కళ్ళు చెమర్చాయి. డోర్ తీసి పట్టుకున్నాడు నజీర్. ఎక్కి కూర్చుంది. స్టాఫ్‌లో కొందరు వింతగా, కళ్ళు పెద్దవి చేసి చూచారు. "డ్రైవర్! ఇంటికి కాదు." అంటూ రమాదేవి అడ్రస్ చెప్పింది. కారు రమాదేవి యింటిముందు ఆగింది. "డ్రైవర్ నువ్వెళ్ళిపో. నేను తరువాత వెళతాను ఇంటికి" అన్నది సుచరిత.

"రాత్రి వరకు కారుతో అయ్యగారి కేం పని లేదు. మిమ్మల్ని దించే వెళతాను" అంటూ అరుగుమీద కూర్చున్నాడు. యజమానికి తగ్గ సేవకులు అనుకుని లోపలి కెళ్ళింది. ఈజీ ఛైర్లో పడుకున్న రమాదేవి ముఖం కళావిహీనంగా ఉంది. శుభ్రంగా ఎక్కడి వస్తువులు అక్కడ సర్ది వుండే యిల్లు చిందరవందరగా వుంది.

"అక్కయ్యా, యెలా వుంది?"

నిర్జీవంగా నవ్వింది రమాదేవి. "ఇదిగో యిలా ఉన్నాను. రా. స్కూలు విశేషాలేమిటి? సుచరిత వెళ్ళి దగ్గరగా వున్న కుర్చీలో కూర్చుంది. "నేను ఈ రోజే వచ్చాను స్కూలుకి. మూడురోజులు సెలవు పెట్టాను. జ్వరం వచ్చింది. అందుకే నీ విషయాలు తెలియవు. అదేమక్కా నెలరోజులు సెలవు పెట్టావట?"

"నెలకూడా సరిపోతుందో లేదో" అన్నది నిరుత్సాహంగా రమాదేవి.

"అదేం? అంత జబ్బు చేసిందా?"

"ఇప్పుడేం లేదట. విశ్రాంతి తీసుకోకుంటే టి.బి. వచ్చే సూచన ఉన్నాయట. నాకు కూడా నీరసంగా ఉంటోంది. సాయంత్రం పూట జ్వ కూడా వస్తోంది."

"మందు తీసుకుంటున్నావా అక్కా!" అంది ఆత్రంగా.

"ఆ. తీసుకుంటున్నాను సుచరితా? ఏమనుకోకు. పిల్లలకు క తలంటుతావా? నేను అంటగలను. కానీ ఆయనకు కోపం వస్తుంది."

"అక్కా! నన్ను అంతగా అడగాలా?... నిన్ను పరాయిదాన్ని యెప్పుడూ చూడలేదు" అంటూ పిల్లలను పిలిచి తలంటి త్వరగా యి సర్ది సాయంత్రం వంట చేసింది. పిల్లలకు తలలు తుడుస్తూ నిల్చుంది.

'ఏమిటో ఈ మమతానుబంధాలు! నాతో చేయించుకున్నవారు, నా కావల్సినవారు ఎక్కడున్నారో! ఈ పిల్లకూ, నాకూ ఏదో అవిభా సంబంధమున్నది' అనుకుంది.

"రమా!" కోపంగా వుంది మూర్తి గొంతు. "ఆదివారం ఎల చేయిస్తానంటే వినవేం? వీళ్ళకు తలెందుకు అంటావు?"

నవ్వింది రమాదేవి. "వాళ్ళనే అడగరాదూ? ఎవరు పోశారో?" సుచ బయటికి రావటంతో అతను అర్థం చేసుకున్నాడు!

"నమస్కారమండీ."

"నమస్కారమమ్మా ! మీరెందుకు శ్రమపడుతున్నారు?"

"ఫరవాలేదు. రోజూ చేస్తానా ? వెళ్ళొస్తానక్కా! రేపే వీలైతే డా గారిని పిలుచుకొస్తాను."

"చాలా శ్రమపడుతున్నావు చెల్లీ !" రమాదేవి ప్రేమగా చెయ్యి నొక్కి సుచరిత పిల్లలను ముద్దుపెట్టుకొని కారెక్కింది.

"వచ్చావా తల్లీ ! అసలే నీరసంగా వున్నావు. ఆలస్యమై హడలిపోయాను" గోపమ్మ కూతురికి యెదురొచ్చింది. సుచరిత రమా గురించి అంతా చెప్పింది.

"మంచివాళ్ళకే ఈ కష్టాలు! తల్లికో, అత్తకో ఉత్తరం రా పిలిపించుకోలేక పోయిందా?"



"యెందుకమ్మా ? మూలిగే నక్క పై తాటికాయపడ్డట్టు ఉద్యోగం వల్లే జబ్బొచ్చిందని కాల్చుకు తింటారు."

సుచరిత నీరసంగా మంచముపై వ్రాలింది. గోపమ్మ హార్లిక్సు కలిపి తెచ్చింది.

* * *

ఆదివారం రఘు టిఫిన్ చేసి, మెడికల్ జర్నల్ తిరగేస్తూ కూర్చున్నాడు. నాయర్ వచ్చాడు. రఘు ఏమిటన్నట్టు చూచాడు. "అయ్యగారూ! ఎవరో అమ్మగారు వచ్చారు. మిమ్మల్ని చూడాలట."

"బట్టలేసుకుని వస్తాను. డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుండబెట్టు" రఘు మాట పూర్తికాక మునుపే సుచరితలోనికి వచ్చింది.

ఆమె చొరవకు ఆశ్చర్యపోతూ ఏమో అనబోయాడు నాయర్. అయ్య గారి ప్రసన్న వదనం చూచి మాట్లాడక వెళ్ళిపోయాడు.

"భలేవాడండీ మీ నాయరు" రఘు ఏమీ వినిపించుకునే స్థితిలో లేడు. ఆనందంతో సుచరితను చూస్తున్నాడు.

"ఏమండీ డాక్టరు గారూ! అనుమతిలేకుండా మీగదిలోకి వచ్చినందుకు కోపమా?...... మాట్లాడ రేమండీ?"

"కోపం కాదు. ఆరాధ్యదేవత నట్టింట ప్రత్యక్షమైతే ఎలా పూజించాలా అని ఆలోచిస్తున్నాను."

"నయం! కర్రతో పూజించేరు" కిలకిల నవ్వింది. సుచరిత అతని సమక్షములోనే అలా నవ్వగలుగుతుంది.

"రా, కుర్చో!" ఆమె చెయ్యి పట్టుకొని సోఫాలో కూర్చుండబెట్టాడు.

"హఠాత్తుగా నాపై యింత దయ కలిగిందేమిటి."

"చాల్లెండి పరిహాసం. ఎవరన్నా వింటే నవ్వగలరు. మీతో అతి ముఖ్యమైన పని ఉండి వచ్చాను."

"నాయర్... రెండు కప్పుల కాఫీ తీసుకురా" సుచరిత వద్దని వారించా లనుకుంది. కాని అతని కళ్ళల్లో వెల్లివిరిసే ఆనందము చూచి ఊరకుండి పోయింది.

"ఇప్పుడు చెప్పు"

"అటు రావటం లేదేం!"

"నాకేం వేరే పని లేదా?" అన్నాడు చిలిపిగా. "అదికాదు సుధీ! న రాకవల్ల నువ్వు నలుగురి నోళ్ళలో నానడమెందుకని రావటంలేదు. ఏ ముఖ్యవిషయం చెప్పాలన్నావు."

"ఏం లేదు- రమాదేవికి టి. బి. వచ్చే సూచనలున్నాయి అన్నా డాక్టరు -"

"నిజం!"

"అవును. అనంతగిరి శానిటోరియంలో చేర్పిస్తే మంచిద కుంటున్నారు. డాక్టర్ అదే చెప్పాడు. కాని అక్కడ బెడ్ దొరకడం చా కష్టమటకదూ?"

"ప్రయత్నిస్తాను. అయినా యిన్ని రోజులు ఆలస్యం చేశారేమి ఒక్కసారి చూద్దాము" నాయర్ కాఫీ తెచ్చాడు.

ఎప్పుడూ గంభీరంగా ఉండే యజమాని నవ్వు చూచి ఆశ్చ పోయాడు.

"నాయర్ ! అమ్మగారు యిక్కడే భోజనం చేస్తారు." నాయ సంతోషంగా వెళ్ళిపోయాడు. రఘు రమాదేవిని చూడటానికి సిద్ధమయ్యా ఇద్దరూ కార్లో కూర్చున్నారు.

ప్రఫుల్లవదనంతో రఘును పలకరించింది రమాదేవి.

"రండి మరిదిగారూ! మా చెల్లి మిమ్మల్ని కూడా శ్రమపెడుతోం

ఇద్దరూ ఉలికిపడ్డారు. ఆ వరసకు, ఆమె చొరవకు. రఘు తేరు నవ్వాడు. "మీరు నన్నంత పరాయివాడిని చేశారేమిటి వదినా. ఇం ఆలస్యంగానా తెలియజేయటం?"

"అదేం లేదు. నీరసమేగా పోతుందనుకున్నాను" అన్నది. మూ వంటింట్లో నుండి వచ్చాడు. "హల్లో డాక్టర్‌గారూ! ఈరోజు చాలా సుదిన

"సుదినమయితే డాక్టర్లను చూడరు" అన్నది సుచరిత. అంద నవ్వారు. ఎక్స్‌రే, బ్లడ్ టెస్టు రిపోర్టులు తెచ్చాడు మూర్తి.



"మరేం ఫరవాలేదు. గాబరా పడొద్దు. అనంతగిరి గాలికే తగ్గిపోతుంది. మీరు అనంతగిరి వెళ్ళడానికి సిద్ధం కండి. నేను నా స్నేహితులకు ఉత్తరం రాస్తాను."

"మీకు శ్రమకలిగిస్తున్నాము."

"సరి. పేషెంట్లను చూడ్డము శ్రమనుకుంటే వృత్తే మానెయ్యాలి. యిక సెలవు యిప్పించండి."

"కాఫీ తీసుకుని వెళుదురుగాని."

"చవకలో వదలగొట్టుదామనుకున్నారేమో! మీకు కొంచెం నయం కానీ- భోజనమే చేస్తాను."

"చేస్తే యిప్పుడు కాఫీ త్రాగొద్దని ఉందా?"

"వద్దక్కా ! యిప్పుడే వీరి వంటమనిషిచ్చిన కాఫీ త్రాగాను. కప్పులు సరిగ్గా పావులీటరున్నాయి" సుచరిత వారించింది. దంపతులిద్దరూ చిరునవ్వుతో సాగనంపారు డాక్టర్ని, సుచరితను.

"అతనికి సుచరితంటే చాలా యిష్టంలా ఉంది."

"ప్రాణం ! ఈమెకూ యిష్టమే కాని...సంఘం, సాంప్రదాయాలు అంటున్నది. నాకైతే యిద్దరూ భార్యా భర్తలు అవుతారనే అనిపిస్తుంది."

"అయితే మంచిది. చూడముచ్చటగా ఉంటుంది. భోజనం చేద్దాము పద" మూర్తి యింట్లోకి వెళ్ళాడు,

"పాపిష్ఠి దాన్ని, మీతో చేయించుకుంటున్నాను" రమాదేవి గొణుక్కుంది.

* * *

"నన్ను యింటిదగ్గర దింపెయ్యండి" దారిలో సుచరిత అడిగింది.

"అదేం కుదరదమ్మాయి ! నాయర్ వంటచేసి కనిపెట్టుకుంటాడు పాపం! వాడి వంట నేను మెచ్చుకోను. ఎవరు ఇంటికొచ్చినా నానా హైరానా పడి వంట చేస్తాడు. ఎలావుందని అడుగుతాడు, బావుందంటే డిగ్రీ దొరికినంత సంతోషం. అంత కష్టపడినా ఏదో ఒకటి తక్కువో, ఎక్కువో వేస్తాడు. అది తినలేక అప్పుడప్పుడు హోటల్లో భోంచేస్తా."

"మంచి వంటబ్రాహ్మడిని పెట్టుకుంటే-"

"అదీ అయింది. ఇంగువ తినలేక చచ్చాను" రఘు యిల్లు చేరా కారు గారేజ్‌లో పెట్టి వచ్చాడు. సుచరిత ఫ్లవర్ వాజ్ దుమ్ము దులుపుతోంది.

"ఫ్లవర్ వాజ్ కాదు. ప్రతివస్తువూ దుమ్ముతో ఆచ్ఛాదితమైనదే. ఒక్క రోజులో పోదు రా. నా కాకలి దహించుకుపోతుంది" రఘు డైనింగ్ రూములో దారితీసాడు. తను వెళ్ళింది. నాయర్ వడ్డించాడు. బంగాళాదుంప వేపుడు మాడ్చిపెట్టాడు. దొండకాయల్లో ఉప్పు యెక్కువేశాడు. పప్పు పులుసులో చింతపండు వాసన... "అమ్మగారూ ! నా వంటెలా వుంది." సిగ్గుపడుతూ నిల్చున్నాడు.

"వంటకేం దివ్యంగా ఉంది. అయినా డాక్టర్లకు రుచులేం తెలుస్తాయి నాయర్!" అంది కొంటెగా రఘు వంక చూస్తూ.

" మరేనండి కొంచెమాగండి, అప్పడాలు తెస్తాను." సంబరంగా లోపలి వెళ్ళాడు. రఘు తన ప్లేటులోని పదార్థాలు, సుచరిత ప్లేటులో వేశాడు. "దివ్యంగా ఉందిగా తిను" అన్నాడేగాని అవమానం చేశానని యెక్క ఏడుస్తుందోనని భయం పట్టుకుంది. కాని సుచరిత వోరగా చూ మామూలుగా తినటం మొదలుపెట్టింది. అప్పడాలు తీసుకొచ్చాడు నాయరు. అవి మాత్రం ఇష్టంగా తిన్నాడు రఘు. లేచి గదిలోకి వెళ్ళారు. నిజంగా అంతగా అభిమానించే రఘును, తన మనసుకు ప్రశాంతత ప్రసాదించే పరిసరాలను వదల బుద్ధి కాలేదు. మంచము మీద పడిపోయాడు రఘు. ఆ క్షణంలో అతని వక్షంపై తలుంచి "నువ్వు లేంది జీవించలేను రఘూ" అనాలనిపించింది. ఎంతో నిగ్రహంతో ఆ కోర్కె నాపుకుంది.

*　　*　　*

వారం రోజులనంతరము రమాదేవిని అనంతగిరి శానిటోరియంలో చేర్చి వచ్చాడు మూర్తి. రఘు తను వెళ్ళక పోయినా ఏర్పాట్లన్నీ తనే చూచాడు. మూర్తికి ఇంట్లో మనసు నిలవటం లేదు. గృహిణిలేని గృహము శూన్యముగా కనిపించింది. బల్లమీద తలపెట్టి పసిపిల్లవాడిలా బావురుమన్నాడు. సుచరిత కెలా ఓదార్చాలో అర్థం కాలేదు. ఏవో రెండుమాటలు చెప్పింది.



"అక్కయ్య తొందర్లోనే ఆరోగ్యవంతురాలై వస్తుంది బావగారూ! మీరేం దిగులు పెట్టుకోకండి" తను కళ్ళు తుడుచుకుంది. బిక్కు బిక్కుమని చూచే పిల్లలను దగ్గరకు తీసుకుంది.

"సుచరితా ! నీకు తెలియదు నా రమ లేంది నేను బ్రతకలేను. మళ్ళీ అది యీ యింట్లో తిరుగుతుందా?"

"అదేం మాట? అక్కయ్య అనుకున్న దానికంటె ముందుగానే వస్తుంది. మీరేం దిగులుపడకండి."

"రమ రాగానే యెక్కడికైనా దూరప్రాంతాలకు వెళ్ళిపోతాము. ఈ రాబందులకు దూరంగా వెళతాము."

"పెద్దపాప ఉండగలదు కాని, చిన్న పాపను మీరు చూడలేరు. అమ్మగార్నో, అత్తగార్నో పిలిపించండి."

"వద్దు సుచరితా ! వాళ్ళ సాధింపులకు ఉన్న మతి కూడా పోతుంది."

"పోనీ చిన్న పాప సుమను నేను తీసుకెళతాను బావగారూ ! అభ్యంతరం చెప్పకండి. పసిపిల్లలతో మీరు వేగ లేరు" పాప నెత్తుకుంది.

"నీకు శ్రమ దేనికి? నా తిప్పలేవో నేను పడతాను."

"నాకేంశ్రమ! అమ్మ ఇంటిదగ్గరే ఉంటుంది పాపను చూసుకుంటుంది." మూర్తి కళ్ళు కృతజ్ఞతతో మెరిసిపోయాయి.

"ఏ జన్మలోనో నా చెల్లెలివై యుండాలి సుచరితా" చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

దినమంతా కబుర్లు చెప్తూ బాగా ఆడుకుంది సుమ. రాత్రి "నాన్నా, అమ్మా" అంటూ ఏడుపు మొదలు పెట్టింది. యెంత మరపించినా మరువదు. ఏం పెట్టినా తీసుకోదు.

"వాళ్ళ నాన్న దగ్గర వదలివద్దామా అమ్మా"

"వీళ్ళను ఇంట్లో వదలి ఆఫీసు కెలా వెళతాడే?"

"అది నిజమే. కాని పిల్ల దిగులు పెట్టుకొని మంచము పడితే !"

"అయితే ఓ పని చేద్దామా? గదులు ఖాళీగా ఉన్నాయి కదా. మనం వాడుకోవటం లేదు, రమాదేవి వచ్చే వరకు ఇక్కడుంటే ఉమను కూడా చూడొచ్చు. జడా అదీ వెయ్యగలడా మొగమనిషి?"

"అమ్మా ! నీ ఆలోచన బావుంది. నీదెంత మంచి మనసమ్మా!"

"పిన్నీ ! నాన్న-అమ్మ దగ్గరకు పోతాను." కాళ్ళు పట్టుకుంది పా పాపని తీసుకొని ఇద్దరూ రిక్షాలో మూర్తి ఇంటికి వెళ్ళారు. తలుపుతీసి వీళ్ళ చూచి ఆశ్చర్యపోయాడు మూర్తి? "అదేవిటమ్మా ! ఇంత రాత్రి బయ దేరారు?" తండ్రి గొంతు వింటూనే పాప తండ్రిపైకి దుమికిం అందుకున్నాడు సుమను. 'సుమా' అంటూ గుండెలకు హత్తుకున్నాడు. ప ఎవరన్నా తీసుకువెళతారేమో అన్నట్టు తండ్రిని గట్టిగా కౌగలించుకొని క మూసుకుంది.

"రండమ్మా. పాప వల్ల ఇంతదూరం వచ్చారు" అన్నాడు. ఉమ తం మంచంమీద నిద్రబోతోంది. తండ్రి భుజంమీద ప్రశాంతంగా క్షణం నిద్రబోయింది సుమ.

"చూడు బాబూ ! పెద్దదాన్ని చెప్తున్నాను-పసిపిల్ల. ఈ పిల్లన్ చూడగలదు? మాదగ్గర నువ్వు లేంది ఉండలేరు. మా యింట్లో బయ గదులు ఖాళీగా ఉన్నాయి. రమ వచ్చే వరకు అక్కడే వుండకూడదూ?"

"నన్ను మీరు అభిమానంతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారమ్మా."

"మరేం చెప్పకు నాయనా! అనవసరంగా పిల్లలు పాడయిపోతారు గోపమ్మ మాట తీసెయ్యలేకపోయాడు.

" అలాగేనమ్మా. నాతల్లికంటే ఎక్కువ అదరిస్తున్నారు" అన్నా రెండు రోజుల్లో సామాన్లన్నీ గోపమ్మ ఇల్లు చేరాయి. గోపమ్మ సంరక్షణ పిల్లలు, యే లోటూ లేకుండా గడుపుతున్నారు. సుచరిత కథలు చెప్తూ ఉమ బడికి వెళుతోంది. సుమ మాత్రం ఇంట్లోనే గోపమ్మ దగ్గర ఉంటోం

* * *

ఇంగ్లీషు కాంపొజిషన్ నోటుబుక్కు దిద్దుతూ కూర్చుంది ఎవి మరియమ్మ, లలిత అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నా హెడ్‌మాష్టరు బయటికెళ్ళారని తెలుసుకున్నారు.

"ఏమండోయ్ ! గోపాలం గారూ ! యిద్దరు హీరోలను హీరో ప్రేమించే సినిమా ఏదన్నా చూశారా?"



"ఇద్దరు హీరోలు ఒక హీరోయిన్‌ను ప్రేమించడం మామూలే కదండి" అన్నాడు గోపాలం.

"నేను అడిగేది హీరోయిన్ సంగతి."

"క్లియోపాత్ర ప్రేమించలేదా? సీజర్ని, అంటోనీని" అన్నాడు గోపాలం.

"సీజర్ మరణించాక. బ్రతికుండగానే అలాంటిది చూశారా?"

"ఏమండీ గోపాలంగారూ ! మీ భారతంలో ద్రౌపది ఐదుగురిని చేసుకుని ప్రేమించలేదా," మరియమ్మ జవాబిచ్చింది. వాళ్ళ భావం మాచాయగా అర్థం చేసుకున్న సుచరిత అసహ్యంగా వాళ్ళ వంక చూచింది. పెద్ద విట్టు లాగ అందరూ నవ్వారు. ఫోర్త్ పీరియడ్‌లో సడన్‌గా ఇనస్పెక్టరొచ్చాడు. అందరూ హడావుడిగా ఉన్నారు. మూలగదిలో నైన్త్ స్టూడెంట్సు గోలగా అరుస్తుంటే నవల చదువుతూ కూర్చుంది ఎవిలీన్.

"ఇది యే క్లాసు?" గంభీరమైన కంఠము విని గాభరాగా లేచింది. పిల్లల గోల తగ్గింది. గుడ్లప్పగించి జూస్తున్నారు.

"ఇప్పుడేముంది మీకు?"

"జాగ్రఫీ" అస్పష్టంగా గొణిగింది ఎవిలీన్.

"అయితే మీరు నవల పఠనములో మునిగియున్నా రేమిటి?"

"నాకు... నాకు జాగ్రఫీ రాదు-బలవంతంగా వేశారు."

"డోంట్ ట్రై టు ప్రిటెండ్, పిల్లలచేత చదివిస్తూ క్లాసును ఎంగేజి చెయ్యలేరా?" తలవంచుకుంది ఎవిలీన్.

"వాట్ ఈజ్ యువర్ ఆన్సర్ హెడ్‌మాష్టరుగారూ? టేక్ హర్ ఎక్స్ప్లనేషన్". వేరే క్లాసుకు వెళ్ళాడు.

ఇనస్పెక్టర్ రిపోర్టును చూచి మండిపోయింది లలిత. సుచరిత, వెంకటేశం, శర్మ మొదలగువారి టీచింగ్ చాలా బావుందని. మిగతావాళ్ళ టీచింగ్ సరిగ్గా లేదు. ఇంప్రూవ్ చేయాలనీ రిపోర్టులో ఉంది.

"హోహోయ్ ! వెధవ రిమార్కుల నెవడు లెక్క జేస్తాడు" అంది మరియమ్మ.

"ఏమిటి లలితా వేడిగా వున్నారు?" అప్పుడే వచ్చిన సుచరి[…] ప్రశ్నించింది.

"వేడిగానే ఉంటుంది మరి-చల్లగా పనులు చేయటం మాకు చేతగా[…] సుచరితా!" దీర్ఘం తీసింది.

"పోజులు పెట్టి పేర్లు సంపాదించటం కాకపోతే ఏమిటిది? అయి[…] మనం పోజు పెట్టినా పిల్లల తల్లులం. ఆయన కంటి కెలా ఆనుతా[…] ఎవిలీన్ హేళనగా అరిచింది, ఆ అవమానంతో సుచరిత ముఖం కందగడ్డ[…] తయారయింది. "ఛీ? ఛీ ! ఏమిటిది? ఇలాంటి ఊహలు మదిలోకి రాని[…] మన పదవికే అవమానం! ఉపాధ్యాయులంటే. ఒక విధంగా సంఘనిర్మాతలు[…] ఆ సంగతి మరిచిపోయి చాలా అసహ్యంగా మాట్లాడుతున్నావు. మన లాం[…] వాళ్ళుంటే టీచర్లు అధికార్లకు చులకన కారూ?" అసహ్యంతో ముఖ[…] తిప్పుకొంది.

"రోషానికేం తక్కువ లేదు" లలిత సాగదీసింది.

"అయినా అంత నీచంగా మాట్లాడడం భావ్యంగా లేదు. అహ[…] అందరికీ వర్తిస్తుంది. మన డిగ్రీలు యెందుకు తగలెయ్యనా ! మనము క[…] కొద్దీ యెంతొస్తే అంత మాట అనకూడదు" మరియమ్మ కలుగజేసుకుం[…]

"నీకూ నీతులు ఒంటబట్టాయా మరియమ్మా?" లలిత కొరకొ[…] చూచింది. దీనికి తోడన్నట్టు సుచరిత యెనిమిదో తరగతి యింగ్లీషు బో[…] చేసిందని వీళ్ళముందే హెడ్‌మాష్టరు సుచరితను మెచ్చుకున్నాడు. ఇంగ్లీ[…] డిబేట్‌లో ఎలెవెన్త్‌తో పోటీచేసే క్లాసు ఒక యెనిమిదో తరగతే. ఆ రో[…] నాగరాజు చక్కగా మాట్లాడాడు. అందరూ అభినందించారు.

"టీచర్ ! ఈ గౌరవం మీదేనండి" ఉత్సాహంగా వచ్చాడు నాగరా[…] మిగతాపిల్లలు సుచరితను చుట్టుముట్టారు.

"ఇంకా అభివృద్ధి చెయ్యాలి. రాష్ట్రానికంతటికీ జరిగే పోటీల[…] పాల్గొనాలి. వ్యాసరచన పోటీకి పేర్లిచ్చారా?"

"యిచ్చారు టీచర్. అమ్మాయిలే ఎక్కువగా యిచ్చారు" సుచ[…] నవ్వింది. "అన్ని రంగాలలోకూడా అమ్మాయిలదే నన్నమాట పైచేయి."



"ఏం కాదండీ" అరిచాడు వాసు. "వాళ్ళకు ఒక్క ఆట రాదు. గేమ్స్‌లో ప్రైజులు అన్నీ మావేగా?" భుజాలెగరేశాడు.

"పెద్ద ! ఉమకు త్రోబాల్ ఆడితే రాలేదేమిటి ఫస్ట్‌ప్రైజు?" ఒకమ్మాయి ఆ అబ్బాయిని ఉరిమి చూచింది.

"అవును ఉమేది? చిల్డ్రన్‌డే నాడు డాన్సు చేస్తుందేమో అడగాలి" అంటుండగానే ఉమ వచ్చింది.

"ఉమా ! టీచర్ చెప్పింది విన్నావా?"

"విన్నాను, చేస్తాను టీచర్ ! అలాగే నా దగ్గరొక పాటుందండీ ! పాడుతుందేమో సుశీలను అడగండి."

"ఏం పాట? అలా - చెట్టుక్రింద కూర్చుందాము పద, అందరూ తరుచ్ఛాయలో విశ్రమించారు. సుశీల కూడా వచ్చింది. అలా పిల్లలతో కలిసి వుండటం యితరులకు గిట్టదు.

"ఏది సుశీలా! పాట పాడమ్మా!" సుశీల పాటున్న కాగితం అందుకొన్నది. నెమ్మదిగా పాటంతా చదివింది.

"ఏ స్టైయిల్లో పాడాలి టీచర్?"

"అదేదో నువ్వే చూడు - నాకు రాగాలు తెలియవు" సుశీల నెమ్మదిగా పాడింది.

నెహ్రూ చరితము విన్నారా? ఆ-ఆ-ఆ
గుండియల భక్తి సుధా ధారలు జాలువారా ॥నెహ్రూ॥
కాశ్మీరు పట్టణాన కలవారి ఇంటిలోనా
కమలకు పతియై వెలసెను నెహ్రూ ॥నెహ్రూ॥
విదేశముల కేగి విద్యలెన్నో నేర్చి-
స్వదేశ రాజకీయములు రమ్యముగా తీర్చి ॥నెహ్రూ॥
భారతావని లోను-ప్రజారాజ్యంలోను-
మకుటములేని మహీపతియై వెలసెను నెహ్రూ ॥నెహ్రూ॥
ప్రపంచములో నింపె శాంతి సందేశం
పాప మదిలో రేపెను ప్రేమావేశం ॥నెహ్రూ॥

ఇరవైఏడు మే అరవైనాలుగు సంవత్సరాన
ఇలను ముంచె శోకాన అయ్యో-నెహ్రూ ॥నెహ్రూ
అందరూ మంత్ర ముగ్ధులవలె కూర్చున్నారు.

"చాలా బాగా పాడావు సుశీలా?" సుచరిత అంది.

"థాంక్స్ టీచర్."

"ఎవరు రాశారు ఉమా?"

"నేనేనండి" ఉమ సిగ్గుపడుతూ చెప్పింది.

"అయితే తమరు రచనలుకూడా చేస్తారన్నమాట."

"అవునండీ, భలే కథలు రాస్తుంది" సుశీల చెప్పింది.

"అదంతా నమ్మకండి టీచర్ !"

"నమ్మితే యేం? కథలు వ్రాయటం మంచిదమ్మా - వెళదాం

"హేమకు పెళ్ళట టీచర్ ! హాలిడేస్ గురించి నోటీస్ రాలేదేమం

సుశీల మాట పూర్తికాకమునుపే రంగయ్య నోటీసు తెచ్చాడు దసరా సెల గురించి. చదివి పిల్లలకు చెప్పి లేచింది సుచరిత.

"సుశీలా !" మరియమ్మ పిలిచింది. అందరూ అటుకేసి వెళ్ళ మరియమ్మ కోపంగా చూసింది. "మీకు హిస్టరీ ఎక్స్ట్రా పీరియ యిద్దామనుకుంటే ఎక్కడికెళ్ళారు?"

"సుచరిత టీచర్ పాడమంటే-పాడి చూపించామండి"

"సుచరితా ! సుచరితా ! మొగపిల్లలకే ఉందనుకున్నా ఆ పిచ్చి. హ కూడా వుందా?" అన్నది.

"..............."

"గ్లామరస్ టీచరుగా? అయినా అమ్మంటే ఎవరికిష్టం ఉండదు

"అందరికీ ఉంటుందండీ."

"అయితే ఇరవై నాలుగుంటలూ అన్నీ వదలి అమ్మ దగ్గర గడ గదా?"

"ఇరవై నాలుగు గంట లెప్పుడండి? ఇప్పుడే కదా? క్లాస్ట రాలేదని."



"రాకుంటే? ఇంతమంది టీచర్లుండగా ఆమె దగ్గరికే వెళ్ళాలా? కాస్త టైము దొరికితే చాలు - నేను చూడటం లేదేమిటి?"

ఉమ ఉపాయస్తురాలు- "వెంకటేశంగారు ఈ పీరియడులోరమ్మన్నారు సుశీ!" అందరూ మరియమ్మను తప్పించుకొని బయటపడ్డారు. సుచరితతో మిగతా టీచర్లను పోల్చుకున్నారు.

"చల్లని చందమామలా నవ్వుతుంది - తియ్యగా మాట్లాడుతుంది. ఉత్సాహంగా ప్రోత్సాహమిస్తుంది-" అనుకున్నారు.

* * *

ఇంట్లో కాలుబెట్టిన సుచరిత ఆశ్చర్యపోయింది. ఇంట్లో నుండి ఏడుపులూ, తిట్లూ వినిపిస్తున్నాయి. చూస్తే ఒక నడివయస్కురాలు కూర్చుని రాగాలు తీస్తోంది. పోలికలను బట్టి రమాదేవి తల్లి అని గ్రహించింది.

"ఇంత అన్యాయమా? నా బిడ్డకు రోగమొస్తే నాకు తెలియనియ్యరా? ఒక్క ఉత్తరం ముక్క రాస్తే ఈయన సొమ్మేం పోయిందో? దాన్ని యిలా నిర్లక్ష్యం చేసే రోగాలపాలు జేశాడు. వద్దే మనకీ ఉద్యోగాలు అంటే అది వింటుందా? పిల్లలు ఎంత చిక్కిపోయారో! దాన్ని ఆ గడ్డకు వదలి నిశ్చింతగా ఉన్నాడా?-" మధ్యమధ్య చీదేస్తోంది. ఉమ వెళ్ళింది అమ్మ దగ్గరకు. సుమ మాత్రం గోపమ్మ నంటిపెట్టుకొని కూర్చుంది. ఆవిడ ధోరణి అలా సాగుతూనే వుంది. "పరాయి పంచలో బిడ్డల నుంచుతాడా?-" గోపమ్మ స్వాంతన వచనాలు ఆమె తల కెక్కటం లేదు. ఆమె స్వభావం ఊహించగలిగింది. అందుకే రమాదేవి అంత దూరంగా ఉండేదేమో !"

సాయంత్రం ఉస్సురంటూ కాళ్ళీడ్చుకుంటూ వచ్చాడు మూర్తి. సుమ పరుగెత్తి తండ్రిని వాటేసుకుంది. శ్రమంతా మరిచి కూతుర్ని ఎత్తుకుని ముద్దు పెట్టుకొన్నాడు.

"నేను చచ్చిపోయాననుకున్నావా నాయనా ! నువ్వూ, పిల్లలూ పరుల పంచలు చేరుతారా? అయ్యో! నీ కెంత గతి పట్టిందే-"

"ఇప్పుడేమొచ్చిందండీ! ఇలా గోలపెట్టి దాన్ని అదరగొడతారనే మీకు

చెప్పలేదు. అనవసరంగా గొడవ చేసి పిల్లలను నొప్పించకండి. వాళ్ళ బెదిరిపోతారు-దిగమ్మా సుమా!" పాపను దించి బాత్‌రూమ్ వైపు వెళ్ళాడు.

*　　*　　*

అనంతగిరి వెళ్ళి కూతుర్ని చూచి వచ్చింది సుభద్రమ్మ

"అక్క బావుందా పెద్దమ్మా?" సుచరిత అత్రుతగా అడిగింది.

"బాగానే ఉందమ్మా. పిల్లల దగ్గరుంటానే అంటే ఆయన చూచు కుంటారులే అమ్మా. ఒదిన ఒక్కర్తీ. నువ్వు ఊరెళ్ళమంటుం దేమిటి? పిచ్చి దాని మనసు రాయి. ఐనా నేనుండగలనా?"

అల్లుని సాధించని క్షణం వుండదు. అందుకే వద్దన్నది కాబోలు అనుకుంది సుచరిత. ఆమె వుండి పోయింది పిల్లలకొరకు.

ఆవిడతో లాంఛనప్రాయంగా తప్పితే ఎక్కువగా మాట్లాడేది కాదు సెలవులు ఉమ, సుమలతో ప్రొద్దు పుచ్చుతుంది. రఘు రావటం లేదు. రఘుని చూడాలని మనసు తహతహలాడుతోంది. ఫ్రెండ్‌ను చూడటానికి వెళ్ళి రఘుని చూద్దామనుకుంది. కాని రమాదేవితప్ప తనకు ఇంక స్నేహితులు లేరని గోపమ్మకు తెలుసు. నిజం తల్లికి చెపితే ఏమనుకుంటుందో !

"అమ్మా, సుచీ! వెళ్ళి రెండుచీరలు తెచ్చుకోరాదూ? అలాగే రెండు దుప్పట్లు తేవాలి ......వెళతావా? యింకొకసారైతే షాపింగ్ మిషతో రఘుని చూడొచ్చు. ఆయనొక వేళ హాస్పిటల్‌కు పోతే ఒంటి గంటకు భోజనానికి వస్తారు అనుకుంది. ఉమ వస్తానని వెంటపడింది. సుచరిత గుండెల్లో రాయి పడింది. ఆ పిల్ల యెక్కడికి వెళ్ళి వచ్చారో తుచ తప్పకుండా చెపుతుంది. ఏది దారి? అనుకుంది. ఆపద్బాంధవిలా సుభద్రమ్మ అడ్డుపడింది. "నీ వెక్కడికి ఆ చిన్నముండ గోల పెడుతుంది" అని లాక్కుపోయింది.

రఘు ఇంటి ఆవరణలో అడుగుబెట్టిన సుచరిత కళ్ళు తృప్తిగా మెరిశాయి. కారు గారేజ్‌లో వుంది. లోపలికి వెళ్ళింది. హాల్లో కుర్చీలు దులుపుతూ నాయర్ కనిపించాడు.

"డాక్టరుగారు ఉన్నారా?"



"ఉన్నారమ్మా! కాలు బెణికింది. రెండురోజుల నుండి ఎక్కడికీ వెళ్ళటం లేదు. ఇప్పుడే పడుకున్నారు" అన్నాడు. అతని మాటలు వింటూనే రఘు గదిలోకి వెళ్ళింది. ముఖంపై అదే గంభీరమైన చిరునవ్వు. అందరినీ ఆకట్టుకునే చిరునవ్వు. కొంచెము నీరసంగా కనిపించాడు. అలికిడికి కళ్ళు విప్పాడు, ఈ రెండుదినాల వంటరితనములో ప్రతిక్షణం సుచరితే గుర్తొచ్చేది. కారు పంపి రప్పించుకోవాలనుకున్నాడు. గోపమ్మ అన్యథా భావిస్తుందని ఊరు కున్నాడు. తెల్లని దుస్తుల్లో, ఒదులుగా వేసుకున్న ముడి అచ్చు మునికన్యలా కనిపించింది. పడుకునే చేతులు చాపాడు. సుచరిత అతని కళ్ళల్లోకి చూచింది. మరుక్షణంలో అతనివక్షంపై వ్రాలిపోయింది. పోతే దొరకదేమో అన్నంత గట్టిగా గుండెలకు హత్తుకున్నాడు. రెండునిమిషాలు అతని గుండెలపై ఎనలేని మధురానుభూతి అనుభవించింది. మరుక్షణమే లేవబోయింది.

"సుచీ ! లేవకు-నాకీ ఆనందాన్ని శాశ్వతం చెయ్యి-మాట్లాడవేం? చెప్పు సుచీ ! రెండురోజుల నుండి ఒంటరిగా నరకయాతన అనుభవించాను." అమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. సుచరిత పచ్చని బుగ్గలు కంది పోయాయి.

"ఒదులు రఘూ! ప్లీజ్-యెవరన్నా వస్తే?-" భీత హరిణేక్షణ బిక్కున చూచింది. రఘు కరిగిపోయాడు. బాహువులు సడలించాడు. సుచరిత లేచి కుర్చీలో కూర్చోబోయింది? రఘు చెయ్యి బట్టి తన మంచమ్మీదే కూర్చో బెట్టుకున్నాడు. సుచరిత అతని కాలును పరీక్షగా చూస్తూ "కాలు బెణికిందట కదా?" అన్నది.

"అవును, నిన్న పూర్తిగా లేవలేదు. ఈరోజు నయం. బాత్‌రూమ్‌కు, హాల్లోకి వచ్చాను."

"నేనంత పరాయిదాన్ని కాబోలు! చెప్పలేదే?"

"నిన్ను ఒంటరిగా చూచి నిగ్రహించుకునే శక్తి నాకు లేదు...". బల్ల మీద పేన్‌బామ్ కనిపించింది. అతనికేం జవాబు చెప్పకుండా పేన్‌బామ్ తీసి కాలుకు రాసింది. ఆమె కాలు తొడమీద పెట్టుకుని రాస్తుంటే ఏదో లోకాలకు తేలిపోయాడు. రఘు మత్తుగా కళ్ళు మూసుకున్నాడు. సుచరితకూడా ఏదో

తెలియని హాయిని అనుభవించింది. ఏది ఏమయినా ఈ స్వర్గసుఖాన్ని పో పెట్టకూడదనుకుంది. అతని కాలు తీసి దిండుపైన పెట్టింది.

"నిద్రపోతున్నారా?"

"ఉహూం!" అన్నాడు.

"ప్రొద్దుటేమయినా తీసుకున్నారా?"

"బ్రెడ్, పాలు తీసుకున్నాను" వంటింట్లోకి వెళ్ళి నాయర్ సహాయం ప్రెషర్ కుక్కర్లో పావుగంటలో వంట పూర్తి చేసింది. చేతులు తుడుచుకుం గదిలోకి వచ్చింది. "హాల్లోకి వస్తారా. భోజనం ఇక్కడికే తేనా?" భుజాలు ప కుదిపింది.

"ఇక్కడికే తీసుకు రమ్మను" తనే అన్నీ వడ్డించి తెచ్చింది.

"లేవండి" అతని చేతులతడి టవల్‌తో తుడుచుకున్నాడు. స్టూ దగ్గరగా జరిపి దానిపై ప్లేటు పెట్టింది. కొసరి కొసరి తినిపించింది.

"సుచీ! రోజూ నా కాలు యిలాగేవుంటే బాగుండును."

"అవును పాపం! రోగులంతా సరాసరి యిక్కడికే తరలివస్తారు"

"వస్తే రానీ...నువ్వూ భోజనం చెయ్యి."

"చేసే వచ్చాను".

"ఈరోజు కడుపునిండా తిన్నాను" అన్నాడు దిండుకు చేరబడు

"అయితే నిద్రపోండి. అరుగుతుంది. నేను వెళ్ళాలి."

"ఏమిటో అంత తొందర.?"

"అమ్మ బట్టలు కొనమంటే వచ్చాను. ఎదురు చూస్తూంటుంది

"ఫరవాలేదు. నిన్ను సాయంత్రము వరకు వదలను."

"నేను వెళ్ళిపోతే కుంటికాలుతో గెంతుతూ వస్తారా?"

"ఓ! దేవకన్య అమృతహస్తము పడగానే బెణుకు పోయింది."

"డాక్టర్లు దేవకన్యలున్నారని నమ్ముతారా?" కళ్ళు తిప్పుతూ అడిగి

"స్వయంగా తనే వచ్చి నేనయ్యాబాబూ దేవకాంతను అని చె నమ్మకుండా యెలా ఉండగలను?"

"మాటలు నేర్చారు?"



"పాపం, మాటలు రాందే పాఠాలు ఎలా చెప్తావు."

"ఇలా అతని ముక్కుపట్టి వూపి జుట్టంతా రేపింది. నాలుగు గంటల వరకూ ఇద్దరూ నాలుగు నిమిషాల్లా కబుర్లతో గడిపారు. కాలు బాగానే వుంది. కారు తెస్తానన్నాడు రఘు. సుచరిత వారించి రిక్షాలో యింటికి వచ్చింది. ఆమెకు తెలియకుండానే గుండెలు గుబగుబలాడాయి. గోపమ్మయితే ఫరవాలేదు, సుభద్రమ్మ యెన్నో ఆరాలు తీస్తుంది అనుకుంటూ యింటి ముందుకొచ్చింది. ప్రక్కవాటా పిల్లవాడు తాళం చెవులిచ్చి చెప్పాడు. "అక్కా! అమ్మగారూ, ఉమ, అమ్మమ్మ శంకరమఠం చూడ్డానికి వెళ్ళారు. తాళాలు మీకిమ్మన్నారు."

"యెప్పుడు వెళ్ళారు?"

"పదకొండు గంటలకు" వాడు ఆటలకు పారిపోయాడు.

"హమ్మయ్య" అనుకుంది సుచరిత. తాళం తీసి ఆలోచిస్తూ పడుకుంది. రఘు యింట్లో టిఫిన్, కాఫీ తీసుకుని వచ్చింది. మాటిమాటికీ అనురాగం కురిసే రఘు కళ్ళే గుర్తొస్తున్నాయి. తను అతనికంత దగ్గరగా వెళుతుందేమిటి? అతనిని తృప్తి పరచాలని తను అలా ప్రవర్తించింది."

"అమ్మా! చాలాసేపైందా తల్లీ వచ్చి" గోపమ్మ సుమ నెత్తుకొని వచ్చింది. సుభద్రమ్మ ఉమను చేతబట్టుకొని వచ్చింది.

"హమ్మయ్య! చలికాలమైనా ఎండ విపరీతంగా ఉన్నది" అంటూ కూలబడింది సుభద్రమ్మ. సుచరిత ఇద్దరికీ కాఫీ పెట్టింది.

"చీరలేవి సుచమ్మా."

"తేలేదమ్మా దీపావళికి మంచి స్టాకు వస్తుందట. తెచ్చుకుందామని ఊరుకున్నాను" అక్కడితో ఆ ప్రసంగం ఆగిపోయింది. రెండవరోజు సాయంత్రం రఘు వచ్చాడు. ఆందోళనగావున్న సుచరిత మనసు ప్రశాంతంగా మారింది. మూర్తి కూడా వచ్చాడు.

"హల్లో! రఘూ! - బావున్నావా!"

"నమస్కారమండీ, వదినగారు ఉత్తరాలు రాస్తున్నారా?

"రాస్తుంది. వెయిట్ పెరిగిందట. మిమ్మల్నందరినీ అడిగానని చెప్పింది."

"చాలా సంతోషం" గోపమ్మ వచ్చి రఘును పలకరించి కూర్చుంది
"దీపావళి వస్తుంది కదయ్యా, ఊరెళుతున్నావా?"

"లేదమ్మా, అమ్మే చిన్నన్నయ్య వాళ్ళ ఊరు వెళుతుందట- మీరు
ఇక్కడే ఉంటారా? కాంతారావు దగ్గరకు వెళతారా?"

"సుచమ్మ సెలవులు అయిపోవచ్చాయి. వాళ్ళు రాయంది యెల
వెళ్ళేది బాబూ!"

"పోనీ, పండుగకు సరదాగా గడుపుదాము వాళ్ళనే రమ్మని రాయకపోయారా." అన్నాడు రఘు. అతని ఉద్దేశం వేరు, అందరూ ఉన్నప్పుడు సుచరిత పునర్వివాహం గురించి ప్రస్తావించవచ్చు. ఎంతయినా సుచరిత పెద్దం చాటు నున్న యువతి గదా !

"అవును నాయనా! నాకూ పిల్లలను చూడాలనే ఉంది. రాయిస్తాను."
సుచరిత, మూర్తి, రఘు చాలాసేపు మాట్లాడుకున్నారు. రఘు యేదో గో గురించి చెప్తే అందరూ గొల్లున నవ్వారు. గోపమ్మ వంటింట్లో నుండి విన్నది కాసేపు తన కూతురు నవ్వుతుందంటే అదే చాలు అనుకుంది.

సుభద్రమ్మ చిరబురలాడింది. రఘు వెళతానని లేచాడు.

"భోజనం చేసి వెళుదురుగాని-"

"వద్దు సుచీ-సుచరితా! మళ్ళీ వస్తాను."

"మళ్ళీ వచ్చినప్పుడు మళ్ళీ తిందురుగాని... రండి". సుచరిత, రఘు కూర్చుంటే గోపమ్మ వడ్డించింది.

"పండుగ రెండు రోజులు ఇక్కడికే వచ్చేయి నాయనా!"

"నా ఫీజు అంతా చెల్లించుకుంటారు కాబోలు!"

"అదేం నాయనా! పరాయి వాళ్ళమా, ఒక్క ఊరివాళ్ళము."

"పోనీలే అమ్మా ! అలాగే అనుకోండి డాక్టరుగారూ !"

"అంతటితో అయిపోయిందా! రేపు మీ అన్నలు రానీ- బిల్ చేసి పంపుతాను" భావయుక్తంగా నవ్వాడు రఘు.

రఘు వెళ్ళిపోగానే సుభద్రమ్మ దూసుకొచ్చింది.

"యెవరమ్మా అతను?"



"మాకు తెల్సిన డాక్టరుగారు పిన్నీ ! రమక్క విషయంలో కూడా చాలా శ్రద్ధ తీసుకున్నారు."

"ఓహో! భోజనంచేస్తే మీ బంధువులనుకున్నాను."

"మా ఊరే వారిది. అమ్మకు జబ్బు చేస్తే రాత్రి, పగలనక వచ్చేవారు" రఘు మంచితనం గురించి చెప్పాలని. సుచరిత అన్నమాటలను సుభద్రమ్మ చెడుగా తీసుకుంది.

"అవునులే అమ్మా- మంచిగా మాట్లాడటానికి నువ్వున్నావు" అని లేచిపోయింది. సుచరిత మనసు చివుక్కుమంది. రాత్రి కూర్చుని సుచరిత అన్నలిద్దరికి ఉత్తరాలు రాసింది. దీపావళికి తప్పక రమ్మని అమ్మ మాటగా రాసింది.

దీపావళి రేపనగా చలపతి భార్యబిడ్డలతో దిగాడు. కాంతారావు రావటం పడదని ఉత్తరం రాశాడు. సుచరిత ఆనందంగా అన్న బిడ్డలను దగ్గరకు తీసుకుంది. గోపమ్మ వంట చేసి అందరికీ వడ్డించింది. అందరూ అలా కూర్చుంటే ఆమె హృదయం ఉప్పొంగిపోయింది.

"సుచమ్మా! నువ్వూ, మీ అన్నయ్యా, ఒదిన వెళ్ళి బట్టలు తెచ్చుకోండి. పిల్లలకుకూడా తీసుకురా" అన్నది.

"అలాగే అమ్మా!" భోజనానంతరము పిల్లలను గోపమ్మ దగ్గర విడిచి ముగ్గురూ షాపింగ్‌కు బయలు దేరారు సుల్తానుబజారు. మాట్లాడుకుంటుండగా రఘు కారు వచ్చింది. "ఎక్కడికో బయలు దేరేరు?... ఏరా నేను గుర్తున్నానా?" కారు దిగి చలపతి చెయ్యి పట్టుకున్నాడు.

"మరిచిపోయానురా..."

"పెద్దవాడివైనా నీ గుణం పోనిచ్చుకున్నావు కాదు. ఇంతకీ యెంతదాకా ప్రయాణం?"

"సుచరితకే తెలుసు. పర్సు, ఖర్చు రెండూ తనవే" అన్నాడు చలపతి.

"సుల్తాన్ బజారుకండి!"

"అయితే యెక్కండి." అందరూ కార్లో కూర్చున్నారు.

సుచరిత అన్నకి, వదినకు, పిల్లలకు బట్టలు తీసింది.

అప్పటికే డబ్బు అయిపోయింది.

"సుచరితా! ఆ బ్లూ వెంకటగిరి చీర తీసుకో!" సలహా యిచ్చా రఘు. సుచరిత విననట్టు ఊరుకుంది. రఘు రెట్టించాడు.

"నా కెందుకు! అయినా ఇప్పుడొద్దు. పదండి అన్నది. చలపతి చెల్లె కొంటాడు అనుకున్న రఘుకు ఆశాభంగమే అయింది.

చలపతే ముందు వచ్చి కార్లో కూర్చున్నాడు. రఘు ముఖం గంభీరంగా మారిపోయింది. పళ్ళు, పిల్లలకు రిబ్బన్లు అవి కొని యింటికొచ్చేసరికి నాలు అయింది.

"నీకేం తెచ్చుకోలేదా తల్లీ?" గోపమ్మ బట్టలను చూచి అడిగింది.

"నా కెందుకమ్మా క్రొత్తబట్టలు?" నీరసంగా నవ్వింది సుచరిత.

గోపమ్మ బాధను దిగమింగింది.

"చలపతికి ఆ మాత్రం జ్ఞానం లేదా? చిన్నదానివి, ఒక్క తోబుట్టు ఒక్క చీర కొనియ్యాలని తెలియదా."

"ఊరుకో అమ్మా! అన్నయ్య ముందనేవు ఆ మాట. వాడు వస్తున్నా వింటే బాధపడతాడు."

"అయినా అమ్మాయికి కట్టే యోగము లేదు కదా! యెందుకు బాధ అన్నది సుభద్రమ్మ. సుచరిత మాట మరిపించింది.

"ఏమన్నయ్యా! కారు విడిచి రాబుద్ధి కావటం లేదా?"

"పిల్లలు వదలటం లేదు. రా రఘూ! కాఫీ తీసుకు వెళ్ళు".

రఘు యెందుకంత ముడుచుకుపోయి ఉన్నాడో సుచరితకు అర్థ కాలేదు. మౌనంగా కాఫీత్రాగి వెళ్ళిపోయాడు.

దీపావళిరోజు తలంట్లు అయ్యాక పిండివంటలతో భోజనా ముగిశాయి. మూర్తి, పిల్లలు, సుభద్రమ్మా ఇక్కడే భోజనాలు చేశారు. మొగా ముగ్గురూ పేకాటలో పడిపోయారు.

సుచరిత బుట్టెడు చామంతులు ముందు పోసుకొని పిల్లలంద జడలేసింది. మూర్తి ఉమకు, సుమకు క్రొత్త గౌనులు తెచ్చాడు. పిల్లలంద బట్టలు వేసింది. చలపతి భార్యకు ఏమీ పట్టవు. యెవర్నీ ఏమీ అన చంటిపిల్లను ప్రక్కలో వేసుకుని పడుకుంది.



కొత్తదుస్తులు ధరించి, అటూ ఇటూ తిరుగుతున్న పిల్లలను చూస్తే సుచరితకు ముచ్చట వేసింది.

"అన్నయ్యా! ఆట చాలు గాని టీకి రండి" సుచరిత పిలుపు విని ముగ్గురూ మధ్య హాల్లోకి వచ్చారు. కారం బూంది, మైసూర్ పాక్ ప్లేట్లున్నాయి.

"ఇవన్నీ తినడానికే! భోజనం చేశాక ఏం పని చేశామని? టీ చాలు" అన్నాడు మూర్తి. ప్లేటు దూరంగా నెడుతూ.

"అరక్కపోతే ప్రక్కన వున్నారుగా డాక్టరుగారు. ఆయన మందిస్తారు." అన్నది రఘును చూపుతూ.

"ఆ! ఆ! వాళ్ళకు మందిచ్చే సంగతి దేవుడెరుగు, నేనే పేషెంటును అయేట్టున్నాను" అన్నాడు రఘు టీకప్పు అందుకుంటూ.

"ఒరేయ్ రఘూ! ఈరోజు సినిమా కెళదామురా."

"అలాగే, మీరు కూడా మూర్తిగారూ-"

"క్షమించండి. ఒక ఫ్రెండు యింటికి వస్తానని మాటిచ్చాను" మూర్తి జవాబిచ్చాడు. అంతలో నాయర్ సైకిల్ తీసుకొని వచ్చాడు. పెద్దడాక్టరు రఘును అర్జంటుగా రమ్మని ఫోన్ చేశారట.

"డాక్టర్ల జీవితం అంటే ఎంతో అందంగా ఊహించుకున్నాను. పండగా, పబ్బమూ లేదా రఘూ!" నిరుత్సాహంగా గొణిగాడు చలపతి.

"ఒరేయ్! పండగ కాబట్టే వాళ్ళు పిలుస్తున్నారు. లేకుంటే నేనే వెళ్ళేవాడిని. అయినా కర్తవ్యనిర్వహణలో వుండే ఆనందం నీకేం తెలుసురా!"

"మరి మన ప్రోగ్రాము?"

"మీరు సిద్ధంగా ఉండండి. విషయమేమిటో కనుక్కొని వస్తాను" వెళ్ళిపోయాడు రఘు. మూర్తి వెళ్ళి దుస్తులు వేసుకొచ్చాడు- "నేను స్నేహితునింటి కెళుతున్నాను. చాలా రాత్రి అవుతుంది" అని చెప్పి అతను వెళ్ళిపోయాడు.

"ఏమమ్మా సుచరితా! ఈ ఊళ్ళో దీపాలంకరణ బావుంటుంది కదా?" సుభద్రమ్మ అన్నది.

"అవును పెద్దమ్మా !"

"చూడాలి. మీ అమ్మ వస్తే అందరమూ వెళదాము."

"అందరమూ వెళితే ఇల్లు?"

"మీ అబ్బాయి ఉండడా?"

"వాడు సినిమా కెళతానన్నాడు."

"మీరు, అమ్మ, ఉమను, అన్నయ్య కొడుకును తీసుకొని వెళ్లం అన్నయ్య సినిమాకెళితే మేము ఇంట్లో వుండి దీపాలు అవీ పెడ్తాము" అన్న సుచరిత. గోపమ్మ, సుభద్రమ్మ పిల్లలను తీసుకొని వెళ్ళారు. సాయంత్ర ఆరు కావస్తున్నా రఘు జాడలేదు. చలపతి విసుక్కున్నాడు. "అనుకోక అను ఈ రోజు సినిమా కెళదామనుకుంటే వీడు యెగనామం పెట్టాడు... యెప్పుడ అదీ, నేనూ కలిసి వెళ్ళడం పడనే పడదు" చలపతి చిన్నపిల్లాడిలా నీరుగా పోయాడు.

"నువ్వూ, వదినా వెళ్ళండన్నయ్యా! రఘు వస్తే పంపిస్తాను" అన్న పిల్లల నొదిలి భార్యను వెంటబెట్టుకొని వెళ్ళిపోయాడు చలపతి.

చలపతి పిల్లలను, సుమను ఆడిస్తూ కూర్చుంది సుచరిత. ఇంటివెం ఆరుబయటా దీపాలు పెట్టింది. చలపతి కూతురు, సుమ కలిసి పక్కిం పిల్లల సహాయంతో టపాకాయలు కాలుస్తున్నారు. యింకో అమ్మా నిద్రబోయింది. చంటి వాడిని భుజంమీద వేసుకుని వేడుక చూస్తూ నిల్చు సుచరిత. ఏడుగంటల ప్రాంతములో రఘు వచ్చాడు. అలసిపోయాడని అత ముఖమే చెప్తోంది.

"సారీ సుచరితా! టైముకు రాలేకపోయాను. వీడేడి?" కుర్చీ లాక్కు కూర్చున్నాడు.

"అన్నయ్య వదినను తీసుకొని సినిమాకు వెళ్ళాడు. మీరు వెళ్ల పనేమిటి?"

"ఓ ఫ్లూరసీ పేషెంటున్నాడు. తిరగొద్దయ్యా బాబూ అంటే విన నాలుగు గంటలకు దమ్ము మొదలయింది." పాప మంచముపైనే బాబు పడుకోబెట్టి లోపలికి వెళ్ళింది. ఐదు నిమిషాలలో పొగలు క్రక్కే కాఫీ కప్పు వచ్చింది. కాఫీ అందుకుంటూ "మనసులోని కోర్కెను యెలా కనిపెట్టా సుచరితా?" అన్నాడు ఆదరంగా చూస్తూ.



"మనసులో దూరి. గొప్ప ధర్మసందేహమే! అలసి వచ్చారు ఆ మాత్రం తెలియకుంటే యెలా!"

"మనసులో దూరటం దేనికి? అక్కడా నీవే ఉన్నావుగా. యిలా రా..." సుచరిత వచ్చింది.

తను తెచ్చిన ప్యాకెట్టు ఆమె చేతితో వుంచాడు. పాకెట్టు అందుకుని విప్పింది! లేత నీలం వెంకటగిరి చీర!

ముందురోజు తనకు కొనమని చెప్పాడు రఘు. విస్మయంగా చూచింది.

"నా కెందుకూ?"

"మరి నాకా? ప్లీజ్! ఆ చీరలో నువ్వు ఎలా వుంటావో చూడాలని వుంది. కట్టుకు రావా?"

"పండుగనాడు నేను కొత్తచీర కట్టుకుంటానా?"

"ఏం కట్టుకుంటే! అసలు నేను అంటే నిర్లక్ష్యములే" నిష్ఠూరమాడితే కట్టుకుంటుందని అనుకున్నాడు.

"మీకెలా చెప్పాలో తెలియటం లేదు" అంటూ లోపలికి వెళ్ళి పోయింది. అయిదు నిమిషాలు చూచి రఘు కూడా వెళ్ళాడు. పెరట్లో స్థంభానికి ఆనుకుని నిలబడింది. ఏడుస్తున్నట్టు గుర్తించాడు రఘు.

"ఏడుస్తున్నావా? ఛీ!--- నీ మనసు నొప్పిస్తే క్షమించు, కొట్లో అందంగా కన్పించిందా చీర. అందమైన నీకు యింకా అందంగా ఉంటుందని కొన్నాను. అయినా నేను సిల్లీగా ప్రవర్తించాను. సాంప్రదాయాలు, సంఘనియమాలు నేను పాటించనని నిన్ను పాటించొద్దనటం తప్పే. కళ్ళు కడుక్కో ప్రక్కన నిలబడి తల నిమిరాడు. సుచరిత వెక్కి వెక్కి ఏడుస్తూ అతని గుండెలపై వ్రాలిపోయింది. రెండునిమిషాలు ఊరుకొని తననుండి ఆమెను దూరంగా జరిపి. "నీకు కష్టం కలిగించే పని చెయ్యను. ఇక-సరా," గబగబ వెళ్ళి నీళ్ళు తీసుకొని ముఖం కడుక్కుంది. బెడ్‌రూమ్‌కెళ్ళి రఘు తెచ్చిన నీలం చీర కట్టుకుంది. యింట్లో వున్న తెల్లచుక్కల జాకెట్టు వేసుకుంది. రఘు సంబరంగా చూచి మత్తుగా నవ్వాడు.

"అలా చూడకండి రఘూ!-- నా నిగ్రహం సడలి పోతుంది - మీ
తృప్తి కోసం ఈ దుస్తులు ధరించాను" రఘు దగ్గరగా వచ్చి ఆపాదమస్తకం ఒకసారి పరికించి చూచాడు. దూరానవున్న వస్తువు అతన్ని ఆకట్టుకున్నట్టు అతని పెదాలు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. వెళ్ళి పూజ గదినుండి కుంకుమ తెచ్చి సుచరిత నుదుట దిద్దాడు.

"ఇదేమిటి రఘూ?" అదిరిపోయింది సుచరిత.

"ఈ తిలకం ఒక్కటి లేక నీ అందము మరుగున పడింది. చూసుకో నీ ముఖం" అంటూ అద్దం తెచ్చి యిచ్చాడు.

సుచరిత ఆశ్చర్యపోయింది. తనేనా? కుంకుమొక్కటే యెంత అందాన్నిస్తుంది! సుచరిత అంతరంగం ఆనందంతో నిండిపోయింది క్షణకాలమైనా తను ఆ దివ్యానుభూతిని పొందటానికి కారకుడైన రఘుని దేవుడే అనుకుంది. చటుక్కున వంగి అతని పాదాలు ముట్టుకుంది. రఘు అపురూపంగా ఆమె భుజాలు పట్టి లేవనెత్తి హృదయానికి హత్తుకున్నాడు సుచరిత ఈలోకంలోకి వచ్చింది. తనెందుకింతగా రఘును ఊరిస్తోంది! మాటవరసకైనా అమ్మ తన పునర్వివాహం గురించి అనదేం? యెందు కంటుంది? శుద్ధ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిందాయె! అమ్మను కాద తను రఘును వివాహము చేసుకుంటే-అమ్మను వీళ్ళు చూస్తారా? చలపతి వాలకం చూస్తూనే ఉంది. కాంతారావు భార్య కూడా పరమగయ్యాళి. రఘుకూ తన మూలంగా నిందలకు గురికావలసివస్తుంది.

ఆ ప్రేమమూర్తికి అలాంటి ఆపద రావద్దు-తన మనసు రాయి చేసుకుని అయినాసరే అతని జీవితాన్ని ఓ మార్గంలో పెట్టాలి

"సుచీ-" దువ్వుకొన్న జుట్టు సవరిస్తూ, మృదువుగా పిల్చాడు.

"ఊఁ!"

"ఏమిటాలోచిస్తున్నావు!"

"మిమ్మల్ని ఓ వరం అడగాలి-"

"వరమా?... దీపావళి అని సత్యభామ వయ్యావేమిటి? ఏం కావా చెప్పు సుచీ... నేను మాత్రం మీ అన్నలు వస్తే మన వివాహం సంగ



అడుగుదామనుకున్నాను. పెద్దన్నయ్య రానే లేదు. మీ చిన్నన్న మాటలు వింటే తన్న బుద్ధేస్తోంది..." అన్నాడు రఘు దూరంగా జరిగి.

"ఏమన్నాడు!"

"ఏదో ఒకటి యిప్పుడెందుకు?"

"మీ సుచి దగ్గరకూడా దాపరికమా?" కవ్వించే చూపు.

"లేదు, నువ్వు బాధపడతావు. కొన్ని విషయాలు వినకపోవడమే మంచిది" అన్నాడు అక్కడేవున్న స్టూలుపై కూర్చుంటూ.

"నేనేం బాధపడను... మీరు... మిమ్మల్ని చనువుగా ఉన్నందుకు ఏమనలేదు కదా?"

"ఛ! అలాంటిది కాదు. నేను నీ భావిజీవితం గురించి ఏమాలోచించారు? అన్నాను. మరల వివాహము చేస్తే బావుంటుందని ప్రస్తావించాను."

"ఏమన్నాడు?" అన్నది ఆదుర్దాగా.

"ఏమన్నాడు ... ప్రపంచంలో యెంతో మంది నీలాంటి వాళ్ళున్నారట! పెళ్ళిచేస్తే కరణం గారు నీకు చిల్లిగవ్వ యివ్వరట- కొన్నాళ్ళు పోయాక నిన్ను ఒప్పించి ఆస్తికై దావా వేస్తారట-మీ పెద్దన్న కూడా అలాగే చేద్దామని ఉత్తరం రాశాడట."

"నిజమా రఘూ! చలపతన్నకు యెంతాశ!" కోపంతో సుచరిత ముఖం ఎరుపెక్కింది.

"నువ్వు ఆవేశపడితే లాభం లేదు. నువ్వే ఆలోచించు."

"ఇంక నేను ఆలోచించేది ఏం లేదు-మీరు వెంటనే మీకు నచ్చిన కన్యను చూసి వివాహం చేసుకోండి. నన్ను మరచిపోండి. నాకు ప్రసాదించమన్న వరం ఇదే!"

"సుచీ! నీకేం పిచ్చి పట్టలేదు కదా!"

"లేదు. పిచ్చిపడితే నా అంత అదృష్టవంతురాలు యింకొకరుండరు... నన్ను అభిమానిస్తే మీకు మిగిలేది అవమానం. రఘూ! జీవితమంతా ఆనందమయము కాకపోయినా, ఆనందం, తృప్తి అన్నీ ఈ కొద్దిరోజుల్లో మీవల్ల పొందాను. ఆ అనుభూతితోనే మిమ్మల్ని తలుచుకుంటూ జీవితం

గడిపేస్తాను. కాని నా కోరికల్లా ఒక్కటే! మీ జీవితం చిగురించి, పుష్పిం ఫలించాలని."

"సరే! నీ కెప్పుడో చెప్పాను కదూ! నీ కోర్కె కాదనే శక్తి లేదు! అ ప్రయత్నిస్తాను" త్వరగా లేచి వెళ్ళి పోయాడు.

సుచరిత కళ్ళు శ్రావణమేఘాలయ్యాయి. అమృతభాండము ద వస్తే అవతలికి నెట్టిన మూర్ఖురాలు తను... అమృతం తాకే అర్హతలే లోకం ముద్రవేసింది. తనేం చేస్తుంది...? "అయ్యో, భోజనం చెయ్యకుం వెళ్ళి పోయారే?" అని ప్రాణం గిల గిలలాడింది. పిల్లలు లోపలికి రావటం ఆలోచనలు వదలి వాళ్ళకు అన్నాలు పెట్టింది. దుస్తులు మార్చుకొని. పదిలం పెట్టెలో దాచుకుంది.

"సుచరితా! వీళ్ళింకా రాలేదా?" అంటూ వచ్చాడు మూర్తి. విస్మయం సంబరంగా సుచరితను చూశాడు.

"అదేమిటి బావగారూ! అలా చూస్తున్నారు?"

"అబ్బా! నీ ముఖానికి ఆ కుంకుమ యెంత అందాన్నిస్తుం చూడమ్మా..." అన్నాడు నవ్వుతూ. సుచరిత గతుక్కుమంది. అనుకోకుం అబద్ధమాడేసింది "సుమ పెట్టింది." అని తుడుచుకుంది.

"సుమ పెట్టిందా? నేను మా తమ్ముడు గారు పెట్టారనుకున్నా

"పోండి బావగారూ!" అన్నది.

అప్పుడే పిల్లలతో అక్కడికి వచ్చిన సుభద్రమ్మ కళ్ళు పెద్దవి చూచింది. సుచరిత ఆమెను పలకరించింది. "యెలా వుంది పెద్దప్ప దీపాలంకరణ?"

"బాగానే ఉంది. మీ అన్నకొడుకు పిడుగు తల్లీ ! ఏది చూస్తే అ పరుగు. యెంత గోలచెయ్యాలో అంతా చేశాడు-హమ్మయ్య! రావే సుమ అన్నది ముఖం ముడుచుకుని.

"భోజనం చేశాక వెళుదురుగాని..... కాళ్ళు కడుక్కోండి పెద్దప్పా

"భోజనం ఎందుకు తల్లీ! మిమ్మల్ని చూస్తేనే కడుపు నిండిపోయింది సుమను లాక్కుని పోయింది. నిద్రకు జోగుతున్న మనవణ్ని తీసుకొని గో వచ్చింది. ఆ వెనకాలే చలపతీ, చలపతి భార్య వచ్చారు.



రెండురోజులుండి వెళ్ళిపోయాడు చలపతి. అతనికి డబ్బు పిచ్చి జాస్తి. సుభద్రమ్మ అల్లుడిని ఆడిపోసుకుంటూ, పిల్లలను తిడుతూ కాలం గడుపుతోంది. పనిలేక సుచరితకు పిచ్చిపట్టినట్టుంది. కూతురు అవస్థ గమనించి గోపమ్మ ఓ సలహా ఇచ్చింది- "సుచమ్మా! నీకు తోచడం లేదు. వెళ్ళి ఏదయినా సినిమా చూసి రా."

"నువ్వూ రాకూడదా అమ్మా?"

"మూడుగంటలు నేను కూర్చోలేనే తల్లీ? ఉమని తీసుకుని వెళ్ళు" అన్నది.

"ఉమా! సినిమాకు వెళదాము తయారవ్వు" ఉమ సంబరంగా వెళ్ళి అమ్మమ్మ నడిగింది. "అదొక్కటే తక్కువయింది. ఈ తిరుగుళ్ళు తిరిగితే బాగుపడినట్టే-" అంది. సుచరితకు కోపం ముంచుకొచ్చింది. ఒక్కర్తే బయలుదేరింది- 'క్లియోపాత్రా' చూడాలని. ఆ థియేటర్లో స్త్రీలకు ప్రత్యేకంగా ఉండదు. కొందరు మింగేటట్టు చూస్తున్నారు. ఒంటరిగా రాకూడదు అనుకొని వెనుతిరిగింది సుచరిత.

రెండు అడుగులు వేసిందో లేదో రఘు కారు వచ్చింది. సుచరిత క్షణం నివ్వెరపోయింది. అతనికెలా ముఖం చూపించేది? అనుకుంటుండగానే అతను కారు పార్కు చేసి వచ్చాడు.

"ఎవరికొరకు చూస్తున్నావు? మీ స్నేహితురాళ్ళు వస్తున్నారా?" అన్నాడు.

"లేదు, నేనే వచ్చాను."

"మరి గేటుదగ్గర నిలుచున్నా వెందుకు?"

"తిరిగి పోదామని. ఒంటరిగా ఆడది బయటికొస్తే మింగేటట్టు చూస్తారు."

"ఈ సత్యము ఈనాడు కనిపెట్టావన్నమాట. అందమైన వస్తువు చూడొద్దంటే మానుతారా !"

"ఈ రోజునుండి మూడురోజులవరకు నైట్ డ్యూటీ. దినమంతా గడపడానికి కాలక్షేపము వెతుక్కుంటూ వచ్చాను. అయితే నేను అదృష్ట

వంతుడినేనని అనుకుని నిరాశచెందని వాళ్ళతోనే గడపగలుగుతున్నా అన్నాడు. సుచరితకు మాట్లాడే అవకాశమే యివ్వకుండా బుకింగ్ ఆఫీసు వెళ్ళాడు, అతడు కనిపించనంతసేపు అతని ఎడ కాఠిన్యము పెంచుకొ దూరంగా ఉండాలనుకుంటుంది. కాని అతడు దగ్గరకు రాగానే అన్నీ మ అతని ఆజ్ఞానుసారమే నడుస్తుంది. అదే చిత్రం !

ఇద్దరూ వెళ్ళి హాల్లో కూర్చున్నారు. సుచరిత మనసు విచిత్ర స్పందిస్తోంది. పండుగరోజు సాయంత్రం అతడికి భోజనం పెట్టలేద మనసంతా నీరవుతుంది. అతని చెయ్యి తనచేతిలోకి తీసుకుంది. "ఆ సాయంత్రము మీరు కోపంగా, భోజనం చెయ్యకుండా వెళ్ళారు. చేయ మంటారు చెప్పండి? అమ్మను కాదని నేనేం చెయ్యలేను."

"అందుకే నువ్వూరుకో. సమయం చూచి అమ్మను నేనే అడుగుత ఆమెకు నీ మీద యెంత ప్రేమో నాకు తెలుసు. అప్పుడు నీకేం అభ్యం ఉండదుగా?"

"అదికాదు రఘూ, నేను దూరమైతే అమ్మను చూచే వారెవరు? దగ్గరకు పంపటం నాకిష్టం లేదు."

"చూద్దాము కొడుకులకు, తల్లికి ప్రతి కుటుంబంలో అదే స ఎదురవుతుంది. కాని చిత్రమేమిటంటే ఎంత అసౌకర్యంగా వున్నా కుమారుల ఇంటనే ఉంటానంటుంది" న్యూస్ రీల్ మొదలవటంతో మా ఆపారు.

సినిమా నుండి తాజ్‌కు వెళ్ళి ఫలహారముచేసి యింటి కొచ్చా బస్సులో వెళ్ళి కార్లో రావటం సుభద్రమ్మకు సుతరామూ గిట్ట లేదు. గో అతన్ని ఆదరంగా పలకరించి రావటంలేదని నిష్ఠూరం ఆడటం అంత గిట్టలేదు. రఘు కాసేపు కూర్చుని వెళ్ళిపోయాడు.

"అయితే-అమ్మాయ్! ఇతనెక్కడ కలిశాడు?"

"సినిమాహాల్లో పెద్దమ్మా" అన్నది నిస్సంకోచంగా.

"అతను అక్కడికెలా వచ్చాడు ? కబురు చేశావా ?" ఆమెను మాయించటము బ్రహ్మాతరం కాదు అని గోపమ్మకు తెలుసు. ఆ



కలుగజేసుకొని "అదెప్పుడు కబురు చేసింది? ఇంట్లో ఎవరున్నారని కబుర్లు చెయ్యడానికి? అమ్మా! సుచరితా! ఏం కథ తల్లీ అది?" గోపమ్మ అడిగింది. సుచరిత కథ చెప్పింది.

"కథ గొప్పదని కాదమ్మా! వాళ్ళ సెట్టింగ్సు చాలా బావుంటాయి. మహారాణిగా సీజర్ ఆమెకిచ్చే స్వాగతం చూచి తీరవల్సిందే? అలాంటి దృశ్యాల గురించే వెళ్ళాలమ్మా!"

"ఏమి సినిమాలో ఏమో! వాటి మహత్యమే మనుషులను పాడు జేస్తుంది. అది ఇద్దర్ని ప్రేమించిందని, రేపటినుండి మొగుడులేని ముండలంతా ప్రేమించటానికి బయలుదేరుతారు" మూర్తి రావటంతో లేచి వాళ్ళ గదిలోకి వెళ్ళిపోయింది సుభద్రమ్మ.

* * *

"స్కూలు రీఓపెన్ అయింది. పబ్లిక్ పరీక్షకు వెళ్ళే వారికి సెలక్షన్ ఎగ్జామ్స్ అని నోటీసు వచ్చింది. ఎవిలీన్‌కు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్సు వచ్చాయి. ఆ వార్త విని చిందులు తొక్కింది ఎవిలీన్.

"దరిద్రపు స్కూలు ! దరిద్రపు అడ్మినిస్ట్రేషన్? 'ఊ' అంటే ట్రాన్స్‌ఫర్? 'ఆ' అంటే ఊస్టింగ్. ఇదంతా ఆ ముసలి నక్క ప్రతాపమే."

"మిసెస్ ఎవిలీన్! సావధానంగా ఆలోచించండి. ఆయనదేం తప్పు లేదు. ట్యూషన్ అనే సరికి అన్ని సబ్జెక్ట్సు చెప్పమా?" సుచరిత సర్దబోయింది.

"... లెక్కలు తప్ప అన్నీ చెప్పొచ్చు."

"మరి మీరు పాఠం చెప్పకుండా కూర్చుంటే ఆఫీసర్ ఏం చేస్తాడు?"

"హెడ్‌మాస్టరే రిపోర్టు ఇచ్చింది."

"మరింకేమి చెయ్యగలడు?"

"గోపాలం పరుగెత్తుకొచ్చాడు- హెడ్‌మాస్టరికి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చాయి." అందరూ ఆశ్చర్యపోయారు.

"మంది ఉసురు పెట్టుకుంటే ఎన్నాళ్ళు తనుంటాడు? బాగయింది-"

"ఆగండి ఎవిలీన్‌గారూ! అతనికి ప్రమోషన్ వచ్చిందండీ. గెజిటెడ్ పోస్టు! వేరే జిల్లాకు డి.ఇ.ఓ.గా వేశారు." అన్నాడు గోపాలం.

ఆ వార్త విని కొందరు సంతోషించారు. కొందరు అసూయ జెందారు.

"కంగ్రాట్యులేషన్స్ సర్!" సుచరిత హృదయపూర్వకంగా అభినందించింది.
అయన కూడా వాత్సల్యపూరితంగా చూచారు.

"థాంక్స్! శెలవులకు ఊరెళ్ళావా సుచరితా?"

"లేదు సర్, క్రొత్త హెడ్‌మాష్టర్ మీకు తెలుసా?" అంది.

"లేదమ్మా. కాని మంచివాడేనట. ఎమ్.ఎ.,బి.ఇడి. చేశాడు. పేరు పాల్"

పిల్లలు ఉత్సాహంగా వచ్చి ఆయనను అభినందించారు.

హెడ్‌మాష్టరి వీడ్కోలు సమావేశము ఏర్పాటు చేశారు. అదేరోజు పాల్ డ్యూటీలో జాయిన్ అవడానికి వచ్చాడు. అతనికి స్వాగతం చెప్పారు.

పాల్‌ని అందరికీ పరిచయం చేశారు పాత హెడ్‌మాష్టర్. నల్లగా వున్నా అందంగా, హుందాగా వున్నాడు. ముప్పైరెండేళ్ళు ఉండొచ్చు. తరిచి తరి చూసే కన్నులు అతని తెలివి తేటలకు నిదర్శనంగా ఉన్నాయి. అల్పాహా విందు తరువాత పాల్ లేచి అందరికీ తన కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. అతని ఉద్యోగంలోని కొన్ని అనుభవాలు తెలిపి, అందరూ తన సహకరించాలని కోరుతూ కూర్చున్నాడు.

హెడ్‌మాష్టరుగారు లేచారు.

"లేడీస్ అండ్ జెంటిల్ మెన్!

ఉద్యోగ నిర్వహణలో మీకు, నాకు భేదాభిప్రాయాలుండవచ్చు. వ్యక్తిగతంగా మనము స్నేహితులమే. నాపై కొందరికి కోపం ఉండవచ్చు. అది మరచిపొమ్మంటున్నాను. మీ మీ పనులను బాధ్యతగా చూసుకో అదే నేను కోరేది. మిసెస్ ఎవిలీన్ కోపకారణంగా యీరోజు రాలేదు. దురదృష్టంగా భావిస్తున్నాను. అనాలోచితంగా నా వల్ల పొరపాట్లు జరి క్షమించమని విద్యార్థులను, ఉపాధ్యాయులను వేడుకుంటున్నాను. మిష్టర్ పా యువకుడు. సమర్థవంతముగా స్కూలు నడపగలడు. అతనికి తగు సహకరించమని ప్రార్థిస్తున్నాను." అని చెప్పి కూర్చున్నారాయన.

విద్యార్థి సంఘం కార్యదర్శి లేచాడు.



"గౌరవనీయులైన హెడ్‌మాష్టరుగారికి, ఉపాధ్యాయులకు-మరియు నాతోటి విద్యార్థులకు.

మా ప్రధానోపాధ్యాయులు ట్రాన్స్‌ఫర్ అయ్యారంటే చాలా విచారించాము. కాని పెద్ద పదవి పొందారంటే ఆనందించాము. వారి విషయం చెప్పాలంటే చాలా వుంది. ముఖస్తుతి కూడా అవుతుందేమో! బందిలిదొడ్డిలా వుండే మా బడిని ఒక సక్రమమైన మార్గములో నడిపారు. చాలా కృషి చేశారు. తెలిసీ తెలియని ఆలోచనతో ఆయనను మేము కష్ట పెట్టాము. మా విద్యార్థుల తరపున క్షమార్పణ వేడుకుంటున్నాను-". అతని తరువాత స్కూలు యూనియన్ ప్రెసిడెంటు వందనసమర్పణతో సమావేశం ముగిసింది.

అందరూ బయలు దేరే సమయానికి వచ్చి రిలీవింగ్ లెటర్ తీసుకుంది ఎవిలీన్. ఎల్.పి.సి. తయారు చెయ్యమని కూర్చుంది.

"ఇక ఆటలు ఎలా సాగుతాయో? ఆ ముసలి నక్కను ఆడించినట్టు ఆడిస్తే పాల్ ఊరుకోడు. అతడు చాలా స్ట్రిక్టు అట. మావారు చెప్పారు." అన్నది కసిగా ఎవిలీన్.

"మేము అంతకంటే స్ట్రిక్టు అండీ. సానపెడితేనే అసలు రంగు బయటపడుతుంది. మా కేం భయం లేదు." జవాబిచ్చాడు వెంకటేశం.

"తెలుస్తుందిగా"

"మీకు వివరాలు తెలుపుతూ ఉత్తరం రాస్తా లెండి. మే మెందుకు లలిత గారున్నారుగా?" వెంకటేశాన్ని మింగేటట్టు చూసింది లలిత. అందరూ వెళ్ళిపోయారు.

పాల్ తననే చూస్తుండడం గమనించి సుచరిత కలవరపడి అతని దృష్టినుండి తప్పుకుంది.

రెండవరోజు సుచరిత క్లాసునుండి బయటకి వచ్చేసరికి రంగయ్య బుర్రగోక్కుంటూ నిల్చున్నాడు.

"ఏం రంగయ్యా!"

"దీపావళి యినాం అమ్మా?"

"ఓ! నేను మర్చేపోయాను. తీసుకో" పర్సుతీసి ఒక రూపాయి ఇచ్చిం వాడు సంబరపడిపోతూ నమస్కరించి వెళ్ళిపోయాడు.

"దీపావళి ఎలా గడిచింది?" లలిత ప్రశ్నించింది.

"బాగానే గడిచింది." అన్నది ముభావంగా.

"దీపావళి రోజు పబ్లిక్ గార్డెన్ దగ్గర మీ అమ్మ గారితో పా ఇంకొకావిడ కనిపించారు. ఎవరు?"

"రమాదేవి తల్లి."

"మీ దగ్గరే ఉంటున్నారా?"

"అవును."

"భర్త కూడానా?"

"ఊఁ!" సుచరిత చికాకుగా చూచి వెళ్ళిపోయింది. డిసెంబరొస్తే కాజు లీవ్స్ వృధాగా పోతాయని అందరూ తీసుకోవడం మొదలు పెట్టారు. లెటర్స్ లేకుండా ఏడుగురు లీవ్ పెట్టారు. దినమంతా ఉన్న టీచర్లు ఉ సలుపుకో లేదు. పాల్ ఎప్పుడూ తిరుగుతూనే ఉంటాడు. రెండవ రో నోటీస్ వచ్చింది.

1. క్యాజువల్ లీవులు ఒక్కరోజు ముగ్గురికంటే ఎక్కువ మం తీసుకోరాదు.
2. అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఇంటిమేట్ చేసి లీవు పెట్టాలి.
3. ఉపాధ్యాయులు తరచూ క్లాసులు వదలి బయట కనిపిస్తున్నా అది సహించలేని విషయము.
4. ఇక నుండి వారంలో రెండు పర్యాయములు హోమ్‌వర్క్ నో బుక్కులు నా వద్దకు రావాలి.
5. టీచింగ్ నోట్సు రెగ్యులర్‌గా సబ్‌మిట్ చెయ్యాలి."

క్రింద హెడ్‌మాస్టరి సంతకముంది.

"ఇవన్నీ కొత్త హెడ్‌మాష్టరు రాగానే మామూలుగా జరిగే తం మళ్ళీ యివన్నీ చూచే ఓపిక వాళ్ళ కెక్కడిది?" మరియమ్మ, లలిత నవ్వు



సెకండ్ పీరియడ్‌లో పాల్ బయటికొచ్చాడు. లలిత క్లాస్ బయట ఉంటే పిల్లలు ఎండలో ఆడుకుంటున్నారు. పాల్‌ను చూచి జంకింది.

వెంటనే పిల్లలని పిలిచి డ్రిల్లు మొదలు పెట్టింది.

పాల్ చూచీ చూడనట్టు వెళ్ళిపోయాడు. హమ్మయ్యా అనుకుంది. అధికారులకు బుర్ర ఉండదని నవ్వుకుంది.

ఇంటర్‌వెల్‌లో రంగయ్య ఓ కాగితం తెచ్చి లలిత చేతికిచ్చాడు. "దీనికి జవాబు తెమ్మన్నారమ్మా" అన్నాడు. చూసింది లలిత అది మెమో.

(1) మీరు రెండవ పీరియడ్‌లో తెలుగు క్లాసైతే డ్రిల్లు చేయిస్తున్నా రెందుకు?

(2) క్లాసు వదలి బయటికి రావడంలో మీ ఉద్దేశ్యం?

లలితకు కోపము ముంచుకొచ్చింది. ఆ కాగితం తీసుకెళ్ళి శర్మకు, మరియమ్మకు చూపించి. "ఏం చేస్తాము ఖర్మ? గొర్రెలు తినువాడు గోవింద కొడితే, బర్రెలు తినువాడు వస్తాడయ్యా అన్నట్టుంది. ఏం చేస్తాము? మొదటి తప్పిదం కాబట్టి క్షమించమని అడుగు" మరియమ్మ సలహా యిచ్చింది. లలిత వెళ్ళేసరికి సుచరిత హెడ్‌మాష్టరుతో మాట్లాడుతోంది.

"టెన్త్ క్లాసు కన్నా ఎనిమిదోతరగతి పిల్లలే నయం. మీ కృషిని అభినందిస్తున్నాను సుచరితగారూ! యెంత చక్కగా రాశారో చూడండి కంపోజిషన్..."

"థాంక్స్ సర్! ఎనిమిదో తరగతి వాళ్ళు చిన్న పిల్లలు. చెప్పితే వింటారు. పెద్దపిల్లలు గొడవ చేస్తారు. చెపితే వినరు, వాళ్ళ కర్థం కాదు, మీరో లెక్కా... అన్నట్టు ప్రవర్తిస్తారు."

"అవును" నవ్వాడు పాల్ "ఇది కౌమార్యదశ కదూ ! మీకు నాండిటేల్ క్లాసు బర్డన్‌గా ఉంటే చెప్పండి. నేను తీసుకుంటాను."

"ఏం లేదు. పూర్తికావచ్చింది కూడాను" అన్నది వినయంగా.

లలిత హృదయం మండిపోయింది. తన ఉనికే గుర్తించనట్టు ప్రవర్తిస్తున్నాడు. కోపాన్ని దిగమింగుకుంటూ "సర్ !" అంది.

"జవాబు రాశారా?" అతని కంఠం, ముఖం గంభీరంగా మారిపోయింది.

"ఇది...ఇది ప్రధమము సర్ ... క్షమించండి" అన్నది తలవంచుకొ
"దిస్ ఈజ్ వెరీ బ్యాడ్ హేబిట్. సరే గుర్తుంచుకోండి. ఇంకెప్పుడు జరగొద్దు. యెవరైనా సరే ఒకేసారి రిలీవింగ్ ఆర్డర్స్ యిచ్చేస్తాను. ఇక వెళ్ళం
లలిత అవమానంతో కుంచించుకు పోయింది. థాంక్స్ చెప్పటం కూ మరిచిపోయి బయటికొచ్చింది.

సహించలేని అవమానం! తన తప్పులు ఎన్నువారు లేరు అన్న రీవిగా తిరిగే సుచరిత ముందా తన కవమానం?

'సుచరితా! కాచుకో. లలితంటే ఏమనుకొన్నావో? నలుగురి తలెత్తుకోకుండా చెయ్యకుంటే నా పేరు లలిత కాదు' అనుకుంది.

స్కూలు ప్రశాంతంగా నడుస్తోంది. ఏ క్షణంలో పాల్ వస్తా తెలియదు. అందరూ అప్రమత్తులై ఉంటారు. లలిత మాత్రం తరుణ కొరకు చూస్తూంది. ఒక్క క్షణం వృధా పోనియ్యక పనిచేసే సుచరితం పాల్‌కు అభిమానం. వర్కంతా అప్ టు డేట్‌గా ఉంచుతుంది. విషయంలోనూ తను సలహాయిచ్చే అవకాశం యివ్వదు. పిల్లలు ఆమె చాలా అభిమానిస్తారు.

అందం, పనితనం, మంచితనం మూర్తీభవించిన సుచరితకు త తనం లోపించటం చేత జాలి, ప్రేమాదరణలు చూపిస్తాడు ఆమె యె ఆమె ప్రతి పనిలోను ప్రత్యేకత కనిపిస్తోంది పాల్‌కు.

స్టాఫ్ రూంలో కూర్చుని రిజిష్టర్ పూర్తి చేసుకుంటోంది సుచరి రంగయ్య వచ్చాడు."అమ్మా ! రమాదేవమ్మకు ఉత్తరాలు వచ్చాయి" అన్నాడు

"నేను వెళ్ళి తీసుకుంటాను" రంగయ్య వెళ్ళిపోయాడు. ఉత్తరా కొరకు హెడ్‌మాష్టరి బల్ల దగ్గర కెళ్ళింది.

"ఏం కావాలండి?" పాల్ పలకరించాడు.

"రమాదేవికి ఉత్తరాలు వచ్చాయట"

"అవి వాళ్ళింట్లో యిస్తానని లలితగారు తీసుకెళ్ళారు." సుచరి ఆశ్చర్యపోయింది. లలితను కలుసుకోవాలనుకుంది. కాని హాఫ్ డే కాజు లీవుపెట్టి వెళ్ళిందన్నారు.



సాయంత్రము ఇంటికొచ్చేసరికి సందు చివర లలిత కనిపించింది. ఉత్తరాలు యివ్వడానికి వచ్చింది కాబోలు! అనుకుంది. సుభద్రమ్మ ముఖం మాడ్చుకుని వాకిట్లో నిల్చుంది.

"ఏం పెద్దమ్మా! అలా ఉన్నారు? అక్కయ్య గుర్తొచ్చిందా?" సుభద్రమ్మ అసహ్యంగా చూచి వెళ్ళిపోయింది.

"-ఎంతమంది జీవితాలు నాశనం చెయ్యకుంటే యిలాంటి జీవితాలు వెళ్ళమారుతాయి... దీంది తప్పు. అందరినీ నమ్ముతుంది. రానీ అయ్యగారి నాటకమేమిటో అడుగుతాను. సంసారులకు కార్లో షికార్లు ఎలా వస్తాయి?" అవి తన గురించేనని గ్రహించటానికి ఎక్కువసేపు పట్టలేదు. అవమానభారంతో కుర్చీలో కూర్చుండిపోయింది.

మూర్తి అప్పుడే వచ్చాడు. "సుచరితా! మీ అక్కయ్య ఉత్తరం వ్రాసింది. బాగా కోలుకుంటోందట. వెయిట్ పెరిగానని రాసింది. నిన్ను మరీ మరీ అడిగానని రాసింది- అదేమిటి అలా ఉన్నావు?"

"ఏం లేదు. కొంచెము తలనొప్పిగా వుంది" లేచి యింట్లోకి వెళ్ళిపోయింది. మూర్తి తెల్లబోయాడు. రమాదేవి కబుర్లంటే పరుగెత్తుకు వచ్చే సుచరిత అలా పోయిందేమిటి" ఆలోచిస్తూ గదిలో అడుగు పెట్టాడు.

"ఏమయ్యా, మూర్తి? ఏమిటీ నాటకం? ఆ సుచరితను చూచుకొని నా బిడ్డగొంతు కోస్తావా? బిడ్డలున్నారన్న జ్ఞానమన్నా ఉందీ?"

"ఆపండీ? మీ వాగుడు" గర్జించాడు మూర్తి.

"ఏం, ఎందుకాపాలి. అంతలా అరిస్తే నేనేం భయపడను. ఉన్న మాటంటే ఉలుకు యెక్కువట. మీ క్రీడలు చూడలేకనే కదూ నా తల్లి మంచము పట్టింది. దాన్ని ఆసుపత్రిలో చేర్చే మిషతో వదిలించుకున్నావు. నీ రాకపోకలు బయటపడకూడదనే ఈ ఇంట్లో చేరేవు? నీ రహస్యం బయట పడకూడదనే మా కెవ్వరికీ కబురు చెయ్యలేదు. కబుర్లు తెలిసి నేను వస్తే పో పొమ్మని ఒకటే పోరు. అప్పుడే అనుకున్నాను-ఏదో వుందని... బావట బావ..."

"ఛీ ! నువ్వా ఓ మనిషివా? నా రమాదేవి ముఖంచూచి వదిలేస్తున్నాను."

"ఏం లేకుంటే కొడతావా?"

"నీలాంటి వాళ్ళను కొట్టినా అవమానమే! దిక్కు లేక అల్లాడే ని పిల్లలను దగ్గరకి తీసిన ఆ దేవతకా ఈ అపవాదు"

"దేవత. కాదు మరి!- పెళ్ళాము దెయ్యము-ముండ దేవతని ఊరికే అన్నారా? అయ్యో రాత! స్కూల్లో హెడ్‌మాష్టరుతో పకపకలట! అటు రఘు గాడు."

"నోరు మూస్తావా లేదా?"

"ఎందుకు మూస్తాను?" నేనో తెలివితక్కువ ముండను. అందరు అనుకుంటున్నారట బయట. నాకేం తెలియదు-"

"మీరు ఇంకా మాట్లాడి నాలోని పశుత్వాన్ని రేపకండి. తక్షణం ఇక్కడ నుండి వెళ్ళిపోండి. రమ ఉత్తరాలు రాస్తూనే ఉంది. మీరు ఏదో స్నే రాజేస్తారని-"

"అయ్యో! ఎన్నెన్ని మాటలంటున్నావు నాయనా! యింకా నీ యింట్లో ఉంటానా! నా బిడ్డలేని ఇంట్లో నాకేం పని! నీవు-నీ పిల్లలు ఏట్లో కలవండి" దూకుడుగా సంచి తీసుకుని బయటపడింది. వీధిలో అందరికీ వినిపించే రాగాలు తీస్తూ తిట్టుకుంటూ వెళ్ళిపోయింది. పనిలేనివాళ్ళు కొందరు నిలబడి వింతగా చూడసాగేరు.

గోపమ్మ, సుచరిత ఉన్నచోట శిలాప్రతిమలవలే నిలబడిపోయారు అవమానంతో భూమిలోకి కుంచించుకు పోయారు. కూర్చున్న చోటే నిద్రపోయారేమో! పనిమనిషి వచ్చి లేపాక లేచి తలుపుతీశారు.

"బాబుగారు ఊరెళ్ళారా అమ్మా!" పని మనిషి అడిగింది. "ఆ ఇంట్లో మొదట చేసి వద్దామనుకుంటే తాళం వేసి ఉంది" అని చెప్పింది. తల్లీ కూతుళ్ళు ఇద్దరూ ముఖముఖాలు చూచుకున్నారు. పదిగంటలవేళ ఓమనిషి లారీ వచ్చాడు. ఓ కవరు తెచ్చియిచ్చాడు సుచరితకు. కవరువిప్పి ఉత్తరం తీసింది అందులో కొంత డబ్బుకూడా ఉంది.

"ప్రియమైన చెల్లెలు సుచరితకు-

ప్రపంచములో కొందరు చాలా సంకుచిత స్వభావులు. ఇతరులను కూడా అలాగే భావిస్తారు. నేను ఇలా వెళ్ళిపోవటం బాధగా ఉంది. కాని తప్పదు



ఇంత అవమానం నా తరఫున నీకు జరిగాక నీకు మొహం ఎలా చూపించేది! నేను పురుషుణ్ని. ఈ నిందలు లెక్క చెయ్యను. లోకం కూడా అంతగా పట్టించుకోదు. నీ విషయం తలచుకుంటే నా గుండెల్లో సూదులు దిగబడుతున్నాయి. అందుకే వెళ్ళి పోతున్నాను. నా స్నేహితుని ఇంట్లో వుంటున్నాను. వాళ్ళకు ఆడపిల్లలు లేరు. ఆవిడ దగ్గరకు ఉమ, సుమ తొందరగానే వెళ్ళారు. నా గురించి చింత వద్దు. ఉత్తరం తెచ్చే అతను సామాన్లు తీసుకొస్తాడు.

సుచరితా? సహోదరుడుగా ఒక్క సలహా ఇవ్వవచ్చా! ఒంటరిగా నీ బ్రతుకు అనే బహుదూరమయిన బాటను దాట లేవు. అడుగడుగునా నిందలు, అపవాదులు! పండులాంటి నీ జీవితం పాడు చేసుకోకు. రఘుకు నువ్వంటే ఎంతో ఇష్టం. అభిమానం. ఆలోచించి ఓ నిర్ణయానికి రా. మీ జంట చూడ ముచ్చటగా ఉంటుంది. సంఘము, సాంప్రదాయాలంటే నాకు గిట్టదు. స్వార్థపరులు ఏర్పరచిన పాత పద్ధతులను వెలి వెయ్యి. మీ అక్కయ్యతో వస్తాను మళ్ళీ. డబ్బు లెక్కచూచి పనిమనిషికి, పాలవాడికి ఇవ్వు. అమృతం కురిపించిన అమ్మకు నా నమస్సులు అందజెయ్యి.

ఇట్లు
మూర్తి."

"ఏమిటే తల్లీ ఇది!"

ఉత్తరం చేతిలోపెట్టి ఇంట్లోకిపోయింది సుచరిత. గోపమ్మ ఉత్తరం చదివి కుమిలిపోయింది. దగ్గరుండి సామాన్లు లారీలో వేయించింది. లారీ వెళ్ళాక కళ్ళు తుడుచుకుంది. యాంత్రికంగా పనులు పూర్తిచేసింది. కూతుర్ని పలకరించలేదు. ఒంటరిగా ఉండనిస్తేనే మంచిదని ఊరుకుంది. దాన్ని సుచరిత ఇంకోవిధంగా అర్థం చేసుకుంది.

"అమ్మా!"

"ఏంతల్లీ !" గోపమ్మ బల్లమీది దుమ్ము దులుపుతోంది.

"నాపై నీకూ అనుమానంగా ఉందా అమ్మా?"

"లేదు తల్లీ! నా బిడ్డ నిప్పు! నా కాసంగతి తెలుసు!" కూతుర్ని అక్కు చేర్చుకుని కన్నీరు కార్చింది. "నువ్వూ. అన్నయ్యల్లాగే మొగబిడ్డవు ఎందు కాలేదు తల్లీ! నీకు, నాకు ఈ అవమానం తప్పేది-ఇంకా ఇలాంటివి ఏ వినాలో, భరించాలో! అదే నా బాధ! ఆయన పుణ్యాత్ములు, త్వర దాటిపోయారు..." తల్లీకూతుళ్ళు మధ్యాహ్నము వరకు అలాగే కూర్చు పోయారు.

బయటివాళ్ళకు ముఖం చూపించలేక గది విడిచి బయటికే రాలే సుచరిత. ఛీ! నీచులు! తను మూర్తిని అన్నయ్యలా గౌరవించింది. బావగా అంటే తప్పా! ఏం చూసి ఈ అపవాదు వేశారో! ఇందులో లలిత పాత్రేం ఈ విషయం రఘుకి తెలిస్తే!- తెలిస్తే అతను అనుమానించడు కదా! అ జరిగితే తన జీవితం నిరర్ధకం! అతను బ్రతుకుమీద కల్పించిన మధు భావాలకు రూపం ఏర్పడుతుందా? ఏమో మగాళ్ళు అనుమానా ఆరాధిస్తారు. పరిపరి విధాలుగా ఆలోచిస్తూ మంచంపై బోర్లా పడుకుంది.

"సుచమ్మా! భోజనం చెయ్యవా తల్లీ!" తను తినకుంటే తల్లి తిన తెలుసు. వెళ్ళి భోజనం అయిందనిపించింది.

"రెండవ రోజు బడికి వెళ్ళింది. ముందురోజు క్యాజువల్ లీవ్ లెట బల్లమీద పెట్టి వెను దిరిగింది. హెడ్‌మాస్టర్ని విష్ కూడా చెయ్యలేదు. ఆ నిర్లక్ష్యము చేస్తే అతను తనను ద్వేషిస్తాడు. స్వార్థపరులకు స్వాం చిక్కుతుంది. కాని పాల్ ఆదుర్దాగా పిలిచాడు.

"ఒక్కరోజులో అలా నీరసించి పోయావేమిటి?" అయోమయం చూచింది సుచరిత.

"అంత ఒంట్లో బావులేనప్పుడు బడికి రావటం దేనికి? రెస్ట తీసుకోవాల్సింది."

"మరేం ఫరవాలేదు సర్! కొంచెము తలనొప్పి వచ్చింది."

"నో ! నో ! మీ ముఖం ఎంత మారిపోయిందో కనిపిస్తూ వుం వెళ్ళి రెస్టు తీసుకోండి."

"ఇంట్లో ఒంటరిగా వుంటే విసుగేస్తోంది. ప్లీజ్ ! నా కేం లేదు" పా



ఇంటికి పొమ్మని బలవంతము చెయ్యలేదు. లైట్‌గా టీచ్ చెయ్యమని చెప్పి పంపాడు.

"రమాదేవి తల్లిగారు బావున్నారా?" లలిత అడిగింది. సుచరిత లోతుగా లలిత కళ్ళలోకి చూచింది. ఏదో ఆరా తీయాలని ఆరాటం కాబోలు!

"బావుంది. మిమ్మల్ని ఒకసారి తీసుకు రమ్మంది. భలే మంచి మంచి కథలు కల్పించి చెప్తారట" అన్నది సుచరిత నీరసంగా నవ్వుతూ.

లలిత ముఖం నల్లగా మాడిపోయింది. ఇంకో బాణం ప్రయోగించుదా మనుకుంది. "అదేం పాల్‌గారు వెళ్ళమన్నా వెళ్ళలేదేం? పాపం! ఆయన మీ ఆరోగ్యం గురించి ఒకటే బాధపడుతున్నారల్లే వుంది."

"అది చూచి మీరు బాధపడటం యెందుకు? పోనీ పాల్‌గారి ఇల్లెక్కడో అడ్రసు కనుక్కురానా? వారి భార్యతో మాట్లాడివద్దురుగాని."

"నాకేం పనిలేదా? అందరిళ్ళకు నేనెందుకుపోతాను?" విసురుగా వెళ్ళిపోయింది - నీ పనేం జేస్తానో చూడమన్నట్లు. సుచరిత యాంత్రికంగా క్లాసులకు వెళ్ళింది. ఎలెవెన్త్ క్లాసుకు ఏం చెప్పాలి? ప్రిపేర్ అవలేదే అని బాధపడుతూ క్లాసుకు వెళ్ళింది. పాల్ ఇంగ్లీషు టెక్స్ట్ తీస్తున్నాడు. సుచరితను చూచి చిన్నగా నవ్వుతూ "ఇది మీ పిరియడ్. కాని మీకు రెస్టు కావాలని నేను తీసుకున్నాను. అందులో నా స్వార్థం కూడా వుంది. రేపు నేను నా పీరియడ్‌లో ఒక మారేజ్‌కి అటెండ్ అవ్వాలి. అది మీ కిస్తాను" అన్నాడు. గంభీరంగా కనిపించే పాల్ పసిపిల్లాడిలా సంజాయిషీ చెప్పుకుంటే నవ్వొచ్చింది సుచరితకు. "థాంక్ యూ సర్" అన్నది. గోపాలం అక్కడే నిలబడి చెవులు రిక్క బొడుచుకుని వీళ్ళసంభాషణ విన్నాడు. అక్కడినుండి లలిత ఉన్నచోటికి వెళ్ళాడు. వాళ్ళు ఏం మాట్లాడుకున్నారోగాని మరియమ్మ భయంగా ఇవతల కొచ్చింది.

సాయంత్రం ఏడుగంటలకు రఘు ఉత్సాహంగా వచ్చాడు గోపమ్మతో మాట్లాడాలని. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. హాల్లో అడుగుపెట్టి ఆశ్చర్యపోయాడు. సుచరిత ఈజీఛైర్‌లో నీరసంగా పడి వుంది. గోపమ్మ క్రింద కొంగుపరచుకొని పడుకుంది.

"ఏం సుచరితా! అలా వున్నావు?" ఉలిక్కిపడి లేచింది. ఎదురుగా రఘు. ఒక్కసారి అతని హృదయంలో తలదాచుకుని అంతా చెప్పి తనివి తీరా ఏడవాలనిపించింది. కాని బలవంతంగా నిగ్రహించుకుంది. గోపమ్మకూడా లేచి కూర్చుంది.

"అంత బాగాలేకపోతే నాకు కబురెందుకు చేయలేదమ్మా! ఇంతకీ సుస్తీ ఏమిటి."

"ఏమని చెప్పను? అంతా మా ఖర్మ నాయనా!" నుదురు కొట్టుకుంది గోపమ్మ.

"అసలు సంగతి చెప్పమ్మా? రెండు రోజులనుండి తీరిక లేదు. వస్తే ఫ్లూ వస్తోంది కదా? పని తెమలటమే లేదు. స్కూల్లో ఏదైనా గొడవ జరిగిందా" సుచరిత వంక చూచాడు. సుచరిత జవాబు చెప్పలేక తన గదిలోకి వెళ్ళి పోయింది. గోపమ్మ విషయాలన్నీ క్లుప్తంగా చెప్పి భోరున ఏడ్చింది.

"ఊరుకో అమ్మా! ప్రపంచమంతా అలాగే వుంది, ఏ కొద్దిమంది తప్ప, ఉపకారం చెయ్యబోతే అపకారం ఎదురవుతుంది. పాపం! ఉన్నపళంగా మూర్తిగారు ఎక్కడికి వెళ్ళారో! నేను కనుక్కుంటాను" అన్నాడు నచ్చ చెప్తూ.

"అందునా మాలాటి ఆడవాళ్ళ, దురదృష్టవంతుల సంగతి చెప్పే నవసరము లేదనుకుంటాను. మేం ఏం చేసినా తప్పే..."

"మీరు పొరపడుతున్నా రమ్మా! నిందలు వెయ్యడానికి ఆడ, మగ అని తేడా లేదు. ఈ మధ్య హాస్పిటల్లో ఓ నర్సు చేరింది. వివాహిత. ఎప్పుడు చూచినా ముఖంలో దైన్యమే కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. జాలి వేసేది. ఆమె విషయాలన్నీ సానుభూతితో విని నాకు తోచిన సలహా యిచ్చాను. ప్రేమించి పెళ్ళిచేసుకున్న భర్త క్యాన్సర్‌తో బాధపడుతున్నాడంటే జాలి కదా? ముప్పై ఏళ్ళు దాటని ఆవిడ అలాంటి దుస్థితిలో ఉంటే సానుభూతి చూపడం తప్పా? అప్పుడప్పుడు భర్త ఆరోగ్యం గురించి అడిగేవాడిని. విద్యావంతులు, మానవ శాస్త్రం చదివిన అసమాన పండితులమనుకునే మా డాక్టర్లే నన్ను మడతమాటల్లో దెప్పటం మొదలు పెట్టారు.

ఓ రోజు నవ్వుతూనే నాలుగు దులిపేశాను. నోరు మూసుకున్నారు



కాకపోతే ఒక తేడా వుంది. పురుషుడు యెన్ని తప్పులు చేసినా తలెత్తుకు తిరగగలుగుతాడు. ఆ ధైర్యం వాళ్ళకు పుట్టుకతో వచ్చింది. ఆ లోకం అతన్ని అంతగా వేలెత్తి చూపదు. స్త్రీల విషయంలో అలా కాదు. వీళ్ళు మానసికంగా బలహీనులని తెలిసి స్త్రీని స్త్రీయే వేలెత్తి చూపుతుంది."

"బాగా చెప్పావు నాయనా! సుచమ్మ జీవితం ఎలా తెల్లవారుతుందో అనే దిగులే నన్ను రాత్రింబవళ్ళు కాల్చుకు తింటోంది నాయనా!"

"సుచరిత ఏది!"

"గదిలో వుంది. మూడురోజుల నుండి ఒకటే ఏడుపు నాయనా!" రఘు లేచి సుచరిత గదిలోకి వెళ్లాడు. "సుచరితా!" తలెత్తి చూచింది, కళ్ళు ఎర్రగా వున్నాయి.

"దుఃఖిస్తే సమస్యలు పరిష్కారమై లాభం కలుగుతుందంటే చెప్పు. కూలీలను పిలిపిద్దాం ఏడవడానికి" అన్నాడు.

"మీకు నాపై అను... అనుమానం లేదు కదా?" అన్నది వెక్కుతూ. ఆమె తలపై చేయి వేశాడు. "ఎంత పిచ్చిపిల్లవు! కల్లోకూడా నిన్ను అనుమానించను. అసూయా పరులన్నమాటలకు యింత బాధపడుతున్నావా? లే, ఈరోజు అమ్మగారితో మాట్లాడాలనే వచ్చాను."

"ఈ రోజా!"

"అవును. ఈ రోజే, నేనుకూడా ఒంటరిగా ఉండి విసిగి పోయాను... నాకు కాఫీ కావాలి." ఆ మాట చెప్పితేనే లేస్తుందని రఘుకి తెలుసు, అతని అంచనా ప్రకారమే సుచరిత లేచింది. అతడు తల్లిని అడిగే విషయాలు ఊహించగానే ఆమె గుండె వేగంగా కొట్టుకోసాగింది. అమ్మ అంగీకరిస్తుందా? అంగీకరించదు. ఆమె నరనరాల్లోను పురాతన సాంప్రదాయాలు ప్రవహిస్తున్నాయి - ఏమో! అదే నిజమైతే తన చదువు థర్డ్ ఫారమ్‌తోనే ఆగిపోయేది.

"నిలబడి కాసేపు ఆలోచించుకోవాలి కాబోలు!" అన్నాడు నవ్వుతూ.

సుచరిత లేచి వంటయింట్లోకి వెళ్ళింది. రఘు వచ్చి గోపమ్మ దగ్గర కూర్చున్నాడు.

"నువ్వు వచ్చావని ఆ మాత్రం ధైర్యంగా ఉన్నాము నాయనా! లేకుంటే అదో మూల, నేనో మూల కూర్చునేవాళ్ళము."

"సుచరిత సంతోషంగా ఉండాలంటే మీరు కొన్నివిషయాలు ఆలోచించాలమ్మా!"

"చెప్పు నాయనా! దాని సంతోషం కంటే నా కేదీ ఎక్కువ కాదు. ఈ ప్రపంచంలో నేను పండుటాకును. ఎప్పుడు రాలిపోతానో తెలియదు. అది సంతోషంగా ఉంటే చాలు."

"అయితే సుచరితకు పునర్వివాహం చెయ్యటానికి మీరు అంగీకరించగలరా?" అన్నాడు. తానాసించిన ప్రశ్న రఘు ముఖతః వచ్చేసరికి గోపమ్మ సంతోషంగా చూచింది. తన కూతురు కంటే, దాని సుఖం కంటె స్వర్గసుఖ ఏముంటుంది తనకు? రఘుతో సుచరిత నూహించుకోగానే ఆమె అంతరంగము ఆనందముతో నిండిపోయింది. కళ్ళు తుడుచుకుని జవాబు చెప్పాలనుకోగానే బూట్లచప్పుడు వినిపించింది. ఇద్దరూ తలెత్తి చూచారు గోపమ్మ పెద్ద కుమారుడు కాంతారావు! రఘు చిరునవ్వుతో నమస్కరించాడు కాంతారావు నమస్కరించి అక్కడేవున్న కుర్చీలో కూర్చున్నాడు. గోపమ్మ ఆనందముతో కుమారుణ్ణి పలుకరించింది.

"కాంతం! అంతా బావున్నారా? పిల్లలు, కోడలు అక్కడే వున్నారా?"

"అంతా బాగున్నారు. సుచరితేది!"

"పెరట్లో వున్నది."

"రఘూ! యిక్కడే వుంటావా? అమ్మవాళ్ళు ఇక్కడే వుంటున్నారా?"

"ఇక్కడే ఉస్మానియా హాస్పిటల్లో పనిచేస్తున్నాను. అమ్మ ఊళ్లో వుంది." అని వెళతానని లేచాడు. ఏమో చెప్తానన్నావు అన్నట్టు చూచింది గోపమ్మ. 'తరువాత' అన్నట్టు చూచాడు.

"మీరు ఉంటారుగా కాంతన్నా?" ఇప్పుడు తనక్కడుండటం మంచి కాదనిపించింది.

"ఊఁ!"

"రేపు మా యింటికి రండి. కారు పంపుతాను. కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలి" అన్నాడు.



కాఫీ తెచ్చిన సుచరిత అన్నగారిని చూచి ఆశ్చర్యపోయింది "నువ్వెప్పుడొచ్చా వన్నయ్యా!" అన్నది కాఫీ బల్లమీదుంచుతూ. ఆమె ప్రశ్నకు జవాబు చెప్పకుండానే ఆమెనే పరీక్షగా చూస్తూ "రఘుకోసం తెచ్చినట్టున్నావు కాఫీ. అతను వెళ్లిపోయాడు." సహజంగా లేదు అతని కంఠం. అనుమానం, హేళన ధ్వనించాయి.

"నువ్వు తీసుకో" అంది మరేమీ అనలేక. కాంతారావు కాఫీ త్రాగి బల్లపై వుంచుతూ "అమ్మా! రేపే ప్రయాణం అన్నీ సర్దుకోండి."

"ఎక్కడికిరా? ఎందుకు?" అన్నది గోపమ్మ విస్మయంగా.

"ఎక్కడికి?....... నా వెంట, వరంగల్లు పోదాము, నాన్నగారు చనిపోగానే మిమ్మల్ని తీసుకుపోవాల్సింది. ఆడపిల్ల అని అభిమానంతో ఊరుకుంటే అప్రతిష్ఠ నాకంటింది."

"ఇప్పుడేం జరిగింది" గోపమ్మ అసహనంగా ప్రశ్నించింది.

"ఏం జరగాలి - చెల్లెలి గారి లీలావిలాసాలు బజారున పడ్డాయి."

"అన్నయ్యా!" సుచరిత కోపంగా అరిచింది.

"అరిస్తే ఎవరూ భయపడరు సుచరితా! అర్ధరాత్రి వరకు రఘు మనింటికి కాపలా కాయాల్సిన అవసరం?-"

"అన్నయ్యా! అవసరాలేమిటో మీరు కనుక్కుంటే ఏ చిక్కూ లేకపోవును. అమ్మ చావుబ్రతుకుల్లో వుందంటే చుట్టపు చూపుగా వచ్చి వెళ్ళారు. డాక్టరు వచ్చేవరకైనా ఉండమని బ్రతిమాలినా వెళ్ళిపోయారే? ఊరివాడు... ఒకచోట చదివిన వాళ్ళము. ఆ అభిమానంతో అమ్మను రాత్రింబవళ్ళు కంటికి రెప్పలా కాపాడిన రఘు తోచక ఇంటికివస్తే వెళ్ళమనే సంస్కారము అలవడ లేదు."

"అయితే మేమంతా సంస్కారహీనులమనేనా!"

"మీ సంస్కారాన్ని యెత్తిచూపటం కాదు నా ఉద్దేశం. మీ బాధ్యతలు గుర్తు చేసుకోండి అంతే. మీ పరువు మర్యాదలు మంటగలిపే పని ఎప్పుడూ చెయ్యలేదు."

"మూర్తిగారెవరు-?" అనుమానంగా చూశాడు.

"మూర్తిగారు నా స్నేహితురాలి భర్త. ఆమెకు టి.బి. అంటే అనంతగిరి శానిటోరియంలో చేర్చేరు. పిల్లలను దినమంతా చూసేవారు లేరని మమ్మల్ని యింట్లో బయటి గదుల్లో వుండమన్నాము. గిట్టని వాళ్ళు అన్నమాటలు విని లేక ఇల్లు ఖాళీచేసి వెళ్ళాడు."

"మీరు తప్ప అతన్ని ఆదుకునేవారే లేకపోయారా?"

"ఉండొచ్చు. కాని ఆ పరిస్థితుల్లో ఆ ఆలోచనలే రాకపోయాయి. అయినా స్వంతచెల్లిని నమ్మలేనివాడవు బయటివాళ్ళ మాటలు నమ్ముతావా అన్నయ్యా!"

"మంది కేంపట్టింది అబద్ధాలు కల్పించడానికి, ఇదిగో చూడు" నలిగిపోయిన కాయితం తీసి సుచరిత కిచ్చాడు. ధైర్యం చిక్కబట్టుకొని అన్నతో వాదించిందేకాని ఆమె చేతులు వణకసాగేయి. చీటీ విప్పింది. వంకర టింకరగా వున్నాయి.

"కాంతారావుకి!

మీ చెల్లెల్ని యిలా ఊరుమీద విడిచిపెడితే ఎలా? మాలాంటి వాళ్ళు సంసారాలు చెయ్యాలా వద్దా? తోటి టీచర్ భర్తను వలలో వేసుకున్నది. అతన్ని యింట్లోనే తెచ్చి పెట్టుకుంది. 'మూర్తిగారూ!' అంటూ అతన్ని విడువక తిరిగితే ఆయన భార్య చావడానికి సిద్ధమైంది. రఘు వుండనే వున్నాడు. అతనితో షికార్లు, సినిమాలు-ఒకటని చెప్పేదా-ఇక ఇప్పుడు కొత్త హెడ్‌మాష్టరు పోస్టు పట్టుకుంది"......

ఇక చదవలేక దాన్ని అక్కడే వదిలేసి గదిలోకి వెళ్ళిపోయింది. కాంతారావు తల్లి వంకచూచి విసవిసా బయటికి వెళ్ళిపోయాడు. క్రిందపడ్డ వుత్తరాన్ని చదివి గోపమ్మ ఉన్నచోటే బండరాయిలా కూర్చుండిపోయింది. రఘు గుర్తుకు రాగానే ఆమె హృదయం తేలికైంది.

పదిగంటలకు ఇంట్లోకి వచ్చి లైటు వేశాడు కాంతారావు. సుచరిత లోపలిగదిలో కళ్ళుమూసుకుని పడుకుంది. నిద్రబోయిందో, మేలుకుందో చెప్పటం కష్టం. గోపమ్మ గోడనానుకుని కూర్చుంది.

"అమ్మా వడ్డిస్తావా?" అన్నాడు షర్టు విప్పేస్తూ.



"కొంచెమాగు నాయనా! చల్లటి అన్నం తినలేవు. రెండునిమిషాల్లో గుప్పెడు బియ్యం పొంగిస్తాను" అని వంటింట్లోకి పోయింది.

"ఫరవాలేదు. నెమ్మదిగా చెయ్యి" సుచరిత దగ్గరకు వెళ్ళి ఆమె మంచంమీద కూర్చున్నాడు.

"సుచరితా! నిద్ర పోతున్నావా!" లేచి కూర్చుంది. కళ్ళు వుబ్బి వున్నాయి.

"చూడమ్మా! నీపై నా కనుమానం లేదు. నువ్వింత బాధపడతా వనుకుంటే అసలు చెప్పేవాడినే కాదు. సరే! జరిగిందాన్ని గురించి మరిచిపోదాము. జరగబోయేది ఆలోచిద్దాము. పురుషుని అండ లేందే స్త్రీ ఒంటరిగా బ్రతకలేదు. అన్నో, తండ్రో, భర్తో వుంటే ఏ నిందా రాదు. ఏ నిందవచ్చినా నీ ఒక్కదాంతో పోయేది అయితే యే గొడవా లేదు. మాకు అప్రతిష్ట వస్తుంది. మాకూ ఆడపిల్లలున్నారు. పెళ్ళిళ్ళు కావాలా, వద్దా? ఈ ఉద్యోగం యెవర్ని పోషించటానికి చెప్పు? ఇద్దరన్నలముండి నీకింత అన్నం పెట్టలేమా? నీ మేలుగోరి చెపుతున్నాను. ఇదివరకే ఎందరో ఎన్నో మాటలన్నారు నీ ఉద్యోగం గురించి. లెక్క చెయ్య లేదు. ఈ విషయాలు అందరికీ సంబంధించినవి కనుక బలవంతము చెయ్యాల్సివచ్చింది.

"నన్నేం చెయ్యమంటా వన్నయ్యా!"

"ఈ ఉద్యోగం మనకొద్దు. వరంగల్ పోదాం పద" అన్నాడు.

సుచరిత ఆలోచిస్తూ కూర్చుంది. కాంతారావు లేచాడు.

పనిమనిషి పిలుపు విని లేచింది సుచరిత. వెళ్ళి తలుపు తీసింది, పనిమనిషి ఆమెను ఎగాదిగా చూసింది.

"జొరం వచ్చిందా అమ్మా! మొఖం గంజిపోయింది" అన్నది.

"లేదు. రాత్రి అన్న వస్తే మాట్లాడుతూ నిద్రపోలేదే" అన్నది.

సుచరిత ముఖం కడుక్కుని తల్లిదగ్గర కొచ్చింది. గోపమ్మ అప్పుడే లేచి పళ్ళపొడి చేతిలో వేసుకుంది.

"అమ్మా ! పోనీ అన్నయ్య వెంబడి వెళ్ళిపోదామా? ఇంత జరిగాక ఈ ఊళ్ళో ముఖం యెత్తుకు యెలా తిరిగేది?"

"అక్కడ మాత్రం ఇలాంటివి జరగవనా! మనుషులూ. మనసులూ

యెక్కడయినా ఒకటే. మీ వదిన గుణం నీకు తెలియదు తల్లీ! ఆమె దగ్గర నువ్వుండలేవు. అన్నయ్య సంగతి యెరుగనిదా? మనమీదే సాగిస్తాడు ఈ డాబు! ఆవిడ ముందు పిల్లే" కాంతారావు లేచిన చప్పుడయితే ఇద్దరూ వంటింట్లోకి వెళ్ళారు.

రఘు కారొస్తే కాంతారావు వెళ్ళిపోయాడు. కాలమహిమ బహుచిత్రము! కాంతారావుకు కారు పంపి కూర్చోగానే హాస్పిటల్ నుండి ఫోను వచ్చింది రఘుకు. చెప్పవల్సిన వన్నీ నాయర్‌కు చెప్పి టాక్సీలో హాస్పిటల్ చేరాడు.

* * *

తలవంచుకొని స్కూల్లో అడుగుపెట్టిన సుచరిత పిల్లలు గుంపులు గుంపులుగా ఉండటం చూచి ఆశ్చర్యపోయింది. వాళ్ళని పలుకరించకుండా లోపలికెళ్ళి అటెండెన్సు రిజిష్టర్‌లో సంతకం పెట్టి తలెత్తింది. "పాల్ సుచరిత ప్రేమికులు" "పాల్ సుచరిత ఆదర్శ ప్రేమికులు!" రకరకాలుగా నల్లని బొగ్గుతో రాసి వున్నాయి. తలకొట్టేసినట్లు అయింది. ఇంకెవరన్నా చూస్తున్నారేమో చుట్టూ చూసింది. తొమ్మిదో తరగతి పిల్లలంతా ఉన్నారు.

"బయట ఇంకా అసభ్యంగా రాశారు టీచర్! చెరిపివేశాము" అన్నారు. యెందుకు భూమి బ్రద్దలయి తన్ను చేర్చుకుని ఈ అవమానం నుండి రక్షించదు? ఓ పిల్లాడి దగ్గర తెల్లకాగితం అడిగి తీసుకొని దానిమీద రెండు గీతలు గీసి హెడ్‌మాష్టరికివ్వమని చెప్పి, రంగయ్యకిచ్చింది. పిల్లలు పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయింది. అప్పుడే బస్సు రావటంతో అందులో ఎక్కేసింది.

పాల్ వచ్చి కూర్చోగానే పేపరు కనిపించింది. పేపరు చూస్తూ కూర్చున్నాడు.

"అయ్యగారూ! సుచరితమ్మ ఈ చీటీ యివ్వమన్నారండీ" అన్నాడు.

కాగితం తీసుకొని చదివి తెల్లబోయాడు. సుచరిత జాబ్‌కు రిజైన్ ఇచ్చింది. "రంగయ్యా! అమ్మగారు ఇంకేమన్నా చెప్పారా?"

"అమ్మగారు ఏం చెప్పలేదు గాని..." చెప్పడానికి తటపటాయించాడు.

"అసలేం జరిగింది? నీ కేం భయంలేదు చెప్పు?"



"ఎవళ్ళో గిట్టనోళ్ళు బాబూ? మీపేరు ఆయమ్మపేరు బొగ్గుతో అడ్డమైన కూతలు గోడమీద రాశారండి. పిల్లలు బయటవన్నీ తుడిచేశారు- ఒక్క మీ గదిలోనివి మాత్రం అమ్మగారు చూశారు. వెంటనే ఈ కాగితం మీద రాసి వెళ్ళిపోయినారు."

"నా గదిలోకూడా రాశారా?" క్రోధాశ్చర్యాలతో అడిగాడు.

"అవును బాబూ-"

"తాళంవేసి ఉంటుంది కదా - ఆ కాపలావాణ్ణిలా పిలు..." గర్జించాడు పాల్.

రంగయ్య నిమిషాల మీద షేక్‌ను పిలుచుకొచ్చాడు. షేక్ వచ్చి దొంగ నమస్కారం పెట్టి నిల్చున్నాడు.

"షేక్ ! నిన్ను పనిలోనుండి తీసివేస్తున్నాను."

"ఎందుకు సాబ్ ! నే నేం జేశాను?"

"నీకు తెలియకుండా నా ఆఫీసుగదిలో ప్రవేశించి, పిచ్చిరాతలు రాసే సాహసం ఎవరికున్నది?- ఈసారి రాయనిచ్చావు ఇంకోసారి ఆఫీసు కాగితాలు తియ్యనిస్తావు. తక్షణం వెళ్ళు, లేకుంటే పోలీసులకు రిపోర్టు యివ్వాల్సి ఉంటుంది.

షేక్ పాల్ రెండు కాళ్ళూ పట్టుకున్నాడు. భోరున ఏడుస్తూ "మాఫ్ చెయ్యండి సాబ్ ! తప్పైపోయింది-"

ప్రార్థనగంట కావడంతో పిల్లలు గ్రౌండ్‌వైపు వెళ్ళారు. ఒక ఎలెవెన్త్ క్లాసు పిల్లలు మాత్రం ఉండిపోయారు.

"సర్! టీచర్ ఈ అవమానం భరించలేక ఏదైనా అఘాయిత్యం చేసుకుంటే?" రమేష్ అడిగాడు.

"సుచరితగారు అంత పిరికివారు కారు." రమేష్‌కు జవాబుచెప్పి, సూటిగా వాళ్ళవంక చూస్తూ "ఒక్క విషయం చెప్పండి. ఈ గూడుపుఠాణీలో మీ పాత్ర లేదు కదా?"

"సర్!" కొన్ని కంఠాలు బాధగా అరిచాయి. రమేష్ జవాబు చెప్పాడు.

"ఆమె మాకు టీచర్ ఒక్కతే కాదు. ఒక అక్కలా చూచుకున్నాము. ఆమెను ఎంత అభిమానిస్తామో ఎలా చెప్పేది?...సర్! ఈ స్కూల్లో సైన్సు

వస్తువులన్నీ భద్రంగా దాచిపెట్టబడి వుండేవి. ఆమె వచ్చినాకే వాటిని దుటి ప్రయోగించే విధానం నేర్చారు."

"మిష్టర్ రమేష్! మొదట ఈ రోగ్‌ని తీసుకెళ్ళి ఇంకా ఈ మంత్రాంగములో పాలు పంచుకున్నవారి పేర్లు తెలుసుకో! ఇది క్షమించరా నేరం!" రమేష్ తదితరులు షేక్‌ను తీసుకొని వెళ్ళిపోయారు.

సాయంత్రం వరకు నలుగురికి రిలీవింగ్ ఆర్డర్సు వచ్చాయి-లలిత దేవదానం, గోపాల్, క్రాఫ్ట్‌మాష్టరు జాఫర్. ఈ నలుగురూ మారుమూల పల్లెట ట్రాన్స్‌ఫర్ చెయ్యబడ్డారు. అతని ఇన్‌ఫ్లుయెన్స్‌కు ఆశ్చర్యపోయారు. మిగిలి టీచర్లు కిక్కురుమనలేదు. జాఫర్ రాయటం తప్పు నే నేం ఎరుగను మొత్తుకున్నా వినలేదు పాల్. దేవదానం తనను క్షమిస్తాడనుకున్నాడు.

కర్తవ్యనిర్వహణలో జాతి, మతం ఏవీ అడ్డురాకూడదని ప్రత్యక్షంగా చూపాడు పాల్. స్కూలే చిన్నబోయినట్టు కనిపించింది. సాయంత్రం రెండు పీరియడ్లు ముందుగా విద్యార్థులను వదిలాడు. రమేష్‌ను సుచరిత యింటి పంపి స్టాఫ్‌మీటింగ్ పెట్టాడు. అతని ముఖం కూడా చిన్నబోయింది.

"లేడీస్ అండ్ జెంటిల్ మెన్!

నా అడ్మినిస్ట్రేషన్లో ఇదొక దుర్దినము! ఒక అమాయకురాలికి జరిగి అవమానం జన్మలో మరిచిపోలేనటువంటిది. ఇలాంటి అపనిందలు వెయ్యటానికి అవకాశమే కనిపించదు. కాని, అసూయతో చేసినపని ఆ స్పష్టమవుతుంది. సుచరితగారు కష్టపడి పనిచేస్తారు. కాలక్షేపానికి క్లాసుల ఎగ్గొట్టదు! అదేవిధంగా యింకా కొందరున్నారు... వెంకటేశం వైపు చూచాడు వాళ్ళందర్నీ గౌరవిస్తాను. నేనే కాదు. ప్రపంచమంతా పనిచేసేవాళ్ళను మెచ్చుకుంటుంది. తాము అలా పనిచేసి చూపాలి. అంతేగాని వక్రమార్గాలు అవలంబించకూడదు. నేను పురుషుణ్ణి, తలెత్తుకు తిరగగలుగుతున్నాను స్త్రీ అలా కాదు, అవమానం సహించలేక యే అఘాయిత్యము చేసినా ఆ పాపం మీ కుటుంబాలను బాధించదా? ఆలోచించండి. స్కూలు ఒక పవిత్రమైన దేవాలయం వంటిది. మనసు పవిత్రంగా ఉంచుకోవాలి. ఉపాధ్యాయులే సంఘానికి మూలస్థంబాలు! అట్టివారు దృఢచిత్తులూ, పవిత్రహృదయులు



ఆయి ఉండాలి. మన దేశంలోనే ఉపాధ్యాయులంటే చులకన. కొంత మన ప్రవర్తన వల్లకూడా అలా చూడబడుతున్నా మేమో! ఇతర దేశాలలో, ఈ వృత్తి స్వీకరించే వ్యక్తి ఎన్నోవిధాలుగా తగినవాడై ఉంటాడు. మరొక్కసారి అందరినీ ప్రార్థిస్తున్నాను. ఇలాంటి దికముందు జరగకూడదు" అన్నాడు. కాని ఆ కంఠములో హెచ్చరికే వినిపించింది. అందరూ నెమ్మదిగా లేచి వెళ్ళారు.

పాల్ తన రూమ్‌లోకి వచ్చి రమేష్ కొరకు ఎదురుచూడ సాగేడు. బాధగా కళ్ళు మూసుకున్నాడు. అతని కళ్ళల్లో నుండి రెండు కన్నీటి బిందువులు రాలి వక్షం మీదుగా జారాయి. మొదటిరోజు అతడు చూచిన సుచరిత గుర్తొచ్చింది. బూడిదరంగు ఫుల్‌వాయిల్ చీర, నలుపు లాన్ జాకెట్టు, పెద్దరింగు ముడి, చేతులకు రెండేసి బంగారుగాజులు, మెడలో సన్నని గొలుసు! తను క్రిష్టియన్ అని పొరపడ్డాడు. కాని హిందూ వితంతు వనగానే హృదయంలో యెవరో బాకు దిగేసినట్టు బాధపడ్డాడు. తను సుచరితపై ప్రత్యేకాభిమానం చూపించాడా? అవును. ఆమెను తన హృదయంలో నిల్చిపోయిన దేవకన్యని గ్రహించుకున్నాడు తాను. అందమైన వస్తువులను చూచి ఆనందించవల్సిందే నేనది తన పాలసీ...

"సర్ ! " రమేష్, కృష్ణ నిల్చున్నారు. కళ్ళు విప్పి చూశాడు.

"టీచర్ వాళ్ళింటికి తాళం వుంది సార్! ప్రక్కవాళ్ళ నడిగితే, మధ్యాహ్నము వాళ్ళన్నగారితో ఊరికి వెళ్ళి పోయారని చెప్పారండి" అన్నాడు.

"దేవుని దయవల్ల క్షేమంగా ఉన్నారు. అంతే చాలు" అన్నాడు పాల్. థాంక్ యూ బాయస్! ఈ రోజు మీ సహకారమే లేకుంటే నేనేమీ చేసేవాడిని కాదు."

"నో మెన్షన్ సార్! అది మా డ్యూటీ! మా కొక్కటే బాధగా వుంది సర్, చిన్నప్పుడు మా అమ్మ, 'మంచివాళ్ళకు చోటుండదు', అని అనేది. అవి పిచ్చిమాటలు అనుకునేవాడిని. ఇప్పుడు నిజమేననిపిస్తుంది. రమాదేవిగారు వెళ్ళిపోయారు. సుచరితగారు రిజైన్ ఇచ్చారు. ఆ ఇద్దరూ ఈ స్కూల్లో పీరియడ్స్ మిస్ కాకుండా టీచ్ చేసేవాళ్ళు. సర్!"

"ఏం చేస్తాము ! అది దైవేచ్ఛ" పాల్, రమేష్ చాలా సేపు

మాట్లాడుకున్నారు. ఈ సంఘటనతో స్కూలు స్వరూపమే మారిపోయింది ఏమంటే ఏమవుతుందోనని అందరూ తమ మానాన తాము పని చేసు కుంటున్నారు. పిల్లల హృదయాలలో సుచరిత శాశ్వతంగా నిలిచిపోయింది

* * *

"హల్లో రఘూ! ఈ మధ్య హాస్పిటల్‌లోనే ఉంటున్నట్టున్నావు?" డాక్టర్ రావు కేక విని అటు తిరిగాడు రఘు.

"ఏమిటి అంటున్నారు...?"

"అంత పరధ్యానం ఏమిటయ్యా? ఇక్కడే కనిపిస్తున్నావు?"

"ప్రభుత్వము రోగులకే కాని డాక్టర్లకు తిండి పెట్టడం లేదు. లేకుంటే ఇక్కడే ఉండేవాడిని..."

"భోజనానికి యింటికి వెడుతున్నానని చెప్పటమా?" పెద్దగా నవ్వాడు రావ్. "ఇదివరకు డ్యూటీ అయిపోతే వెతికినా కనిపించేవాడివి కాదు. ఇంటికి వచ్చినా సామాన్యంగా దర్శనమయేది కాదు. అలాంటి వాడవు ఇరవై నాలుగు గంటలూ హాస్పిటల్లో ఉంటున్నావు. కారణం తెలుసుకోవచ్చా?"

"పెద్ద కారణం ఏమీ లేదు. విక్రమార్కుడు చేసేవాడట ఆరు నెలలు రాజ్యం, ఆరు నెలలు దేశాటన; అలాగే అనుకోండి. ఆరునెలలు ఉత్తుత్తి డ్యూటీ, ఆరునెలలు నిజమైన డ్యూటీ..."

"నువ్వుటయ్యా ఉత్తుత్త డ్యూటీ చేసేవాడివి?"

"అసలు సంగతేమిటో చెప్పారు కారు. విశేషం లేందే మీరు నన్ను పలకరించరు" అన్నాడు రఘు.

"విన్నావా, విన్నావా? ఎంతమాట అంటున్నాడో?"

"రావుగారూ? వినటానికెవరూ లేరండి. ఇక్కడున్నది మనమిద్దరమే. అసలు విషయం చెప్పండి" అన్నాడు రఘు నవ్వుతూ.

"ఏం లేదోయ్! రేపు నీ కారు కావాలి."

"మీది ఉండాలిగా?"

"ఉంది. మా మరదలు బొంబాయి నుండి వచ్చింది. ఓరుగల్లు



చూడాలనుకుంది. అదీ, దానీ పిల్లలూ, మేమూ, మా పిల్లలూ ఒక కార్లో పోగలమా?"

రఘు యే విషయాలు మరిచిపోవాలని రాత్రింబవళ్ళు రోగుల వద్దే గడుపుతున్నాడో ఆ విషయం...ఓరుగల్లు పేరు వినగానే సుచరిత జ్ఞాపకం వచ్చింది. తను దురదృష్టవంతుడు! రాత్రి వరకు హాస్పిటల్లో ఉండిపోయాడు. తన గురించి తల్లీ కూతుళ్ళు ఏమనుకున్నారో! కాంతారావుకి ఇష్టముండదు. అతనికి సుచరిత వైపునుండి డబ్బు రావాలనే ఉందేమో!

"ఏమిటయ్యా మహానుభావా! నిలబడే నిద్రబోతున్నావు?"

"ఆ. ఏం లేదు. అలాగే తీసుకెళ్ళండి" అన్నాడు తేరుకుని.

"నువ్వూ రాకూడదూ? సరదాగా వెళ్ళొద్దాము."

"అలాగే వస్తాను." అన్నాడు. క్షణక్షణానికి రఘులో మారే రంగులు చూచి నవ్వుకున్నాడు రావ్.

* * *

శిథిలావస్థలో ఆంధ్రవైభవానికి చిహ్నమైన ఓరుగల్లు చూస్తే కళ్ళు చెమ్మగిల్లాయి. కోట దేవాలయం సందర్శించారు. వాళ్లు మాట్లాడుకుంటూ, చర్చించుకుంటూ నవ్వుతూ తిరుగుతున్నారు. రఘు వాళ్ళల్లో ఒకడుగా తిరుగుతున్నాడే కాని మనసు మాత్రం సుచరిత చుట్టే పరిభ్రమిస్తోంది. అందరూ వేయి స్థంభాలమంటపం దగ్గర విశ్రమించారు.

"ఏం రఘూ! ముభావంగా వున్నావు ? రుద్రమ్మ జ్ఞాపకం వచ్చిందేమిటి? రావ్ హాస్యం చేశాడు.

"ఏం లేదు. నే నలా ఊళ్ళోకి వెళ్ళి వస్తాను." కార్లో కూర్చున్నాడు. మరుక్షణమే దుమ్ము లేపుకుంటూ కారు వెళ్ళిపోయింది.

కాంతారావు యింటి అడ్రసు, ఆఫీస్ తేలికగానే కనుక్కున్నాడు. ఆఫీసుకెళితే పనిమీద బెజవాడ వెళ్లాడని చెప్పారు. నెమ్మదిగా ఇంటివైపు పోనిచ్చాడు. తను వెళ్ళితే వాళ్ళేమనుకుంటారు? సుచరితను మొదట నిందిస్తారు. సుచరితకు ధైర్యం వుంటే యెవర్నీ లెక్కచేసేవాడే కాదు. సాంప్రదాయాలనే సంకెళ్ళు వదిలించుకొని తన్ను చేబడుతుందా సుచరిత?

ఒట్టిది !...అంతమాత్రానికి వెళ్ళి అశాంతి రేపడం దేనికి?" రకరకాలుగా ఆలోచించి తను వెళ్ళటం సమంజనం కాదనే నిర్ణయించుకున్నాడు. కారు వెనుకకు తిప్పాడు. ఇంటికి వచ్చేసరికి తల్లీ, వదినా వున్నారు. పిల్లలతో సందడిగా వుంది యిల్లు! వెళ్ళి తల్లిపాదాలకు నమస్కరించాడు.

"ఏమిటమ్మా యిలా వచ్చారు?-బావున్నారా వదినా?"

"బావున్నాము మరిదిగారూ? మీ బాగోగులు చూద్దామని యిలా వచ్చాము" అన్నది నవ్వుతూ సీత.

"వాడికి మఠం నిద్ర, సత్రం కూడు... బావున్నాయే" అన్నారు లక్ష్మమ్మ.

"తడబడుతున్నారమ్మా" అంటూ నవ్వాడు. విశ్రాంతి తీసుకుని భోజనాలు కానిచ్చి అందరూ మాటల్లో పడ్డారు. బంధువుల విషయాలు ఊరి విషయాలు మాట్లాడుకున్నారు.

"అత్తయ్యా! అన్ని విషయాలు తరువాత, ముందు మా మరిదిగారు పెళ్ళివిషయం ఏమంటారో కనుక్కోండి."

"వదినా! చదువుకున్న మీరూ అలాగే మాట్లాడుతారా? నేనేం చిన్నపిల్లాడినా! నాకు అవసరమనిపించినప్పుడు నేనే చేసుకుంటానుగా పెళ్ళి!"

"అరవై నిండాక. తలపండాక, పళ్ళూడాక, వణుకుతూ పిల్లను చూడ్డానికి బయలు దేరుదువుగాని."

"చూశావా అమ్మా! వదిన..."

"అదన్నది నిజమేరా! ముప్పైదాటాయి. ఏం అడ్డంకులు! చెప్పు. చదువు అయింది. ఉద్యోగమయింది. ఆ పెళ్ళి కాస్తా అయిందనిపించు. నేను నిశ్చింతగా వుంటాను. ఏ యాత్రలకో వెళతాను" అన్నది.

"అయితే నేను పెళ్ళిచేసుకోను. నువ్వు యింటిదగ్గరే వుండాలి" అన్నాడు నవ్వుతూ.

"నువ్వు నవ్వుతూ తప్పించేయకు. రేపు అన్నయ్యొస్తున్నాడు. బేగంపేటలో ఒక పిల్ల వుందట. వెళ్ళి చూద్దాము."

"రేపు నాకు అర్జెంటు కేసులున్నాయి."

"అదేం కుదరదు" ఖచ్చితంగా చెప్పింది లక్ష్మమ్మ. వెళ్ళి పడుకున్నాడు.



నిద్రలో సుచరిత గుర్తుకొచ్చింది. ఈ సమయంలో సుచరిత తన్ను తలుస్తుందా? ఏం చేస్తోందో? తలవక ఎలా వుంటుంది? సుచీ? ఏం చేస్తున్నావు? అనుకుంటూనే నిద్రబోయాడు.

* * *

"సుచరితా? చిట్టి గోల చేస్తూంది. జడ వెయ్యరాదూ!"

"వస్తున్నా వదినా! రెండే రెండున్నాయి చపాతీలు" సుచరిత జవాబు పూర్తికాకమునుపే విసుక్కుంది సావిత్రి.

"గంటనుండి చేస్తున్నావు. త్వరగా చెయ్యాలమ్మా! అయినా మీ అమ్మ ఉద్యోగం చేసే కూతురువని గారాబంగా మొగరాయుడల్లే పెంచిందాయె-" ఈ లోపల సుచరిత చేతులు కడుక్కుని రానే వచ్చింది. ఆడపిల్లలకు జడ వేసి, మొగపిల్లలకు తలలు దువ్వి అందరికీ దుస్తులేసి, భోజనం పెట్టి బడికి పంపించి దూరం వెళ్ళేవాళ్ళకు చపాతీలు డబ్బాలో వేసి యిచ్చింది.

"సుచరితా! వడ్డిస్తున్నావా!" కాంతారావు వచ్చాడు.

"అలాగే. నేను కూడా భోజనానికి కూర్చుంటాను. పది దాటితే సహించదు. తిన్నా అరగదు" సావిత్రి వచ్చి కూర్చుంటుంది. వాళ్ళ భోజనాలై ఇల్లు సర్దేసరికి పదకొండు. గోపమ్మ నెమ్మదిగా ప్రొద్దుటే లేచి కూతురికి సహాయం చేస్తుంది. ముదిమికన్నా అవమానం, అసహాయం ఆమెను ఎక్కువగా కృంగదీశాయి. ఆమె మంచం పట్టింది. కూతురు చాకిరి చూస్తూ ఇంకా కృంగిపోయింది. సహాయం చెయ్యబోతే సుచరిత రెస్టు తీసుకోమని కసురుకునేది. తల్లీ కూతుళ్ళ భోజనాలు అయ్యేసరికి పిల్లలు మధ్యాహ్నం బడినుండి వచ్చేవారు. పిల్లలకు భోజనాలు పెట్టి పంపించేసి ఏదయినా పుస్తకం చదువుదామని తియ్యగానే సావిత్రి పిలిచేది- ఆవలిస్తూ "కాస్త కాఫీనీళ్ళు పడేస్తావూ !" కాఫీ పెట్టి ఆవిడ కిచ్చెయ్యగానే యింకో పని పురమాయించేది. మీ అన్నయ్య వస్తారేమో! ఏం ఫలహారం చేస్తావు! వడ యిష్టం వారికి నేను చేస్తే మెచ్చరు. సుచరిత లేచి ఆ పనిలో లీనమవుతుంది. పెసరట్టు, బజ్జి ఏదో ఒకటి రోజూ వుండాలి. అక్కడినుండి రాత్రి పదిన్నరవరకు చేతినిండా పని. వంట, వడ్డనా ఆ తరువాత ఇల్లు కడిగి పాలు కాచే సరికి పదిన్నర! వచ్చి

పడుకుంటుంది. అప్పటికే గోపమ్మ నిద్రబోతుంది. నీరసంగా ఉండి మడి ఆచారం అన్నీ వదులుకుంది. స్నానం చేసి భోంచేస్తుంది. సాయంత్రం ఏ ఫలహారమో చేసి పడుకుంటుంది. అలసిపోయిన సుచరిత అన్నీ మరి నిద్రబోతుంది. రఘు జ్ఞాపకాలు మాత్రం మధురస్వప్నంగా మిగిలిపోయాయి తీరిక చిక్కితే రఘు, తరవాత రమాదేవి గుర్తొచ్చి ఆమె మనసును కలచివేస్తాయి రఘు అరాధన సామాన్యంగా మరుపుకొచ్చేదా! తను చెప్పి రాలేదు. బాగా కోపం వచ్చి ఉంటుంది. వస్తేనే మంచిది. అతని జీవితమన్నా ఓ దారి పడుతుంది... కళ్ళల్లో నీరు తిరిగాయి.

"సుచరితా! వీలు చూసుకొని పిల్లలకు పాఠాలు చెపుతూ ఉండమ్మా బొత్తిగా చదవరు" అన్నగారి ఆజ్ఞ.

"అలాగే అన్నయ్యా!" అన్నదిగాని సమయమేది?

ఆ రోజు అంట్లు తొలుస్తూ కప్పు క్రిందపడేసింది పనిమనిషి సావిత్రి దాన్ని నానా మాటలు అన్నది. అది ఊరుకుంటుందా? "అమ్మా, అన్ని మాటలు ఎందుకు? జీతంలో దాని ఖరీదు పుచ్చుకో-" అంది బింకంగా.

"నీ కెంత పొగరే ! కప్పుపోతే జాగ్రత్తగా వుండమంటే మాటలంటావా!"

"మీరే ఎన్నో మాటలన్నారు-"

"అంటాను. యిష్టమయితే ఉండు, కష్టమయితే మాను."

"అలాగే మానేస్తాను" అని విసురుగా వెళ్ళిపోయింది.

"పోతే పోవే. నాకేం దొరకరా!" అంది ధీమాగా.

కాని వారం అయినా పనిమనిషి జాడే లేదు. ఆ పనులూ సుచరిత నెత్తినే పడ్డాయి. కూతురిచేత యేనాడూ పూచి పని చేయించని గోపమ్మ తల్లడిల్లి పోయింది. నెమ్మదిగా అంట్లు తొలిచి, కూరలు తరిగి, రొట్టెలకు పిండి కలిపి పెట్టేది కూతురికి. దగ్గూ, ఆయాసంతో గోపమ్మ ఒక్కొక్క రోజు లేవలే కాదు. చేసే వారుంటే రోగాలు చుట్టం చూపుగా కాక కోడళ్ళుగా వస్తున్నాయి

"ప్రొద్దున లేస్తే తల తిరుగుతూంది. అదేం పాపమో! కాళ్ళూ, చేతులూ పీక్కుపోతున్నాయి" వాపోతుంది సావిత్రి.

"ఇంక పనిమనిషి కుదరలేదా సావిత్రమ్మా?" ఉండబట్టలేక అడిగింది గోపమ్మ.



"కుదిర్తే పెట్టనా? ఈ రోజులలో పనిమనుషులు ఎక్కడ దొరుకుతారు?... దీర్ఘం తీసింది సావిత్రి.

"ఆ సంగతి తెలుసుండి కూడా దాన్నెందుకు మాన్పించావు అమ్మాయ్?" వచ్చే కోపాన్ని అణచుకుంటూ అడిగింది గోపమ్మ.

"అది పొగరుమోతుగా మాట్లాడితే కాళ్ళు పట్టుకోవాలా?"

"కాళ్ళు పట్టుకోమన్నానా?" అంది గోపమ్మ చిన్నబుచ్చుకుంటూ.

"మరి? - అయినా దాని మనసులో మంది యెక్కువయ్యారని ఉంది. నేనన్నమాట వంకబెట్టుకొని పోయిందిగాని-" సావిత్రమ్మ కొరకొరా చూచింది.

"ఎవరు కూర్చుని తింటున్నారని."

"అమ్మా! నువ్వూరుకో, ఇప్పుడు పనిమనిషెందుకులే వదినా! అయినా మనమంతా ఏం చేస్తామని?..." సుచరిత కలగ జేసుకుంది. సావిత్రమ్మ అత్తగారివైపు అదోరకంగా చూచింది.

"మీ అమ్మ చూడు, ఎలా మాట్లాడుతుందో! నువ్వేమో అరిగిపోయినట్టు!" అంటూ వెళ్ళిపోయింది బయట గదిలోకి.

"ఎందుకమ్మా అలా అడిగావు? ఇద్దరము తినేవాళ్ళము పెరిగామా? అదీగాక యిలా పని చేస్తుంటే అన్నీ మరిచిపోగలుగుతున్నానమ్మా!"

"అంతా నా ఖర్మ !" నుదురు కొట్టుకుంటూ కూలబడింది.

సుచరిత నాలుగు గంటలకు బయటి వరండాలో నిల్చుంది. స్కూలు పిల్లలు ఇళ్ళకు వెళుతున్నారు. తన స్కూలు, పిల్లలు గుర్తొచ్చారు.

గతం అంతా కళ్ళముందు తిరిగింది. రఘు గుర్తొచ్చాడు. మనసంతా అదోలా అయింది. తనో దురదృష్టవంతురాలు. అమృతఫలం అంజలిలో పడితే అందుకోలేక చేతులు మూసుకుంది. ఏమిటో ఈ అనుబంధాలు! సుమ, ఉమ ఎలా ఉన్నారో? రమాదేవికి నయమయిందో లేదో!

"పొయ్యిమీద టీ నీళ్ళు పడేశావేమో అన్నీ పొంగిపోయాయి."

"ఆఁ!.. టీ నీళ్ళు-వెళుతున్నాను వదినా!" సుచరిత లోపలి కెళ్ళింది.

"అత్తమీద చేతులు, అంగట్లో కళ్ళుంటే యెలా? చేతకాకపోతే, వెయ్యడానికిష్టం లేకపోతే చెప్పరాదూ?"

"అదేం లేదు ఒదినా! పొరపాటు జరిగిపోయింది." అన్నది సుచరిత. అయినా సావిత్రమ్మ సాయంత్రం వరకూ గొణుక్కుంటూనే ఉంది.

పనంతా పూర్తిచేసి కలతబారిన మనసుతో తులసికోట దగ్గర కూర్చుంది. రాత్రి చీకటిలో నక్షత్రాలు మిణుకు మిణుకుమని మెరుస్తున్నాయి. అలికిడి విని లేవబోయింది. అన్నా, వదిన వచ్చి వరండామెట్లపై కూర్చున్నారు.

"మధ్యాహ్నాము అలా చేసిందా? ఇప్పుడు మనము రాకుంటే ఈ తలుపులు ఇలా తీసి ఉండేవేగా? ఇంత బాధ్యత లేని పనులేమిటి? ఏమనడానికీ వీల్లేదు. కూతుర్ని రాచి రంపాన పెట్టినట్టు బాధపడుతుంది"

"అబ్బ! పోనిద్దూ! ఏదో ముఖ్యవిషయం చెప్తానని పిల్చి ఇదేం సోది!"

"అవును లెండి. నాదంతా సోది. ఇంకో ఇద్దర్ని మేపండి. నేనూ, నా పిల్లలు నోట్లో దుమ్ముకొట్టుకుంటాము. ఇంత ఇంగితం లేకుంటే ఎలా? ఆ అమ్మాయిని ఉద్యోగం మానిపించి తీసుకురమ్మన్నానా? ట్రాన్స్‌ఫర్ చేయిస్తే ఆసరాగా ఉండేది."

"ఎన్నిసార్లు చెప్పినా నీ పాట నీదేనా?- నేను చెప్పనే లేదు. ఏదో మాటవరసకి మందలించాను. అదే రిజైను చేసింది. అయినా అంత చదివింది. అమాయకురాలు- దానిచేత అంట్లు తోమించటం భావ్యంగా లేదు సావిత్రీ"

"ఆ మాటంటారని తెలుసు లెండి. నేనే తోముతాను. అయినా పిచ్చిగాని- మీచెల్లెలు మీకు అపురూపం కదూ? అవును. అందరినీ పడుకోమని, నేను చాకిరీచేస్తే అందరికీ, మీకూ సమంజసంగా కనిపిస్తుంది. నా ఆరోగ్యం దిగజారిపోతుంటే ఎవరికీ పట్టదు. ఉద్యోగం లేదు. ఇంట్లో పని చెయ్యకా ఏం జేస్తుంది?"

"నీ కెప్పుడూ ఆత్రమే. ఏదో స్కూల్లో ఖాళీ ఉందట డి.ఇ.ఓ. గారిని కలుసుకుంటాను." ఇద్దరూ లేచి వెళ్ళిపోయారు. తలుపులు వేసుకున్నారు. అప్పుడుగాని తలుపు లెయ్యొద్దంటే ఎంత జరగాలో అంతా జరిగేది. అలాగే కూర్చుంది. గోపమ్మ బాత్‌రూమ్ కెళ్ళాలని బయటికొచ్చింది. అప్పుడు సుచరిత లేచింది. "ఎవరూ?"

"నే నేనమ్మా!" సుచరిత కళ్ళు తుడుచుకుంటూ వచ్చింది.



"నువ్వు వరండాలో పిల్లలకు చదువు చెప్తున్నావనుకున్నాను-మరి తలుపెవరు వేశారు?"

"నే నిక్కడే కూర్చున్నాను. నేను నీ గదిలో ఉన్నాననుకున్నారేమో? వదిన తలుపేసింది. పద" తలుపు లేసి ఇద్దరూ గదిలోకి వెళ్ళారు.

ఎంతపనిచేసినా తృప్తిలేదు సావిత్రికి. సుచరిత వచ్చిన నాటినుండి అదనంగా అయిన ఖర్చు చూచుకొని బాధపడుతోంది. అది విని గోపమ్మ బాధపడుతోంది.

సంక్రాంతి వచ్చింది. సుచరిత గతాన్ని ఒక స్వప్నంగా తలుచుకుంది. సావిత్రి రెండురోజులు కొట్లన్నీ తిరిగి చీరలు తెచ్చుకుంది. పిల్లలకు తెచ్చింది. కాని సుచరిత కేం కొనలేదు. బట్టలు చూసుకుని అందరూ మురిసిపోతున్నారు. గోపమ్మ కూడా ఆ సంబరంలో పాలు పంచుకుంది.

"ఆ తెల్లచీర సుచమ్మకా సావిత్రీ?" గోపమ్మ అడిగింది. సావిత్రి ముఖం చిట్లించింది. "లేదు నాకే" అంది ముక్తసరిగా. గోపమ్మ లేచిపోయింది.

"ఎంతవారి కంత. ఈవిడ బుద్ధులు ఇలా ఉన్నాయి. కాబట్టే కూతురికి ఆ రాత రాశాడు దేవుడు. ఆ కూతురే నలుగురిలా సుమంగళయితే కొంప లేచిపెట్టేది. ముసలివాళ్ళయినా ఇంగితం ఉండదు" సావిత్రి సాధింపు సాగుతూనే ఉంది. పండగ రోజంతా వంట, వడ్డనతోనే గడిపింది సుచరిత. సాయంత్రం సావిత్రి పిల్లలతో కలసి పేరంటానికెళ్ళింది. చేతులు కడుక్కొని వచ్చి పెట్టె తీసింది. రఘు తెచ్చిన నీలం వెంకటగిరి చీర! ఒక్కసారి దాన్ని హృదయానికి హత్తుకొని శాంతి పొందింది. 'రఘూ! ఈ అభాగ్యురాలిని మరిచిపో!' అనుకుంది.

* * *

ముదురాకుపచ్చ సిల్కుచీర ముందుంచుకొని ఆలోచిస్తున్నాడు రఘు. కారు, ఆ చీరలో సుచరిత ఎలా వుంటుందో ఊహించుకుంటున్నాడు.

"ఏమయ్యా! మరిదిగారూ! చీరెక్కడిది చాలా బావుంది!" ?

వదిన వచ్చి దాన్ని చేతిలోకి తీసుకుంది. రఘు అయోమయంగా

చూచాడు. "నాకు తెలుసులే. పండుగకు నా కివ్వాలని కొన్నావు. మొహమాటం కొద్దీ దాచావు- అంతేనా-?"

"అత్తయ్యా! మీ పరధ్యానపు డాక్టరుగారు పండుగనాడు చీరకొని ఈరోజు- ముందేసుకు కూర్చున్నాడు " సంబరంగా అత్తగారికి చూపించింది సీత. లక్ష్మమ్మ కుమారుని ఎన్నికకు మురిసిపోయింది. "ఏంరా? పోనీ నిన్న యిస్తే వదిన కట్టుకునేదిగా!" అన్నది. రఘు మాట్లాడలేదు. నీరసంగా నవ్వాడు.

"నీ నవ్వులతో నన్ను తృప్తిపరచలేవురా. ఆ పిల్లకేం వంకుందో? కొ చదువు తక్కువ. యేం ఉద్యోగం చెయ్యాలా!"

"లేదమ్మా! వాళ్ళ సాంప్రదాయాలు నాకు నచ్చలేదు. వదినకు నచ్చాయేమో అడుగు. 'హల్లో డాక్టర్' అంటూ ఆ అమ్మాయి కరచాలనం చేస్తే నేను తెల్లబోయాను. తేరుకోవటానికి అయిదునిమిషాలు పట్టింది."

"అంతా నీ ఊహ."

"కాదు అత్తయ్యా? రఘు చెప్పింది నిజం. ఆ అమ్మాయిలో సంసారం చేసే గుణం మాత్రం కనిపించలేదు."

వీడికి వివాహం చేసుకునే యోగ్యతుందో లేదో!... పోనీరా నీ యిష్టమొచ్చిన అమ్మాయిని... కులం, గోత్రం అక్కరలేదు. నచ్చిన దాన్ని చేసుకో"

"చూద్దాము" అతడు లేచి స్నేహితులను చూడాలని బయటకి వెళ్ళాడు లక్ష్మమ్మ విసుక్కుంది.

"వీడు భలే నటన నేర్చాడు. ముహూర్తబలముంటుందేమోనే! సంక్రాంతి నెలలో పెళ్ళిచూపులేమిటి? మీరంతా నన్ను చాదస్తులంటారు."

"అది కాదత్తయ్యా! మనూర్లో యెంతమంది చెయ్యటం లేదు! నమ్మకంలో ఉంది. మనసులో యేదో ఉంది. చెప్పడు,"

"ఇక మనమెందుకు? వెళ్దామా ఊరికి?" అన్నది నిరాశగా.

వంటింట్లో మాటల సందర్భంలో నాయర్ సుచరిత విషయం ఎత్తాడు పేరు మాత్రం అంతగా జ్ఞాపకంలేదు అన్నాడు.



"మనింటికొచ్చిందా?"

"అయ్యగారికి కాలునొప్పి అయి నేను అన్నం వండితే వద్దు పొమ్మని ఆయమ్మ వచ్చి కాలు రాసి, కాపు వేసి, తనే అన్నం వండి పెట్టారు. కిక్కురుమనకుండా తిన్నారు."

"మేం వచ్చిం దగ్గరనుండి రావటం లేదేమి?"

"ఆయమ్మ ఊళ్ళోలేనట్టుంది. అందుకే అయ్యగారు ఏదో పోగొట్టుకున్నట్టు తిరుగుతుండారు" అన్నాడు.

"విన్నారా అత్తయ్యా!" అన్నది కోడలు.

"వింటున్నాను తల్లీ! నేను ఏ జాతిపిల్లయినా సరే నంటినిగా! దాపరికం దేనికో?"

"వాళ్ళ వాళ్ళు అంగీకరించారో లేదో!" అత్తాకోడళ్ళు ఆ అమ్మాయి గురించే మాట్లాడుకుంటూ కూర్చున్నారు. రఘు నడగాలని రాత్రి పదిగంటల దాకా యెదురు చూశారు. రాత్రికి సీరియస్ కేసు అటెండ్ చెయ్యాలని రాలేనని ఫోన్ చేశాడు రఘు.

లక్ష్మమ్మ రెండవరోజే ఊరికి ప్రయాణం పెట్టుకుంది. కుమారుని చేష్టలకు కోపం ముంచుకొచ్చింది. 'వాడి ఖర్మ?' అని సరిపెట్టుకుంది. ట్రైను ఎక్కించటానికి వచ్చినప్పుడు మాత్రం వదిన అడిగింది.

"చెప్పాలని కాదు... మాటల సందర్భంలో నాయర్ చెప్పాడు. నీ దగ్గర కెవరో అమ్మాయి వచ్చేదిట-చనువుగా తిరిగే వారట. మీ అమ్మకు యెవరైనా అభ్యంతరం లేదు. మరీ ఆలస్యం చేయకు."

"నేను కన్ను మూశాక చేసుకుంటాడే వాడు."

"అమ్మా!"

"కాదత్తయ్యా! ఈసారి వివాహం చేసుకుని కోడల్నే ఏకంగా నీకు తెచ్చి చూపిస్తాడు. కదూ రఘూ!" 'శుభం' అన్నట్టు చూసింది. ట్రైను ప్లాటుఫారమ్ దాటగానే బయటికొచ్చాడు రఘు.

* * *

కాంతారావు భోజనానికి కూర్చున్నాడు. సుచరిత వడ్డిస్తున్నది.

ఆలస్యమైందని ఆ రోజు సావిత్రి మొదలే భోజనంచేసి కూర్చుంది. "ఏమండీ ఇరవయ్యో తారీఖునే డబ్బు నిండుకుంటే పదిరోజులు ఎట్టా గడుస్తాయి!" సావిత్రి బాధపడుతూ చెప్పింది.

"ఈ నెలలో పండగొచ్చిందిగా? ఎవరిదగ్గరయినా తీసుకుని సర్దు వచ్చే నెలనుండి సుచరిత ఉద్యోగంలో చేరుతుంది. అంతగా ఇబ్బంది వుండదు" అన్నాడు కాంతారావు.

"ఉద్యోగమా? ఎక్కడండీ!"

"గవర్నమెంటు స్కూల్లో...సుచరితా! ఫస్టుకు వెళ్ళి జాయినవ్వాలమ్మా!"

"నాకిష్టం లేదన్నయ్యా, ఇలాగే గడిచిపోనియ్యి."

"ఎలా గడుస్తుంది? నేనూ పిల్లలు గలవాడినే. యెల్లకాలం మిమ్మల్ని పోషిస్తూ కూర్చుంటానా? అక్కడికి ఇక్కడికి చాలా తేడా వుంది. పిల్లలు అంత తెలివైనవారుండరు. పని పూర్తి చేసుకుని వచ్చేయి."

"మీ ఇష్టం!" అని లోపలికి వెళ్ళింది, అన్నా, వదిన ఏ పనిచేసినా ప్లాను ప్రకారం చేస్తారు. ఘటికులు అనుకుంది.

* * *

స్కూలు ఆవరణలో అడుగుపెట్టి ఆశ్చర్యపోయింది సుచరిత. పన్నెండు గంటలకే పిల్లలు ఇండ్లకు వెళ్ళుతున్నారు. ఉపాధ్యాయులంతా వరండాలో బెంచీలు ఒకచోట చేర్చి అక్కడ కూర్చుని పేకాడుతున్నారు. సుచరిత వారి దగ్గరకు వెళ్ళింది. కాసేపు పారాయణం ఆపి విచిత్రంగా చూశారు. దూరంలో లేసులల్లుకుంటున్న లేడీ టీచర్స్ కళ్ళింత చేశారు. సుచరితే మాట్లాడింది.

"నేను కొత్తగా అపాయింట్ అయి వచ్చాను. పేరు సుచరిత. హెడ్‌మాష్టర్ లేరా" అన్నది.

"ఉన్నాడు. ఇప్పుడే టీ త్రాగటానికి హోటల్‌కెళ్ళాడు" అన్నాడు ఒకతను తేరుకొని.

"ఇప్పు డొస్తారా?"

"రావచ్చు. లేదా బట్టలకొట్లో ఎవరూ లేకుంటే ఓ గంట కూర్చుని వస్తాడు" విచిత్రంగా చూచింది సుచరిత.



"కొత్తవారిదగ్గర అలా కట్టె, కొట్టె, తెచ్చె అని మాట్లాడితే ఎలారా? అయనకు బట్టల కొట్టుంది. కలప వ్యాపారం చేస్తాడు. ఏదో ఇన్ని వ్యాపారాలు కదా! ఎప్పుడన్నా దివాళా తీస్తే ఇంత అన్నం తినడానికి ఆసరాగా ఉంటుందని ఈ ఉద్యోగాన్ని పట్టుకు ప్రాకులాడుతున్నాడు" అంతా నవ్వారు. లేడీస్ దగ్గర ఓ చిన్న కుర్చీవేస్తే వెళ్ళి కూర్చుంది సుచరిత. మూడుగంటలకు వచ్చాడు హెడ్ మాష్టరు.

సుచరిత వెళ్ళి పరిచయం చేసుకుంది. అతను సుచరితను చూచి ఆశ్చర్య పోయాడు. "ఇంత అందాలబొమ్మ టీచరా?" అనుకున్నాడు. "ఇంత చండాలపు మనిషి హెడ్‌మాష్టరా?" అనుకుంది సుచరిత. తాంబూలంతో గారపట్టిన పళ్ళు! చవకరకం టెర్లిన్ గుడ్డతో ఇంకో ఇద్దరు సులువుగా దూరగలిగే షర్టు. మాంధాతల కాలం నాటి ఉలెన్ ప్యాంటు, నూనె ఓడుతున్న ముఖం! మాట్లాడుతుంటే లాలాజలం ఫౌంటెనులా విరజిమ్ముతోంది. చేతిలో చెత్తబుట్ట పరిమాణంలో ఉండే బ్యాగు.

"ఓహో! మీరేనా సుచరితంటే? కాంతారావుగారి చెల్లెలు కదూ?- చాలా సంతోషం! నువ్వు సైన్సు చెప్తావా"

"అవునండి" అంది. అతని ఏకవచన సంబోధనకు అసహ్యమేసింది.

"రేపు టైమ్‌టేబుల్ యిస్తాను" అన్నాడు కచ్చా. పిచ్చా పాన్ నములుతూ.

"మంచిదండీ" నమస్కరించి వచ్చేసింది.

"మన స్కూలుకు కళ వచ్చిందిరోయ్" ఎవరిదో కంఠం. వెనుకనే రెండుమూడు గొంతులు కలసి గొల్లున నవ్వాయి.

రెండవరోజు స్కూలుకెళ్ళింది పదిగంటలకు. ఓ పదిమంది టీచర్లున్నారు. పిల్లలుకూడా కొందరు ఓ దిబ్బ దగ్గర నిల్చున్నారు. దిబ్బమీద నిలబడి ఏవో రెండు మాటలు చెప్పి దిగాడు హెడ్‌మాష్టరు. "ఉహూఁ!" అని హుంకరించటం తప్పితే ఏమన్నాడో ఎవరికీ అర్థం కాలేదు.

పిల్లలు గోలగా అరుస్తూనే ఉన్నారు. రెండోవైపునుండి ప్రార్థన ప్రారంభమయింది. మామూలుగా అయితే 'వందేమాతరమ్' పాట వింటుంటే తల వంచ బుద్ధేస్తుంది. కాని అక్కడ ఆ పాట వింటుంటే చెవులు మూసుకో

బుద్ధేసింది, ఉచ్చారణదోషాలు కొల్లలు. 'భుమదల శోభనీ' "సుఖాశిని".

ఇంకా ఇలాంటి స్కూళ్ళు ఉన్నాయన్నమాట! పిల్లలు టీచర్లను తాకుతూనే అల్లరిగా యీలలు వేస్తూ క్లాసులకు పరుగెత్తారు. నిట్టూర్చి సుచరిత హెడ్‌మాష్టరి బల్లదగ్గరకు వెళ్ళింది. ఆయన ఫ్యూన్‌ను కేకేశాడు.

'ఒరేయ్ రాములూ! పోయి ఓ ఖారాకిల్లీ పట్టుకురా. జర్దా వెయ్యమనరా... నీకు టైమ్‌టేబిల్ ఇవ్వాలి కదూ... పదకొండు నుండి ఐదువరకు సైన్సు పీరియడ్లన్నీ నీవే తీసుకో. వెళ్ళు"

"యెన్నో పీరియడ్లో సైన్సు వుందో నాకెలా తెలుస్తుంది?"

"అబ్బ! అదికూడా చెప్పాలా? పిల్లల్ని అడుగు."

"హతోస్మి" అనుకుంది.

"పోనీ క్లాసువైజు టైమ్‌టేబుల్ ఇవ్వండి. నేను కాపీ చేసుకుంటాను" అన్నది చివరకు.

"అదెక్కడో పడిందమ్మా! వెళ్ళు, పిల్లలనడుగు"

పీరియడులు పిల్లల నడుగుకుంది. రెండవ పీరియడ్‌లో పదవతరగతి ఉంది, అక్కడకు వెళ్ళింది. విద్యార్థులు ఇష్టారాజ్యంగా కూర్చున్నారు. టీచర్లు క్లాసుకొస్తే విష్ చెయ్యాలన్న జ్ఞానం కూడా లేదు వారికి...ఏ హెడ్‌మాస్టరో పరిచయము చేస్తే తప్పితే వాళ్ళకు మాత్రం ఏం తెలుసు తను టీచరని? తన్ను తాను పరిచయం చేసుకున్నాక, వాళ్ళు సర్దుకుని కూర్చున్నారు.

"మీరు ఇంతమందేనా ఈ క్లాసులో," అన్నది.

"లేదు, ముప్ఫై ఆరుగురు టీచర్!" అన్నాడో కుర్రవాడు లేచి.

"ఈరోజు అందరూ రాలేదా?"

"వచ్చారండి. గ్రౌండులో కొందరు, బయట కొందరు ఆడుకుంటున్నారు. పిలవనా?"

"అదేం, క్లాసుంటే ఆటలకెలా వెళ్ళారు?"

"అలాగే వెళతారండి. రోజూ అలవాటేనండి" అన్నారు. ఇక లాభంలేదని వెనుక జరిగిన పాఠం తెలుసుకుని అందులో కొన్ని ప్రశ్నలు వేసింది. ఒక్కరూ సరియైన జవాబు చెప్పలేదు.



"రెండు నెలలు కూడా లేవు పరీక్షలు!"

"..............."

"మాట్లాడరేం? ఇదొక్కటేనా అన్ని సబ్జెక్టులూ ఇంతేనా?"

"అన్నీ అంతేనండి" ఒకబ్బాయి జవాబిచ్చాడు. మిగతావారు నవ్వారు.

" చదవాలని లేనిదే బడి కెందుకొస్తారు?"

"..........."

"ఇట్లా ఉంటే యెలా ప్యాసవుతారు?- మీకు ప్యాసవ్వాలని లేదా?"

"చదివి ప్యాసయినవాడు యెవడండీ?"

"అంటే!"

"ప్రతి స్కూల్లో టీచర్లే జవాబులు రాసి యిస్తారట కదండీ!"

"యెవరయ్యా చెప్పింది?"

"అందరూ అట్లానే చెబుతారండి. ప్రశ్నలు చేతికందగానే రాయి కట్టి బయటకు వేస్తారట. అక్కడ కొందరుండి ప్రాబ్లమ్స్ సాల్వ్ చేస్తారట. మళ్ళీ పేపర్లు ఉండలా చుట్టి బయటి నుండి క్లాసు రూములలోకి విసురుతారట! అన్నీ అంతేనట" సుచరిత విచిత్రంగా చూచింది.

"మరి వాచర్లు ఊరుకుంటారా?"

"ఊరుకోకపోతే బుర్ర రామకీర్తన పాడుతుంది"

సుచరిత మాటలుడిగి చూస్తూ కూర్చుంది.

"ప్రతి క్లాసూ అంతే. పదిమంది పిల్లలు క్లాసులో ఉన్నారు. మిగతావాళ్ళు బయట గ్రౌండులో ఉంటారు. హెడ్‌మాష్టరు పదకొండున్నరకే పనిమీద వెళ్ళిపోతాడు. మిగతావాళ్ళు వాళ్ళిష్టమొచ్చినట్టు తిరుగుతారు.

సైన్స్ క్లాసులో నిలబడి నీటిఒత్తిడి గురించి చెప్తోంది. తెల్లని దుస్తులు ధరించి టక్ చేసిన షర్టు, చక్కగా దువ్విన తల. ఓ యువకుడు వచ్చాడు. సుచరిత లేచి నమస్కరించింది.

"నువ్వేనా కొత్తగావచ్చిన సైన్సు టీచర్?"

"అవును. మీరే సబ్జెక్టు చెప్తారు!"

"ఆ! ఏమన్నారు?"

"మీ రేం చెప్తారు? లెక్కలా?"

"నేను నైన్త్ క్లాస్ మానీటరునండి" గర్వంగా కాలరు సరిచేసుకున్నాడు. గుడ్లు తేలేసింది సుచరిత.

"అవతల కొంచెము పని వుంది. రేపటినుండి నీ క్లాసుకు తప్పక అటెండ వుతాను."

'ఉద్ధరిస్తావు' అనుకుంది.

ఇంటికి బయలుదేరింది. లేడీస్ దూరంగా ఉండిపోయారు. ఒక్కతే బయలుదేరింది.

"అబ్బ! టీచర్ యింత అందంగా ఉందనుకుంటే క్లాసుకు వచ్చే వాడినిరా" వెనుతిరిగి చూచింది సుచరిత. నైన్త్ మానీటర్, తదితరులున్నారు.

"అచ్చం సినిమాతార సురేఖలా లేదూ?"

"ఛ! ఏడిసినట్టే వుంది నీ పోలిక. సురేఖ బొండాము"

ఇంకేమి వినాల్సి వస్తుందోనని త్వరత్వరగా వచ్చేసింది.

సుందర్, రమేశ్, కృష్ణ మదిలో మెదిలారు. వాళ్ళకూ, వీళ్ళకూ పోలిక? పరిమళ ప్రసూనాలు వాళ్ళు! గడ్డిపూలు వీళ్ళు! ఇంటికొచ్చేసరికి కాంతారావు యింట్లోనే వున్నాడు. కాఫీ టిఫిన్ల పని నెత్తిన పడ్డందుకు సావిత్రమ్మ చిరచిర లాడుతోంది. సుచరిత కాళ్ళు కడుక్కుని కాంతారావు గదిలోకి వెళ్ళింది.

"అన్నయ్యా!"

"ఏమిటి సుచరితా?" అన్నాడు రాసుకునే కాగితాలు ప్రక్కనబెట్టి.

"నేను ఆ స్కూల్లో పనిచెయ్యలేను అన్నయ్యా!"

"యెందుకని?........ యెంతో కష్టపడితే దొరికిందా ఉద్యోగం."

"అక్కడి వాతావరణం తలచుకుంటే భయం వేస్తుందన్నయ్యా! నన్ను బలవంతపెట్టకు"

"నా పరిస్థితి ఆలోచించు"

"కాదనలేను. కాని.... ఆడపిల్లల స్కూల్లో చూడన్నయ్యా?"

"అలాగే. మన మనుకోగానే దొరకొద్దా! ప్రయత్నిస్తాను."

ఇంటి పనులన్నీ చేసేసరికి నిద్ర ముంచుకొచ్చింది. ప్రొద్దున్నే లేచి



పనిచేసుకుని తయారయింది. ఎంతైనా అంత పని చెయ్యలేదుగా? కొంత పని మిగిలేపోయింది. సావిత్రి అదోలా ముఖంపెట్టుకుంది. తను మాత్రం ఏం చెయ్యగలదు. వెళ్ళిపోయింది.

స్కూల్లో అడుగు పెట్టగానే ఆశ్చర్యపోయింది. నిన్నటి ప్రార్థన గూడా లేదు. పిల్లలు గోలగా అరుస్తున్నారు. సుచరిత వెళ్ళి కూర్చుంది. ఒక టీచరు కొత్తబట్టలేసుకుని వచ్చాడు. అతనికి అందరూ అభినందనలు తెలిపారు. అతడు టీపార్టీ ఇచ్చాడు. ఆ రోజు అతని పుట్టినరోజట! పిల్లలు మర్యాదగా మాట్లాడలేకపోయినా లాంఛనాలు తెలుసు, అందరూ కలిసి ఒక వెండిగ్లాసు తెచ్చి బహూకరించారు. ఓ ముసలి టీచర్ లేచి, "హాపీ బర్త్‌డే టు యూ!" అంటూ పాట మొదలుపెట్టాడు. సుచరిత అందరితో పాటు కూర్చుంది.

"ఏమండీ ఒక్కమాట కూడా మాట్లాడరు?" బర్త్‌డే చేసుకునే బుజ్జి పాపాయి పలకరించాడు, పుట్టినరోజు వేడుక చిన్న పిల్లలకు తల్లులు చేసి చూడాల్సిన ముచ్చట. ఇదేమిటి! ఈయన ఇంత పెద్దాయన జరుపుకోవటం విచిత్రంగా అనిపించింది. అదీ స్కూలు ప్రెమిసెస్‌లో జరుపుకోవటం మరీ విచిత్రం!

"పోనీ మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయి. ఫలహారమన్నా చేయండి" యాంత్రికంగా ఫలహారం పూర్తి చేసింది. టీ తీసుకుంటూ "నాకు పీరియడుందండీ" అన్నది.

"మీరు సర్వీసుకు కొత్తా !" ప్రక్కనున్నాయన వింతగా చూచాడు.

"ఇదివరకు హైదరాబాద్‌లో చేశానండి..."

"ఇక్కడ చేసేపద్ధతి వేరుగా ఉంటుందండీ... మీకేం కష్టం లేదు. మీ యిష్టమొచ్చినప్పుడు క్లాసు కెళ్ళొచ్చు. లేకుంటే మానెయ్యొచ్చు. డెమోక్రసీ అంతా మన హెడ్‌మాస్టారు ప్రాక్టీసులో పెడుతున్నారు. మీకేం యిబ్బంది లేదు" ఆ రోజంతా అలాగే గడిచింది. ఒక్క క్లాసు కూడా జరగలేదు.

మూడుగంటలకు అందరూ వెళదామని బయలు దేరారు. ఒక బట్టతలాయన ఓ కుర్రాడిని వెంటబెట్టుకొచ్చాడు. ఏమిటన్నట్లు చూచారందరూ.

"రోజూ సమయంకాని సమయంలో యింటికొస్తాడు. అదేమిటంటే మా బడి వదిలారు అంటాడు."

"అంటే ?" బుజ్జిపాపాయి ముఖం చిట్లించాడు.

"అంటే పిల్లవాడిది పొరపాటా? లేక బడే అలా వదులుతున్నారా?"

"ఏదో ఒకటి! ఆరవ తరగతి పిల్లాడిని యిలా స్ట్రిక్ట్‌గా పెడితే బాగుపడ్డటే. వాడు మొదలు స్కూలుకు రానియ్యండి తరవాత రెగ్యులారిటీ నేర్చుకుంటాడు."

"జూన్ నుండి వస్తూనే ఉన్నాడుగా?"

"నువ్వు ప్లీడరువా?"

"ప్లీడరునైతే ఈ స్కూలుకి నా పిల్లాడిని యెందుకు పంపుతానయ్యా! యేదో ప్రైవేటు స్కూలుకు పంపుకుంటానుగా" రుసరుసలాడుతూ వెళ్ళిపోయాడు బట్టతల పెద్దమనిషి.

"బోడిగుండూ' వీడూ? ఆరా తీయటానికి వచ్చాడు." అందరూ గొల్లున నవ్వారు. సుచరితకు అసహ్యం వేసింది, పవిత్రమైన విద్యాసంస్థ యిది? ఆలోచిస్తూ యిల్లు చేరింది. స్కూల్లో జరిగిన విషయాలన్నీ అన్నతో చెప్పి బాధపడింది సుచరిత. కాంతారావు మౌనంగా విన్నాడు.

"నువ్వు బాధపడాల్సిన విషయమేముందక్కడ! నలుగురితో పాటు నారాయణ అనుకుంటే పోలా?" అన్నది సావిత్రి. సుచరిత విస్మయంగా చూచింది వదిన వంక.

"అదేమిటొదినా! నెలనెల జీతం తీసుకుంటూ అలా ప్రవర్తిస్తే యెంతమంది జీవితాలు నాశనమవుతాయి?"

"అయితే అవుతాయి నీకెందుకు? యేదో తొందరగా వచ్చేస్తే యింట్లో పనన్నా అవుతుంది. సింగినాదం, ఆదర్శాలు అనుకుంటే పనులవుతాయా?" రుసరుసలాడుతూ వెళ్ళింది లోపలికి.

మొదటిరోజే సుచరితకు ఆ స్కూలంటే అసహ్యం పుట్టుకొచ్చింది. అందుకే అక్కడినుండి త్వరగా బయటపడాలనే ఆదుర్దా యెక్కువైంది. వెళ్ళి క్లాసులో కూర్చుంది. ఆ రోజు హెడ్‌మాష్టరొచ్చాడని కొందరు క్లాసులో ఉన్నారు.



"సుచరితా! ఆ పిల్లాడు, సుబ్బిగాడినిలా పంపండి" ఒక మాష్టరొచ్చి అడిగాడు.

"క్లాసు అయింతరవాత పంపుతాను."

"క్లాసు ఎక్కడికి పోతుంది లెద్దూ? అవతల నా ఫ్రెండ్ వచ్చి నిల్చున్నాడు. కాఫీ తేవాలి."

"ప్యూన్‌ను పంపండి."

"ప్యూన్‌ను హెడ్‌మాష్టరు పంపారండి. అబ్బ! నీ ఆర్గ్యుమెంట్ చల్లగుండా."

పంపనని కచ్చితంగా చెప్పి వేసింది. ఆయన బుసలు కొడుతూ వెళ్ళిపోయాడు.

"నేను వెళతాను టీచర్ ! లేకుంటే పేల్చేస్తాడు" సుచరిత అనుమతి లేకుండానే ఆ పిల్లవాడు వెళ్ళిపోయాడు.

సుచరితకు కోపం ముంచుకొచ్చింది. వెళ్ళి హెడ్‌మాష్టరితో రిపోర్టు జేసింది. ఆయన కిళ్ళీ నములుతూ తలాడిస్తూ విన్నాడు.

"మీరూ అలాగే ఆయన పంపినట్టు ఎవర్నయినా పంపండి. అతడు వద్దంటే నేను అడుగుతాను"

నాకేం పని లేదు సర్ ! పిల్లల్ని పాఠం వినకుండా పంపాడు. అన్యాయమండీ?

"మీరే అన్యాయంగా మాట్లాడుతున్నారు. గురువుకు శిష్యుడు సేవచేయటం అన్నది లోకవిదితమే. ఈ రోజు క్రొత్తగా వచ్చిందేమీ లేదు. నాలుగురోజులు పనిచెయ్యాలంటే అందరితో కలసి మెలసి తిరగాలి"

సుచరితకు ఆశ్చర్యంతో నోటిమాట రాలేదు. ఇతడా స్కూలును నడిపే అధిపతి? బెల్ కావటంతో తొమ్మిదో తరగతికి వెళ్ళింది. క్లాసు మానీటరు హీరోపోజు పెట్టి ఫ్రంటు బెంచీలోనే కూర్చున్నాడు. వాడి వేషానికి నవ్వు, జాలి కలిగింది. పాఠం మొదలు పెట్టింది.

"టీచర్?" మధ్యలో అందుకన్నాడు మానీటర్. ఏమిటన్నట్టు చూచింది సుచరిత. "ఏ టీచరొచ్చినా మొదట రెండుమూడు రోజులు మంచికథలు చెప్తారు-మీరు కూడా ఓ కథ."

"అది యిప్పుడు కాదు. జూన్‌లో పుస్తకాలు అచ్చుయి రావు. అప్పుడు కథలు చెప్తారు. అది కాక ఇప్పుడు చెయ్యవలసిన పోర్షన్ చాలా వుంది."

"మీరే కదండి కొశ్చన్ పేపరు సెట్ చేసేదీ, దిద్దేదీనూ, ఎంత పోర్షనుతే అంతే ఇవ్వండీ" జగమెరిగిన పిల్లలు!... ఏం జవాబు చెపుతుంది? "నాకు కథలు రావు" అన్నది తప్పించుకోడానికి.

"కథలు కాకుంటే ఏమైనా జోక్స్ చెప్పండి" ఇంకో కుర్రవాడు అడిగాడు. ఇదేం తద్దినంరా బాబూ అనుకుంది. మూలనుండి ఓ పిల్లవాడు లేచి వచ్చాడు "టీచర్ ! 'ప్రేమించి చూడు' సినిమా చూచారా? అబ్బ ఎంత నవ్వొస్తుంది!"

"సాంగ్స్ కూడా బావున్నాయండి. మేడమీద మేడ గట్టి కామందు" అంటూ మొదలుపెట్టాడు మానీటర్.

"ఛ! దాంట్లో ఏం బావున్నాయిరా? టీచర్! 'మనుషులూ-మమతలు' అనే సినిమా మీరు చూచారండి? అబ్బ ఎంతబావున్నాయండి పాటలు!" సుచరిత ఒక శ్రోతగా మిగిలిపోయింది. అమాయకులు పిల్లలు. వాళ్ళకు ఏ దారి చూపితే ఆ దారి వెంటే నడుస్తారు.

"వక్త్" చూశారండి? హిందీ పిక్చర్స్ ఉన్నంత బాగా తెలుగు సినిమ లుండవు టీచర్!" ఇంకో అబ్బాయి తన అమూల్యమైన అభిప్రాయము వ్యక్తం చేశాడు.

"మీకు ఇన్ని సినిమాలు చూడ్డానికి డబ్బు లెలావస్తాయి?" సంశయిస్తూ అడిగింది.

"ఒక్క రూపాయి యెవరిదగ్గరయినా అడుక్కుంటాము. ఆ డబ్బుతో శుక్రవారం మ్యాట్నీ క్యూలో నిల్చుంటాము. యాభైపైసలవి రెండు టిక్కెట్లు కొంటాము. అవి గేటుదగ్గర బ్లాకులో అమ్ముతాము. మంచి పిక్చరైతే రూపాయికి అమ్ముతాము.

"మీ ఇంట్లో ఏమనరూ?"

"యెందుకంటారు? మేము సాయంత్రం ఇంటికి వెళతాము" ఆ అబ్బాయి తెలివితేటలకు ఆశ్చర్యపోయింది.

"నేను మాత్రం మా అమ్మమ్మ దగ్గర అడుక్కుంటా నండి" ఇంకో అబ్బాయి తన మంచితనం నిరూపించుకో జూచాడు.



"అమ్మమ్మా లేదు, తిమ్మమ్మా లేదు. జేబులు తడిమి చూస్తాడు టీచర్" ఇంకో అబ్బాయి నవ్వాడు.

"ఏమన్నావురా! నేనా జేబులు చూచేది? కావాలంటే అడగండి టీచర్. వాడి అన్న పక్కా దొంగండి" చర్రున లేచాడు.

"ఎవరు ఎలాంటి వారన్నది అనవసరం. నేను అడగలేదు. మీరు మాట్లాడొద్దు" వారించింది సుచరిత.

"వాడు మా అన్నను దొంగంటే ఊర్కోమంటారా టీచర్!" కయ్యిమని లేచాడు.

"నిజం చెప్పాను" అన్నాడు ధీమాగా.

వాళ్ళిద్దరికీ రాజీ కుదిర్చేసరికి తాతలు దిగివచ్చారు.

సుచరిత మనసు వికలమైపోయింది. స్టాఫ్‌రూములో పేకాట జోరుగా సాగుతోంది. అక్కడికి పోలేక వరండా స్తంభాన్ని ఆనుకుని నిల్చున్నది. సుందరం అనే వయసు మీరిన మాష్టరు వచ్చాడు.

"ఏమమ్మా క్లాసులు లేవా?"

"ఈ పీరియడ్‌లో లేవండి" అన్నది ముక్తసరిగా.

"చూడమ్మా! పెద్దవాడిని చెపుతున్నాను. సుశిక్షితురాలిగా కనపడు తున్నావు. మూడు రోజులనుండి నీ అవస్థ గమనిస్తున్నాను. ఇక్కడ నీలాంటి వాళ్ళకు చోటు లేదమ్మా! పోనీ ఏ గరల్స్ స్కూల్లోనన్నా ప్రయత్నించు. ఏమనుకోకు. అందమైన దానివి కూడాను." అతని మాటలు విని రోషంగా తలెత్తింది. అతని కళ్ళల్లోకి చూచి నీరు కారిపోయింది. వాత్సల్యము తప్ప ఏమీ లేదా కళ్ళల్లో.

"థాంక్స్ సర్ ! ఈ స్కూల్లో మీలాంటి వారు ఒక్కరున్నందుకు సంతోషం" అన్నది. అతను కాసేపు మాట్లాడి వెళ్ళిపోయాడు.

"మీకు నీతిబోధ మొదలు పెట్టాడా ముసలినక్క?" అంటూ వచ్చాడు బుజ్జిపాపాయి.

"నాకేం చెప్పలేదు. అనుభవం కలవారు ఏమి చెప్పినా తప్పు లేదు" అన్నది. అతను సుచరితను యెగాదిగా చూచి వెళ్ళిపోయాడు. సుచరిత

అన్యమనస్కంగా ఇంటి కొచ్చింది. ఉద్యోగం చెయ్యనని ఖచ్చితంగా అన్నకి చెప్పింది. కాంతారావు నచ్చచెప్ప చూచాడు. వినలేదు.

"ఆడపిల్లల బడిలో చూడండి. చేస్తాను."

"మనము మంచైతే ఎక్కడైనా నిలుస్తాము." సావిత్రి విసుక్కుంది.

"నాకు మంచిగా ఉండటం చేత గాదు. ఏం చెయ్యను" సుచరిత ఠకీమని జవాబు చెప్పింది. అలాంటి జవాబు ఆశించని సావిత్రి కోపంతో ఊగిపోయింది.

"విన్నారా? విన్నారా, ఆ మాటలు? ఇంత పెడసరపు మనుష్యులు ఎక్కడైనా నెగ్గుకు రాగలరా?" సావిత్రి భర్తను గదిలోకి పిలుచుకుపోయి మంతనాలు జరిపింది.

భార్యాభర్తలు ప్రశాంతంగా వున్నారు. సుచరిత ఆశ్చర్యపోయింది. రెండవరోజు రిజైను చేసి వచ్చింది. రెండురోజులు ప్రశాంతంగా గడిచాయి. ఆరోజు శివరాత్రి. గుడిలో పురాణం ఉందంటే గోపమ్మ మనమడిని వెంటబెట్టుకుని వెళ్ళింది. పనంతా అయ్యాక సుచరిత హాల్లో పిల్లలదగ్గర వాళ్ళకు రానివి చెప్తూ కూర్చున్నది.

"సుచరితా!" వాళ్ళ అన్నగారి సౌమ్యమైన పిలుపు వినిపించింది. ఎన్నడూ వాళ్ళ గదిలోకి వెళ్ళని సుచరిత సందేహిస్తూ గది బయటే నిల్చుంది.

"రామ్మా లోపలికి. నీకేం ఆటంకము?" అన్నాడు. లోపలికి వెళ్ళి కూర్చుంది సందేహంగా చూస్తూ. సావిత్రి స్టూల్లాక్కుని కూర్చుంది. కాంతారావు కొన్ని టైపుచేసిన కాగితాలు ఆమె చేతికిచ్చాడు. ఏమిటన్నట్టు చూచి తీసుకుంది. ఆమె అత్త వారిపై దావా వెయ్యడానికి సరంజామా!

ఆశ్చర్యంగా తలెత్తింది, "ఏమిటన్నయ్యా! ఇది?"

"ఏముంది! న్యాయంగా రావాల్సిన భరణం. నువ్వు బ్రతికి వున్నావని తెలిసి కూడా వాళ్ళు ఉపేక్షిస్తే, మనమేనా చేతగానివారము?" అన్నాడు.

"అన్నయ్యా! ఆ ప్రసక్తి దేనికి? నువ్వే అన్నావు-పిడికెడు మెతుకులు చాలని. ఆ పిడికెడు అన్నం గురించి వాళ్ళను దేవురించాలా? వాళ్ళకు నాకు అసలు పరిచయమెంత? వద్దన్నయ్యా! ఆ విషయం నేను మర్చిపోయాను...



మళ్ళీ గుర్తు చేయకు" ఆ మాట అంటుండగానే కళ్ళు నీళ్ళు నింపుకున్నాయి. సావిత్రి యేదో చెప్పబోయింది. వారించాడు కాంతారావు. "పిడికెడు మెతుకులు పెట్టమని కాదు; వాళ్ళు నీకు చెందవల్సింది అనుభవిస్తున్నారే అన్న బాధ."

"ఫరవాలేదు. నా జీవితంపట్ల ఆ మాత్రం సానుభూతి ఉంటే చాలు" అని లేచింది.

"ఇదే నీ నిర్ణయమా?"

"నన్ను బలవంతపెట్టకన్నయ్యా?"

"బలవంత మేముంది? నువ్వు సంతకం చెయ్యి. మిగతా విషయాలు నేను చూసుకుంటాను."

"అన్నయ్యా! ప్లీజ్ ! ఆ విషయం వదిలెయ్యి. నీ కో నమస్కారం చేస్తాను" కుమిలిపోయే చెల్లెల్ని చూస్తే కాంతారావు హృదయం ద్రవించి పోయింది.

"పోనీలేమ్మా! నువ్వేడవకు, అమ్మతో ఈ సంగతి చెప్పకు. అంతా మర్చిపో" అన్న వైపు ఆదరపూర్వకంగా చూచి కళ్ళు తుడుచుకొని బయటకి వచ్చింది. సావిత్రమ్మ కొరకొర చూస్తూ వెళ్ళిపోయింది? ఆ వచ్చిన కోపానికి అక్కడ వున్న పూలకుండీ బలైంది.

రోజూ సావిత్రి సాధిస్తూనే వుంది. పిల్లి మీద పెట్టి, ఎలుక మీదపెట్టి దెప్పుతూనే వుంది. సుచరిత చెవిటిదానిలా వుండటం నేర్చుకుంది. బలహీనంగా వున్న గోపమ్మ సహించలేకపోతున్నది.

ఆ రోజు సావిత్రి తమ్ముడొచ్చాడు. పిండివంటలు చేయించింది.

"ఏమిటక్కా విశేషాలు! బావకు ప్రమోషన్ వచ్చిందట?"

"ఆ, వచ్చింది. దాంతోబాటు యింట్లోకి మెంబర్లు ప్రమోట్ అయి వచ్చారు. యెంతొచ్చినా భోజనాలకు చాలటం లేదు. రేపు పిల్లల చదువులు, ఆడపిల్లల పెళ్ళిళ్ళూ ఎలా జరుగుతాయో?" అన్నది కొంపమునిగిపోయినట్టు గునుస్తూ.

"అంత కటకటలాడిపోవాల్సిన అవసరం ఏమిటక్కా"

"అయ్యో రాత! మీ బావగారి బలగమంతా ఇక్కడికే దిగబడ్డారురా! అమ్మ, చెల్లెలూను-"

"ఆవిడేదో ఉద్యోగం చేస్తుందన్నావు?"

"అందముందిగదా అని అహంకారంతో తిరిగితే అది కాస్తా ఊడ లాక్కున్నారు-" గుసగుసలాడినా అటుగా వెళుతున్న సుచరిత చెవుల్లో పడ్డాయి మాటలు? గుండెల్లో బాకు దిగినంత బాధపడింది. రెండవ రోజు రెండు కూరలు, పచ్చడి, పులుసు చేశారు. ఆయన ఎక్కడో పెద్ద ఉద్యోగమే చేస్తున్నారట. సెలవుమీద అందరినీ చూచిపోవాలని వచ్చాడు. అతని చూపులు వాలకం యెబ్బెట్టుగా కనిపించాయి సుచరితకు. మాటిమాటికి సుచరితను పిలిచి ఏదో పని పురమాయిస్తాడు. అయిష్టంగానే చేస్తుంది. ఆరోజు అక్కా తమ్ములు భోజనంచేసి లేచారు.

"ఏమిటోరా! ఈ ఖర్చులు! రోజుకో రకం వంటైనా చేసి పెట్టుకోలేని దాన్ని. ఇంట్లో ఖర్చులు చూస్తే తలతిరుగుతోంది. సంపాదించేవారు ఒక్కరూ! మెయ్యడానికి మంద."

"అస్తమానం అలా మాట్లాడితే పడి ఉండటానికి యువతలివాళ్ళు మనుష్యులే సావిత్రీ! మాకు తేరగా పెడుతున్నావా? యింటద్దెలన్నీ నెలనెలా తెచ్చుకోవటం లేదూ? అయినా ఇంటెడు చాకిరీ అది చేస్తూనే ఉందె..."

"ఊ అనొద్దు ఆ అనొద్దు! ఇదెక్కడి ఖర్మ? నా కష్టాలు నా తోబుట్టువుతో చెప్పుకుంటున్నాను. అద్దెలట అద్దెలు! బోడి అద్దెలు! మీరిద్దరు తినగా మిగిలింది బ్యాంకిలో వేసుకుంటున్నాము" తారాజువ్వలా లేచింది సావిత్రి.

"దేంట్లో వేసుకుంటున్నారో? అది మంచి పిల్ల కాబట్టి సరిపోయింది. లేకుంటే రోజుకో పోట్లాట అయ్యేది.- నాకు తొందరగా చావొచ్చినా పీడాపోను" అంటూ విలపించింది గోపమ్మ.

సావిత్రి భర్త వచ్చేవరకూ సాధిస్తూనే ఉంది. ఆయన రాగానే శోకాలు మొదలు పెట్టింది.

"ఏమైంది? ఎందుకు రాగాలు పెడుతున్నావు?" అన్నాడు చికాకుగా. అలసటగావున్న అతని మనసు వికలమైంది.



"ఈ యింట్లో మీరూ, మీ అమ్మ వుండండి. నేను నోరెత్తితే చాలు విరుచుకుపడుతోంది-"

"అమ్మా? మీ కేం కష్టమని పోట్లాడుకుంటారు?"

"నేను పోట్లాడానా? తేరగా తింటున్నానని ఊరికే అంటుంటే ఎంతకని వింటూ ఊరుకునేది?" అన్నది కళ్ళొత్తుకుంటూ. కాంతారావు కోపంగా చూచాడు తల్లివైపు.

"తేరగా తింటున్నారంటే కోపమా? మంచిగా ఏ సలహా ఇవ్వబోయినా వినిపించుకోరు."

"కాంతం!" ఆశ్చర్యంగా చూచింది గోపమ్మ.

"నేనే! నాకూ పిల్లలున్నారు. పెరిగిపోయే ఖర్చులు ఎలా భరిస్తాను? పరాయివాళ్ళు తినొచ్చట తనసొమ్ము. కాని మేము జ్ఞాపకమే చెయ్యొద్దట-" సందర్భము అర్థం కాని గోపమ్మ రాయిలా నిల్చుంది. సుచరిత కుమిలిపోతూ వంటింట్లోనుండి బయటికి రాలేదు.

రాత్రి తల్లీ, కూతుళ్ళకు నిద్రలేదు. ఎవరి ఆలోచనలో వాళ్ళున్నారు. తలుపులు తట్టిన శబ్దము వినిపించింది.

"అమ్మా! సుచీ! యెవరో తలుపు తడుతున్నారే?"

"పదకొండుదాటింది టైము. ఎవరై ఉంటారబ్బా!"

"సావిత్రి తమ్ముడేమో!" గోపమ్మ అనుమానించింది. సుచరిత లేచి వెళ్ళింది. తలుపు తీసిన చప్పుడు వినిపించింది. రెండుమూడు నిమిషాలకు 'అమ్మా' అన్న అరుపు వినిపించింది. గోపమ్మ నెమ్మదిగా లేచి హాల్లోకి వచ్చింది. హాల్లోని దృశ్యము చూచి కాళికాదేవిలా హూంకరించింది. "అప్రాచ్యుడా! వదులు నా బిడ్డను" అంతవరకు గట్టిగా తన కౌగిలిలో బంధించిన సుచరితను వదిలివేశాడు సావిత్రి తమ్ముడు. 'అందరూ నిద్రబోయే వేళ ఈ ముసలిముండ మేలుకుం దేమిటా !' అని ఆశ్చర్యపోతూ లోపలికెళ్ళాడు.

గోపమ్మ అరుపులకు కాంతారావు, సావిత్రి బయటికొచ్చారు.

సుచరిత రెండుచేతులతో ముఖం కప్పుకుని ఏడుస్తోంది.

"ఏమైంది?" ముఖం చిట్లించాడు కాంతారావు.

"ఏమవుతుంది!... నా రాత, దాని రాత! సుచరిత నడత మంచిది కాదని స్కూల్లోవాళ్ళు వెళ్ళగొట్టారు. బాగుచేయడానికి నువ్వు కంకణం కట్టుకున్నావు. అది తెలిసి నీ బావమరిది ఒక్కఊపు ఊపి చూశాడు." గోపమ్మ ఆవేశంగా అన్నది.

"వాడేం చేశాడు మధ్యన?" దీర్ఘం తీసింది సావిత్రి.

"వెళ్ళి తమ్ముడినే అడుగు. మీరంతా గౌరవము కలవారు-"

"గౌరవము లేదని ఏడ్చేకన్నా ఉండేటట్లు ప్రవర్తించరాదూ! వాడిని కవ్వించందే వాడెందుకు ముందుకు వస్తాడు...?"

"సావిత్రీ!" కుప్పలా కూలిపోయింది గోపమ్మ. "నీకూ ఆడపిల్లలున్నారు. ఇలా మాట్లాడటం న్యాయమా?" వలవలా ఏడ్చింది.

"నా ఆడపిల్లలకు నీ కూతురితో పోలిక తెస్తావెందుకు? నా పిల్లలను నేనలా పెంచను" అన్నది.

"ఒదినా! నీకో నమస్కారం పెడతాను మాటలతో ఎందుకు బాధిస్తారు? మీకు కావల్సింది ఆస్తేగా! రేపే సంతకం పెడ్తాను. తెచ్చుకోండి-"

"నీ ఆస్తి యెవడికి కావాలి బోడి ఆస్తి! నువ్వూ వద్దు, నీ ఆస్తీ వద్దు. దిక్కున్నచోటికి వెళ్ళండి."

"సావిత్రమ్మా!" అరచి క్రిందపడిపోయింది గోపమ్మ. సుచరిత వచ్చి తల్లిని పొదివి పట్టుకుంది. గోపమ్మ ఆయాసపడుతోంది. కాంతారావు సహాయంతో మంచం మీద పడుకోబెట్టింది తల్లిని సుచరిత

"అన్నయ్యా! డాక్టరును పిలువు. అమ్మగుండె ఎంత వేగంగా కొట్టుకుంటుందో చూడు." ఏడుస్తూ దీనంగా చూచింది సుచరిత.

"డాక్టరెందుకు ? ఆవేశంతో అలా అయిపోయింది. నువ్వే ఈ అనర్థాలన్నిటికీ కారణం! చచ్చినా పీడా పోవును."

"తలెత్తుకు తిరగాల్సిన రాత మనకుండొద్దూ!" సావిత్రమ్మ దీర్ఘం తీసింది

"ఛీ! ఛీ! లేని తద్దినం నెత్తిన పెట్టుకున్నాను." కాంతారావు అసహ్యంగా చూచి గదిలోకి వెళ్ళిపోయాడు. సావిత్రమ్మ భర్తను అనుసరించింది.



గోపమ్మ గుండె రాస్తూ కూర్చుంది సుచరిత. అర గంటకు కోలుకుంది. "అమ్మా! ఇప్పు డెలావుంది?" ఆతృతగా అడిగింది.

"ఈ మొండిఘటం చావదులే తల్లీ ! ఇంకెన్ని..... చూడాలో....ఆస్తి ఎక్కడిదే? ఆస్తి అంటున్నావు?"

"ప్రొద్దున చెప్తాగాని ఇప్పుడు మాట్లాడకమ్మా!"

"నా కేం లేదు చెప్పు తల్లీ...."

"ఆ రోజు చలపతన్న అడిగినట్టే పెద్దన్న కూడా మా అత్త వారిని డబ్బు అడుగుదాము అన్నాడమ్మా ! నేను వద్దన్నాను. అదే కోపం అన్నయ్యకు."

" ఆ.....వీళ్ళ ఆశ మండిపోనూ?...సరే తెలివి తక్కువగా ఏదో ఉద్ధరిస్తాడని ఆత్రపెట్టే అప్పటికప్పుడు ప్రయాణం అయి వచ్చాం. చూశావుగా రేపే పట్నం పోదాము. అక్కడ నేను చేయవలసిన పని చేస్తే తృప్తిగా చచ్చిపోతాను. వీళ్ళను నమ్మడం శుద్ధతప్పు.

"అలాగే యిప్పుడు ఎక్కువగా మాట్లాడకమ్మా" సుచరిత జాలిగా తల్లివంక చూసింది.

"అంత భయం దేనికి?... ఇంత చిన్న విషయానికి పోయేదాన్నైతే ఏనాడో పోదును" కళ్ళుమూసుకుంది గోపమ్మ.

ఆమెముఖం తృప్తిగా, ప్రశాంతంగా వుంది. త్వరలో నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోయింది. అప్పుడప్పుడు రఘు పేరు కలవరిస్తోంది. సుచరిత నిద్రపోకుండా ఆలోచిస్తూ కూర్చుంది. ప్రొద్దుటనుండి భోజనం లేదు. ఆకలిబాధ కన్నా అవమానం బాధ దహించివేయసాగింది. తనుంటే యెవరికి సుఖం? అమ్మకు రోజా గుండెలమీద కుంపటి! అన్నయ్యలకు అవమానం! తనేం సుఖపడుతుందని... భగవాన్! నాకీ జన్మ యెందుకిచ్చావు?" అంటూ ఏడ్చింది. నెమ్మదిగా లేచి పెరట్లోకి వెళ్ళింది. దూరాన కోళ్ళు కూస్తున్నాయి. పాడుపడిన బావి సుచరితను పిలిచింది.

తను లేని క్షణం అమ్మ ఏమవుతుంది? భగవాన్! ఏమిటీ మమకార బంధాలు! "నువ్వు చచ్చినా పీడా పోను" అన్నగారి మాటలు చెవుల్లో గింగురు

మన్నాయి. విధవా వివాహాలు ప్రోత్సహించేది వేదికపైనే! వీరేశలింగం పంతుల్ని రాజా రామ్‌మోహన్‌రాయ్‌ని, ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌ని వేదికపై తల్చుకొని వారి పటాలకు పుష్పమాలలు వేస్తారు. కాని వారి అడుగుజాడల్లో నడచి వారు ప్రవేశ పెట్టిన మార్పులను ప్రోత్సాహమిస్తూ ఆత్మలకు శాంతి చేకూర్చరు.

మన భారతదేశంలో ప్రజలు రెండు రంగాలలో నిపుణులు ఒకటి పిల్లలకు జన్మనిచ్చుటలో, రెండవది ఆచరణలేని మాటలు మాట్లాడుటలో... ఇది యెప్పుడు మారుతుందో! అంతవరకు ఆశ్రయహీనులగతి ఇంతే! రక్తం పంచుకుపుట్టిన అన్న అవమానం చేశాడు. కొంగునడుముకు బిగించి ఒక్కడుగు ముందుకు వేసింది. బలమైన హస్తము సుచరిత జబ్బ పట్టుకుంది.

వెనుకకు తిరిగిన సుచరిత ఉలిక్కిపడింది. గుడ్డి వెన్నెలలో ఆమె చెంపలపై నీళ్ళు తళుక్కుమన్నాయి. సావిత్రమ్మ తమ్ముడు నిల్చుని తన చేయి పట్టుకున్నాడు. అసహ్యంతో ముఖం ప్రక్కకు త్రిప్పుకుంది.

"క్షమించండి సుచరితా! నేను చెడ్డవాడినే కాని మానవత్వం లేని వాడిని మాత్రం కాదు. మీ విషయంలో తప్పుగా అంచనా వేసుకున్నాను?"

"మీరేం చేస్తారు? నా కర్మ" అంది ఏడుస్తూనే.

"నేను నిద్రకు దూరమై బాధపడుతున్నాను. చెప్పండి, మీ బాధ దూరం చెయ్యడానికి నేనేం చెయ్యగలను? మీరు ఇలాంటి సాహసానికి పూనుకుంటారనే మేల్కొని ఉన్నాను" అన్నాడు.

"నా రాతకు యెవరూ బాధ్యులు కారు. అంతమాత్రం అర్థం చేసుకుని సానుభూతి చూపించారు. అదే చాలు."

"ఒక్కమాట! ఇలాంటి అఘాయిత్యము తలపెట్టనని మాట ఇవ్వండి. మీ హృదయమెంత సున్నితమో గ్రహించాను!"

"ఫరవాలేదు. అలాంటి భయమక్కరలేదు. అదేదో బలహీనమైన క్షణం నన్ను విచలితురాల్ని చేసింది." అని కళ్ళుతుడుచుకుని లోపలికి వచ్చింది. సుచరితకు అంత బాధ లోనూ నవ్వు వచ్చింది. వదినకన్నా వదిన తమ్ముడే నయమేమో! వచ్చి పడకపై వ్రాలింది.

ఇంట్లో గిన్నెల చప్పుడుకు మేలుకుంది సుచరిత. సావిత్రి కంఠము



కూడా కంచులా మ్రోగుతోంది. "దాసీ దాన్ని నేను వుండగా అందరికీ ఏం పట్టింది లేవడానికి? తొమ్మిదైనా లేవరు. ఈయన కేమో తెల్లవారకముందే పనులు ముంచుకుపోతాయి. మీరొకటి ప్రతిపనిలో అడ్డు" చంటివాడి వీపు పేలిపోయింది. అంతా వినిపిస్తోంది. కాని సుచరితకు లేవాలనిపించటంలేదు. కళ్ళు మండుతున్నాయి. ఒళ్ళు నొప్పులుగా ఉంది, కడుపులో తిప్పుతోంది. కొంతసేపాగి ఓపిక చేసుకుని లేచింది. గోపమ్మ కూడా లేచింది.

"కాఫీ అయిందా?" కాంతారావు కేకకు సావిత్రి జవాబివ్వకుండా అక్కడే ఉన్న పెద్దాడికి నాలుగు అంటించింది.

"అబ్బబ్బా! వాళ్ళనెందుకు బాదుతావు? కాఫీ అయితే యివ్వు. లేకుంటే ఏ హోటల్లోనో త్రాగుతాను." అన్నాడు విసుగ్గా.

"ఇష్టమున్నచోట త్రాగండి. అందరూ బెదిరించేవారే"

కాంతారావు వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. గోపమ్మ వెళ్ళి గుమ్మంలో నిల్చుంది. "కాంతం! ఒక పదిహేను రూపాయలు కావాలి" అన్నది. అతడు కనుబొమ్మలు ముడి వేసుకున్నాడు.

"ఎందుకూ?" అన్నాడు.

"సుచరితను తీసుకొని హైద్రాబాదు వెడ్తాను" అన్నది.

"మీ ఇష్టమున్నచోటుకు వెళ్ళండి. నా దగ్గర డబ్బు లేదు." అంటూ వెళ్ళిపోయాడు.

గోపమ్మ నిస్సహాయంగా చూచింది. సుచరిత ఓపికున్నంతవరకూ పనులు చేసింది. కాఫీ త్రాగి ముడుచుకుని పడుకుంది. సావిత్రమ్మ తమ్ముడికి, పిల్లలకు గొణుక్కుంటూ అన్నాలు పెట్టింది. భర్త కొరకు ఎదురు చూస్తూ కూర్చుంది. కాని మధ్యాహ్నమైనా కాంతారావు యింటికి రాలేదు. సావిత్రి భోజనానికి కూర్చుంది.

మూడుగంటలకు ఆఫీసు ప్యూన్ వచ్చాడు. హనుమకొండదగ్గర కాంతారావు పరధ్యానంగా బస్‌కోసం వెయిట్ చేస్తోంటే, లారీ గ్రుద్దుకుందట. కొంచెములో ప్రమాదము తప్పింది కాని రక్తం చాలా పోయిందట. స్పృహలేని స్థితిలో హైద్రాబాదు తీసుకెళ్ళారట. సంగతి విని అందరూ గొల్లు మన్నారు.

సావిత్రమ్మ ఒకటే ఏడుపు. "నా యింటికి శని దాపురించింది. ప్రొద్దున్నే విసుక్కుని వెళ్ళారు. రోజూ కొంపలో రుసరుసలే. ఆమె తమ్ముడు త్వరగా వెళ్ళి టాక్సీ తెచ్చాడు. సావిత్రమ్మ కూర్చుంది. సుచరిత యెక్కబోతే చీదరించుకుంది- "ఇంకా ఎందుకు తల్లీ! నా కొంప ముంచావు" అంటున్నా బలవంతంగా ఎక్కి కూర్చుంది. గోపమ్మ, పిల్లలు ఇంటి దగ్గరుండిపోయారు.

* * *

"హాల్లో రఘూ! రౌండ్సు పూర్తిచేసుకున్నావా!"

"ఊ! ఏమిటి? మీరు చాలా బిజీగా వున్నారు? కొత్త కేసు వచ్చిందేమిటి?"

"అవునోయ్, ఓ యాక్సిడెంట్ కేసు, బ్లడ్ చాలా పోయింది. బ్లడ్ ఇచ్చాము. అతనికి బ్లడ్ ఇచ్చిన అమ్మాయి స్పృహ తప్పింది. చాలా ఆందోళనగా ఉంది-"

"ఇప్పుడప్పుడే యింటికి రారా?"

"ఎందుకు రాను? ఒక్కసారి ఆ అమ్మాయిని చూచి వద్దాము. జస్ట్ ఫైవ్ మినిట్స్" అన్నాడు. రఘు కూడా రావు వెంబడి వెళ్ళాడు. నర్సు ఎదురొచ్చింది.

"ఎలా వుంది?" !

"ఇప్పుడిప్పుడే స్పృహలోకి వస్తోంది... అందరూ ఆ యాక్సిడెంటు పేషెంటు దగ్గరే ఉన్నారు. ఆ అమ్మాయికి స్పృహరాగానే - త్రాగడానికిస్తే బావుండును."

"వాళ్ళతో చెప్పావా?"

"చెప్పాను. విని ఊరుకున్నారు."

"పోనీ-మీ రెవరన్నా పాలు త్రాగించండి" అని ఇద్దరూ గదిలోకి వెళ్ళారు. మంచంపై అచేతనంగా వడిలిన తోటకూరకాడలా పడివున్న అమ్మాయిని చూచి రఘు "సుచరితా!" అని పిలిచాడు. అతని కంఠం బొంగురు బోయింది.

"ఈమేనా రక్తం ఇచ్చింది!"

"అవును రఘూ! నీకు తెలుసా?"



"తెలుసుగాని యాక్సిడెంట్ జరిగినతను ఎవరట?"

"ఆవిడే చెప్పింది, తన అన్నయ్యని, అతణ్ని కాపాడమని ఒకటే గోలపెట్టింది. ఇద్దరి రక్తం కలిసింది."

వింటూనే సుచరితను పరీక్షించాడు. నర్సును పిలిచి ఏవో ఇంజక్షన్‌లు తెమ్మని పురమాయించాడు. రావు వంక తిరిగి "రావ్ ! కాసిని మంచి పాలు తెప్పించు" రావు అనుమానంగా చూచాడు.

"అతి నీరసంగా వుంది. ముందు ఏమన్నా ఇవ్వాలి" రావు వెళ్ళిపోయాడు.

రఘు మంచము చివర కూర్చుని సుచరితను పరీక్షగా చూచాడు. మాసిపోయి వెలిసిపోయిన చీర, తైలసంస్కారంలేని జుట్టూ, కళ్ళక్రింద నల్లగీరలు, బండబారిన అరచేతులు అలసటంతా ముఖంలో స్పష్టమవుతోంది. అంత చిక్కి రూపు మాసినా ఆ ముఖం వింత అందాలను వెదజల్లుతూనే వుంది. అరచేతులు రాశాడు. గరుకుగా తగిలాయి అప్రయత్నంగా కళ్ళల్లో నీరూరింది. సన్నగా మూలుగుతోంది సుచరిత. నర్సు తెచ్చిన ఇంజక్షన్లు యిచ్చాడు.

"నర్స్? మీరు ఇక్కడే ఉండండి. నేను ఆ పేషెంటును చూసి వస్తాను" రఘు వెళ్ళి కాంతారావుని చూచి ఆయన కేసు షీటు చదివి వచ్చాడు.

"ఈ పేషెంటు ఎప్పుడు వచ్చాడు నర్స్!"

"నిన్న రాత్రి ఎనిమిది గంటలకు సర్! ఉదయం బ్లడ్ ఇచ్చాము."

"మీరు వెళ్ళండి."

నర్స్ వెళ్ళిపోయింది.

సాయంత్రము అయిందింటికి పూర్తిగా తెలివిలోకి వచ్చింది సుచరిత. బద్ధకంగా కళ్ళు విప్పింది. పైన ఫ్యాన్ తిరుగుతోంది. సన్నగా చీకట్లు అలముకుంటున్నాయి. తనెక్కడుంది? తన గదిలోకి ఫ్యాన్ యెలా వచ్చింది? ఏదో మందుల వాసన గుప్పుమంది, నెమ్మదిగా గుర్తొచ్చింది. అన్నగారికి యాక్సిడెంటు జరిగింది-ప్యూన్ చెప్పితే-అందరు కార్లో వచ్చారు. రక్తం కావాలంటే-తను ఇచ్చింది-బల్లమీదుండగానే కళ్ళు తిరిగాయి-అంతే-"

"సుచరితా ! లేవగలవా?" ఎవరి దా గొంతు? మూతలు పడే కళ్ళు బలవంతంగా విప్పింది. మొదట ఎర్రని టై కనిపించింది. తెల్లని సూటు, నొక్కుల ఒత్తయిన జుట్టు ఎవరి దా రూపం! రఘుదే-కాని తను కల కనటం లేదు కదా? రఘు వంగి ఏమో అడుగుతున్నాడు. కళ్ళు మరింత పెద్దవి చేసి చూసింది. తెలివి వచ్చిందని తెల్సుకున్నాడు. తలదగ్గర కూర్చుని ఒక చేయి ఆమె భుజాల క్రిందుగా పోనిచ్చి రెండోచేత్తో పాలకప్పు పట్టుకున్నాడు. అతని చేయి ఆసరాగా ఉండటంతో కొద్దిగా లేచింది.

మూడు పూటల నుండి ఏం తీసుకోనందున గబగబా పాలన్నీ త్రాగింది. మరో కప్పు పోసి త్రాగించాడు. కర్చీఫ్‌తో మూతి అద్ది పడుకోబెట్టాడు.

"ఎలా ఉంది?"

"నీరసంగా ఉంది. అన్నయ్య కెలా ఉంది?" అన్నది. రఘు హృదయం అర్ద్రమైపోయింది. వదిన తనను నిర్లక్ష్యంగా వదిలినా అన్నగారి క్షేమం తనకు కావాలి. "ఫరవాలేదు. పడుకో" పడుకుంది. మళ్ళీ పదిగంటలకు మెలకువ వచ్చింది. లేచి పాలు త్రాగి నిద్రపోయింది.

"రఘూ! నర్స్ ఉంటుంది. వెళదాము పద." రావు వచ్చాడు.

"ఇప్పుడు రాలేను" అన్నాడు లేస్తూ.

"మధ్యాహ్నము కూడా లంచ్ తీసుకోలేదు. రా రఘూ!"

"థాంక్స్ ! ఆమె తెలివిలోకి వచ్చిందాకా నేను రానోయ్!"

"అయితే నేను విన్నదంతా నిజమేనన్నమాట?"

"నీ వేం విన్నావో నాకు తెలియదు. ఈమె ఎవరో చెప్పనే లేదు కదూ? నా బాల్యస్నేహితురాలు. ఈ నాటి నా ఆరాధ్యదేవత!"

"మరి దూరంగా ఉండిపోవటానికి కారణం?" కాసేపు మౌనంగా ఊరుకున్నాడు. తరువాత చెప్పాడు.

"మనము డాక్టర్లము. విధివిలాసము అంటే నమ్మం. కాని విధే మమ్మల్నీ ఆడిస్తోంది రావ్" నిట్టూర్చాడు రఘు. రావు వెళ్ళి క్యారియర్ పంపాడు. భోజనంచేసి అక్కడే కుర్చీలో నిద్రపోయాడు రఘు.

ఐదుగంటలకు నర్స్ వచ్చి సుచరితను లేపింది. ముఖం కడిగించింది.



"నర్స్ ! నేను నడవగలను. కాని నీరసంగా ఉంది. కాస్త చేయూత నివ్వగలరా?" నర్స్ బాత్‌రూమ్‌వరకు సుచరితను నడిపించుకు పోయింది. రఘు లేచి వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకుని వచ్చాడు. నర్స్ చిరునవ్వుతో యెదురొచ్చింది.

"గుడ్ మార్నింగ్ డాక్టర్ !"

"మార్నింగ్ ! హౌ ఈజ్ షీ ?"

"నౌ షి ఈజ్ ఆల్ రైట్ !" నర్స్ వెళ్ళిపోయింది. రఘు వచ్చేసరికి దిండు నానుకొని కూర్చుంది సుచరిత.

"ఇప్పుడెలా ఉంది సుచరితా!" ఆప్యాయంగా ఉన్న పలుకరింపు విని సుచరిత చలించిపోయింది. ఈ అయిదారు నెలల్లో ఆ ఆదరమైన పిలుపే వినిపించలేదు. ఆమె కళ్ళనుండి నీళు వచ్చాయి.

"అదేమిటి? యెందుకు కన్నీరు? యెక్కడికెళ్ళినా నా బాధ తప్పలేదనా?"

"రఘూ! మీరు నన్ను అపార్థం చేసుకుంటున్నారు" అతని చేతులు తీసుకొని అందులో ముఖం దాచుకుంది.

"అబ్బ! అసలే వీక్ గా ఉన్నావు. కంటతడి పెట్టొద్దు," చేతులు తీసి కన్నీరు ఒత్తాడు.

"ఇన్నాళ్ళకు ఆదరంగా పలుకరించే మిమ్మల్ని చూసే సరికి దుఃఖం ఆపుకోలేక పోయాను... ఇవి ఆనందబాష్పాలు. రఘూ!... మీరు నన్ను అంత కఠినంగా యెలా ఊహించుకున్నారు?"

"అదేం లేదు...ఊఁ టిఫిన్, పాలు తీసుకో. అంటూ ట్రేలో వున్న టిఫిన్ ప్లేటు ఆమె చేతికిచ్చాడు.

"మరి మీరు! నిన్నటి నుండి ఇక్కడే ఉన్నారట...ఫలహారం, టీ అక్కరలేదా?"

"తీసుకుంటాలే, నీ టిఫిన్ కానియ్యి?"

"ఊహు! మీరు చెయ్యందే నేను చెయ్యను-"

"సరే. నేను ఇంటికి వెళ్ళి దుస్తులు మార్చి టిఫిన్ చేసి వస్తాను. నువ్వు టిఫిన్ చేసి రెస్టు తీసుకో." రఘు వెళ్ళిపోయాడు.

సుచరిత ఫలహారముచేసి పాలు త్రాగింది. 'అయిన అనుభవాలు చాలు... ఇక రఘును నిరాశపరచవద్దు...తను మాత్రం యెంత సుఖంగా బ్రతికిందని? తను యెవరి మర్యాదకొరకు పాటుపడిందో వారే అపార్థం చేసుకుని శంకించారు....' బలవంతంగా ఆలోచనలు కట్టిపెట్టి, నెమ్మదిగా వెళ్ళి అన్నగారిని చూచివచ్చింది. బలహీనంగా ఉండటం మూలాన కాళ్ళు లాక్కుపోయాయి. కళ్ళు మూసుకుంది. రౌండ్స్ పూర్తి చేసుకుని వచ్చాడు రఘు.

"అప్పుడే ఒక్క దానివి అంతదూరం యెందుకు వెళ్లావు? కళ్ళు తిరిగితే యెంత ప్రమాదం!"

"ఎంత ప్రమాదమయినా తప్పించేవారు మీరున్నారుగా?" అన్నది నవ్వుతూ.

"మళ్ళీ నిన్ను చూస్తాననుకోలేదు-"

"యెందుకో?-"

"తెలియదా?- ఆ రోజు చెప్పి పోవాలనిపించలేదా? అత్యవసరంగా వెళ్ళినా ఉత్తరం కూడా రాయలేదు-"

"ఆరోజు తల తీసేసినంత పని అయింది" జరిగిందంతా చెప్పింది.

"నా బ్రతుకు ఎలా పోయినా-అన్నయ్యల గౌరవం, వాళ్ళ పిల్లల బాగోగులు ఆలోచించి వెళ్ళాను. కాని అనుక్షణం నరకయాతన అనుభవించాను."

"భోజనానికి ఇంటికి పద. మీ వదిన కూడా వస్తామన్నారు-" రఘు.

సుచరిత క్యాజువాల్టీ వార్డు కొచ్చేసరికి గోపమ్మ కాంతారావు పెద్దకుమారుడిని వెంటబెట్టుకొని వచ్చింది.

"నా కొడుక్కి యెలా ఉంది బాబూ!" అన్నది యేడుస్తూ.

"క్షేమంగా ఉన్నారు. మీరేం కంగారుపడొద్దు-" కాంతారావు దగ్గరకు తీసుకెళ్ళాడు ఆమెను. కట్లతో పడి వున్న కుమారుని చూచి గొల్లుమంది గోపమ్మ.



"అమ్మా!-వచ్చావా-నాకేం పరవాలేదు. ఏడవకమ్మా!" కాంతారావు కళ్ళు కూడా చెమర్చాయి.

"రఘుబాబూ! ఏం ప్రమాదము లేదు కదా? కుమారుని కాళ్ళూ, చేతులూ తడిమి చూచింది.

"అంతా బావుంది. చెల్లెలు తన రక్తంతో నన్ను బ్రతికించుకున్నదమ్మా"

"మీరు ఎక్కువగా మాట్లాడకండి..." జరిగినదంతా క్లుప్తంగా చెప్పాడు రఘు.

"పోనీలే బాబూ? పిల్లలు కలవాడు వాడు. క్షేమంగా వుంటే చాలు! రఘు బాబూ! నువ్వెళ్ళు నాయనా! మీరు వెళ్ళండి సావిత్రీ! నేను ఇక్కడే వుంటాను" మమతనే యెరిగిన మాతృమూర్తిని అక్కడినుండి కదిలించటం సులువుకాదని రఘు గ్రహించాడు. సావిత్రి, సుచరితను, బాబును తీసుకొని యింటికి వెళ్ళారు.

రఘు మర్యాదా, ఆప్యాయతా చూచి తన స్వభావాన్ని సడలించుకుంది సావిత్రి.

"వంటవాడు చేసింది పనికి వస్తుందా! మీరు చేసుకుంటారా?- మొహమాట పడొద్దు. ఒక్క ఊరివాళ్ళము. కలిసినట్లు ఉండాలి" రఘు నవ్వుతూ సావిత్రిని మాట్లాడించాడు.

"వద్దు తింటాను. హోటల్లో తినటం లేదూ?"

"నాయర్ ! అన్నీ తయారుగా ఉన్నాయా."

"ఉన్నాయి అయ్యగారూ! వడ్డిస్తున్నాను" జవాబిచ్చాడు.

"నీ ఒక్కనికి యింత పెద్ద యిల్లు యెందుకయ్యా!"

"ప్రక్కభాగంలో ప్రాక్టీసు పెట్టాలని ఉందండి."

"అవును వాళ్ళిచ్చే జీతం తిండి, తిరుగుళ్ళకు చాలదు. ప్రైవేటుగా ప్రాక్టీస్ చేస్తే యెంత లేదన్నా వెయ్యిరూపాయలు సంపాదించవచ్చు" అన్నది సావిత్రి. రఘు నవ్వుకున్నాడు. ప్రతిదీ డబ్బుతో చూస్తారు అనుకొన్నాడు. సుచరిత స్నానం చేసి నాయర్‌కు వడ్డనలో సాయం చేస్తోంది. అందరూ

కూర్చుని భోజనం చేశారు. గోపమ్మకు పాలు తీసుకుని హాస్పిటల్‌కు వెళ్ళింది సావిత్రి. బాబుకూడా యింట్లోనే ఉండిపోయాడు.

"ప్రొద్దుట వెళ్ళడం పడ లేదు. నేను కూడా వెళ్ళాలి. ఇద్దరు పేషెంట్లను చూడాలి. అలాగే రమాదేవి దగ్గరకు వెళ్ళాలి" అన్నాడు రఘు.

సుచరిత కళ్ళు మిలమిలా మెరిశాయి. కూర్చుందల్లా లేచింది. "నేనూ వస్తాను. అక్కయ్యను చూడాలి" అన్నది.

"అమ్మాయిగారూ! మీరు మా పేషెంట్లండి. మేము చెప్పినట్లు వినాలి. రెండురోజులు యెక్కడికీ తిరగొద్దు. తరువాత నేను తీసుకెళతా" అన్నాడు బట్టలేసుకుంటూ.

"కార్లోనేగా వెళ్ళేది..."

"వెళ్ళేది కార్లోనే. అక్కడికెళితే కబుర్లలో పడిపోతావు. నీకు రెండు రోజులు కంప్లీట్ రెస్టు కావాలి. మాట్లాడక ఇక్కడే పడుకో" ఆజ్ఞాపిస్తున్నట్టుగా చెప్పి వెళ్ళిపోయాడు. బాబు హాల్లో అప్పటికే నిద్రపోయాడు. అది రఘు మంచము అని గుర్తుకు రాగానే సుచరితకు తీయని ఊహలతో నిద్రాదేవి ఒడిలోకి జారిపోయింది.

ఎవరో భుజాలుపట్టి కుదుపుతున్నారు. అదరిపడి లేచింది. రఘు లేపుతున్నాడు. కళ్ళు విప్పి చూసింది. సంధ్య చీకట్లు అలముకుంటున్నాయి. టేబుల్ వాచ్ కేసి చూసింది. ఆరు చూపుతోంది.

"అప్పుడే ఆరుగంటలా? లేపనే లేదేమండి?" అన్నది లేస్తూ.

"ఇప్పుడెవరు లేపితే లేచావో?" అన్నాడు కొంటెగా.

"మీ రిప్పుడే వచ్చారా? అమ్మావాళ్ళు రాలేదా!"

"కొంచెమాగి వస్తారు. కారు, డ్రైవర్ని వదిలివేసి వచ్చాను."

అంటూండగానే నాయర్ కాఫీ తెచ్చాడు. సుచరిత ముఖం కడుక్కొచ్చి కాఫీ తీసుకుంది.

"మీ వదినా, నువ్వూ మాట్లాడుకోరా?"

"......................"

"మరేమీ అనుకోకు. ఆవిడలా పట్టీపట్టనట్టుంటే అడిగాను."



"మీ దగ్గర దాచవలసిన విషయా లేమున్నాయి?" తను అన్నా, వదినల దగ్గరకు వెళ్ళినప్పటి నుండి జరిగిన విషయాలు దాచకుండా చెప్పింది.

"మీ అన్నగారుకూడా అలా ప్రవర్తించటం ఆశ్చర్యంగా ఉంది."

"ఆశ్చర్యమేముంది? రేపు భార్యవస్తే మీరూ అంతే!"

"దురదృష్టవంతుడిని; నాకు అక్కచెల్లెళ్ళు లేరుగా" అన్నాడు.

"సుచీ? నువ్విప్పుడేం చిన్నపిల్లవు కావు. మంచీ చెడూ తెలుసు. నీ జీవిత మార్గము వెతుక్కునే స్తోమత నీకున్నది. సంఘం అని, బంధువులు అని అడ్డుపెట్టడం మూర్ఖత్వమే అవుతుంది. పిరికివాళ్ళకు తమ మనస్సాక్షే తమ కద్దు! ఆలోచించు. ఇంకా సమయం మించిపోలేదు" అన్నాడు.

సుచరిత జవాబు చెప్పేలోగా కారు వచ్చింది. గోపమ్మ, సావిత్రి వచ్చారు. గోపమ్మ స్టౌ మీద ఇన్ని బియ్యం పొంగించుకుని కారం, నెయ్యి వేసుకు తిన్నది. మిగతావారు నాయర్ వండిందే తిన్నారు.

రెండవరోజు అందరూ హాస్పిటల్ కొచ్చారు. చిన్నపిల్లలు ఎలా ఉన్నారోనని సావిత్రి దిగులు పడింది.

"మీ తమ్ముడున్నాడుగా?" అన్నాడు కాంతారావు.

"వాడేం జేస్తాడు? పనిమనిషి కూడా లేదు. తొందర్లో వాడిని పంపాను, సుచరితను పంపాల్సింది" అన్నది, ఎవ్వరూ మాట్లాడలేదు. "బాబు వెంట వెళ్ళమని చెప్పండి" అన్నది తనే.

"సుచరితెందుకు? మీ తమ్ముడున్నాడు? ఆమె వెళ్ళనంటోంది. నువ్వే వెళ్ళు" అన్నాడు కాంతారావు. సావిత్రి మరి మాట్లాడలేదు.

పరవాలేదు వెళ్ళమని రఘు చెప్పాక వెళ్ళిపోయింది.

వారం రోజులు కాంతారావును వుండమన్నారు డాక్టర్లు. ఎక్కడుండాలి అన్నది సమస్య! ఉన్న గది తప్ప ఇంట్లో భాగం అద్దె కిచ్చారాయె...

"ఏమిటి సామాన్లు కట్టక ఆలోచిస్తున్నారు?" రఘు వచ్చాడు.

"ఏం లేదోయ్! నేను ఊరు వెళదామనుకుంటున్నాను" అన్నాడు కాంతారావు.

"ఇంకో పదిరోజులుండాలి..."

"ఎలా? మా ఇంట్లో అంతా అద్దెకిచ్చామే?"

"భలేవారే! నేను అంత పరాయివాడినా? సామాన్లు కట్టండి."

"ఇప్పటికే నీకు చాలా శ్రమ ఇచ్చాను రఘూ!"

"అలాంటి మాటలు వద్దు! మీరు దూరంగా ఉండాలనుకున్నా నేను ఉంచలేను... సుచీ ... సుచరితా! సామాన్లు సర్దు" కాంతారావు ఏమీ మాట్లాడలేదు.

రఘు ఇంట్లో ఏ కొరతా లేకుండా గడిచిపోయింది. కాంతారావుకు పూర్తిగా నయం అయింది. రఘు ప్రతి కదలికను పరీక్షగా చూసేవాడు. అతను సుచరిత నెంత అభిమానిస్తాడో? ప్రేమిస్తాడో ఊహించుకోగలిగాడు. ఆరోజు మధ్యాహ్నము సుచరిత పుస్తకాలు దులుపుతోంది. కాంతారావు రఘు దగ్గర పుస్తకాలు తీసుకుందామని అతని గది దగ్గరకొచ్చి ఆగిపోయాడు.

"మీరీ మధ్య చీరలు కడుతున్నారేమిటి?" అన్నది కిలకిలనవ్వుతూ.

పుస్తకం చదువుతూ అటు తిరిగి పడుకున్న రఘు సుచరిత నవ్వు విని ఇటు తిరిగాడు "ఏమిటి?"

"మీ బీరువాలో చీరుంది..." అన్నది ఆకుపచ్చ చీర చూపిస్తూ.

"ఓ అదా ! స్వప్నసుందరికోసం కొన్నాను. సంక్రాంతికి ఆ చీర కట్టుకుంటే యెలా వుంటుందో ఊహించుకొని తృప్తి చెందాను" అన్నాడు. సుచరిత తలవంచుకుంది.

"ఊహించుకోవడంకూడా తప్పేనా దేవిగారూ!"

"నే నేం చెప్పలేను రఘూ!" ఇటు తిరిగి కళ్ళు తుడుచుకుంది.

కాంతారావు తన మంచం దగ్గరకొచ్చి ఆలోచనలో పడిపోయాడు.

అన్నగారికి తల రుద్ది, ఒళ్ళు రుద్ది పసిపిల్లాడికి చేయించినట్టు స్నానం చేయించింది సుచరిత. టవల్‌తో వీపు తుడుస్తూ "ఈ రోజు హాయిగా నిద్రపడుతుంది అన్నయ్యా!" అన్నది.

"అవునమ్మా....నీ చేతి మహత్యము. నువ్వు దేవతవు చెల్లీ!" అన్నాడు సజల నయనాలను దాచుకుంటూ.

"నిజమే బాబు?..." నాయర్ ఏదో చెప్పబోయాడు.



"చాలుగాని నాయర్ ! వెళ్ళి నీ పని చూసుకో. ఈ తీయని మాటలు హి అయ్యగారి దగ్గర వల్లించు" అంది సుచరిత. వాడు బుర్రగోక్కుంటూ వెళ్ళిపోయాడు.

"నిజం సుచీ! నీ రక్తంతో నాలోని కల్మషములన్నీ కడిగివేశావు. నా ప్రవర్తన తలచుకుంటే నాకే అసహ్యంగా వుంది. నీ గురించి రాత్రి నీచంగా అన్నాను. తెల్లవారేలోగా భగవంతుడు నాకే శిక్ష విధించాడు"

"అన్నయ్యా! నువ్విలా మాట్లాడితే కోపం వస్తుంది. అలా అన్వయించుకు పోతే బాగానే వుంటుంది! నే నెవర్ని అన్నానని నాకీ అపవాదులన్నీ?"

"నువ్వు యెన్ని చెప్పినా సరే. నీ హృదయఘోష నాకు శాప మైందమ్మా! ఈ అన్నను మన్నించు తల్లీ!" చెల్లెలిని అక్కున చేర్చుకొని కంటతడి పెట్టాడు.

"ఛ! సినిమాలో లాగా ఏమిటన్నయ్యా'!

"సినిమాలు ఎలా వచ్చాయమ్మా? నాలాటి కటికవాడు, నీలాంటి నవనీత హృదయమున్న వారి వల్లే-"

"నీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుకో." అన్నకు దూరంగా జరిగింది.

రఘు చలపతిని వెంటబెట్టుకొని వచ్చాడు. కాంతారావు దగ్గరకు వెళ్ళి "ఎలా ఉందన్నయ్యా?" అంటూ అడిగాడు.

"బాగుంది. కాని నీ కెలా తెలిసిందిరా?"

"సుచరిత ఉత్తరం రాసింది. ఎంత గాభరా పడిపోయానో!"

"సుచీ, రఘు కలిసి నన్ను బ్రతికించారు."

"చలపతా? ఎప్పుడొచ్చావురా?" అంటూ గోపమ్మ వచ్చింది.

"నీ ఆరోగ్యమెలా ఉందమ్మా?"

"నా కేం బాగానే ఉన్నాను. పిల్లలు కులాసా?"

"అంతా బావున్నారు. సంవత్సరాదికి అందరూ వస్తారు."

సుచరిత వడ్డించగా ముగ్గురూ భోజనం చేశారు.

రఘు, చలపతి చాలాసేపు చిన్ననాటి కబుర్లు చెప్పుకున్నారు. చలపతి ఆటే వెళ్ళి నిద్రబోయాడు.

"రఘు ! ఇలా రా !" రఘు వచ్చి కాంతారావు దగ్గర కూర్చున్నాడు.

"మళ్ళీ ఒళ్ళు తిరిగినట్టు వుందా !"

"లేదు. నీతో ఓ ముఖ్య విషయం మాట్లాడాలి."

"చెప్పండి."

"చదువు అయింది. ఉద్యోగం చేస్తున్నావు. మరి పెళ్ళి ఎందుకు చేసుకోలేదు?" అనుకోని ప్రశ్నకు నిరుత్తరుడయ్యాడు రఘు.

"మన మందరము ఒక వూరివాళ్ళము. ఒకచోట పెరిగాము. నీ విషయాలు అడగటానికి ఆ మాత్రం చనువుందనుకుంటాను."

ఈసారీ రఘు మాట్లాడలేదు. తలవంచుకున్నాడు.

"చెప్పడానికి అభ్యంతరమైతే వద్దులే. మాకు యింత ఆదరము చూపావు. నీ క్షేమ మరయవలసిన బాధ్యత నాకుండదా!"

"లేదని ఎవరన్నారు?"

"మరి నీ మౌనానికి అర్థం? నీకు నచ్చిన అమ్మాయి లభ్యమవలేదా?" గుమ్మం అవతల నిలబడి సుచరిత గుండె వేగంగా కొట్టుకోసాగింది. అవునన్నట్టు తలూపాడు.

"ఆ సంగతి పోనియ్యి, నేనో సంగతి చెప్తాను విను. మా సుచరితను చూశావుగా. ఆమెకు పెళ్ళి అయింది. అది బొమ్మల పెళ్ళి లాంటిది- నేను ఆమెకు మళ్ళీ పెళ్ళిచేయాలనుకుంటున్నాను. వరుణ్ణి వెతికేవాళ్ళు నిజాన్ని గ్రహించక పోవచ్చు. నువ్వే ఎందుకు చేసుకోవు!"

రఘు ఉలిక్కిపడి చూశాడు.

"దురాశకు పోయానా!" అతడి కళ్ళల్లో కొంటెతనం కొట్టవచ్చినట్టు కనిపించింది. వచ్చే సంతోషాన్ని అదిమిపట్టి గంభీరంగా "మీరు పెద్దలు, నా శ్రేయోభిలాషులు! మీ ఇష్టం కాదంటానా! అలాగే కానివ్వండి" లేచి బయటికి వెళ్ళాడు. గోపమ్మ కళ్ళు తుడుచుకుంది.

"నువ్వేమంటావమ్మా!"

"ఏమంటాను కాంతం! ఇంత మంచిపని చేస్తే వద్దంటానా? నీ పిల్లలు, నువ్వు కలకాలం చల్లగా ఉండండి నాయనా!"



చలపతి మొదట తెల్లబోయినా, తన అంగీకారం తెలిపాడు సుచరిత వివాహానికి. సుచరిత ఆ రోజంతా రఘు ఎదుట పడనే లేదు

రెండవరోజు అతడు హాస్పిటల్ నుండి వచ్చేసరికి వంటింట్లోకి వెళ్ళి నాయర్ చేత కాఫీ పంపింది. నాయర్ కాఫీ అలాగే తెచ్చి "అయ్యగారికి తలనొప్పిగా ఉందట, కాఫీ వద్దన్నారమ్మా" సుచరిత ఆందోళనగా గదిలోకి వచ్చింది. బూట్లతోనే మంచానికి అడ్డంగా కళ్ళుమూసుకుని పడుకున్నాడు.

"చాలా నొప్పిగా ఉందా?" రఘు కళ్ళు విప్పాడు. నుదురు తాకి చూస్తోంది సుచరిత. ఆమె చేతులు తీసుకుని కళ్ళపై పెట్టుకొని "దేవి దర్శనంతో పూర్తిగా తగ్గిపోయింది" అన్నాడు చిలిపిగా నవ్వుతూ.

"అంతా ఎత్తు" చిరుకోపంగా చూసింది.

"సుచీ! ఇంత అన్యాయమా? నిన్నటినుండి ఒక్కసారీ కనబడ లేదు- యిలా కూర్చో? -లేకుంటే బలవంతంగా కూర్చోపెట్టాల్సి వస్తుంది" సిగ్గుతో సతమతమవుతూ అతని చెంత కూర్చుంది. ఆమె ముఖం రెండుచేతులలోకి తీసుకుని "నేను ఎంత అదృష్టవంతుడినో తెలుసా?"

"కాదు నేను-" అంటూ అతని గుండెలలో తలదాచుకుంది.

"కాఫీ తీసుకొస్తావా?" అన్నాడు వీపు తడుతూ.

"తెస్తాను. సాయంత్రం రమక్క దగ్గరకు వెళదాము."

"ఆజ్ఞ!" అన్నాడు లేచి కూర్చుంటూ. సుచరిత వెళ్ళి కాఫీ తెచ్చింది. అతడు కాఫీ త్రాగి కప్పు బల్లమీద పెట్టాడు. అతని టై ఊడదీసి కోటు హేంగరుకు తగిలించి బూట్లు విప్పడానికి కూర్చుంది "ఛ! అదేం పని?" రఘు వారించాడు.

"మంచిపనే? మాట్లాడకండి" అన్నది కోపంగా చూస్తూ.

"అధికారం చెలాయిస్తున్నావే" అతనిమాట పూర్తి కాకముందే నాయర్ పిలిచాడు.

"కూరలేం చెయ్యమంటారు?"

"బుట్టలో ఉన్నవి చెయ్యి" అన్నది.

సుచరిత ఉతికిన చీర కట్టుకొని వచ్చింది.

"ఈ దుస్తులతో నావెంట రావద్దు" అన్నాడు.

"మరి?"

"బీరువాలో దాచినచీర కడితే తీసుకెళతాను."

"బడాయి!- జాకెట్టు వద్దా?"

"పాతదున్నా ఫరవా లేదు" సుచరిత తప్పదని వెళ్ళి దుస్తులు మార్చు కొచ్చింది. ఆమె చేతులు తీసుకొని బల్లమీద పొట్లం విప్పి ఆకుపచ్చరంగు మట్టిగాజులు తొడిగాడు. బంగారుఛాయగల చేతులకు గాజులు మెరిసి పోయాయి... తన చేతులను తానే సంబరంగా చూసుకుంది. ఇంకో చిన్న పొట్లం విప్పి అనార్కలి కుంకుమ తీసి ఆమె నుదుట దిద్దాడు. సుచరిత ఆనందబాష్పాలతో అతని పాదాలపై వ్రాలిపోయింది. లేవనెత్తి తన బాహువులలో బంధించాడు.

"ఈ క్షణం శాశ్వతమని నమ్మమంటారా?" అన్నది అరమోడ్పు కన్నులతో మత్తుగా, మధురంగా.

"అనుమానమా సుచీ!"

"మీపై కాదు. నా అదృష్టంపై నమ్మకం లేదు."

"అలాంటి పిచ్చి నమ్మకాలు వద్దు. నువ్వు నాదానివి. ఈ ఇంటి యజమానురాలివి. రఘు హృదయ సామ్రాజ్యాన్ని పరిపాలించే మహారాణివి..." ఆమె అధరాలను చుంబించాడు. మత్తుగా అతని కౌగిట్లో ఒదిగిపోయింది. ఇద్దరూ గది బయటి కొచ్చేసరికి గోపమ్మ వచ్చింది. ఆమెకు నమస్కరించారు. కూతుర్ని లేవనెత్తి నుదురు ముద్దిడుకుంది.

"రమక్కదగ్గర కెళతామమ్మా!"

"మంచిది. తల్లీ! త్వరగా వచ్చేయండి." అన్నది కళ్ళొత్తుకుంటూ. ఇద్దరూ వెళ్ళి కార్లో కూర్చున్నారు.

మూర్తిగారు కారు ఆగగానే సంతోషంగా ఎదురొచ్చాడు. "రమా! త్వరగా రా. మీ మరిదిగారు చెల్లెల్ని వెంటబెట్టుకొచ్చాడు చూడు." రమాదేవి పరుగున వచ్చింది. "సుచరితా!" చేతులు చాచింది. సుచరిత వెళ్ళి ఆమె



చేతులలో ఇమిడిపోయింది. వియోగానాంతరం కలుసుకున్న స్నేహితులు మాటలు కరువై కన్నీరు కారుస్తూ ఉండిపోయారు.

"కంగ్రాచ్యులేషన్స్ రఘూ! నే నాసించిన శుభదినం ఈనాడు వచ్చిందా?" మూర్తిగారు రఘుతో కరచాలనం చేశాడు. రమ సుచరిత చేయిబట్టి కుర్చీలో కూర్చుండబెట్టింది.

"ఆరోగ్య మెలా ఉందక్కా?"

"రఘు దయవల్ల నయమయింది సుచరితా ! ఆయన ఋణం యెలా తీర్చుకుంటానో..."

"మాటిమాటికి 'ఋణం' అంటూ నన్ను సిగ్గిల చేయకుంటే చాలు" అన్నాడు ఇబ్బందిగా. చాలాసేపు జరిగిన సంగతులు చర్చించుకొని నవ్వుకున్నారు - దుఃఖించారు.

"ఇక వెళదామా?" సుచరిత వంక చూచాడు రఘు.

"అదేం లేదు. భోజనంచేసి పోవాలి" భార్యాభర్తలు బలవంత పెట్టేరు. వంటలో సుచరిత సహాయం చేసింది. పిల్లలు సుచరితను వదలనే లేదు. అందరూ కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేశారు.

"ఒదినగారూ! నాకో సహాయం చెయ్యాలండీ"

"అంతకంటేనా రఘూ! చెప్పండి" అన్నది రమాదేవి

"నేనో కిండర్‌గార్టెన్ స్కూలు ఓపెన్ చెయ్యాలనుకుంటున్నాను. దానిని మీరే నడపాలి."

"అదెలా? టీచింగ్ చెయ్యొద్దన్నారుగా?" అన్నది నిరాశగా.

"టీచింగ్‌కు మీ చెల్లెలుంది. వేరే టీచర్లను పెడ్తాను. మీరు సూపర్ వైజ్ చెయ్యాలి. దానికి మీరే సమర్థులు."

"మీ కా నమ్మకం ఉంటే తప్పక చేస్తాను. నాకూ యేం తోచదు. వచ్చే యేడు సుమ కూడా బడికి వెళుతుంది."

"ఇక వెళతాము" ఇద్దరూ వచ్చి రఘును, సుచరితను సాగనంపారు. రఘు కారు స్టార్ట్ చేశాడు. సుచరిత బయటికి చూస్తూ ఆలోచిస్తోంది.

"సుచీ, ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"..............."

"ఓ పంతులమ్మా!... అంతులేని ఆలోచనలు యెవరి గురించి?"

"మీ గురించే" అన్నది ఇటు తిరుగుతూ.

"నా గురించా? ఏమున్నాయబ్బా ఆలోచించడానికి?"

"మీరు సమస్యల నెంత తేలికగా పరిష్కరిస్తారు? వాళ్ళ ఇబ్బంది గ్రహించి స్కూలు పెడతానంటున్నారు కదూ!"

"కాదు, ఓ స్కూలు, ఓ నర్సింగ్‌హోమ్ ఓపెన్ చెయ్యాలని నా కోర్కె చాలా నాళ్ళుగా ఉంది. ఇప్పుడు సదవకాశము కలిగింది! అదీగాక నిన్ను ఎంగేజి చెయ్యాలిగా! ఎంతైనా పంతులమ్మవి... అలవాటు ప్రకారం నాకు టీచింగ్ మొదలు పెడితే..." అన్నాడు కొంటెగా.

"మీరు దైవం! పూజిస్తాను. బోధిస్తానా?" అన్నది అతని భుజంపై వ్రాలుతూ, ఒక చేత్తో కారును కంట్రోలు చేస్తూ, రెండవచేత్తో ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

"ఆజ్ మేరే ఘర్ ప్రీతమ్ ఆయే..." జ్యోతికారాయ్ కంఠం వివిధ భారతిలో కాబోలు వినిపిస్తోంది హోటల్లోంచి ! ! !

